

నరమేధాన్ని ఆపండి

మణిపూర్‌లోని ఇంఫాల్‌లో పౌరహత్యలకు వ్యతిరేకంగా మహా ప్రదర్శన

వివరాలు 3లో

అనుదినం... జనస్వరం

www.navatelangana.com

నవతెలంగాణ

బుధవారం 11-12-2024

సమగ్ర తెలుగు దినపత్రిక

సంపుటి : 10 సంచిక : 295 | Published from Karimnagar, Rangareddy, Hyderabad, Khammam | 12 పేజీలు | వెల : 6.50



కేంద్రం కుట్రల్ని తిప్పికొట్టండి

కేరళ వామపక్ష ప్రభుత్వానికి అండగా నిలవండి

అన్నింటా కేరళ సర్కార్‌ ఆదర్శం

నాడు కాంగ్రెస్‌, నేడు బీజేపీ ఆర్థిక నిర్బంధాలు అయినా తట్టుకొని నిలుస్తున్నాం :

సీఐటీయూ, ఏఐకేఎస్‌, ఏఐఏడబ్ల్యూయూ సంయుక్త సదస్సులో విజ్జూ కృష్ణన్‌

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

కేరళలోని వామపక్ష ప్రభుత్వంపై కేంద్రంలోని నరేంద్రమోడీ సర్కార్‌ చేస్తున్న కుట్రలను తిప్పికొట్టాలని ఆలిండియా కిసాన్‌సభ జాతీయ ప్రధాన కార్యదర్శి విజ్జూకృష్ణన్‌ చెప్పారు. అప్పట్లో కేంద్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్‌, ఇప్పుడు బీజేపీ రెండూ కేరళ ప్రభుత్వంపై ఆర్థిక ...10లో

సీపీఐ(ఎం) కేంద్ర కమిటీ సభ్యులు కెఎం తివారీ కన్నుమూత

నేడు అంతిమ వీడ్కోలు

సీపీఐ(ఎం)పొలిట్‌ బ్యూరో నివాళి



(ఫైల్‌)

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

సీపీఐ(ఎం) సీనియర్‌ కేంద్ర కమిటీ సభ్యులు కెఎం తివారీ (70) ఇకలేరు. మంగళవారం ఉదయం న్యూఢిల్లీలోని ఓ ఆస్పత్రిలో ఆయన కన్నుమూశారు. ఆయనకు సీపీఐ(ఎం) పొలిట్‌బ్యూరో నివాళి అర్పించింది. నేడు (బుధవారం) ...3లో

రాజ్యసభ చైర్మెన్‌పై అవిశ్వాసం

జగదీప్‌ ధన్కర్‌ ఏకపక్ష వైఖరిని ఖండిస్తూ ప్రతిపక్షాల నిర్ణయం

ఉభయసభలు నేటికి వాయిదా

పార్లమెంట్‌ సమావేశాలు ప్రారంభమై 11 రోజులు దాటినా... ప్రధాని మోడీ సభలో గానీ బయటగానీ అదానీ వ్యవహారంలో నోరు విప్పడం లేదు. పార్లమెంట్‌ ఆవరణలో ప్రతి పక్షాలు అదానీ -మోడీ భాయ్‌ భాయ్‌ అంటూ వినూత్న ఆందోళనలు చేస్తున్నా, నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తున్నారు





నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

రాజ్యసభ చైర్మెన్‌ జగదీప్‌ ధన్కర్‌పై ప్రతిపక్షాలు అవిశ్వాస తీర్మానాన్ని ప్రవేశపెట్టాయి. ఆయన వ్యవహరిస్తున్న తీరు ఏకపక్షంగా ఉంటోందని ప్రతిపక్ష ఎంపీలు ఎప్పటి నుంచో చెబుతున్నారు. అయితే ఇటీవల కూడా ఆయన తీరును ప్రదర్శిస్తూ ప్రతిపక్షాలను ఉద్దేశించి విమర్శలు చేస్తున్నా రాజ్యసభ నుంచి తాము తరచూ వాకౌట్‌ చేయాల్సిన పరిస్థితికి చైర్మెన్‌ ధన్కర్‌ వైఖరే కారణమని ప్రతిపక్ష ఎంపీలు విమర్శిస్తున్నారు. ఈ నేపథ్యంలో మంగళవారం ఉదయం చైర్మెన్‌పై అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టారు. ఈ తీర్మానంపై ఇండియా బ్లాక్‌కు చెందిన కాంగ్రెస్‌, టీఎంసీ, సీపీఐ(ఎం), ఆప్‌, ఎస్పీ, డీఎంకే, ఆర్జేడీ, సీపీఐ తదితర పార్టీలకు చెందిన 50 మందికిపైగా ఎంపీలు సంతకాలు చేశారు. ఈ సంతకాలు చేసిన నోటీసులను రాజ్యసభ సెక్రెటేరియట్‌కు సమర్పించారు. చైర్మెన్‌కు వ్యతిరేకం గా ప్రతిపక్షాలు అవిశ్వాస తీర్మానాన్ని ప్రవేశపెట్టడం దేశ పార్లమెంటరీ చరిత్రలోనే ఇది మొదటిసారి. కాగా రాజ్యసభలో ప్రతిపక్ష నాయకుడు మాట్లాడేందుకు లేచి నిలబడినపుడు చైర్మెన్‌ ఆయనకు ...3లో

అదానీపై చర్చకు భయపడుతున్న బీజేపీ

అదానీ అంశంపై చర్చకు బీజేపీ భయపడుతోందని ఎంపీ ప్రియాంక గాంధీ అన్నారు. ఉభయ సభలు నేటికి వాయిదా పడిన అనంతరం ఆమె విలేకరులతో మాట్లాడారు. "నేను పార్లమెంటుకు కొత్త సభ్యురాలిని. ఇప్పటి వరకు పార్లమెంటులో ప్రధానమంత్రి కనిపించ లేదు. మనం ఈ అంశాన్ని ఎందుకు లేవనెత్తకూడదు?" అని అన్నారు. మరోపక్క ...3లో


తేల్చాల్సిందే

అదానీ ముడుపుల వ్యవహారంపై ఇండియా బ్లాక్‌ ఎంపీల ఆందోళన

'మోడీ-అదానీ' క్యారికేచర్లతో కూడిన బ్యాగ్‌లతో వినూత్నంగా గళమెత్తిన ఎంపీలు

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

అదానీ ముడుపుల వ్యవహారంపై జాయింట్‌ పార్లమెంటరీ కమిటీ(జేపీసీ)తో విచారణ జరిపించి, నిజనిజాలు తేల్చాల్సిందేనని ప్రతిపక్ష పార్టీలు డిమాండ్‌ చేశాయి. మంగళవారం పార్లమెంట్‌ ఆవరణలో వినూత్న రీతిలో ఆందోళన చేపట్టాయి. పార్లమెంట్‌ ప్రధాన ద్వారమైన మకర ద్వార్‌ మెట్ల ముందు 'మోడీ-అదానీ' క్యారీకేచర్లతో కూడిన బ్యాగులతో ప్రతిపక్ష ఎంపీలు ఆందోళన చేపట్టారు. ఒకవైపు మోడీ- ...10లో



మొండి బాకీలు రూ. 4.5 లక్షల కోట్లు

ప్రభుత్వ, ప్రయివేటు బ్యాంకుల్లో స్థూల ఎన్‌పీఏలు

ఆరు నెలల్లో రూ.42 వేల కోట్ల రుణాలు రద్దు

రైతులకు రుణాలివ్వటానికి ఎన్నో మెలికలు పెట్టే బ్యాంకులు, అప్పు తీసుకున్నాక డబ్బులు కట్టకపోతే ఆస్తులను జప్తు చేయటానికీ వెనుకాడటం లేదు. అలాంటిది కార్పొరేట్‌ పెద్దలకు మాత్రం తీసుకున్న అప్పులకు వడ్డీలే కాదు.. అసలూ తిరిగి చెల్లించకున్నా పట్టించుకోవడం లేదు. దీంతో లక్షల కోట్లల్లో అప్పులు పేరుకుపోతున్నాయి. మరో వైపు బ్యాంకులు సరిగా పని చేయటం లేదంటూ కేంద్రం వాటిని విలీనం పేరిట తగ్గించేస్తోంది. కానీ ఇందుకు కారకులైన పెద్దల జోలికి మాత్రం వెళ్లటం లేదు.

న్యూఢిల్లీ : దేశంలో ప్రభుత్వ ప్రయివేటు రంగ బ్యాంకుల్లో మొత్తంగా రూ.4.5 లక్షల కోట్ల స్థూల మొండి బాకీలు ఉన్నట్టు ఆర్థిక శాఖ సహాయ మంత్రి పంకజ్‌ చౌదరి తెలిపారు. 2024 సెప్టెంబర్‌ 30 నాటికి ప్రభుత్వ రంగ బ్యాంకుల్లో రూ.3.16 లక్షల కోట్ల స్థూల ఎన్‌పీఏలు ఉండగా.. ప్రయివేటు బ్యాంక్‌ల్లో రూ.1,34,339 కోట్ల మొండి బాకీలు నమోదయ్యాయని ఆయన రాజ్యసభకు తెలిపారు. ప్రభుత్వ రంగ బ్యాంకు మొత్తం రుణాల్లో 3.09 శాతం, ప్రయివేటు రంగ బ్యాంకుల్లో అప్పుల్లో 1.86 శాతం చొప్పున రుణాలు ఎన్‌పీఏలుగా మారాయన్నారు. 2024 మార్చి 31 నాటికి 580 మంది రుణ గ్రహీతల సంస్థలు రూ.50 కోట్లకు పైగా బ్యాంకులకు ఎగ్గొట్టాయన్నారు. సెప్టెంబర్‌ 30 నాటికి దేశంలో 1,068 కార్పొరేట్‌ దివాలా కేసులు పరిష్కార ప్రక్రియలో ఉన్నాయన్నారు. వీటి ...11లో

ఆశాల ఫిక్స్‌డ్‌ వేతనంపై ప్రతిపాదనలు

వైద్యారోగ్య శాఖ కమిషనర్‌ వెల్లడి

- యూనియన్‌ నాయకులతో అధికారుల చర్చలు
- ఆదివారం, పండుగ సెలవుల అమలుకు హామీ
- తెలంగాణ ఆశా వర్కర్స్‌ యూనియన్‌ ధర్నా విజయవంతం

ప్రస్తుత అసెంబ్లీ సమావేశాల్లోనే ప్రకటించాలి : తెలంగాణ ఆశా వర్కర్స్‌ యూనియన్‌ రాష్ట్ర అధ్యక్షులు పి.జయలక్ష్మి

నవతెలంగాణ - సుల్తాన్‌ బజార్‌

ఆశా వర్కర్లకు ఫిక్స్‌డ్‌ వేతనం రూ.18 వేలపై ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నట్టు వైద్య ఆరోగ్య శాఖ కమిషనర్‌ వెల్లడించారు. ఆదివారం, పండుగ సెలవులు మంగళవారం నుంచే అమలు చేస్తామని హామీ ఇచ్చారు. ఈ మేరకు తెలంగాణ ఆశా వర్కర్స్‌ యూనియన్‌ (సీఐటీయూ) ధర్నా సందర్భంగా ప్రతినిధులతో జరిగిన చర్చల్లో చెప్పారు. అయితే, వీటన్నింటిపై ప్రస్తుత అసెంబ్లీ సమావేశాల్లోనే సీఎం ప్రకటించాలని యూనియన్‌ రాష్ట్ర అధ్యక్షులు పి.జయలక్ష్మి డిమాండ్‌ చేశారు. ఫిక్స్‌డ్‌ వేతనంపై ప్రతిపాదనలు ...12లో



పోడు సాగుకు సోలార్‌ పవర్‌

- ఎన్ని ఇబ్బందులొచ్చినా ప్రజావాణి ఆగదు: డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క.



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్‌

ఫారెస్ట్‌ రైట్‌ యాక్ట్‌ ద్వారా పట్టాలు పొందిన పోడు రైతులు సాగు చేసుకోవడానికి సోలార్‌ ద్వారా ప్రతి వ్యవసాయం పంపు సెట్‌కు కరెంటు అందించడానికి చర్యలు తీసుకుంటామని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క తెలిపారు. మంగళవారం హైదరాబాద్‌లోని ప్రజాభవన్‌లో ప్రజావాణి లబ్దిదారులతో ఆయన సమావేశమయ్యారు. ఫిర్యాదులపై అధికారుల స్పందన, పరిష్కారం తదితర అంశాలను ఈ సందర్భంగా వారినడిగి తెలుసుకున్నారు. అనంతరం భట్టి మాట్లాడుతూ పోడు రైతులు సోలార్‌ పవర్‌ పెట్టుకోవడానికి కావలసిన ఏర్పాట్లు చేయాలని గిరిజన సంక్షేమ శాఖకు ఆదేశాలు ఇవ్వనున్నట్టు వెల్లడించారు. ప్రజల అవసరాలు వారి సమస్యలు నేరుగా చెప్పుకోవడానికి ప్రజా ప్రభుత్వం ప్రజావాణిని ఏర్పాటు చేసిందనీ, ఎన్ని ఇబ్బందులొచ్చినా ఈ కార్యక్రమాన్ని నిరంతరం కొనసాగిస్తామని వెల్లడించారు. ప్రజావాణిలో ...11లో



హామీలు అమలు చేసే వరకూ పోరాడుతాం

పాలకుల విధానాల వల్లే వికలత్వం పెరుగుతోంది

పింఛన్‌ రూ.ఆరువేలకు పెంచాల్సిందే : ఎన్‌పీఆర్‌డీ మహాధర్నాలో మాజీ ఎమ్మెల్యే జూలకంటి

- వికలాంగుల రక్షణ ప్రభుత్వానికి పట్టదా ?: టి జ్యోతి
- చట్టాల అమలులో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలం : అడివయ్య
- భారీగా తరలొచ్చిన వికలాంగులు
- నినాదాలతో దద్దరిల్లిన ధర్నా చౌక్‌

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్‌

'వికలాంగులకిచ్చిన హామీలు అమలు చేసే వరకూ ప్రభుత్వం వెంటపడతాం, పౌష్టికాహార లేమితోపాటు, తగిన సమయంలో వైద్య సదుపాయాలు అందకపోవటంతో ఎంతో మంది అనారోగ్యాల పాలవుతున్నారు. అసమానతలు పెంచిన ప్రభుత్వ విధానాల వల్లే వికలత్వం పెరుగుతోంది. ఆ పాపం ప్రభుత్వాలదే' అని మాజీ ఎమ్మెల్యే, సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జూలకంటి రంగారెడ్డి అన్నారు. మంగళవారం హైదరాబాద్‌లోని ధర్నాచౌక్‌లో వికలాంగుల హక్కుల జాతీయ వేదిక (ఎన్‌పీఆర్‌డీ) ఆధ్వర్యంలో ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కె.వెంకట్‌ అధ్యక్షతన వికలాంగుల మహాధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా జూలకంటి మాట్లాడుతూ పాలకుల నిర్లక్ష్యం, అసమర్థతే వికలాంగుల పాలిట శాపంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. వారికి పౌష్టికాహారాన్ని అందించాల్సిన బాధ్యత ప్రభుత్వానికి లేదా? అని ప్రశ్నించారు. వికలాంగులకిచ్చిన హామీలను అమలు చేయాలనే ఆలోచన ఎందుకు చేయడం లేదని ప్రభుత్వాన్ని నిలదీశారు. వారి బాధలు ...11లో

విగ్రహాలపై ఉన్న ధ్యాస విద్యార్థుల మీద లేదా?

సీఎం రేవంత్‌రెడ్డికి మాజీమంత్రి హరీశ్‌రావు ప్రశ్న



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్‌

విగ్రహాల మీద ఉన్న ధ్యాస విద్యార్థుల మీద లేదా?అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని మాజీ మంత్రి, బీఆర్‌ఎస్‌ ఎమ్మెల్యే టి హరీశ్‌రావు ప్రశ్నించారు. ఢిల్లీ పెద్దలను ప్రసన్నం చేసుకోవడంపై ఉన్న ధ్యాస, పిల్లల భవిష్యత్తుపై లేదా?అని మంగళవారం ఒక ప్రకటనలో అడిగారు. రాష్ట్ర వ్యాప్తంగా కాదు, కనీసం సొంత జిల్లా ప్రభుత్వ పాఠశాలలు, గురుకులాలను సైతం పట్టించుకోని నిర్లక్ష్యపు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉమ్మడి మహబూబ్‌నగర్‌ జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలు, గురుకులాల్లో వరుస ఫుడ్‌ పాయిజన్లు జరిగి విద్యార్థులు ఆస్పత్రుల పాలవుతుంటే ప్రభుత్వం ఏం చేస్తున్నట్టు?అని ఆయన ప్రశ్నించారు. పది రోజులు కాకముందే వికారాబాద్‌ జిల్లా తాండూరు గిరిజన బాలికల హాస్టల్‌లో ఫుడ్‌ పాయిజన్‌ జరిగి 15 మంది ఆస్పత్రి పాలైన దుస్థితి ఉందని తెలిపారు. సీఎం సొంత జిల్లాలోనే పరిస్థితి ఇలా ఉంటే, రాష్ట్ర వ్యాప్తంగా ఇంకెంత దారుణ పరిస్థితులు ఉన్నాయో అర్థం చేసుకోవచ్చని పేర్కొన్నారు. రాష్ట్రంలో వరుస ఫుడ్‌ పాయిజన్‌ కేసులు నమోదవుతున్నా, విద్యార్థులు ప్రాణాలు కోల్పోతున్నా ప్రభుత్వం మొద్దు నిద్ర వీడక పోవడం దుర్మార్గమని విమర్శించారు. విద్యార్థులకు కల్తీ ఆహారం పెడితే జైలుకు పంపిస్తామన్న సీఎం రేవంత్‌రెడ్డి మాటలు నీటి మూటలయ్యాయని తెలిపారు. మాటలే తప్ప చేతలు లేని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నిర్లక్ష్య తీరు వల్ల ఇంకెంత మంది విద్యార్థులు ఆస్పత్రి పాలు కావాలనీ, ఇంకెందరు ప్రాణాలు కోల్పోవాలని అడిగారు.



తాండూరులో ఫుడ్‌ పాయిజన్‌

గిరిజన సంక్షేమ బాలికల హాస్టల్‌ విద్యార్థినులకు అస్వస్థత

- జిల్లా ఆస్పత్రి, ఎంసీహెచ్‌ ఆస్పత్రులకు తరలింపు
- హాస్టల్‌ను సందర్శించిన ఆయా పార్టీల నేతలు

నవతెలంగాణ-తాండూరు

వికారాబాద్‌ జిల్లా తాండూరు పట్టణ కేంద్రంలోని గిరిజన సంక్షేమ బాలికల హాస్టల్‌లో మంగళవారం ఫుడ్‌ పాయిజన్‌ అయ్యింది. దీంతో 20 మంది విద్యార్థినులు అస్వస్థతకు గురయ్యారు. వీరిని హాస్టల్‌ సిబ్బంది స్థానిక జిల్లా ఆస్పత్రి, ఎంసీహెచ్‌ ఆస్పత్రులకు తరలించి చికిత్స అందిస్తున్నారు. ప్రస్తుతం విద్యార్థినుల పరిస్థితి నిలకడగా ఉంది. ఈ క్రమంలో హాస్టల్‌ను ప్రతిపక్ష పార్టీల నాయకులు సందర్శించి, ఘటనకు గల కారణాలను విద్యార్థినులను అడిగి తెలుసుకున్నారు. అధికారుల నిర్లక్ష్యం వల్లే ఇలాంటివి పునరావృతం అవుతున్నాయని వారు ఆరోపించారు.వివరాల్లోకి వెళ్తే.. మూడవ తరగతి నుంచి పదవ తరగతి వరకు ఉన్న తాండూరు గిరిజన సంక్షేమ బాలికల హాస్టల్‌లో ...2లో

కలుషిత ఆహారంపై వివరణివ్వండి

- సర్కారుకు హైకోర్టు ఆదేశం 11లో..

డిజిటల్‌ యుగంలో సవాళ్లు

డీప్‌ ఫేక్‌, గోప్యతకు భంగం వంటి అంశాలు ఆందోళనకరం

ప్రజల హక్కులు, గౌరవాన్ని కాపాడే వాతావరణాన్ని సృష్టించాలి : రాష్ట్రపతి ముర్ము



11లో

పాఠ్యపుస్తకాల్లో 'జయజయహే తెలంగాణ' రాష్ట్ర గీతం

తెలంగాణ తల్లి విగ్రహానికీ చోటు

పాఠశాల విద్యాశాఖ నిర్ణయం



11లో

ఎందుకలా..?

ఓ వర్గంపై అలహాబాద్‌ హైకోర్టు న్యాయమూర్తి వివాదాస్పద వ్యాఖ్యలు విచారణ చేపట్టిన 'సుప్రీం'

11లో..





ప్రజామోద, చట్టబద్ధమైన పోరాటాలకు సిద్ధం

- ఇథనాల్ పరిశ్రమలపై సీపీఐ(ఎం) ప్రజాభిప్రాయ సేకరణ
- రద్దుకు ప్రత్యేక కార్యాచరణ
- ముప్పును ఎదుర్కోవడానికి ప్రజలందరూ సిద్ధమవ్వాలి : గుగ్గిల్లలో సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి ఆముదాల మల్లారెడ్డి

నవతెలంగాణ-బెజ్జంకి

భవిష్యత్తు తరాలకు ఇథనాల్ పరిశ్రమల వల్ల ముప్పు తప్పదని, ప్రజాభిప్రాయం మేరకు చట్టబద్ధమైన పోరాటాలకు ప్రజలందరి సమన్వయంతో ప్రణాళికలు రూపొందించి సిద్ధమవ్వాలని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి ఆముదాల మల్లారెడ్డి అన్నారు. సిద్దిపేట జిల్లా బెజ్జంకి మండలంలో ప్రజాభిప్రాయానికి వ్యతిరేకంగా నిర్మిస్తున్న ఇథనాల్ పరిశ్రమల నిర్మాణాలపై గుగ్గిల్ల, తిమ్మాయిపల్లి గ్రామాల్లో అముదాల మల్లారెడ్డి బృందం పర్యటించి ప్రజాభిప్రాయాలను సేకరించారు. ఈ సందర్భంగా గుగ్గిల్ల గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద స్థానిక ప్రజలతో కలిసి ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మట్లాడారు. ఇథనాల్ పరిశ్రమల వల్ల ఆ గ్రామాలకు భవిష్యత్తులో సంభవించనున్న ముప్పును గుర్తించి ప్రభుత్వం పరిశ్రమ నిర్మాణాలను నిలిపివేసి అనుమతులు రద్దుచేసేలా సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో ప్రజాభిప్రాయం, చట్ట ప్రకారం పోరాటాలు చేపట్టనున్నట్టు తెలిపారు. ప్రజా సమస్యలపై పోరాటాలు చేసేది కమ్యూనిస్టులేనని, భవిష్యత్తు తరాలకు కలుషితంలేని పర్యావరణం అందించడమే అంతిమ లక్ష్యంగా సీపీఐ(ఎం) ప్రత్యేక కార్యచరణతో పోరాటానికి సిద్ధమవుతుందని తెలిపారు. ప్రజాభిప్రాయానికి వ్యతిరేకంగా నిర్మిస్తున్న ఇథనాల్ పరిశ్రమను రద్దు చేయాలని జిల్లా కలెక్టర్, సీపీకి పార్టీ ఆధ్వర్యంలో ప్రజాభిప్రాయాలను నివేదిక రూపంలో అందజే స్తామన్నారు. పరిశ్రమల రద్దుకు ముమ్మందు మండలంలోని యువత, రైతులందరూ సిద్ధమవ్వాలని పిలుపునిచ్చారు. ఈ ప్రజాభిప్రాయ సేకరణలో సీపీఐ(ఎం) జిల్లా నాయకులు రాళ్లబండి శశిధర్, గోపాలస్వామి, దాసరి ప్రశాంత్, మండల కార్యదర్శి తిప్పారపు శ్రీనివాస్, నాయకుడు సంగ ఎల్లయ్య పాల్గొన్నారు.

ఆర్థిక ఇబ్బందులతో చేనేత కార్మికురాలి ఆత్మహత్య



నవతెలంగాణ-రామన్నపేట

ఆర్థిక ఇబ్బందులు తాళలేక చేనేత కార్మికురాలు ఆత్మహత్య చేసుకుంది. ఈ ఘటన యాదాద్రిభువనగిరి జిల్లా రామన్నపేట సిరిపురం గ్రామంలో మంగళవారం జరిగింది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. దోర్నాల విజయ(51) చేనేత కూలి పనిచేస్తూ జీవనం సాగించేంది. కుటుంబ అవసరాల కోసం అప్పులు చేసింది. అయితే, సరైన ఉపాధి లేక.. అప్పులు తీరే మార్గం కనిపించకపోవడంతో మంగళవారం ఇంట్లోనే చేనేత రంగుల్లో కలిపే నైటప్ రసాయనాన్ని తాగి ఆత్మహత్య చేసుకుంది.

ఆమె కోడలు గమనించి స్థానికుల సహాయంతో రామన్నపేట ఆస్పత్రికి తీసుకెళ్లారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం నార్కట్‌పల్లి కామినేని ఆస్పత్రికి తరలించారు. చికిత్స అందించినా ఫలితం లేకపోయింది. సాయంత్రం మృతిచెందింది. ఆమెకు ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. మృతదేహాన్ని రామన్నపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

కేరళను ఆర్థిక దిగ్బంధం చేసిన కేంద్రం

- ఇక్కడి ప్రజల హక్కుల రక్షణకు దేశ వ్యాప్తంగా ఉద్యమాలు : ఏఐఎడబ్ల్యూయూ ప్రధాన కార్యదర్శి బి.వెంకట్

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో



కేరళ ప్రభుత్వాన్ని ఆర్థికంగా మోడీ ప్రభుత్వం దిగ్బంధించిందని ఏఐఎడబ్ల్యూయూ ప్రధాన కార్యదర్శి బి.వెంకట్ అన్నారు. కేరళ ప్రజల హక్కుల రక్షణకు దేశవ్యాప్తంగా ఉద్యమాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. మంగళవారం కర్నాటక రాష్ట్ర ఏఐఎడబ్ల్యూయూ రాష్ట్ర కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కేరళకు నిధులు విడుదల చేయకుండా పక్షపాత వైఖరి ప్రదర్శిస్తోందని విమర్శించారు. ప్రజలకు సంబంధించిన పథకాలకు నిధులు ఇవ్వకుండా ఎల్‌డీఎఫ్ ప్రభుత్వాన్ని ప్రజల్లో బలహీనపరిచి విచ్ఛిన్నం చేసే కుట్ర పన్నుతోందని విమర్శించారు. ఎల్‌డీఎఫ్‌కు వ్యతిరేకంగా కాంగ్రెస్, బీజేపీ ఏకం అవుతున్నాయని ధ్వజమెత్తారు. ఈనెల 25న దేశవ్యాప్తంగా కేరళకు సంఘీభావంగా సభలు నిర్వహించాలని అన్నారు. వామపక్ష ప్రత్యామ్నాయాన్ని సంఘటితం చేసేందుకు క్షేత్రస్థాయిలో పని చేయాలని సూచించారు. కేరళ ఎల్‌డీఎఫ్‌కు ప్రజలు మోడల్ అయితే, ప్రధాని మోడీ, ఆర్ఎస్ఎస్ మోడల్ కార్పొరేట్, కమ్యూనల్ మోడల్ అని అన్నారు.

అర్ధాంతరంగా ఆగిన 'స్మార్ట్ సిటీ' రోడ్డు

వరంగల్‌లో ఏండ్లు గడిచినా పూర్తి కాని పనులు

- ముందుకు పోని మురుగునీరు
- నోచుకోని సెంట్రల్ లైటింగ్ సిస్టమ్ పనులు

నవతెలంగాణ-వరంగల్

హైదరాబాద్‌తో సమానంగా వరంగల్ నగరాన్ని మారుస్తామని ప్రభుత్వం చెబుతున్నా.. అభివృద్ధి పనులు మాత్రం నత్తనడకన సాగుతున్నాయి. ఇప్పుడే కాదు.. గత పదేండ్లుగా ఇదే పరిస్థితి ఉంది. బాలాజీ నగర్ జంక్షన్ నుంచి క్రిస్టియన్ కాలనీ నర్సంపేట రోడ్ వరకు 100 ఫీట్ల రోడ్డు, డ్రయినేజీ, సెంట్రల్ లైటింగ్ సిస్టమ్ ఏర్పాటు చేయాలని తొమ్మిదేండ్ల కిందట రూ. 37 కోట్లతో అప్పటి ఓ ప్రజా ప్రతినిధి ఒత్తిడితో శంకుస్థాపనలు జరిగాయి. రోడ్డు వేయడం ప్రారంభించినా అర్ధాంతరంగా మధ్యలోనే ఆపేశారు. దాంతో ఇప్పటికీ ఆ రోడ్డు అసంపూర్తిగానే ఉంది. అంతేకాదు, ఆ రోడ్డుకు ఇరువైపులా కచ్చా డ్రయినేజీ ఉండటంతో దానిలోకి మట్టిపడి మురుగునీరు ముందుకు పోక దుర్వాసన వెదజల్లుతోంది. వర్షాకాలం వచ్చిందంటే కట్ట మల్లన్న చెరువు నుంచి వస్తున్న నీరు దానితోపాటు వరద నీరు చేరడంతో డ్రయినేజీలోని నీరు రోడ్డుపైకి వచ్చి పలు కాలనీలు నీట మునుగుతున్నాయి. సమస్యను అరికట్టాలని ప్రజా ప్రతినిధులు, సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లినా డ్రయినేజీ నిర్మాణం పూర్తి కావడం లేదు. ఇప్పటికైనా శాశ్వత పరిష్కారం కోసం ఇరువైపులా డ్రయినేజీ నిర్మించాల్సిన అవసరం ఉందని కాలనీవాసులు కోరుతున్నారు.

కచ్చా డ్రయినేజీతో ఇబ్బందులు

అసంపూర్తి రోడ్డుకు ఇరువైపులా కచ్చా డ్రయినేజీ ఉండటంతో మురుగునీటితో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. గొర్రెకుంట శివారులోని కట్టమల్లన్న చెరువు నీళ్లు గరీబ్‌నగర్ నుంచి ఎస్సార్ నగర్, శ్రీనివాస కాలనీ, బాలాజీ నగర్ జంక్షన్ నుంచి చిన్న వడ్డేపల్లి చెరువులోకి చేరాలి. కానీ కచ్చా డ్రయినేజీ వల్ల చెరువులోకి వెళ్లకుండా ఖాళీ ప్లాట్లలోకి చేరుతున్నాయి. వర్షాలతో వరద నీరు చేరడంతో డ్రయినేజీలోని నీరు రోడ్డుపైకి వచ్చి ఎస్ఆర్ నగర్, మధుర కాలనీ, సాయిగణేష్ కాలనీ వంటి పలు కాలనీలు నీట మునుగుతున్నాయి.



పైపులతో రోడ్డు ప్రమాదాలు..

తొమ్మిదేండ్ల కిందట ప్రారంభించిన స్మార్ట్‌సిటీ రోడ్డు అసంపూర్తిగా నిలిచింది. రోడ్డు నిర్మాణం చేసినప్పటికీ దానికి ఇరువైపులా ఉన్న డ్రయినేజీ, సెంట్రల్ లైటింగ్ పనులు నిలిచిపోయాయి. అంతేకాదు. రోడ్డుకు మధ్యలో ఉన్న పైప్‌లైన్లు తీయకపోవడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. ఒకవైపు పైప్‌లైన్లు, మరోవైపు లైట్లు లేక చీకటిగా ఉండటంతో రోడ్డు ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. బాలాజీ నగర్ జంక్షన్ నుంచి నర్సంపేట రోడ్ క్రిస్టియన్ కాలనీ వరకు ఓ బడా గుత్తేదారు పైపులను డివైడర్ స్థానంలో పెట్టడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కొంత మంది రోడ్డు ప్రమాదాల బారిన పడి మృతి చెందుతున్నారు. ఎన్టీఆర్‌నగర్ కాలనీకి చెందిన ఓ యువకుడు ప్రమాదానికి గురై మరణించాడు. ఇలాంటి సంఘటనలు 100 ఫీట్ల రోడ్డుపైన ప్రతిరోజూ ఏదో ఒకచోట జరుగుతూనే ఉన్నాయి.

ఏండ్లు గడిచినా ఏర్పాటు కాని సెంట్రల్ లైటింగ్:

బాలాజీ నగర్ జంక్షన్ నుంచి క్రిస్టియన్ కాలనీ నర్సంపేట రోడ్ వరకు సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేయాల్సి ఉన్నప్పటికీ ఏండ్లు గడిచినా ఏర్పాటుచేయకపోవడం అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనం. రోడ్డు మధ్యలో వేసిన పైపుల్లో కొంతమంది గంజాయి, సిగరెట్లు తాగుతూ ప్రయాణికులను భయభ్రాంతులకు గురి చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పైపులు తొలగించి పక్కా డ్రయినేజీ, సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేయాలని వాహనదారులు కోరుతున్నారు.

ఇబ్బందులు పడుతున్నాం

రోడ్డు నిర్మించారు కాని రోడ్డుకు ఇరువైపులా డ్రయినేజీ అస్తవ్యస్తంగా ఉండటంతో ఇబ్బందులు పడుతున్నాం. మురుగు నీటితో దుర్వాసన వెదజల్లుతోంది.



వర్షం వస్తే మురుగునీరు రోడ్లపైకి వచ్చి కాలనీలు మునిగిపోతున్నాయి.

వక్కలకుమార్, గరీబ్ నగర్

సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేయాలి

సెంట్రల్ లైటింగ్ లేకపోవడంతో రాత్రిపూట ఆ రోడ్డుపై వెళ్లాలంటేనే భయమేస్తోంది. మద్యం తాగినవారు కొంతమంది రోడ్డుపై వెళ్లే వారిని భయపెడుతున్నారు. రోడ్డు ప్రమాదాలూ తరచూ జరుగుతున్నాయి.



సింగారపు బాబు, వరంగల్

సమగ్ర శిక్ష కాంట్రాక్టు ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

- క్రమబద్ధీకరణ హామీని సీఎం నిలబెట్టుకోవాలి
- సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో పలు జిల్లాల్లో నిరాహార దీక్షలు

నవతెలంగాణ-విలేకరులు



సమగ్ర శిక్ష కాంట్రాక్టు ఉద్యోగుల క్రమబద్ధీకరణతో పాటు పలు సమస్యలపై సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ సమగ్ర శిక్షా ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో మంగళవారం పలు జిల్లాల్లో రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. విద్యాశాఖలో సమగ్ర శిక్షను విలీనం చేయాలని, ఉద్యోగులకు కనీసవేతనం ఇవ్వాలని, రూ.10లక్షల జీవిత బీమాతో పాటు ప్రభుత్వ ఉద్యోగులకు అందే అన్ని వసతులను తమకూ ఇవ్వాలని డిమాండ్ చేశారు. నల్లగొండ కలెక్టరేట్ ఎదుట నిరవధిక సమ్మె చేపట్టారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అసోసియేట్ ప్రెసిడెంట్ క్రాంతికుమార్, రాష్ట్ర కార్యదర్శి కంచర్ల మహేందర్, గౌరవ సలహాదారులు డి. నీలాంబరి మాట్లాడారు. ఆసిఫాబాద్ కలెక్టరేట్ ఎదుట చేపట్టిన సమ్మెకు స్థానిక ఎమ్మెల్యే కోవ లక్ష్మి, టీఎస్‌యూటీఎఫ్ జిల్లా అధ్యక్షులు శాంతికుమారి, గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు సంఘం జిల్లా అధ్యక్షులు లతీఫ్, పీఆర్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి చునార్కర్ అనిల్‌కుమార్ మద్దతు తెలిపారు. ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ చౌక్‌లో ఎస్ఎస్ఏ ఆకారంలో ఉద్యోగులు కూర్చొని నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎస్ఏ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి పడాల రవీందర్ తదితరులు పాల్గొన్నారు. వికారాబాద్ పట్టణంలోని ఆర్డీఓ కార్యాలయం నుంచి ఎన్టీఆర్ చౌరస్తా వరకు ర్యాలీ నిర్వహించారు. అన9ంతరం ఆర్డీఓ కార్యాలయం ఎదుట రిలే దీక్షలు చేపట్టారు. రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్ ఎదుట చేపట్టిన రిలే దీక్షలు కొనసాగుతున్నాయి. ఖమ్మం కలెక్టరేట్ వద్దనున్న ధర్నా చౌక్ వద్ద రిలే దీక్షను చేపట్టారు. టీఎస్ టీటీఎఫ్, టీఎస్ యూటీఎఫ్, ఏఐఎస్ఎఫ్, సీఐటీయూ, టీచర్స్, విద్యార్థి సంఘాలు మద్దతుగా సంఘీభావం తెలిపాయి.



పెండింగ్ వేతనాలు చెల్లించండి

- ప్రజాభవన్‌లో గిరిజన ఆశ్రమ పాఠశాలలు, హాస్టళ్ల ఏఎన్ఎమ్‌ల ఆందోళన
- 20 రోజుల్లో చెల్లిస్తామని హామీనిచ్చిన ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షులు జి.చిన్నారెడ్డి

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

రాష్ట్రంలోని గిరిజన ఆశ్రమ పాఠశాలలు, హాస్టళ్లలో పనిచేస్తున్న తమకు 11 నెలల వేతనాలు చెల్లించాలని కోరుతూ గిరిజన సంక్షేమ శాఖ ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయిస్ యూనియన్(సీఐటీయూ) ఆధ్వర్యంలో మంగళవారం హైదరాబాద్‌లోని ప్రజాభవన్‌లో ఏఎన్ఎమ్‌లు ఆందోళనకు దిగారు. వారి వద్దకు ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షులు డాక్టర్ జి.చిన్నారెడ్డి, ప్రజాపాలన నోడల్ అధికారి దివ్య దేవరాజన్ చేరుకుని వినతిపత్రం తీసుకున్నారు. వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. 20 రోజుల్లో వేతనాలు చెల్లించేలా కృషిచేస్తానని డాక్టర్ జి.చిన్నారెడ్డి హామీనిచ్చారు. 11 నెలలుగా వేతనాలు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ఎన్నిసార్లు అధికారులకు మొరపెట్టుకున్నా అధికారులు పట్టించుకోవటం లేదని ఈ సందర్భంగా ఏఎన్ఎమ్‌లు ఆవేదన వ్యక్తం చేశారు. హామీ మేరకు వేతనాలు చెల్లించకపోతే నిరవధిక సమ్మె చేస్తామని ప్రకటించారు. అనంతరం గిరిజన సంక్షేమ శాఖకు వెళ్లి అక్కడ అడిషనల్ డైరెక్టర్ సర్వేశ్వర్‌రెడ్డిని కలిసి వినతి పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా ఆ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి కె. బ్రహ్మచారి మాట్లాడుతూ ఆర్థిక శాఖ వద్ద పెండింగ్ ఉన్న ఏఎన్ఎంల వేతనాల చెక్కును వెంటనే పరిష్కారం చేయాలని డిమాండ్ చేశారు. గిరిజన విద్యార్థుల ఆరోగ్య రక్షణ కోసం అంకితభావంతో పనిచేస్తున్న ఏఎన్ఎంల పట్ల రాష్ట్ర ప్రభుత్వం ఇలా వ్యవహరించడం తగదన్నారు. ప్రతినెలా మొదటి వారంలో వేతనాలు చెల్లించాలనీ, వారాంతపు సెలవును అమలు చేయాలని కోరారు. పీఎఫ్ ఈఎస్ఐ పటిష్టంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఏఎన్ఎంలు సంఘటితంగా పోరాడితేనే సమస్యలు పరిష్కారమవుతాయని తెలిపారు. కార్యక్రమంలో సీఐటీయూ ఆదిలాబాద్ జిల్లా కార్యదర్శి ఎ.కిరణ్, ములుగు జిల్లా కార్యదర్శి రత్నం రాజేందర్, ఆసిఫాబాద్ జిల్లా అధ్యక్షులు ఆర్. రాజేందర్, తెలంగాణ గిరిజన సంక్షేమ శాఖ ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు స్వరూప, రాజమణి, పల్లవి, జంగుబాయ్, రమ, శ్రీదేవి, జయశ్రీ, మీనాక్షి, మహేశ్వరి, నర్మద తదితరులు పాల్గొన్నారు.

తాండూరులో ఫుడ్ పాయిజన్

(మొదటిపేజీ తరువాయి)

మొత్తం 80 మంది విద్యార్థినులు ఉంటున్నారు. కొన్ని రోజులుగా ఇక్కడి భోజనంలో నాణ్యత లోపించింది. అన్నంలో పురుగులతో పాటు మెత్తగా వండుతున్నారని, చారు నీళ్లలా ఉంటుందని విద్యార్థినులు చెబుతున్నారు. వార్డెన్ స్థానికంగా ఉండకపోవడంతోపాటు వంట మనుషులు కూడా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ వంట పనులు సైతం విద్యార్థినులతోనే చేయిస్తున్నారు. అయినా విద్యార్థినులకు సరైన భోజనం పెట్టడం లేదు. సోమవారం రాత్రి కూడా వండిన భోజనం సరిగ్గా లేకపోవడంతో విద్యార్థినులు తినడానికి నిరాకరించారు. కొందరు మాత్రమే భోజనం చేయగా.. వారు మంగళవారం ఉదయం వాంతులు చేసుకున్నారు. ఈ విషయాన్ని హాస్టల్ సిబ్బంది దృష్టికి తీసుకెళ్లడంతో అస్వస్థతకు గురైన వారిని ఆస్పత్రికి తరలించారు. కొందరికి హాస్టల్‌లోనే వైద్యం అందించారు. విషయం తెలుసుకున్న స్థానిక మున్సిపల్ కౌన్సిలర్ సాహూ శ్రీలత లక్ష్మీకాంత్ హాస్టల్‌ను సందర్శించి ఘటనకు గల కారణాలను విద్యార్థినులను అడిగి తెలుసుకున్నారు. పలువురి పరిస్థితి సీరియస్‌గా ఉండటంతో ఏంసీహెచ్ ఆస్పత్రికి తరలించారు. విద్యార్థినుల పట్ల హాస్టల్ సిబ్బంది వైఖరిపై ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు.

హాస్టల్‌ను సందర్శించిన రాజకీయ పార్టీలు, విద్యార్థి సంఘాల నాయకులు

గిరిజన సంక్షేమ హాస్టల్‌లో విద్యార్థులు అస్వస్థతకు గురైన విషయం తెలుసుకున్న బీఆర్ఎస్, బీజేపీ, కాంగ్రెస్ నాయకులతోపాటు విద్యార్థి సంఘాల నాయకులు హాస్టల్‌ను సందర్శించారు. విద్యార్థులతో మాట్లాడి ఘటనకు గల కారణాలను తెలుసుకున్నారు.

హాస్టల్ వార్డెన్ నిర్లక్ష్యం కారణంగానే ఘటన జరిగిందని వారు ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో రోజుకోచోట మధ్యాహ్న భోజనం వికటిస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉన్నతాధికారులు పట్టించుకోకపోవడంతోనే ఇలాంటి ఘటనలు పునరావృతం అవుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. విద్యార్థినుల తల్లిదండ్రులు సైతం ఫుడ్ పాయిజన్ ఘటనపై ఆగ్రహం వ్యక్తం చేశారు. తాండూరు తహసీల్దార్, ఎంఈఓలు కూడా విద్యార్థినుల ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. విద్యార్థినుల పరిస్థితి నిలకడగా ఉందని, ఎవరికీ ఎలాంటి ఇబ్బంది లేదని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు బియ్యని శ్రీనివాస్‌రెడ్డి, తాండూరు మార్కెట్ కమిటీ చైర్మెన్ పట్లోళ్ల బాల్‌రెడ్డి, పలువురు నాయకులు విద్యార్థినులను పరామర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. విద్యార్థినులకు మెరుగైన వైద్యం అందించి, మళ్లీ ఇలాంటి ఘటనలు జరగకుండా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కాగా, ప్రతిపక్ష పార్టీలు హాస్టల్‌ను సందర్శించిన నేపథ్యంలో హాస్టల్ వద్ద పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.

పొలాల్లో సోలార్ పవర్



- 4 వేల మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తికి రాష్ట్ర సర్కారు నిర్ణయం
- రైతులు వాడుకోగా మిగిలినది డిస్కమ్‌లకు అమ్మవచ్చు
- యూనిట్‌కు రూ.3.13 చొప్పున విద్యుత్ సంస్థల చెల్లింపులు
- యూనిట్ల కేటాయింపులో మహిళా సంఘాలకు ప్రాధాన్యం
- పొలాలను లీజుకు తీసుకుని కూడా ప్లాంట్లు ఏర్పాటు చేసుకోవచ్చు
- టెండర్లకు పిలుపు.. 20వ తేదీ తుది గడువు

నవతెలంగాణ - ఖమ్మం ప్రాంతీయ ప్రతినిధి:

రాష్ట్రంలోని రైతుల పంట పొలాల్లో సౌర విద్యుత్ ప్లాంట్లను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. పీఎం కుసుమ్ (ప్రధానమంత్రి కిసాన్ ఊర్జా సురక్షా ఏవమ్ ఉత్థాన్ మహాభియాన్) పథకం కింద 2024-25 ఆర్థిక సంవత్సరంలో వీటిని ఏర్పాటు చేస్తారు. ఈ పథకానికి తెలంగాణ పునరుత్పాదక ఇంధన వనరుల అభివృద్ధి సంస్థ (రెడ్కో)ను నోడల్ ఏజెన్సీగా రాష్ట్ర ప్రభుత్వం నియమించింది. ఈ మేరకు రాష్ట్ర ఇంధన శాఖ ముఖ్యకార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా ఇటీవల ఉత్తర్వులు జారీ చేశారు. రాష్ట్రంలో ఏడాదిలో 300 రోజుల పాటు సౌరవిద్యుత్ ఉత్పాదనకు అవకాశం ఉంది.

సబ్ స్టేషన్ల వారీగా నోటిఫికేషన్..

రాష్ట్రంలోని 33/11 కేవీ సబ్ స్టేషన్ల వారీగా ఎంత సామర్థ్యంతో కొత్త సౌరవిద్యుత్ ప్లాంట్ల ఏర్పాటుకు అవకాశాలున్నాయో వెల్లడిస్తూ త్వరలో డిస్కమ్‌లు నోటిఫికేషన్ ఇస్తాయి. నిర్ణీత సామర్థ్యం మేరకు సౌర విద్యుత్ కేంద్రాల స్థాపనకు రైతుల నుంచి రెడ్కో దరఖాస్తులను స్వీకరించనుంది.

డిస్కమ్‌ల ద్వారా కొనుగోళ్లు

రైతులు తమ పొలాల్లో ఏర్పాటు చేసుకునే సౌర విద్యుత్ కేంద్రాల నుంచి ఉత్పత్తయ్యే విద్యుత్‌ను రాష్ట్ర విద్యుత్ పంపిణీ సంస్థ (డిస్కమ్)లు కొనుగోలు చేస్తాయి. ఒక్కో యూనిట్ విద్యుత్‌కు రూ.3.13 ధరను తెలంగాణ విద్యుత్ నియంత్రణ మండలి (ఈఆర్సీ) ఇప్పటికే ఖరారు చేసింది.

టెండర్లకు పిలుపు : మహేందర్ రెడ్డి, రెడ్కో అధికారి, వరంగల్

ఇప్పటివరకు దీనికి సంబంధించిన నియమ నిబంధనలపై మార్గదర్శకాలు రాలేదు. ప్రస్తుతానికి మహిళా స్వయం సహాయక సంఘాల నుంచి దరఖాస్తులు ఆహ్వాని స్తున్నారు. ఈనెల 20వ తేదీ వరకు టెండర్లు దాఖలు చేయవచ్చు.

జార్ఖండ్ స్పీకర్‌గా రవీంద్రనాథ్ మహతో



రాంచీ : జార్ఖండ్ అసెంబ్లీ స్పీకర్‌గా జేఎంఎం ఎమ్మెల్యే రవీంద్ర నాథ్ మహతో రెండోసారి ఎన్నిక య్యారు. దీంతో రాష్ట్రంలో వరసగా రెండోసారి స్పీకర్‌గా ఎన్నికైన తొలి నాయకుడిగా నిలిచారు. సోమవారం నుంచి జార్ఖండ్ అసెంబ్లీ ప్రత్యేక సమావే శాలు ప్రారంభమయ్యాయి. రెండో రోజున సమావేశాల్లో స్పీకర్‌గా మహతో పేరును ముఖ్యమంత్రి హేమంత్ సొరెన్ ప్రతిపాదించారు. జేఎంఎం ఎమ్మెల్యే మధుర ప్రసాద్ మహతో బలపర్చారు. ప్రతిపక్ష బీజేపీ ఎమ్మెల్యేలతో సహా అందరూ మద్దతు పలికారు. సంతాల్ పరగణా డివిజన్‌లోని నాలా అసెంబ్లీ నుంచి ఇటీవల ఎన్నికల్లో మహతో విజయం సాధించారు. 2005లో తొలిసారిగా ఎమ్మెల్యేగా విజయం సాధించిన మహతో 2009 ఎన్నికల్లో మినహా 2014, 2019ల్లోనూ ఎమ్మెల్యేగా విజయం సాధించారు. గత అసెంబ్లీలోనూ స్పీకర్‌గా బాధ్యతలు నిర్వహించారు. స్పీకర్ పదవిలో ఉంటూ ఎమ్మెల్యేగా విజయం సాధించిన తొలి వ్యక్తిగా నిలిచారు.



రాంచీలో జార్ఖండ్ సీఎం హేమంత్‌సోరెన్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన సీపీఐ(ఎం) పొలిట్‌బ్యూరో సభ్యురాలు బృందా కరత్

నరమేధాన్ని ఆపండి

మణిపూర్‌లోని ఇంఫాల్‌లో పౌరహత్యలకు వ్యతిరేకంగా మహా ప్రదర్శన



ఎఎఫ్‌ఎస్‌పీఏని రద్దు చేయాలని డిమాండ్

గౌహతి: "ఎఎఫ్‌ఎస్‌పీఏని రద్దు చేయండి", "మణిపూర్‌ను నిర్మూలించొద్దు", "మణిపూర్‌ను రక్షించండి" అంటూ ప్లకార్డులు చేతబూని మణిపూర్ ప్రజలు గళమెత్తారు. తిరుగుబాటుదారులపై ఉపయో గించే చట్టాలను బనాయించటం తగదని నినదించారు. సాయుధ దళాలకు విస్తృత అధికారాలను ఇచ్చే ఎఎఫ్‌ఎస్‌పీఏ రద్దు చేసేవరకు తాము వెనక్కి తగ్గమని నిరసనకారులు స్పష్టం చేశారు. అంతర్జాతీయ మానవ హక్కుల దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం సాయుధ దళాల (ప్రత్యేక అధికారాలు)చట్టం (ఎఎఫ్ఎపీఏ) "ఉగ్రవాదుల" పౌర హత్యలకు వ్యతిరేకంగా రాజధాని ఇంఫాల్‌లో వేలాది మంది ప్రజలు, చిన్నా..పెద్దా తేడా లేకుండా భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా థౌ గ్రౌండ్ నుంచి ఐదు కిలోమీటర్ల దూరంలో ఉన్న ఖుమాన్ లంపాక్ స్టేడియం వరకు ప్రదర్శన సాగింది. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు భద్రతను కట్టుదిట్టం చేశారు.

మొబైల్ ఇంటర్నెట్ సేవలపై రాష్ట్ర ప్రభుత్వం నిషేధాన్ని ఎత్తివేసిన మరుసటి రోజే నిరసన చెలరేగిం దంటూ..అక్కడి బీజేపీ సర్కార్ ఇంటర్నెట్ సేవలను పూర్తిగా నిలిపివేసింది. దీంతో ఆల్ మణిపూర్ యునైటెడ్ క్లబ్స్ ఆర్గనైజేషన్, పొయిరే లీమారోల్ అపున్‌బా మీరా పైబి, ఆల్ మణిపూర్ ఉమెన్స్ వాలంటరీ అసోసియేషన్, కమిటీ ఆన్ హ్యూమన్ రైట్స్ , మణిపూర్ స్టూడెంట్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో మహా ర్యాలీ నిర్వహించాయి.

కుకీ మిలిటెంట్లు ఆరుగురు అమాయక మహిళలు , పిల్లలను చంపడాన్ని మేం ఖండిస్తున్నాం " అని ఒక నిరసనకారుడు అన్నారు. జిరిబామ్ జిల్లాకు చెందిన ఆరుగురు పౌరుల హత్యలు గత నెలలో ఇంఫాల్ లోయలో విస్తృత నిరసనలకు దారితీశాయి, ఈ సమయంలో ఆగ్రహించిన గుంపులు మంత్రులతో సహా పలువురు శాసనసభ్యుల ఇండ్లు, ఆస్తుల లూటీ లాంటి ఘటనలకు దారితీసిన విషయం విదితమే.

అయితే గత నెలలో ఇంఫాల్ లోయలోని ఆరు పోలీస్ స్టేషన్ల పరిధిలో మళ్లీ ఎఎఫ్‌ఎస్‌పీఏని అమలు చేసింది. ఇది లోయ నివాసితులను కలవరపరిచింది. ఆ తర్వాత, అధికార ఎన్డీయే పార్టీల ఎమ్మెల్యేలు సమావేశమై కేంద్ర ప్రభుత్వాన్ని రద్దు చేసే అంశాన్ని పరిశీలించాలని తీర్మానించారు.

అసమానతలపై పోరాడుదాం

- మహిళల భద్రతకు ఐక్యంగా ఉద్యమిద్దాం : ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి



నవతెలంగాణ - ముషీరాబాద్

అసమానతలపై పోరాడుదాం.. మహిళల భద్రతకు ఐక్యంగా ఉద్యమిద్దాం అని ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి పిలుపునిచ్చారు. మానవ హక్కుల దినోత్సవం సందర్భంగా ఐద్వా రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం హైదరాబాద్ వీఎస్‌టీ చౌరస్తా నుంచి బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రం వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఐద్వా రాష్ట్ర అధ్యక్షులు ఆర్.అరుణజ్యోతి అధ్యక్షతన జరిగిన సభలో మల్లు లక్ష్మి మాట్లాడారు. మహిళలపై లైంగికదాడులు, లైంగిక వేధింపులు పెరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. వీటిని అరికట్టడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సరైన చర్యలు తీసుకోవడం లేదన్నారు. ఘటన జరిగినప్పుడే స్పందిస్తున్నాయి తప్ప ఈ ఘటనలకు కారణమవుతున్న మూలాలను గుర్తించి చర్యలు తీసుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. మద్యం, మాదకద్రవ్యాలు, పోర్న్‌సైట్స్ వల్ల మహిళలు, చిన్నారులపై హింస పెరుగుతోందని చెప్పారు. మద్యం, మాదకద్రవ్యాలను నియంత్రించాలని, ఎన్టీఆర్ హయాంలో రాష్ట్రంలో మద్య నిషేధం విధించినప్పుడు మహిళలపై వేధింపులు తగ్గాయని మహిళా సంఘాలు చెబుతున్నా ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదన్నారు. వర్మ కమిషన్ సూచనలు అమలు చేయాలని కోరారు. సింగపూర్ లాంటి దేశాల్లో పోర్న్‌సైట్స్‌ను నిషేధించారని, మన దేశం మాత్రం ఆ వైపు ఆలోచించడం లేదన్నారు. ధరలు నియంత్రించకపోవడం వల్ల ఆహారధాన్యాలు సరిపడా కొనలేక మహిళలు, పిల్లలు పోషకాహార లోపంతో బాధపడుతున్నారని తెలిపారు.

రాజ్యాంగం కల్పించిన జీవించే హక్కును పై అంశాల ద్వారా పేద మహిళలు పొందలేకపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అసంఘటిత రంగంలో పనిచేస్తున్న 70శాతం మహిళలకు పని భద్రత లేదని, సమాన పనికి సమాన వేతనం అందడం లేదని వివరించారు. ఐక్యరాజ్యసమితి ఈ సంవత్సరాన్ని "సమానత్వం- అసమానతలను తగ్గించాలి" అనే స్లోగన్‌తో నిర్వహించాలని పిలుపునిచ్చింది కానీ దేశంలో మహిళలకు సంబంధించిన అన్ని అంశాల్లో అసమానతలతోపాటు అడుగడుగునా హింస ఎదురవుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ పరిస్థితిపై ప్రశ్నించాలని, మన హక్కుల రక్షణ కోసం ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో రాష్ట్ర సహాయ కార్యదర్శి కెఎన్.ఆశాలత, ఓటాఫ్ ఆఫీస్ బేరర్స్ ఎం.వినోద, పి. శశికళ, వై.వరలక్ష్మి, రాష్ట్ర నాయకులు ఎం.లక్ష్మమ్మ, పి.విమల, ఎ.పద్మ, స్వరూప, సిహెచ్.లీలావతి, బి.కవిత, హైదరాబాద్, మేడ్చల్ జిల్లాల నుంచి మహిళలు పాల్గొన్నారు.

సీపీఐ(ఎం) కేంద్ర కమిటీ సభ్యులు
కెఎం తివారీ కన్నుమూత

(మొదటిపేజీ తరువాయి)

నిగమ్ బోధ్ ఘాట్‌లో అంత్యక్రియలు జరగనున్నాయి. సీపీఐ(ఎం) కేంద్ర కమిటీ సభ్యులు, ఢిల్లీ రాష్ట్ర కమిటీ మాజీ కార్యదర్శి కెఎం తివారీ ఏడాది కాలంగా క్యాన్సర్‌కు చికిత్స పొందుతున్నారు. సోమవారం సాయంత్రం తీవ్ర శ్వాసకోస సమస్యతో తూర్పు ఢిల్లీలోని ధర్మశిలా ఆస్పత్రికి తరలించారు. అక్కడ వెంటిలేటర్‌పై చికిత్స పొందుతున్న ఆయన మంగళవారం ఉదయం తుదిశ్వాస విడిచారు. తివారీ తన చుట్టూ ఉన్న వారికి స్ఫూర్తినిస్తూనే తన ఆరోగ్య విషయంలో ధైర్యంగా పోరాడారు. ప్రముఖ ట్రేడ్ యూనియన్ నాయకుడు తివారీ ఘజియాబాద్-సాహిబాబాద్ పారిశ్రామిక బెల్ట్‌లో తన రాజకీయ ప్రయాణాన్ని ప్రారంభించారు. సీఐటీయూ ఢిల్లీ రాష్ట్ర కార్యదర్శిగా బాధ్యతలు నిర్వహించారు. సీఐటీయూ జనరల్ కౌన్సిల్, వర్కింగ్ కమిటీ సభ్యునిగా బాధ్యతలు నిర్వర్తించారు. కార్మికుల హక్కుల కోసం పోరాటం చేశారు.

1977లో సీపీఐ(ఎం)లో చేరిన తివారీ 1988లో ఢిల్లీ రాష్ట్ర కమిటీకి ఎన్నికయ్యారు. 1991లో రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులుగా ఎన్నికయ్యారు. 2018లో కేంద్ర కమిటీ సభ్యునిగా ఎన్నికయ్యారు. 2017 నుంచి 2024 వరకు ఆయన ఢిల్లీ రాష్ట్ర కార్యదర్శిగా బాధ్యతలు నిర్వర్తించారు. ఆయన ఘజియాబాద్ జిల్లా కార్యదర్శిగా ఎన్‌సీఆర్ ప్రాంతంలో ట్రేడ్ యూనియన్ ఉద్యమాలను నిర్వహించడం లో కీలక పాత్ర పోషించారు. తివారీ మూడు నెలలకుపైగా జైలు జీవితం గడిపారు. రాజకీయ పోరాటంలో మూడు సంవత్సరాల తొమ్మిది నెలల పాటు అజ్ఞాతవాసంలో ఉన్నారు. కార్మిక ఉద్యమానికి తివారీ చేసిన కృషి, కమ్యూనిస్టు లక్ష్యం పట్ల ఆయన నిబద్ధత అంకితభావం గుర్తుండిపోతాయని సీపీఐ(ఎం) శ్రేణులు తెలిపాయి.

తివారీ భౌతికకాయాన్ని ఘజియాబాద్ పార్టీ కార్యాలయానికి తీసుకెళ్లి నివాళులర్పించిన తరువాత, నేడు (బుధవారం) ఉదయం 9:30 గంటలకు న్యూఢిల్లీలోని హరికిషన్ సింగ్ సుర్జీత్ భవన్‌కు తీసుకెళ్లనున్నారు. అంతిమ వీడ్కోలు ఉదయం 11 గంటలకు ఢిల్లీలోని నిగమ్ బోధ్ ఘాట్‌లో జరగనున్నాయి.

కెఎం తివారీకి సీపీఐ(ఎం) పొలిట్ బ్యూరో నివాళి

సీపీఐ(ఎం) కేంద్ర కమిటీ సభ్యులు, ఢిల్లీ రాష్ట్ర కమిటీ మాజీ కార్యదర్శి కామ్రేడ్ కెఎం తివారీ మరణం పట్ల సీపీఐ(ఎం) పొలిట్ బ్యూరో తన ప్రగాఢ సంతాపాన్ని వ్యక్తం చేసింది. ఈ మేరకు మంగళవారం ప్రకటన విడుదల చేసింది. గత కొన్ని నెలలుగా క్యాన్సర్‌తో పోరాడుతున్న ఆయన మంగళవారం ఉదయం మరణించారని తెలిపింది. ఆయన కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేసింది.

గిరిజనుల భూములు అన్యాక్రాంతం



- తెలంగాణ గిరిజన సంఘాల ఆధ్వర్యంలో సదస్సు

నవతెలంగాణ-రామచంద్రాపురం

సంగారెడ్డి జిల్లా రామచంద్రాపురం మండలంలోని వెలిమెల, కొండకల్ ప్రాంతానికి చెందిన గిరిజనుల భూములను బిల్డర్లు కాజేస్తున్నారని, వారిపై చర్యలు తీసుకొని గిరిజనులకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ పలు గిరిజన సంఘాల ఆధ్వర్యంలో మంగళవారం గిరిజనులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తెలంగాణ గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీరాం నాయక్, గిరిజన పోరాట నాయకులు, వెలిమెల మాజీ సర్పంచ్ మహిపాల్ గౌడ్, అడ్వకేట్ కృష్ణ, నాయకులు నారాయణ నాయక్, ఆంజనేయ నాయక్ మాట్లాడారు. సంవత్సరాల క్రితం పేద ప్రజలు, గిరిజనులకు ప్రభుత్వం ఇచ్చినటువంటి భూములను బాగుచేసుకొని వ్యవసాయం చేసుకుంటూ ఆయా గ్రామాల ప్రజలు బతుకుతున్నారని తెలిపారు. అలాంటి భూములు ఇప్పుడు కోట్ల రూపాయల విలువ చేస్తుండటంతో వాటిని వ్యాపారరీత్యా లాక్కునేందుకు గిరిజనులను ప్రలోభాలకు గురిచేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పేదలకు ఇచ్చిన 38ఈ, పీటీ, పట్టా, అసైన్డ్ భూములను భూబకాసురులు మాయ మాటలు చెప్పి పేదల వద్ద నుంచి లాక్కునే ప్రయత్నాలు చేస్తున్నారని అన్నారు. ప్రభుత్వ అధికారులు వ్యాపారస్తులకు ఏజెంట్లుగా వ్యవహరిస్తూ రికార్డులను తారుమారు చేస్తూ పేదల భూములకు ఎసరు పెడుతున్నారని తెలిపారు. గతంలో వెలిమెలలోని సర్వే నంబర్ 392, కొండకల్‌లోని 155, మోకిల ప్రాంతాల్లో పేద ప్రజలకు ఇచ్చిన వందల ఎకరాల భూములు నేడు ఒక సెంటు కూడా లేకపోవడం శోచనీయమన్నారు.

ప్రభుత్వ అధికారుల అండదండలతో యధేచ్ఛగా పేదల భూములను కాజేసేందుకు ప్రయత్నిస్తున్న నిర్మాణ సంస్థలపై తమ పోరాటం ఆగదన్నారు. ఆయా భూములు గిరిజనులకు దక్కే వరకు మరో లగచర్ల పోరాటం జరుగుతుందని తెలిపారు. గిరిజనులు బిల్డర్ల మోసాలకు మోసపోకుండా సంఘటితంగా పోరాడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో గిరిజన పోరాట నాయకులు ప్రతాపరెడ్డి, అన్యా నాయక్, బుజ్యా నాయక్, విగ్నేష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

చేనేత కార్మికులను గాలికొదిలేసిన ప్రభుత్వం

- ఉపాధి లేక ఆకలి చావులకు గురవుతున్నారు : మాజీ ఎమ్మెల్సీ, చేనేత కార్మిక సంఘం గౌరవాధ్యక్షులు చెరుపల్లి సీతారాములు
- చేనేత కార్మిక సంఘం ఆధ్వర్యంలో రాష్ట్ర సదస్సు



నవతెలంగాణ-ముషీరాబాద్

చేనేత సంక్షేమ పథకాలను కాంగ్రెస్ ప్రభుత్వం రద్దుచేసి కార్మికులను గాలికి వదిలేసిందని మాజీ ఎమ్మెల్సీ, చేనేత కార్మిక సంఘం గౌరవాధ్యక్షులు చెరుపల్లి సీతారాములు అన్నారు. తెలంగాణ చేనేత కార్మిక సంఘం ఆధ్వర్యంలో మంగళవారం హైదరాబాద్ బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో రాష్ట్ర సదస్సు నిర్వహించారు. సంఘం నాయకులు వనం శాంతి కుమార్ అధ్యక్షతన జరిగిన ఈ సభలో చెరుపల్లి మాట్లాడారు. రాష్ట్రంలో చేనేత కార్మికులు ఉపాధి లేక, చేసిన కష్టానికి తగిన ఆదాయం లేక ఆర్థిక ఇబ్బందులకు గురవుతూ కుటుంబ పోషణ భారమై ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. చేనేత పరిశ్రమకు బడ్జెట్‌లో నిధులు కేటాయించకపోవడంతో పాటు యారన్ సబ్సిడీ, నేతన్నకు చేయూత పథకాలను ఎత్తివేసినందుకా విజయోత్సవ సభలు అని ప్రశ్నించారు.

చేనేత కార్మికులకు రుణాలు మాఫీ చేస్తామని చెప్పి కాలయాపన చేస్తున్నారని అన్నారు. చేనేత సహకార సంఘాలకు ప్రజాస్వామ్య యుతంగా ఎన్నికలు జరపాలని డిమాండ్ చేశారు. చేనేత ఉద్యమాన్ని ముందుకు తీసుకోవడం కోసం ఈ నెలలో పలు జిల్లాల్లో చేనేత కార్మిక సంఘాలు, వివిధ రాజకీయ పార్టీలతో కలిసి రౌండ్ టేబుల్ సమావేశం ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. అనంతరం చేనేత కేంద్రాల్లో నిరాహార దీక్షలు, స్థానిక ఎమ్మెల్యేలకు, అధికారులకు వినతి పత్రాలు ఇవ్వనున్నట్టు చెప్పారు. జనవరిలో రాష్ట్రవ్యాప్తంగా బస్సుయాత్ర నిర్వహించి హైదరాబాద్‌లో నేతన్న గర్జన కార్యక్రమాన్ని చేపడతామన్నారు. ఈ కార్యక్రమాలపై కలిసివచ్చే వారందరితో ఐక్య ఉద్యమాలను నిర్వహిస్తామని తెలిపారు.

రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ప్రభుత్వ రంగ సంస్థలకు కావలసిన వస్త్రాలను ఉత్పత్తి చేస్తున్న కార్మికులకు వేతనాలను పెంచాలని కోరారు. చేనేత కార్మికుల ఉపాధి సంక్షేమానికి అభివృద్ధి బోర్డును ఏర్పాటు చేసి, రూ. 2000 కోట్లు కేటాయించాలని అన్నారు. ప్రతి చేనేత కార్మికునికి రూ. 5 లక్షల పెట్టుబడి సహాయం ఇవ్వాలని, తృప్తి ఫండ్ అండ్ సబ్సిడీ పథకాలను పునరుద్ధరించాలని, చేనేత కార్మికులకు ప్రత్యేక ఆరోగ్య బీమా పథకాన్ని ప్రవేశపెట్టాలని కోరారు.

ఇల్లు లేని ప్రతి కార్మికునికి 120 గజాల ఇంటి స్థలం, వర్క్ షెడ్ కట్టుకోవడానికి రూ. 10 లక్షలు ఇవ్వాలని అన్నారు. మిల్లు వస్త్రాలపై ప్రింట్ అయి వస్తున్న పోచంపల్లి ఇక్కత్ డిజైన్స్‌ను అరికట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో చేనేత కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి కూరపాటి రమేష్, నాయకులు గంజి మురళీధర్, కందగట్ల స్వామి, గడ్డం జగన్నాథం, పాసి కంటి లక్ష్మీ నరసయ్య, డి నరసింహారెడ్డి, బాషాబత్తిని రాజేషం, చోళ రాజేశం, చిక్క దేవదాస్, వీరన్న, బడుగు శంకరయ్య, ముషం నరహరి, వర్కాల చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

కర్నాటక మాజీ సీఎం
ఎస్ఎం కృష్ణ కన్నుమూత

- నేడు అంత్యక్రియలు
- ప్రధాని మోడీ ప్రభృతుల సంతాపం





(ఫైల్)

బెంగళూరు : కర్నాటక మాజీ ముఖ్యమంత్రి, పద్మ విభూషణ్ అవార్డు గ్రహీత ఎస్ఎం కృష్ణ (92) ఇకలేరు. గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన మంగళవారం తెల్లవారు జామున తన నివాసంలో మృతి చెందారని ఆయన కుటుంబ సభ్యులు తెలిపారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమార్తెలు వున్నారు. కర్నాటక ప్రభుత్వం మూడు రోజులు సంతాప దినాలుగా ప్రకటించింది. ఆయన అంత్యక్రియలు బుధవారం అధికారిక లాంఛనాలతో స్వంత జిల్లా అయిన మాండ్యలో స్వగ్రామంలో జరగనున్నాయి. వృద్ధాప్యం కారణంగా క్రియాశీల రాజకీయాల నుంచి వైదొలగుతున్నట్టు 2023 జనవరిలో ప్రకటించారు. తన రాజకీయ జీవితంలో ఆయన పలు పదవులను అధిష్టించారు. కాంగ్రెస్‌తో 50ఏండ్ల అనుబంధాన్ని విడనాడి 2017లో బీజేపీలో చేరారు. అంతకుముందు ఆయన ప్రజా సోషలిస్టు పార్టీలో వుండేవారు. ఐటి రంగంలో బెంగళూరును గ్లోబల్ మ్యాప్‌లోకి తీసుకెళ్ళిన నేతగా ఆయనకు పేరుంది. ఆయన మృతి వార్త తెలిసిన వెంటనే దేశవ్యాప్తంగా సంతాపాలు వెల్లువెత్తాయి. ప్రధాని నరేంద్రమోడీ, కర్నాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, గవర్నర్ తావర్‌చంద్ గెహ్లాట్, ఆంధ్ర, తెలంగాణా ముఖ్యమంత్రుల సహా పలువురు ప్రముఖులు ఆయన మృతికి సంతాపం తెలియచేశారు.

రాజ్యసభ ఛైర్మెన్‌పై అవిశ్వాసం

(మొదటిపేజీ తరువాయి)

అవకాశం ఇవ్వాలని, కానీ సభలో ప్రతిపక్ష నాయకుడు మల్లికార్జున ఖర్గే లేచి నిలబడగానే ఛైర్మెన్ మైక్రోఫోన్‌ను తరచూ కట్ చేస్తున్నారని ప్రతిపక్ష ఎంపీలు విమర్శించారు. పార్లమెంటరీ నిబంధనలు, సాంప్రదాయాల ప్రకారం సభ నడవాలని, ఈ విషయమై తాము ఫిర్యాదు చేసిన ప్రతిసారి తమను ఛాంబర్‌లోకి పిలిచి సర్దుబాటు చేసేందుకు ఛైర్మెన్ ప్రయత్నిస్తున్నారే తప్ప నిబంధనలను పాటించాలని భావించడం లేదని తెలిపారు. ఈ సమావేశాల్లో అవిశ్వాస తీర్మానానికి ఆమోదం లభించడం సాంకేతికంగా సాధ్యం కాదని, 14 రోజుల నోటీస్ పీరియడ్ ఉండాలని, శీతాకాల సమావేశాలు ముగియడానికి ఇప్పుడు కేవలం ఎనిమిది రోజులే ఉందని అధికార పార్టీకి చెందిన వారు చెబుతున్నారు.

అదానీపై చర్చకు భయపడుతున్న బీజేపీ

(మొదటిపేజీ తరువాయి)

పార్లమెంట్ శీతాకాల సమావేశాల్లో వాయిదాల పర్వం కొనసాగుతోంది. మంగళవారం ఉదయం 11 గంటలకు ప్రారంభమైన ఉభయ సభలు అదానీ వ్యవహారంపై ప్రతిపక్ష ఎంపీల ఆందోళనతో మధ్యాహ్నం 12 గంటలకే వాయిదా పడ్డాయి. తిరిగి ప్రారంభమైనా ఎలాంటి మార్పు లేకపోవడంతో నిమిషాల వ్యవధిలోనే బుధవారానికి వాయిదా పడ్డాయి.

పత్తి రైతులకు సీసీఐ అన్యాయం

- కేంద్ర మంత్రులకు రైతు కమిషన్ వినతి

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

పత్తి కొనుగోళ్లలో సీసీఐ మోసం చేస్తున్నదని వ్యవసాయ మరియు రైతు సంక్షేమ కమిషన్ ఆరోపించింది. ఎనుమాముల మార్కెట్, జిన్నింగ్ మిల్‌లో పత్తి రైతులకు జరుగుతున్న అన్యాయాలను కమిషన్ ఛైర్మెన్ కోదండరెడ్డి నేతృత్వంలోని బృందం పరిశీలించారు. ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి ఆ విషయాలను బుధవారం పార్లమెంట్ ఆవరణంలో వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్‌సింగ్ చౌహన్, కేంద్ర టెక్స్‌టైల్స్ శాఖ మంత్రి గిరిరాజ్ సింగ్‌లకు వినతిపత్రం సమర్పించారు.

ముంబయిలో ఘోర రోడ్డు ప్రమాదం

- ఏడుగురు మృతి.. 49 మందికి గాయాలు



ముంబయి : ముంబయిలోని కుర్లాలో సోమవారం రాత్రి ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. మున్సిపల్ కార్పొరేషన్‌కు చెందిన బెస్ట్ అనే బస్సు అదుపుతప్పి పాదచారులపైకి దూసుకెళ్లింది. ఈ ఘటనలో ఏడుగురు మృతి చెందారు. 49 మందికి గాయాలయ్యాయి. ఈ ఘటనకు సంబంధించి వివరాలిలా ఉన్నాయి. సోమవారం రాత్రి కుర్లా నుంచి అంధేరికి వెళ్తున్న బెస్ట్ బస్సు బుద్ధ కాలనీ వద్దకు రాగానే బ్రేకులు ఫెయిల్ అయి పాదచారులపైకి, కొన్ని వాహనాలపైకి దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో అక్కడికక్కడే ముగ్గురు ప్రాణాలు కోల్పోయారు. మరో నలుగురు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు. పలువురికి గాయాలయ్యాయి. అలాగే పలు వాహనాలు ధ్వంసమయ్యాయి. సమాచారం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. క్షతగ్రాతులను చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. గాయపడిన వారిలో కొందరి పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు తెలిపారు. కాగా, ఈ ఘటనలో పోలీసులు డ్రైవర్‌ని అదుపులోకి తీసుకుని విచారించారు. బస్సు బ్రేక్ ఫెయిల్ అవ్వడంతో నియంత్రణ కోల్పోయినట్టు డ్రైవర్ వాంగ్మూలాన్ని పోలీసులు నమోదు చేశారు. అయితే బస్సును డ్రైవర్ అతివేగంతో నడిపారని స్థానికులు తెలిపారు. ఈ ఘటనలో ప్రమాదానికి గురైన బస్సు.. కొత్తదేనని.. మూడు నెలల క్రితమే రిజిస్ట్రేషన్ అయిందని ఆర్టీవో పేర్కొన్నారు.

జీవో 22ను అమలు చేయాలి

సింగరేణి కాంట్రాక్ట్ కార్మికుల వేతనాలు పెంచాలి

- ప్రజాభవన్‌లో ఎస్‌సీకేఎస్ ఆధ్వర్యంలో కాంట్రాక్ట్ కార్మికుల ఆందోళన
- వారంలోగా యాజమాన్యంతో జాయింట్ మీటింగ్ ఏర్పాటు చేస్తామని అధికారుల హామీ




నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

జీవో 22ను అమలు చేసి వేతనాలు పెంచాలని సింగరేణి కాంట్రాక్ట్ కార్మికులు డిమాండ్ చేశారు. ప్రజాభవన్‌లో మంగళవారం సింగరేణి కాంట్రాక్టు కార్మిక సంఘం(ఎస్‌సీకేఎస్-సీఐటీయూ అనుబంధం) ఆధ్వర్యంలో వారు ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలను ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షులు డాక్టర్ జి. చెన్నారెడ్డి, ప్రజాపాలన నోడల్ ఆఫీసర్ దివ్య దేవరాజ్ అడిగి తెలుసుకున్నారు. సింగరేణి లైజాన్ ఆఫీసర్‌ను ప్రజాభవన్‌కు పిలిపించి కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలపై చర్చించారు. వారం రోజుల్లోపు సింగరేణి యాజమాన్యంతో జాయింట్ మీటింగ్ ఏర్పాటు చేయించి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. వేతనాల పెంపుదల జీవో 22 అమలు, తదితరాలను సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం, విద్యుత్ శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క దృష్టికి తీసుకెళ్ళి న్యాయం చేసేందుకు ప్రయత్నిస్తామని భరోసానిచ్చారు.

అంతకు ముందుకు ఎస్‌సీకేఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి.మధు మాట్లాడుతూ..రూ.4,900 కోట్ల నికర లాభాలను ప్రకటించిన సింగరేణి సంస్థ దానికి కారణమైన కాంట్రాక్ట్ కార్మికుల వేతనాలు పెంచకుండా దోపిడీకి పాల్పడుతున్నదని విమర్శించారు. కార్మిక శాఖ ఆధ్వర్యంలో సింగరేణి యాజమాన్యం-యూనియన్ల మధ్య జరిగిన ఒప్పందం సైతం అమలుకు నోచుకోవడం లేదని వాపోయారు. కాంట్రాక్టు కార్మికుల వేతనాలు పెంచడానికి ఎందుకు అనుమతించడం లేదో ప్రభుత్వం, విద్యుత్ శాఖ మంత్రి సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఈఎస్ఐకి ఎందుకు డబ్బులు చెల్లించడం లేదని యాజమాన్యాన్ని ప్రశ్నించారు. నర్సరీ వర్కర్లకు సీఎంపీఎఫ్, ఈఎస్ఐ కనీస వేతనాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. కోలిండియా వేతనాలు అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. బెల్ట్ క్లీనింగ్ కార్మికులకు సెమీ స్కిల్డ్ వేతనాలివ్వాలనీ, అండర్‌గ్రౌండ్‌లో పనిచేస్తున్న వారికి 20 శాతం అదనపు అలవెన్స్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రతినెలా ఏడో తేదీ లోపు వేతనాలు చెల్లించే ఆదేశాలున్నప్పటికీ కాంట్రాక్టర్లు అమలు చేయట్లేదని విమర్శించారు. పర్మినెంట్ కార్మికుల మాదిరిగానే కాంట్రాక్ట్ కార్మికులకు కూడా బోనస్ అమలు చేయాలనీ, ప్రొఫెషనల్ ట్యాక్స్ మినహాయింపునివ్వాలని కోరారు. అనంతరం సింగరేణి ప్రధాన కార్యాలయానికి వెళ్ళి సింగరేణి డైరెక్టర్ (పా)ను కలిసి సమస్యలపై వినతి పత్రం అందజేశారు. సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని డైరెక్టర్ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సింగరేణి కాంట్రాక్ట్ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు దూలం శ్రీనివాస్, నాయకులు, డి. వీరన్న, మహేందర్, రాజన్న, రాజేష్, రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

సంపాదకీయం

అధర్మధర్మం



తమ విద్వేష ఎజెండా అమలుకు, ఉన్మాద చర్యలకు అడ్డొచ్చిన వారిని బీజేపీ, ఆరెస్సెస్ పరివారం ఏ విధంగా కక్షకట్టి వేటాడి వెంబడించి చిత్రవధలకు గురిచేస్తాయో గుజరాత్ మాజీ ఐపిఎస్ అధికారి సంజీవ్ భట్ ఉదంతం తిరుగులేని ఉదాహరణ. ఆలిండియా సర్వీస్ పోలీస్ అధికారికే ఇంతటి ఘోర అనుభవం ఎదురైందంటే, ఇక సాధారణ వ్యక్తుల పరిస్థితేంటో తలచుకుంటే భయం కలుగుతుంది. దాదాపు 27 సంవత్సరాల కింద పోలీస్ కస్టడీలో ఉన్న నిందితుడిని నేరం ఒప్పుకోవాలని ప్రమాదకర ఆయుధాలతో, కరెంట్ షాక్‌లతో టార్చర్ పెట్టారన్న కేసులో సంజీవ్ భట్‌ను నిర్దోషిగా గుజరాత్‌లోని పోర్‌బందర్ అదనపు చీఫ్ జ్యుడిషియల్ మేజిస్ట్రేట్ కోర్టు ఇటీవల ప్రకటించింది. ప్రాసిక్యూషన్ సందేహింపజాలని సాక్ష్యాధారాలు చూపలేక పోయిందని, ఒక ప్రభుత్వ అధికారి ప్రాసిక్యూషన్‌కు సరైన అనుమతి తీసుకోలేదని కోర్టు తప్పుబట్టింది. కాగా రెండున్నర దశాబ్దాలకుపైన తనపై నమోదైన అభియోగాలు తప్పుడువని నిరూపించుకోడానికి పోలీస్ అధికారి భట్ పడ్డ వ్యయప్రయాసలు, ఎదుర్కొన్న మానసికవ్యథ మాటల్లో చెప్పలేం. ఇక్కడితోనే న్యాయపోరాటం ఆగిపోయిందని కాదు. భట్ పూర్తిగా బయటపడ్డారనుకోవడానికి వీల్లేదు.

సంజీవ్‌భట్‌పై బీజేపీకి ఎందుకంత కక్షనో అర్థం కావాలంటే కాస్త వెనక్కి వెళ్లాలి. అయోధ్య రామమందిర నిర్మాణం కోసం 1990లో ఎల్‌కె అద్వానీ చేపట్టిన దేశవ్యాప్త రథయాత్రను నిలిపేశాక గుజరాత్‌లో పెద్దఎత్తున మత అల్లర్లు రేగాయి. జామ్‌జోథ్‌పూర్ పట్టణంలో బంద్‌లో ఘర్షణలు సృష్టిస్తున్న 150మందిని పోలీస్ అధికారిగా ఉన్న భట్ అదుపులోకి తీసుకున్నారు. వారిని విడిచిపెట్టాక ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఒకరు చనిపోయారు. దాన్ని లాకప్ మరణంగా చిత్రీకరించడంతో ఆ కేసులో భట్ జీవిత ఖైదు అనుభవిస్తున్నారు.

ఎంతటి వారినైనా బీజేపీ ఏ రకంగా అక్రమ కేసుల్లో ఇరికిస్తుందో భట్ కేసు పూర్వాపరాలు పరిశీలిస్తే అర్థమవుతుంది. 1994లో ఆర్‌డిఎక్స్, ఇతర భయంకర అక్రమ ఆయుధాల ల్యాండింగ్‌పై పోలీసులు 22 మందిపై టాడా కేసు పెట్టి అరెస్ట్ చేశారు. అహ్మదాబాద్ సబర్మతి జైలులో ఉన్న నరన్ జాదవ్, ఇతర నిందితులను 1997లో పి.టి. వారెంట్‌పై పోర్‌బందర్‌కు విచారణకై తరలించారు. అక్కడ పోలీస్ కస్టడీలో నేరం ఒప్పుకోవాలంటూ ఎస్‌పిగా ఉన్న భట్, కానిస్టేబుల్ వాజుభాయి చౌ తమను టార్చర్ చేశారని నిందితుడు నరన్ జాదవ్ మేజిస్ట్రేట్‌కు ఫిర్యాదు చేశాడు. కొన్నేళ్ల విచారణ అనంతరం 2013లో భట్, చౌలపై ఎఫ్ఐఆర్ నమోదుకు మేజిస్ట్రేట్ ఆదేశించారు. తీర్పు వచ్చేలోపు కానిస్టేబుల్ చౌ చనిపోయాడు. ఉగ్రవాద నిరోధక చట్టం టాడా కేసులోని నిందితుడి ఫిర్యాదుపై ఇన్నేళ్లు ఒక ఐపిఎస్ అధికారిపై కేసు నడవడం స్థానిక బీజేపీ ప్రభుత్వ ప్రోద్బలం లేకుండా అసంభవం. 61 సంవత్సరాల మాజీ ఐపిఎస్ మరో రెండు కేసుల్లో శిక్ష పడి రాజ్‌కోట్ కేంద్ర కారాగారంలో శిక్ష అనుభవిస్తున్నారు. ఇవి కూడా బీజేపీ వెనుకుండి బనాయించిన కేసులే కావడం గమనార్హం.

సంజీవ్‌భట్‌పై బీజేపీకి ఎందుకంత కక్షనో అర్థం కావాలంటే కాస్త వెనక్కి వెళ్లాలి. అయోధ్య రామమందిర నిర్మాణం కోసం 1990లో ఎల్‌కె అద్వానీ చేపట్టిన దేశవ్యాప్త రథయాత్రను నిలిపేశాక గుజరాత్‌లో పెద్దఎత్తున మత అల్లర్లు రేగాయి. జామ్‌జోథ్‌పూర్ పట్టణంలో బంద్‌లో ఘర్షణలు సృష్టిస్తున్న 150మందిని పోలీస్ అధికారిగా ఉన్న భట్ అదుపులోకి తీసుకున్నారు. వారిని విడిచిపెట్టాక ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఒకరు చనిపోయారు. దాన్ని లాకప్ మరణంగా చిత్రీకరించడంతో ఆ కేసులో భట్ జీవిత ఖైదు అనుభవిస్తున్నారు. రాజస్థాన్‌కు చెందిన ఒక లాయర్‌ను డ్రగ్స్ కేసులో 1996లో ఇరికించిన కేసులో 20 ఏళ్ల జైలు శిక్ష అనుభవిస్తున్నారు. 2002లో గుజరాత్ మత అల్లర్ల విషయంలో అబద్ధపు సాక్ష్యాలు సృష్టించారన్న కేసులో సామాజిక ఉద్యమకారిణి తీస్తా సెతల్వాద్, నాటి డీజీపీ శ్రీకుమార్‌తో పాటు భట్ కూడా నిందితుడు. అన్నింటికీ మించి 2002లో గోద్రా అనంతర మారణకాండకు అప్పుడు గుజరాత్ ముఖ్యమంత్రిగా ఉన్న నరేంద్ర మోడీ ప్రమేయం ఉందని భట్ అఫిడవిట్ ఇవ్వగా సిట్ తోసిపుచ్చింది. ఈ కార్పణ్యంతోనే భట్‌ను ఏవో సాకులు చెప్పి సర్వీస్ నుంచి 2015లో గుజరాత్ ప్రభుత్వం సస్పెండ్ చేయగా, కేంద్రహోం మంత్రిత్వశాఖ ఏకంగా సర్వీస్ నుంచి తొలగించింది. న్యాయంకోసం భట్ సుప్రీం కోర్టును ఆశ్రయించారు. బీజేపీ, మోడీ కక్ష కడితే ఇలా ఉంటుందని భట్ జీవితం ద్వారా తెలుస్తుంది. పైశాచికంగా సామూహిక లైంగికదాడికి గురై, కుటుంబాన్ని కోల్పోయిన బిల్కిస్‌బానో కేసులో శిక్ష అనుభవిస్తున్న ముద్దాయిలకు చట్టం, రాజ్యాంగం, కోర్టులను కాలరాసి క్షమాభిక్ష పెట్టగలరు. భీమాకోరేగావ్ వంటి కేసుల్లో అక్రమంగా ఇరికించి ఏండ్లకేండ్లు బెయిల్ రాకుండా అడ్డుకోనూగలరు. తమ దారికి రాని భట్ వంటి సిన్సియర్ అధికారులను వెంటాడి వేధిస్తారు. ఇదీ బీజేపీ, మోడీ, సంఘ్ పరివారం ధర్మం, నీతి!

మెయిల్ @ నవతెలంగాణ

మార్చాల్సింది తెలంగాణా బతుకుల్ని

ప్రస్తుతం తెలంగాణ రాష్ట్ర రాజకీయాల్లో ప్రధానంగా జరుగుతున్న టాపిక్ ఇది. ప్రజా సమస్యలపై కాకుండా వాటి దృష్టి మరల్చేందుకు గాను అధికార, ప్రతిపక్షాల మధ్య నడుస్తున్న చర్చగా దీని అభివర్ణనలు కూడా మొదలయ్యాయి. సహజంగానే ఏదైనా అంశం ముందుకొచ్చినప్పుడు రాజకీయాల్లో ఇలాంటి అభిప్రాయాలు, ఆలోచనలు వస్తుంటాయి. తాజాగా "తెలంగాణ తల్లి" విషయానికొస్తే తెలంగాణ తల్లి ఎలా ఉండాలి? అనేది ప్రజల్లో కంటే రాజకీయ పార్టీల మధ్య జరుగుతున్న రాద్ధాంతం ఆసక్తి కలిగించే చర్చగా నడుస్తున్నది. నాడు ఉమ్మడి ఏపీలో ఉన్నప్పుడు తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర ఉద్యమం జరుగుతున్న సమయంలో తెలంగాణ తల్లి విగ్రహం ఇలా ఉండాలని అప్పుడు నాటి టీ(బీ)ఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో గ్రామగ్రామానా తెలంగాణ తల్లి విగ్రహాలు ఆవిష్కరణలు జరిగాయి. ఆ విగ్రహం విషయంలో కూడా అనేక విమర్శలు వచ్చినప్పటికీ తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర ఉద్యమ సెంటిమెంట్ ముందు ఆ విమర్శలు ఎవ్వరూ లెక్కచేయలేదు. తెలంగాణ సాయుధ పోరాటంలో కీలకపాత్ర నిర్వహించి, నిజాం దొరలకు ముచ్చెమటలు పట్టించిన వీరనారి ఐలమ్మను తెలంగాణ తల్లిగా గుర్తించాలని సామాజిక సంఘాలు డిమాండ్ చేసినప్పటికీ దశాబ్దపాలనలో ఐలమ్మను తెలంగాణ తల్లిగా ఒప్పుకోవడానికి సాహసించలేదు. ఎందుకంటే ఐలమ్మకు ధగధగా మెరుపులతో కూడిన పట్టుచీరలు లేవు. మెడలో వేసుకోవడానికి హారాలు అసలే లేవు. పాత సంతుకలో ఉండే చేనేత చీర, మెడలో పసుపు తాడు, కాళ్లకు కడియాలు, నుదుట కుంకుమ బొట్టు తప్పితే ఆమెకు ఏమీ లేవు.అందుకే ఆమెను తెలంగాణ తల్లిగా ఒప్పు కోలేదనే విమర్శలు జోరుగా నడిచాయి.

అయితే ఇప్పుడీ చర్చ ఎందుకొచ్చిందంటే? 2023 డిసెంబరులో మన రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చింది. రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యారు. గత కేసీఆర్ పాలనలో అమలు చేసిన టీఎస్‌ను టీజీగా, టీఎస్ఆర్టీసీని టీజీఎస్ఆర్టీసీగా, టీఎస్‌పీఎస్‌సిని టీజీపీఎస్‌సీగా మార్చారు. యాదాద్రిని యాదగిరిగుట్టగానే పిలవాలని సూచించారు. ఇప్పుడు తెలంగాణ తల్లి విగ్రహంలోనూ మార్పులు చేర్పులు చేశారు. బంగారపు అంచుతో ఉండే ఆకుపచ్చ చీర, ఒక చేతిలో వరికంకులు, మెడలో హారం, పోరాటానికి ప్రతిరూపంగా గద్దెపై పిడికిళ్లను చేర్చారు. ఈ విగ్రహాన్ని ఈనెల 9న సచివాలయంలో ఆవిష్కరించారు.అయితే ఇక్కడ ప్రధానంగా ఆలోచించాల్సింది ఏమిటంటే? నిజమైన తెలంగాణ తల్లి ఎలా ఉండాలనేది ఎవ్వరూ పూర్తిగా చెప్పలేరు. ఇలా ఉండాలనే క్లారిటి కూడా ఇవ్వలేరు. ఎందుకంటే తెలంగాణ రాష్ట్రం పూర్తిస్థాయి గ్రామీణ సాంప్రదాయ సంస్కృతి కలిగిన రాష్ట్రం. సబ్బండ వర్గాల వేదిక. గ్రామీణ ప్రాంతాల్లో తెలంగాణ మహిళ ఎలా ఉంటుందో గ్రామీణ ప్రాంతాలపై అవగాహన కలిగిన ప్రతి వ్యక్తికి తెలుసు. తెలంగాణ రాష్ట్రంలోని నూటికి తొంభై శాతం మహిళలు అధునాతన సౌందర్య అలం కరణపై కాకుండా సాంప్రదాయ అలంకరణకే ప్రాధాన్యత ఇస్తారు. మనం కూడా మన తల్లి ఎలా ఉండాలని అనుకుంటాము? మన తల్లి రూపం అచ్చమైన గ్రామీణ సాంప్రదాయ రూపం కొట్టొచ్చినట్లు ఉండాలనేది మనందరి ఆకాంక్ష. పార్టీల మధ్య వైరుధ్యాలు ఎలా ఉన్నప్పటికీ తెలంగాణ రాష్ట్ర సాంప్రదాయాన్ని కనుమరుగు చేయకుండా ఉంటే అదే చాలు..! నాడు కేసీఆర్ పాలనలో ఉన్న తెలంగాణ తల్లి విగ్రహరూపం నేడు కాంగ్రెస్ ప్రభుత్వం మార్చి వేసింది. రేపు మరో పార్టీ అధికారంలోకి వస్తే వారికున్న ఆకాంక్షలు, ఆలోచనలకు తగినట్లుగా ఉండాలని మరో రూపం తీసుకొచ్చే ప్రమాదం ఉంది. కాబట్టి ఫలానా విగ్రహం ఇలా అలా ఉండాలనేది పాలకుల ఇష్టమా.. ప్రజల అభీష్టమా ముందుగా తేలాల్సిన అవసరం ఉంది. తెలంగాణ ప్రజల బతుకులు మారాలి.విగ్రహ రూపాలు కాదు.

- కల్యాణి ఎల్లయ్య, 8179190156

దక్షిణ కొరియాలో కుట్ర : వైఫల్యమా? విబేధాలా!



ఎం కోటేశ్వరరావు
8331013288

అత్యవసర పరిస్థితి పేరుతో సైనిక పాలనకు తెరతీసి కేవలం ఆరుగంటల వ్యవధిలో అనివార్య పరిస్థితుల్లో ఎత్తివేసిన దక్షిణ కొరియా అధ్యక్షుడు యూన్ సుక్ యోల్ దేశం విడిచిపోకుండా అక్కడి అవినీతి నిరోధకశాఖ ప్రధాన కార్యాలయం ఆంక్షలు విధించింది. దీంతో అక్కడ సంక్షోభం సమసిపోలేదన్నది స్పష్టం. 1987 తరువాత తొలిసారిగా దక్షిణ కొరియాలో మిలిటరీ పాలన రుద్దేందుకు చూశారు. 2024 డిసెంబరు మూడోతేదీ మంగళవారం రాత్రి సైనిక పాలన విధించి బుధవారం తెల్లవారుజామున రద్దు చేస్తున్నట్లు ప్రకటించారు. అత్యవసర పరిస్థితి ప్రకటన, మిలిటరీకి అధికారాలు అప్పగింత, పార్లమెంటు వ్యతిరేక తీర్మానం, ఉపసంహరణ నాటకీయంగా జరిగాయి. అనేక అనుమానాలకు తావిచ్చే ఈ పరిణామం ఎందుకు, ఎలా జరిగింది? తెరవెనుక కథ ఏమిటన్నది తెలియాల్సి ఉంది. కారణాలేమైనా తాత్కాలికంగానైనా జనం ఊపిరి పీల్చుకున్నారు. అధ్యక్షుడు యూన్ సుక్ యోల్ మీద ప్రతిపక్షాలు పెట్టిన అభిశంసన తీర్మానం వీగిపోయింది. మరోసారి పెట్టేందుకు చూస్తున్నారు. తప్పు చేసినట్లు యూన్ ప్రకటించాడు. తనపై ఏదో ఒక నిర్ణయం తీసుకొనే బాధ్యతను పార్టీకి అప్పగిస్తున్నట్లు జాతీయ టీవీలో ప్రసంగిస్తూ చెప్పాడు. అయితే అధ్యక్షుడు ఏ కార్యకలాపాలు నిర్వహించకూడదని నిర్ణయించినట్లు ప్రధాని హాన్ డక్ సూ, అధికార పీపుల్స్ పవర్ పార్టీ (పిపిపి) నేత హాన్ డాంగ్ హూ ప్రకటించారు. మరోవైపు యూన్ మీద విచారణ జరుపుతున్నట్లు ప్రత్యేక దర్యాప్తు అధికారి ప్రకటించాడు. అధ్యక్షుడు రాజీనామా చేస్తే లేదా నేరాలకు పాల్పడినపుడు అరెస్టయితే తప్ప విధులు నిర్వహించటానికి ప్రధానికి అవ కాశం లేదు. మిలిటరీ కమాండర్ ఎవరనే ప్రశ్న కూడా తలెత్తింది. సాంకేతికంగా అధ్యక్షుడు ఉన్నా అధికారాలు లేనట్లు ప్రకటించిన తరువాత హోంమంత్రి రాజీనామాను ఆమోదించిన తీరుచూస్తే తెరవెనుక ఏదో జరుగుతోందన్న భావన కలుగుతోంది.అధ్యక్షుడికి అధికారాలు లేకుండా చేసి పదవి నుంచి తొలగించకుండా కొనసాగించటం దేశంలో జరిగిన రెండో కుట్రగా ప్రతిపక్షాలు వర్ణించాయి.

తాత్కాలిక రక్షణ మంత్రి, సైనిక దళాల జాయింట్ చీఫ్ కమాండర్ ఒక ప్రకటన చేస్తూ యూన్ మరోసారి అత్యవసర పరిస్థితి ప్రకటిస్తే ఆమోదించేది లేదని చెప్పటం విశేషం. అత్యవసర పరిస్థితి ఎత్తివేత తరువాత రక్షణ మంత్రి రాజీనామా చేశాడు, అతనిపై దేశద్రోహనేరం మోపి అరెస్టు చేశారు. ప్రత్యేక దళాల, రాజధాని రక్షణ కమాండర్లు అనేక మందిని విధుల నుంచి తప్పించారు. దక్షిణ కొరియాలో మిలిటరీ నియంత పాలన అధికారికంగా అంతమైనప్పటికీ పాలనలో మిలిటరీ ప్రమేయం కొనసాగుతూనే ఉంది.1961లో జరిగిన తొలి మిలిటరీ తిరుగుబాటు తరువాత 1987నుంచి పౌరపాలన ఉన్నప్పటికీ పౌర భద్రతా వ్యవహారాలన్నీ మిలిటరీ మాజీ నేతలే ఎక్కువగా చూస్తున్నారు. ఇంతవరకు రక్షణ మంత్రిగా ఒక్కరంటే ఒక్కరు కూడా మిలిటరీయేతరులు లేరు. అనేక ముఖ్య బాధ్యతల్లో ఉద్యోగవిరమణ చేసిన మిలిటరీ అధికారులే ఉంటున్నారు. అందువలన పౌర నేతలు తమ రాజకీయ అవసరాల కోసం మిలిటరీ నేతల మీదనే ఆధార పడుతున్నారు. మిలిటరీ అధికారుల తీరుతెన్నులు చూసినపుడు వారు రాజకీయాల్లోని మితవాద శక్తులతోనే బలమైన సంబంధాలు కలిగి ఉండటం ఆందోళన కలిగించే అంశం.ప్రజాస్వామ్యం కోసం జరిగిన ఆందోళన, ఉద్యమాలను అణచివేసిన చరిత్ర వారిది. తమతో చేతులు కలపని లేదా విబేధించే వారిని కమ్యూనిస్టులతో సంబంధాలు ఉన్నాయనో దేశానికి వ్యతిరేకంగా పని చేస్తున్నారనో ఆరోపించి అణచివేయటం పరిపాటిగా మారింది. డిసెంబరు మొదటి వారంలో అత్యవసర పరిస్థితి ప్రకటించి విధిలేక వెనక్కు తీసుకున్న యూన్ కూడా అవే చిలుక పలుకులు వల్లించాడు. అక్కడ మిలి టరీ పాలన ముప్పు మెడ మీద కత్తిలా వేలాడుతూనే ఉంది. 2017లో దొడ్డిదారిన మిలిటరీ పాలన రుద్దేందుకు చూశారు.అవినీతికి పాల్పడినందుకు అధ్యక్షురాలు పార్క్ యున్ హై మీద పెట్టిన అభిశంసన తీర్మానం నెగ్గింది. దాంతో ఆమెను తిరిగి నియమించకూడదంటూ ఆందోళనకు సిద్ధపడిన వారిని, మీడియాను అణచేందుకు వందలాది మిలిటరీ వాహనాలు, ఆరువేల మంది సైనికులను సిద్ధం చేసి మిలిటరీ పాలన ప్రకటించేందుకు దాదాపు ఏర్పాట్లు చేశారు.

తాజా పరిణామాలకు వస్తే అత్యవసర పరిస్థితి విధింపును వ్యతిరేకిస్తూ పద్దెనిమిది మంది అధికార పక్ష సభ్యులు తీర్మానానికి అనుకూలంగా ఓటు వేయటంతో నెగ్గింది. అయితే అభిశంసన తీర్మానం సమయానికి వారు వెనక్కు తగ్గటంతో వీగిపోయింది. అయినప్పటికీ యూన్ రాజీనామా, అతగాడి అరెస్టు, అధికార పార్టీని రద్దు చేయాల్సిందేనంటూ ఆదివారం నాడు సియోల్లో పార్లమెంటు ముందు వేలాది మంది జనం ప్రదర్శన చేశారు. అధ్యక్షుడిని తప్పించకుండా ప్రధానికి అధికారాన్ని కట్టబెట్టటం రాజ్యాంగ విరుద్ధమని పార్లమెంటు స్పీకర్ ఊ వన్ షిక్ ప్రకటించాడు. తక్షణమే యూన్ అధికారాన్ని సస్పెండ్ చేసేందుకు అవకాశాలను వెతికేందుకు ప్రతిపక్ష పార్టీలతో సమావేశం జరపనున్నట్లు పేర్కొన్నాడు. స్వల్ప మెజారిటీతో అధ్యక్ష పదవికి ఎన్నికైన యూన్ గత రెండున్నరేండ్లుగా ప్రతిపక్షాలు, మీడియా, కార్మికవర్గాన్ని అణచివేసేందుకు చూశాడు. కమ్యూనిస్టు వ్యతిరేక ప్రచారాన్ని ప్రారంభించాడు. 2023 ఆగస్టులో లిబరేషన్ డే ప్రసంగంలో కమ్యూనిస్టు నియంతృత్వశక్తులు ప్రజాస్వామ్యం, మానవహక్కుల కార్యకర్తలు లేదా పురోగామి శక్తుల ముసుగులో తప్పుడు ప్రచారం చేస్తున్నారని, అనైతిక ఎత్తుగడలను అనుసరిస్తున్నారని ఆరోపించాడు. నియంతల పాలనలో ప్రతివారూ ఇలాంటి చిలుక పలుకులే వల్లించారు. సైనిక పాలన విధించేందుకు అవసరమైన పద్ధతుల్లో యూన్ ఏదో చేయబోతున్నట్లు ప్రతిపక్ష డెమోక్రటిక్ పార్టీ ఎంపీ కిమ్ మిన్ ఒక ప్రకటనలో హెచ్చరించాడు. తన స్కూలు సహాధ్యాయులు, అనుచరులను పెద్ద సంఖ్యలో కీలకమైన మిలిటరీ, ఇతర భద్రతా అధికార పదవుల్లో నియమించాడని పేర్కొన్నాడు. తాజా పరిణామాల తరువాత కిమ్ చెప్పింది వాస్తవమే అని పచ్చి మితవాద పత్రిక చోసన్ ఇబో వ్యాఖ్యానించింది. యూన్ భార్య కిమ్ ఇవోన్ హి, ఆధ్యాత్మిక సలహాదారు మైయుంగ్, ఇతర అనుచరగణం అనేక అక్రమాలు, అవినీతికి పాల్పడ్డారు. అధికార పార్టీలో తమ అనుచరులకు పెద్దపీట వేశారు.

కార్పొరేట్లకు అనుకూలంగా కార్మిక వ్యతిరేకమైన చర్యలను యూన్ ప్రతిపాదించాడు. వారానికి 52గంటలకు బదులు 120 గంటలు పని చేయాలని, ఏడు రోజులూ 17 గంటల చొప్పున విధులు నిర్వహించాలని పిలుపునిచ్చాడు. మార్చినెలలో కార్మిక శాఖ 69 గంటల పని వారాన్ని ప్రతిపాదించగా కార్మికులు పెద్ద ఎత్తున నిరసన తెలిపారు. సైనిక పాలన విధించిన వెంటనే సైనిక జనరల్ ఆన్ సూ అన్ని రాజకీయ కార్యకలాపాలు, కార్మికుల సమ్మెలను నిషేధించాడు, పత్రికల మీద సెన్సార్‌షిప్ ప్రకటించాడు. ఎవరినైనా వారంటు లేకుండా అరెస్టు చేసే అధికారమిచ్చాడు. సమ్మెచేస్తున్న వైద్యులు విధుల్లో చేరాలని ఆదేశించాడు. కార్మిక సంఘాలలో లేని కార్మికుల రక్షణ కోసమంటూ ప్రతిపాదించిన చర్యలకు ప్రతిపక్షం మద్దతు ఇవ్వాలని ఈ ఏడాది మేనెలలో యూన్ కోరాడు. అలాంటి కార్మికులు పరస్పరం సహాయం చేసుకొనే విధంగా అసోసియేషన్లను ప్రోత్సహిస్తామని చెప్పాడు. ఇది కార్మికులను సంఘాలకు దూరం చేసే, విచ్ఛిన్నం చేసే ఎత్తుగడతప్ప మరొకటి కాదు. పార్లమెంటులో ప్రతిపక్షాలు మెజారిటీగా ఉన్నందున ఇలాంటి ప్రతిపాదనలు ఆమోదం పొందే అవకాశం లేదు. సంఘటిత కార్మిక సంఘాలంటే హింసాత్మక నేరాలకు పాల్పడే సంఘటిత శక్తులని యూన్ ఆరోపించాడు. నిర్మాణ రంగంలో తమ కార్మికులను మాత్రమే వినియోగించాలని కంపెనీల మీద సంఘాలు ఒత్తిడి చేస్తున్నాయని నిందించాడు. తన వైఫల్యాలను కప్పిపుచ్చుకొనేందుకు కార్మిక సంఘాలను బూచిగా చూపి నిందిస్తే జనం హర్షిస్తారని భావించిన యూన్ ఇతర చర్యలతో అదే ప్రజల్లో పలుకుబడి కోల్పోయాడు. 2022లో జరిగిన ఎన్నికల్లో కేవలం 0.73శాతం ఓట్ల మెజారిటీతో మాత్రమే యూన్ ఎన్నికయ్యాడు. ఈ ఏడాది ఏప్రిల్లో జరిగిన ఎన్నికల్లో పార్లమెంటులోని 300 స్థానాలకు గాను యూన్ నాయకత్వంలోని పీపుల్స్ పవర్ పార్టీ 108 స్థానాలను మాత్రమే తెచ్చు కోగా ప్రతిపక్షాలకు 192 వచ్చాయి. అందువలన తన అజెండాకు పార్లమెంటు ఆమోదం తెలిపే అవకాశం లేకపోవటంతో దాన్ని పక్కన పెట్టేందుకు కుంటి సాకులతో అత్యవసర పరిస్థితి లేదా మిలిటరీ పాలన రుద్దేందుకు ప్రయత్నించాడు. ఒక వైపు మిలిటరీ పాలన ప్రకటనకు క్షమించాలని అంటూనే తన చర్యను సమర్థించుకున్నాడు. పార్లమెంటులో మెజారిటీగా ఉన్న పార్టీలు అసాధారణ రీతిలో తన యంత్రాంగాన్ని అభిశంసించేందుకు పూనుకొని బడ్జెట్‌తో సహా ప్రభుత్వ కార్య కలాపాలను అడ్డుకొనేందుకు పూనుకున్నట్లు ఆరోపించాడు.



1961లో జరిగిన తొలి మిలిటరీ తిరుగుబాటు తరువాత 1987నుంచి పౌరపాలన ఉన్నప్పటికీ పౌర భద్రతా వ్యవహారాలన్నీ మిలిటరీ మాజీ నేతలే ఎక్కువగా చూస్తున్నారు. ఇంతవరకు రక్షణ మంత్రిగా ఒక్కరంటే ఒక్కరు కూడా మిలిటరీయేతరులు లేరు. అనేక ముఖ్య బాధ్యతల్లో ఉద్యోగవిరమణ చేసిన మిలిటరీ అధికారులే ఉంటున్నారు.అందువలన పౌర నేతలు తమ రాజకీయ అవసరాల కోసం మిలిటరీ నేతల మీదనే ఆధార పడుతున్నారు. మిలిటరీ అధికారుల తీరుతెన్నులు చూసినపుడు వారు రాజకీయాల్లోని మితవాద శక్తులతోనే బలమైన సంబంధాలు కలిగి ఉండటం ఆందోళన కలిగించే అంశం.ప్రజాస్వామ్యం కోసం జరిగిన ఆందోళన, ఉద్యమాలను అణచివేసిన చరిత్ర వారిది.

ఇప్పుడు దక్షిణ కొరియాలో ఏం జరగబోతోంది అన్న ఆసక్తి తలెత్తింది. యూన్ రాజీనామా చేయటం, అధ్యక్ష ఎన్నికలను ప్రకటించటం ఒకటి. అయితే గత ఎన్నికల్లోనే స్వల్ప మెజారిటీ, పార్లమెంటు ఎన్నికల్లో ఘోరపరాభవం పాలైన అధికార పక్షం ఇంత జరిగాక ఎన్నికల్లో పోటీకి సిద్ధపడుతుందా ? యూన్ మీద విచారణ తతంగం జరిపి తిరిగి ఓటర్లలో విశ్వాసం ఉంది అనుకుంటే అప్పుడు ఎన్నికలకు వెళ్లవచ్చు. దాంట్లో భాగంగానే దేశ పౌరులకు టీవీలో క్షమా పణ కూడా చెప్పించారు. అధికార విధులేవీ నిర్వర్తించకూడదని, ఒక క్రమ పద్ధతిలో తప్పుకుంటాడని ఆదివారం నాడు పార్టీ ప్రకటించినప్పటికీ మరోసారి సైనికపాలన విధించేందుకు అవసరమైన అధికారాలన్నీ అతగాడి వద్ద ఉన్నాయి. శనివారం నాడు పార్లమెంటు వద్ద యూన్‌కు వ్యతిరేకంగా జరిగిన ప్రదర్శనలో పదిలక్షల మంది పాల్గొన్నట్లు నిర్వాహకులు ప్రకటించగా పోలీసులు లక్షా 49వేల మంది అని చెప్పారు. అనేక అంశాలతో పాటు ఆర్థిక దిగజారుడు అక్కడి కార్మి రేట్లను ఆందోళనకు గురిచేస్తున్నది.వృద్ధి రేటు 2010లో 6.8శాతం ఉండగా గతేడాది 1.4శాతానికి దిగజారింది. ఈ ఏడాది 2.2శాతంగా ఉండవచ్చని ఐఎంఎఫ్ అంచనా వేసింది.అంతర్జాతీయ కార్మిక సంస్థ నివేదికల ప్రకారం 2022లో నిజవేతనాలు 0.2శాతం, 2023లో 1.3శాతం పడిపోగా ఈ ఏడాది 0.5శాతం ఉండవచ్చని అంచనా. ఈ కారణంగానే అనేక పరిశ్రమల, సంస్థల కార్మికులు ఇటీవలి కాలంలో ఆందోళనలు చేపట్టారు. దాని అణచివేత ప్రయత్నమే సైనిక పాలన అని చెప్పవచ్చు. వచ్చే రోజుల్లో ఏ ప్రభుత్వం వచ్చినా లేదా సైనిక తిరుగుబాటు జరిగినా కార్మికవర్గానికి పోరుబాట తప్ప మరొక మార్గం లేదు.

రైతులకు 'భరోసా'నివ్వని ఏడాది పాలన



మూడ్ శోభన్
9949725951

రాష్ట్రంలో 2023 డిసెంబర్ 9న అధికారానికి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం తమ ఎన్నికల మేనిఫెస్టోలో రైతులకు అనేక వాగ్దానాలు ప్రకటించింది. అందులో ప్రధానంగా చెప్పుకోవాల్సినవి కొన్ని ఉన్నాయి. ప్రభుత్వం ఏర్పడిన వెంటనే రూ.2 లక్షల రైతు రుణమాఫీ, ఇందిరమ్మ రైతు భరోసా పేరుతో భూమి ఉన్న రైతులతో పాటు, కౌలు రైతులకు ఏడాదికి ఎకరాకు రూ.15 వేలు, భూమిలేని ఉపాధి హామీ రైతుకూలీలకు ఏడాదికి రూ.12 వేలు ఇస్తామని హామీనిచ్చింది. అన్ని పంటలను మెరుగైన మద్దతు ధరతో ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని, మూతబడిన చక్కెర కర్మాగారాలు తెరిపించి, పసుపు బోర్డు ఏర్పాటు చేస్తామని తెలిపింది. పంటల బీమా, భూమి యాజమాన్య హక్కులను అందిం చటం, నకిలీ విత్తన వ్యాపారులపై పిడి యాక్ట్ వంటి తప్పకుండా అమలు చేస్తామని పేర్కొంది. ప్రతీ ఎకరాకు సాగు నీరందేలా, నిర్దిష్ట సమయంలో అసంపూర్ణ ప్రాజెక్టుల పూర్తి చేస్తామని చెప్పింది. రైతు కమిషన్, కొత్త వ్యవసాయ విధానాలతో పాటు మరిన్ని హామీలనిచ్చింది. ఈ హామీలన్నింటిని ఏడాదిలో పూర్తి చేస్తానని ఒక్కో హామీకి తేదీలు కూడా ఖరారు చేసింది. మరి ఏడాదికాలంగా రైతాంగానికి ఇవన్నీ హామీలు అమలు చేసిందా? వాస్తవ పరిస్థితి ఏమిటి?

రుణమాఫీ, రైతు భరోసా ఏది?

రూ.2 లక్షల లోపు పంటరుణాన్ని 2024 ఆగష్టు 15లోపు రద్దు చేస్తానని ప్రకటించింది. కానీ ఆగష్టు 15 నాటికి 22,07,067 మందికి రూ.17,869.20కోట్లు, నవంబర్ 2024లో 2.80లక్షల మందికి రూ.2,860కోట్లు మాఫీ చేసింది. ప్రభుత్వం అంచనా ప్రకారం 41లక్షల మందికి 31వేల కోట్లు మాఫీ చేయాల్సివున్నా సాంకేతిక కారణాల సాకుతో మాఫీ చేయలేదు. పైగా ఇంకా మాఫీ చేస్తామని మ ంత్రులు ప్రకటిస్తూనే వున్నారు. ఈ జాప్యం వల్ల రైతులకు బ్యాంకులు రుణాలివ్వడం లేదు. 2024-25కు బ్యాంకర్ల కమిటీ పంట రుణాల కింద రూ. 81,477.09 కోట్లు కేటాయించినప్పటికీ వానాకాలం 27,485 కోట్లు మాత్రమే పంట రుణాలిచ్చి చేతులు దులుపుకుంది. దీంతో రైతులు అధిక వడ్డీకి ప్రయివేటు వ్యాపారులపై ఆధారపడి రూ.20వేల కోట్లకు పైగా రుణాలు తెచ్చిన పరిస్థితి నెలకొంది. దీర్ఘకాలిక రుణాలు ఇవ్వడం లేదు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం 2018లో ప్రవేశ పెట్టిన రైతుబంధు 2023 వానాకాలం నాటికి రూ.79,714.49 కోట్లు 65లక్షల మంది రైతులకు పంపిణీ చేసింది. కాంగ్రెస్ ప్రభుత్వం 2023-24 యాసంగికి 69.86లక్షల మందికి రూ.7,625.75కోట్లు చెల్లించింది. కానీ 2024-25 వానాకాలం రైతు భరోసాని ఎగ్గొట్టింది. విధానపరమైన నిర్ణయం శాసనసభలో జరపాలని, ఎవరికి రైతు భరోసా ఇవ్వాలో తేల్చాలని వాయిదా వేసింది. కనీసం యాసంగికి 2025 జనవరి 15 సంక్రాంతి వరకు ఇస్తామని ముఖ్యమంత్రి స్వయంగా ప్రకటించారు. అమలు కోసం రైతులు ఎదురుచూస్తున్నారు.



పంటలకు మద్దతు ధర ఇచ్చేదెన్నడు?

అన్ని పంటలను మెరుగైన మద్దతు ధరతో ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని హామీనిచ్చినా కేవలం ధాన్యం మాత్రమే కొనుగోలు చేసింది. రాష్ట్రంలో గతంకన్నా 8వేల కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి, వానాకాలం ఉత్పత్తి మొత్తాన్ని ఆఖరిగింజ వరకు కొనుగోలు చేస్తా మని పదేపదే ప్రకటిస్తున్నది. అత్యధికంగా 155 లక్షల టన్నుల ధాన్యం ఉత్పత్తి అయినట్లు, 90లక్షల టన్నులు మార్కెట్‌కు వస్తుందని తెలి పింది. కొనుగోలుకు రూ.10,547కోట్లు కేటాయించింది. కానీ మార్కెట్ల లో తేమ, నాణ్యత ప్రమాణాలను కారణాలు చూపి క్వింటాల్‌కు 5 కిలోల వరకు కోత పెడుతున్నది. మార్కెట్‌కు తెచ్చిన ధాన్యం పదిరోజుల వరకు అమ్మకాలు సాగడం లేదు. మార్కెట్లలో ప్లాట్‌ఫామ్, టర్పాలిన్స్ అందుబాటులో లేవు. అమ్మిన ధాన్యం డబ్బులు కూడా రైతుల అకౌంట్లలో ఆలస్యంగా వేస్తున్నారు. మేనిఫెస్టోలో ప్రకటించిన ఆరు పంటలకు మద్దతు ధర ఇస్తామని చెప్పినా నెరవేర్చలేదు. వరికి రూ.500, మొక్కజొన్నకు రూ.330, కందులు రూ.400, సోయా రూ.450, పత్తి రూ. 475, జొన్నలు రూ.292, మద్దతు ధరలు మిరప రూ.15వేలు, పసుపు రూ.12వేలు, ఎర్రజొన్న రూ.3,500, చెరుకు రూ.4వేలు క్విం టాల్‌కు నిర్ణయిస్తూ ప్రకటించారు. కానీ వాగ్దానానికి భిన్నంగా సన్న ధాన్యానికి రూ.500లు మాత్రమే ఇస్తున్నారు. మొత్తం వరి ధాన్యంలో 30శాతానికి లోపు ఉంది. తక్కువ మంది రైతులకు ప్రయోజనం కలుగుతుంది.

అఖిలపక్షం సలహాలు ఏం చేశారు?

ధరణి చట్టంలో అనేక లోపాలున్నాయని, దాన్ని రద్దు చేసి భూమాతను తీసుకొస్తామని ప్రభుత్వం చెప్పింది. ఎం.కోదండరెడ్డి కన్వీనర్‌గా ఏడుగురితో వేసిన రైతు సంక్షేమ కమిషన్‌ను నియమించింది. ఆ కమిషన్ 2024 ఆగష్టు 8న అఖిలపక్ష సమావేశాన్ని పిలిచి సలహాలు కోరింది. ప్రభుత్వం ప్రకటించిన ముసాయిదాపై అనేక సవరణలొచ్చాయి. 1. గత ప్రభుత్వం ధరణిలో రద్దు చేసిన "పాసు పుస్తకాల చట్టం 1971 సెక్షన్ 26" దానిని తిరిగి పునరుద్ధరించాలని సమావేశం సూచించింది. దీని వలన వాస్తవ సాగు దారులకు కౌలు దారులకు హక్కు పునరుద్ధరించబడుతుంది. రిజిస్ట్రేషన్ 19 రకాల భూములకు అంగీకరిస్తూ ముసాయిదా చట్టంలో చూపారు. కానీ, 1948 జాగీర్‌దారి రద్దు కిందగల జాగీర్ భూములు, పాయిగా, సంస్థాన్, మక్తా, ఆగ్రహార గ్రామం, ఉమిలీ, ముకాసా భూములకు పాస్ పుస్తకాలివ్వకూడదు. అవి ప్రభుత్వ ఆధీనంలోనే ఉంటాయన్న ముసా యిదాను సవరించాలని అభిప్రాయం తెలిపింది. వ్యవసాయ భూములకు, వ్యవసాయేతర భూములకు (రియల్ ఎస్టేట్) విడిగా రిజిస్టర్లు తయారు చేయాలని, 2జూన్2014 నాటికి తెల్లకాగితాలపై కొనుగోలు చేసిన భూములకు ఆస్తుల బదలాయింపు చట్టం-1882, రిజిస్ట్రేషన్ చట్టం-1908 ప్రకారం పట్టాలివ్వబడతాయి. సాదాబైనామాల గడువును జీవో 150 ప్రకారం 15జూన్2016 వరకు ఫారం 10 ఇచ్చిన వారికి వర్తింపచేయాలని అఖిలపక్షం కోరింది. వీలునామా, వారసత్వ మ్యుటేషన్‌కు ఎలాంటి రిజిస్ట్రేషన్ ఫీజు వసూలు చేయకూడదని, గ్రామంలో రికార్డులను తయారుచేయడానికి రెవెన్యూ వీఆర్ఎలను నియమిస్తామని ముసాయిదాలో చెప్పబడింది. భూముల కేసులపై అఫిల్ చేయడానికి జిల్లా కలెక్టర్ లేదా సిసిఎల్ఏ దగ్గరికి వెళ్లాలని చేసిన సూచనను అఖిలపక్షం వ్యతిరేకించింది. ప్రతి జిల్లా కేంద్రంలో నోడల్ ఆఫీసర్‌ను పెట్టాలని, ఈ చట్టాన్ని తరహా ఆమోదించి అమలు చేయాలని సమావేశంలో ఈ అభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. ఇది కాక ప్రజాపాలనలో వచ్చిన 1.28 కోట్ల దరఖాస్తుల్లో 70లక్షల దరఖాస్తులు భూసమస్యలకు సంబంధించినవే ఉన్నాయి. వీటిని సరిచేయ డానికి 20 రోజులు కార్యక్రమం తీసుకుని ఇంతవరకు పెండింగ్‌లోనే పెట్టింది. రైతుల సమస్యల్ని పరిష్కరించే పద్ధతి ఇదేనా?

భూ దరఖాస్తుల పరిష్కారమెప్పుడు?

భూమాత చట్టాన్ని (ధరణి) ఆమోదించి, ప్రజాపాలనలో వచ్చిన భూ దరఖాస్తులను విచారించి వాస్తవ సాగు దారులందరికీ పాసు పుస్తకాలివ్వాలి. ఇప్పటికే లక్షలాది మంది ఏడాది కాలంగా ఈ సమస్యల పరిష్కారానికి రెవెన్యూ కార్యాలయాలు, సివిల్ కోర్టుల చుట్టూ చెప్పుల రిగేలా తిరుగుతున్నారు. కౌలుదారులకు హక్కులు కల్పించాలి. ప్రస్తుత శీతాకాల అసెంబ్లీ సమావేశాలు నడుస్తున్నందున ఈ పథకాల్ని ఆమోది ంచేలా ప్రభుత్వం చొరవ తీసుకోవాలి. అలాగే ముసాయిదాలోని లోపాలను సరిచేయాలి. రాష్ట్రానికి వ్యవసాయ ప్రణాళిక రూపొందించాలి. భూసార పరీక్షలు నిర్వహించాలి. పంటల విధానాన్ని రూపొందించి రాష్ట్రాన్ని దిగుమతుల నుండి రక్షించాలి. నకిలీ విత్తన వ్యాపారంపై ఉక్కుపాదం మోపుతామన్న ప్రభుత్వం ఆ దిశగా చర్యలు తీసుకోవడం లేదు. నకిలీ విత్తన వ్యాపారం సజావుగా సాగిపోతునేవుంది. రైతులు నష్ట పోతూనే ఉన్నారు. సంస్థాగతంగా, చట్ట పరంగా చేపట్టాల్సిన చర్యలు శూన్యం.ప్రధానంగా ఆత్మహత్యల నివారణకు, కౌలుదారులకు చట్టపరమైన రక్షణ కల్పించాలి. ప్రభుత్వ భూములకు రక్షణ కల్పనతో పాటు చట్టాల్లో మార్పు చేయాలి. 65 ఏండ్లు దాటిన రైతులకు పెన్షన్ సౌకర్యం కల్పించాలి. రైతు బీమాలో మార్పు చేయాలి. జిల్లా స్థాయిలో అఖిల పక్ష సమావేశాలు ఏర్పాటు చేసి రైతులెదుర్కొంటున్న సమస్యల్ని పరిష్కరించాలి. లేదంటే కాంగ్రెస్ ప్రభుత్వం రైతాంగంలోనే కాదు, ప్రజల్లోనూ విశ్వాసం కోల్పోతుంది.

నకిలీ విత్తన వ్యాపారంపై ఉక్కుపాదం మోపుతామన్న ప్రభుత్వం ఆ దిశగా చర్యలు తీసుకోవడం లేదు. నకిలీ విత్తన వ్యాపారం సజావుగా సాగిపోతునేవుంది. రైతులు నష్ట పోతూనే ఉన్నారు. సంస్థాగతంగా, చట్ట పరంగా చేపట్టాల్సిన చర్యలు శూన్యం.ప్రధానంగా ఆత్మహత్యల నివారణకు, కౌలుదారులకు చట్టపరమైన రక్షణ కల్పించాలి. ప్రభుత్వ భూములకు రక్షణ కల్పనతో పాటు చట్టాల్లో మార్పు చేయాలి. 65 ఏండ్లు దాటిన రైతులకు పెన్షన్ సౌకర్యం కల్పించాలి. రైతు బీమాలో మార్పు చేయాలి. జిల్లా స్థాయిలో అఖిల పక్ష సమావేశాలు ఏర్పాటుచేసి రైతులెదుర్కొంటున్న సమస్యల్ని పరిష్కరించాలి. లేదంటే కాంగ్రెస్ ప్రభుత్వం రైతాంగంలోనే కాదు, ప్రజల్లోనూ విశ్వాసం కోల్పోతుంది.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
కరీంనగర్
బుధవారం | డిసెంబర్ 11, 2024 | www.navatelangana.com

మానకొండూర్‌లో రూ.100 కోట్లతో కొత్త పనులు

- నిధుల మంజూరుకు మంత్రి కోమటిరెడ్డి హామీ
- మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి వెల్లడి

నవతెలంగాణ - తిమ్మాపూర్

రోడ్లు, భవనాలశాఖ ద్వారా మానకొండూర్ నియోజకవర్గంలో రూ.100కోట్లతో కొత్త పనులు చేపట్టనున్నట్టు మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి తెలిపారు. మంగళవారం హైదరాబాద్‌లో నియోజకవర్గంలో ఇప్పటికే చేపట్టిన అభివృద్ధి పనులకు సంబంధించిన నిధులే కాకుండా కొత్త పనులకు నిధుల మంజూరు, పెండింగ్ పనుల పూర్తి చేయించాలని కోరుతూ రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డిని ఆయన ఛాంబర్‌లో కలిసి ఎమ్మెల్యే కవ్వంపల్లి వినతిపత్రం అందజేశారు. మానకొండూర్ నియోజకవర్గంలో చేపట్టిన అభివృద్ధి పనులకు సంబంధించి నిధులు విడుదల చేయాలని, గతంలో మంజూరై పెండింగ్‌లో ఉన్న పనులతోపాటు కొత్త పనులకు నిధులు మంజూరు చేయాలని



మంత్రి కోమటిరెడ్డి కి వినతి పత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి

డాక్టర్ కవ్వంపల్లి మంత్రిని కోరారు. అలాగే నియోజకవర్గ అభివృద్ధి కోసం చేపట్టాల్సిన పనులు, అందుకు అవసరమైన నిధులు తదితర అంశాలపై మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డితో ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ సుదీర్ఘంగా చర్చించారు. మానకొండూర్ నియోజకవర్గంలో గతంలో మంజూరైన పనులు చాలావరకు అసంపూర్తిగా మిగిలి ఉన్నాయని, ఆ పనులను వెంటనే చేపట్టేలా అధికారులకు ఆదేశాలు జారీ చేసి వాటిని పూర్తి చేసేలా చూడాలని మంత్రిని కోరారు. నియోజకవర్గంలో వర్షాకాలంలో కాజ్ వేలపై వరద నీరు ప్రవహించి చాలా గ్రామాలకు, మండలాలకు రాకపోకలు సాగక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని ఆయన మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. వర్షా కాలంలో ఎదురవుతున్న ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని హై లెవెల్ బ్రిడ్జిలు మంజూరు చేయాలని ఎమ్మెల్యే కోరారు. దీనికి మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి స్పందిస్తూ మొదటి దశలో రూ.100కోట్ల నిధులు మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు. అంతేకాకుండా పెండింగ్ పనులు పూర్తి చేసేలా అధికారులతో మాట్లాడుతానని మంత్రి కోమటిరెడ్డి ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లికి హామీ ఇచ్చారు. మంత్రిని కలిసినప్పుడు ఎమ్మెల్యే వెంట ఇల్లంతకుంట మండల పరిషత్ మాజీ అధ్యక్షుడు ఊట్కూరి వెంకటరమణారెడ్డి కూడా ఉన్నారు.

ప్రతిభను వెలికితీయడానికే సీఎం కప్ క్రీడలు

ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

నవతెలంగాణ - గంగాధర

క్రీడాకారుల నైపుణ్యాన్ని, ప్రతిభను వెలికితీయడానికి మండల స్థాయి సీఎం కప్ క్రీడలు దోహదపడతాయని ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అన్నారు. గంగాధర మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన మండల స్థాయి సీఎం కప్ క్రీడలను ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల క్రీడాకారులను ప్రోత్సహించేలా సీఎం కప్ క్రీడలు నిర్వహించడం జరుగుతున్నాయన్నారు. దినదినం క్రీడలపై యువతలో ఆసక్తి తగ్గుతుందని, క్రీడల వల్ల ఎన్నో రకాల ప్రయోజనాలు ఉన్నాయని అన్నారు. క్రీడల వల్ల వ్యాయామం, మానసికోల్లాసం ఏర్పడుతుందన్నారు. విద్యార్థులు, యువతలో క్రీడాసక్తి పెంచేలా ప్రభుత్వం కృషి చేస్తుందని, 2032 ఒలంపిక్స్‌లో పథకం సాధించడమే లక్ష్యంగా క్రీడాకారులను తయారు చేయడమే సీఎం కప్ క్రీడల ముఖ్య ఉద్దేశం అన్నారు. విద్యతోపాటు ప్రభుత్వం క్రీడలకు కూడా అదే ప్రాధాన్యతను ఇస్తుందన్నారు. రాష్ట్రం క్రీడలను మరింత ప్రోత్సహించడానికి వీలుగా ప్రభుత్వం త్వరలో స్పోర్ట్స్ యూనివర్సిటీని ఏర్పాటు చేసుందన్నారు. విడతల వారి రాష్ట్రం



ఇంటిగ్రేటెట్ పాఠశాలలను ఏర్పాటు చేయడానికి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. చొప్పదండి నియోజక వర్గంలో క్రీడల్లో ప్రతిభ గల క్రీడాకారులను ప్రోత్సహించడానికి తనవంతుగా కృషి చేస్తామన్నారు. ప్రతి విద్యార్థి విద్యతోపాటు క్రీడల్లోనూ రాణించేలా తర్ఫీదు పొందాలని, ఇటువంటి క్రీడలను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే మేడిపల్లి సత్య పిలుపు నిచ్చారు. ముందుగా క్రీడాకారులను ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం పరిచయం చేసుకుని క్రీడలను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జడ్పీ సీఈవో శ్రీనివాస్, కురిక్యాల సింగిల్‌విండో చైర్మన్ వెలిచాల తిర్మల్‌రావు,



మాజీ జడ్పీటీసీలు గునుకొండ బాబు, సత్తు కనుకయ్య, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పురుమల్ల మనోహర్, గంగాధర సింగిల్‌విండో ఉపాధ్యక్షుడు వేముల భాస్కర్, ఎంపీడీవో దమ్మని రాము, ఎంపీవో జనార్ధన్‌రెడ్డి, డిప్యూటి తహసీల్దార్ అనుమల్ల వినయ్‌కుమార్, మాజీ ఎంపీపీ పడితపల్లి కిషన్ పాల్గొన్నారు.

నవతెలంగాణ - తిమ్మాపూర్

క్రీడలు శారీరక, మానసిక ఉల్లాసానికి దోహదపడతాయని మండల ప్రత్యేక అధికారి డిపిఓ రవీందర్ అన్నారు. మండలంలోని శ్రీ చైతన్య ఇంజనీరింగ్ కళాశాల ప్రాంగణంలో మంగళవారం సీఎం కప్ క్రీడలను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ విజయ్ కుమార్, ఎంపీడీవో విజయ్ కుమార్, మండల పంచాయతీ అధికారి సురేందర్ ,మండల విద్యాధికారి శ్రీనివాస్, ఆయా పాఠశాలల ఫిజికల్ డైరెక్టర్లు, ఆయా పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి ఇచ్చిన హామీని నెరవేర్చాలి

సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం

నవతెలంగాణ - కరీంనగర్ : ముఖ్యమంత్రి ఇచ్చిన హామీని వెంటనే అమలు చేయాలని తెలంగాణ సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం కరీంనగర్ జిల్లా శాఖ డిమాండ్ చేశారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట నిరవధిక సమ్మె మంగళవారం ప్రారంభించారు.



ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గతేడాది సెప్టెంబర్ 13న పీసీసీ అధ్యక్షుని హోదాలో ప్రస్తుతం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలంగాణ సమగ్ర శిక్ష ఉద్యోగులు హనుమకొండలో ఏకశిల పార్క్ వద్ద చేస్తున్న దీక్ష శిబిరాన్ని సందర్శించి కాంగ్రెస్ ప్రభుత్వం రాగానే వందరోజుల్లో సమగ్ర శిక్ష ఉద్యోగుల సమస్యలను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారన్నారు. తెలంగాణ సమగ్ర శిక్ష ఉద్యోగులను విద్యాశాఖలో విలీనం చేసి వెంటనే క్రమబద్ధీకరించాలని డిమాండ్ చేశారు.

పలు సంఘాల మద్దతు :

తెలంగాణ సమగ్ర శిక్ష ఉద్యోగులు కరీంనగర్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన నిరవధిక సమ్మెకు సీఐటీయూ జిల్లా అధ్యక్షులు గిట్ల ముకుంద రెడ్డి, జిల్లా జనరల్ సెక్రెటరీ ఎడ్ల రమేష్, ట్రెజరర్ రాజేశం, సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి మిల్కురి వాసుదేవ రెడ్డి, బహుజన కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు కన్నం లక్ష్మణ్, టీఆర్టీఎఫ్ జిల్లా జనరల్ సెక్రెటరీ బాలయ్య, డీటీఎస్ జిల్లా జనరల్ సెక్రెటరీ తిరుపతి, బీజేపీ సీనియర్ నాయకులు సుగుణాకర్ రావు, కరీంనగర్ మాజీ మేయర్ సర్దార్ రవీందర్ సింగ్ లు మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘం గౌరవ అధ్యక్షులు బెజ్జంకి ఆంజనేయులు, జిల్లా అధ్యక్షులు గుండ రాజు రెడ్డి, ప్రధాన కార్యదర్శి చంద్రగిరి మహేష్, బి.శ్రీకాంత్, ఉపాధ్యక్షులు వరలక్ష్మి, నీరజ, రవిచందర్, ఆంజనేయులు, వెంకటేష్, శ్రీకన్య, బి.రమేష్, మీనాక్షి, తిరుమల, శ్రీనివాస్, భరత్, శ్రీనివాస్, ఉద్యోగులు పాల్గొన్నారు.

కలెక్టరేట్ ముట్టడి..

నవతెలంగాణ - కరీంనగర్

జాతీయ అధ్యక్షులు ఆర్.కృష్ణయ్య నాయకత్వంలో, బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షులు వేముల రామకృష్ణ నాయకత్వంలో మంగళవారం కలెక్టరేట్ కరీంనగర్‌లో ముట్టడి కార్యక్రమం అనిల్ యాదవ్ ఆధ్వర్యంలో జిల్లా అధ్యక్షులు బీసీ విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. ముఖ్యఅతిథిగా ఉమ్మడి జిల్లా అధ్యక్షులు ఆది మల్లేశం పటేల్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు అనిల్ యాదవ్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం బీసీ, ఈబీసీ, ఎస్సీ, మైనార్టీ విద్యార్థులకు ఫీజులు బకాయిలు చెల్లించకుండా ఏండ్ల తరబడి జాప్యం చేస్తుందన్నారు. తెలంగాణ రాష్ట్రంలో విద్యార్థులకు ఇస్తున్న రూ.5500నుంచి వెళ్లి రూ.20వేల వరకు స్కాలర్షిప్‌ను పెంచాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు. పేద విద్యార్థుల పక్షాన రాష్ట్ర ప్రభుత్వం అండగా ఉండి వారి స్కాలర్షిప్, ఫీజు మేనేజ్మెంట్‌ను విడుదల చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో భాగంగా జిల్లా కార్యదర్శి దుబ్బాసి ప్రణీత్, మహేష్, సిద్ధు, నాగరాజు, హరీష్, తిరుమలేష్, రూ.500మంది విద్యార్థులు పాల్గొన్నారు.

వాలీబాల్ జాతీయ క్రీడాకారుడికి పరామర్శ

నవతెలంగాణ - గంగాధర :

గంగాధర మండల కేంద్రానికి చెందిన వాలీబాల్ జాతీయ స్థాయి క్రీడాకారుడు, వాలీవాల్ అసోసియేషన్ కరీంనగర్ ఉమ్మడి జిల్లా ఉపాధ్యక్షుడు ఠాగూర్‌ను కురిక్యాల సింగిల్‌విండో చైర్మన్ వెలిచాల తిర్మల్‌రావు, మాజీ జడ్పీటీసీ గునుకొండ బాబు, మాజీ ఎంపీపీ పడితపల్లి కిషన్, నాయకులు కిషన్, రాకేశ్ పరామర్శించారు. కాలికి ఆపరేషన్ చేయించుకుని తన స్వగృహంలో ఉన్న ఠాగూర్‌ను వారు పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఆరోగ్యం కుదుటపడే వరకు విశ్రాంతి తీసుకోవాలని వారు సూచించారు.



వాలీబాల్ జాతీయ క్రీడాకారుడు ఠాగూర్ పరామర్శించిన నేతలు

వల్లంపల్లి ఆడబిడ్డ రుచిత పెళ్లికి అండగా కాంగ్రెస్ నాయకులు



నవతెలంగాణ - మేడిపల్లి : దోసిలి ఫౌండేషన్ వ్యవస్థపాకులు, మన్నెగూడెం మాజీ సర్పంచ్ సింగిరెడ్డి నరేష్ రెడ్డి రూ.10వేల, మేడిపల్లి మండల అధ్యక్షులు ఏనుగు రమేష్ రెడ్డి రూ.5వేలు, మండల కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి చేపూరి నాగరాజు రూ.5వేలు, వెల్మ నవీన్ రెడ్డి రూ.10వేలు, మేడిపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ మాధం వినోద్ రూ.3 వేలు, వల్లంపల్లి కాంగ్రెస్ బృందం రూ.5వేలు మొత్తం కలిపి సుమారు రూ.40వేలు వివాహ ఖర్చుల కోసం రుచిత కుటుంబానికి అందజేశారు. ఈ కార్యక్రమంలో వడ్డే రామిరెడ్డి, గౌరీ దశరథం, రాజేశ్వర్, కొప్పుల కష్టారెడ్డి, లక్ష్మీ నరసయ్య, రాజిరెడ్డి, తిరుపతి పాల్గొన్నారు.

పథకాలు సాధించిన విద్యార్థులకు సన్మానం



నవతెలంగాణ - హుజురాబాద్ : జాతీయస్థాయిలో కరాటే పోటీలో పాల్గొని బంగారు, వెండి పతకాలు సాధించిన విద్యార్థులకు స్థానిక న్యూ కాకతీయ మోడల్ స్కూల్ ఆవరణంలో తెలంగాణ ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్ అసోసియేషన్ కరీంనగర్ జిల్లా అధ్యక్షులు చందుపట్ల జనార్ధన్ ఆధ్వర్యంలో సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా హాజరైన పట్టణ సీఐ తిరుమల్ గౌడ్, ఎక్సైజ్‌శాఖ సబ్ ఇన్‌స్పెక్టర్ వినోద్ కుమార్ మాట్లాడుతూ.. హుజురాబాద్ పట్టణంలో గ్లోబల్ షోటోఖాన్ కరాటే డు ఇండియా కరీంనగర్ జిల్లా అధ్యక్షులు కరాటే మాస్టర్ ఎస్కే జలీల్ ఆధ్వర్యంలో శిక్షణ పొందిన విద్యార్థులు పథకాలు సాధించడం పట్ల సంతోషంగా ఉందన్నారు. జలీల్ రేపటి భావి భారత పౌరులను శిక్షణ ఇవ్వడంలో నేటి బాలబాలికలకు విద్యా ద్వారా విజ్ఞానాన్ని అందించి కరాటే శిక్షణ ద్వారా దేహదారుడిని పొందడం, మానసికంగా అన్ని రకాలుగా సంసిద్ధులవుతారన్నారు. ఈ కార్యక్రమంలో టౌన్ ఎస్ఐ యూసుఫ్ అలీ ఏఎంసీ మాజీ డైరెక్టర్ ఖాళీద్ హుస్సేన్ మైనార్టీ నాయకులు జ్యోతిరావు పూలే కమిటీ చైర్మన్ ఉప్పు శ్రీనివాస్, గోస్కుల మధు విద్యార్థులు తల్లిదండ్రులు పాల్గొన్నారు.

సమగ్ర శిక్ష ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలి

నవతెలంగాణ-కరీంనగర్ : తెలంగాణ సమగ్ర శిక్ష ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలని బీజేపీ సీనియర్ నాయకులు పి.సుగుణాకర్ రావు అన్నారు. మంగళవారం కరీంనగర్ కలెక్టరేట్ ఎదుట తెలంగాణ సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నిరవధిక సమ్మెకు బీజేపీ సీనియర్ నాయకులు పి.సుగుణాకర్ రావు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..గత సంవత్సరం 13/09/2023న హన్మకొండలో ముఖ్యమంత్రి ఇచ్చిన హామీ మేరకు విద్యాశాఖ లోని సమగ్ర శిక్షా అభియాన్ ఉద్యోగుల అందరిని రెగ్యులర్ చేయాలని, ఆ లోపు తక్షణమే పే స్కేల్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. సమాన పనికి సమాన వేతనం వెంటనే అమలు చేయాలని వారు డిమాండ్ చేశారు.

నాణ్యమైన భోజనం అందించాలి

ఏఐఎస్ఎఫ్ నగర కార్యదర్శి

మామిడిపల్లి హేమంత్..

నవతెలంగాణ - కరీంనగర్ : రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించి ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించేందుకు కృషి చేయాలని ఏఐఎస్ఎఫ్ కరీంనగర్ నగర కార్యదర్శి మామిడిపల్లి హేమంత్ హేమంత్ డిమాండ్ చేశారు. మంగళవారం కరీంనగర్ నగరంలోని కోతిరాంపూర్ లోని ప్రభుత్వ పాఠశాలలను ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో సందర్శించారు. విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. ఈ సందర్భంగా హేమంత్ మాట్లాడుతూ..ప్రభుత్వ పాఠశాలలు సమస్యలకు నిలయంగా ఉన్నాయని, ప్రభుత్వ పాఠశాలలో మధ్యాహ్న



భోజనం వంట చేయడానికి చాలా పాఠశాలల్లో ప్రత్యేక గదులు లేవన్నారు. పాఠశాల ఆవరణలో పరిశుభ్రత ఉండటం లేదని, మధ్యాహ్న భోజనానికి నిధులు పెంచాలన్నారు. పెండింగ్ బిల్లులు ఇవ్వాలని, మధ్యాహ్న భోజనం మెనూ ప్రకారం అమలు చేయాలన్నారు. ప్రభుత్వ పాఠశాలలో మినరల్ వాటర్ ప్లాంట్ లను ఏర్పాటు చేయాలని, నాసిరకమైన ఆహార వస్తువులను సరఫరా చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. పాఠశాలల్లో ఫుడ్ పాయిజన్‌లు కాకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని హేమంత్ డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నగర్ నాయకులు సాయికుమార్, శ్రీకాంత్, విష్ణు పాల్గొన్నారు.

గణిత ఫోరం ఆధ్వర్యంలో మండలస్థాయి పరీక్ష పోటీలు

నవతెలంగాణ - జమ్మికుంట : తెలంగాణ గణిత ఫోరం ఆధ్వర్యంలో మండల స్థాయి పరీక్ష పోటీలను పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత బాలుర పాఠశాలలో మంగళవారం నిర్వహించారు. ఈ పోటీలో మండలంలోని వివిధ పాఠశాల



నుండి 26మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు మండల విద్యాధికారి హేమలత సర్టిఫికెట్స్ అందజేశారు. తెలుగు మీడియంలో ప్రథమ స్థానంలో హజీరా పరిహీన్ పదవ తరగతి జెడ్పీహెచ్ఎస్ బాలుర జమ్మికుంట పాఠశాల, ద్వితీయ స్థానం జెడ్పీహెచ్ఎస్ ఆబాది జమ్మికుంట, ఇంగ్లీష్ మీడియంలో స్పందన పదవ తరగతి జెడ్పీహెచ్ఎస్ కోరపల్లి ప్రథమ స్థానంలో, సంతోష్ పదవ తరగతి జెడ్పీహెచ్ఎస్ గర్ల్స్ జమ్మికుంట, ద్వితీయ స్థానంలో సిద్ధు పదవ తరగతి జెడ్పీహెచ్ఎస్ ఆబాది, తృతీయ స్థానంలో నిలిచారు. రెసిడెన్షియల్ పాఠశాల నుంచి కేజీబీవీ జమ్మికుంట శివసాయి, హర్షిత ప్రథమ స్థానంలో నిలిచారు. ఈ కార్యక్రమంలో స్థానిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు నల్లగొండ సదానందం, మండల గణిత ఫోరం అధ్యక్షులు మ్యాకముల శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి రాజేంద్రకుమార్, వివిధ పాఠశాల నుంచి వచ్చిన గణిత ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విజేతలకు ప్రశంసా పత్రాలు

నవతెలంగాణ - చిగురుమామిడి : గణిత ఫోరం(టీఎంఎఫ్) ఆధ్వర్యంలో మండలంలోని నవాబుపేట జెడ్పీ హైస్కూల్‌లో మంగళవారం గణిత ప్రతిభ పోటీలను నిర్వహించారు. ఉదయం మండల విద్యాధికారి వి.పావని ప్రశ్నపత్రాల సీల్డ్ కవర్‌ను ఓపెన్ చేసి, గణిత ప్రతిభ పరీక్షను ప్రారంభించారు. తెలుగు, ఆంగ్ల మాధ్యమంలో మండలంలోని పాఠశాల విద్యార్థులు సాయి చరణ్, హర్షిని, వినీల, అక్షిత, సాత్విక, అక్షర, సిరిలు గెలుపొందారు. వీరికి పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాజయ్య ప్రశంస పత్రాలను అందజేసి ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో టీఎంఎఫ్ మండల అధ్యక్షులు మునిప్రసాద్, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ రెడ్డి, జిల్లా కార్యదర్శి కుమారస్వామి, స్టేట్ రిసోర్స్ పర్సన్ అరుణదేవి, అలాగే మండలంలోని వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నవతెలంగాణ - హుజురాబాద్ : జాతీయ గణిత దినోత్సవ సందర్భంగా కరీంనగర్ జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో మంగళవారం మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలకు చెందిన ముగ్గురు పదవ తరగతి విద్యార్థులకు మండల స్థాయి గణిత ప్రతిభ పాటలను జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల చెల్పూరులో నిర్వహించారు. ఈ పోటీల్లో విజయం సాధించిన విద్యార్థులకు, బహుమతి, ప్రశంస పత్రాలతో ఎంఈఓ భూపతి శ్రీనివాస్ సన్మానించారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ.. విద్యార్థులు నిర్దేశించిన గణితం యొక్క ప్రాముఖ్యత తెలుసుకొని సామర్థ్యాలను పెంపునకు కృషి చేయాలన్నారు. టిటియు కరీంనగర్ జిల్లా అధ్యక్షులు ఆదర్శన్ రెడ్డి మాట్లాడుతూ.. గణితం అన్ని శాస్త్రాల అభివృద్ధికి దోహదపడుతుందని విద్యార్థులు కూడా నిత్యజీవిత సమస్యలను పరిష్కరించుటకు దోహదపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మండలంలోని వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, గణిత ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జాతీయ హాకీ పోటీల్లో సత్తా చాటిన హుజూరాబాద్ క్రీడాకారులు

నవతెలంగాణ- హుజురాబాద్: 68వ జాతీయస్థాయి ఎస్‌జీఎఫ్ హాకీ టోర్నమెంట్‌లో భాగంగా మంగళవారం జరిగిన మ్యాచ్‌లో ఢిల్లీపై తెలంగాణ హాకీ జట్టు 2-0తో విజయం సాధించింది. ఈ విజయంలో నిమ్మటూరి మిధున,వర్షిత చెరి చెరో గోల్ చేసి తెలంగాణ టీంకు విజయంపై కీలక పాత్ర పోషించినట్లు కోచ్ వేముల రవికుమార్ మేనేజర్ శ్రీనివాసులు తెలిపారు. తెలంగాణ జట్టు విజయం సాధించడంతో శాశ్వత అధ్యక్షుడు తోట రాజేంద్రప్రసాద్, కరీంనగర్ జిల్లా హాకీ క్లబ్ ఉపాధ్యక్షులు బండ శ్రీనివాస్, హుజురాబాద్ హాకీ క్లబ్ అధ్యక్షుడు కొలిపాక శ్రీనివాస్, సెక్రటరీ ఉమామహేశ్వర్, క్లబ్ ఉపాధ్యక్షుడు భూసారపు శంకర్,సీనియర్ క్రీడాకారులు జీ.సమ్మయ్య , హుజురాబాద్ హాకీ కోచ్ తిరునాహరి శ్రీనివాస్,బండ రఘు, కె.బిక్షపతి, సాదుల శ్యాం కుమార్, రమేష్, తిరుపతి, రాజేష్, సాయి కృష్ణ, ఎం విక్రం, శుభాకాంక్షలు తెలిపి అభినందించారు.

కరీంనగర్‌లో 'కాన్షియస్‌నెస్ క్లబ్' ఆవిష్కరణ

నవతెలంగాణ - కరీంనగర్ క్రైం : కరీంనగర్ జిల్లా రామడుగు మండలం గుండిపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మాదకద్రవ్యాల దుర్వినియోగాన్ని అరికట్టేందుకు ఉద్దేశించిన 'కాన్షియస్‌నెస్ క్లబ్'ను ఎక్సైజ్ రూరల్ ఎస్ఐ విజయభాస్కర్ ప్రారంభించారు. ఈ కార్యక్రమం యువతలో మాదకద్రవ్యాల వాడకం వల్ల కలిగే శారీరక, మానసిక, సామాజిక ప్రభావాల గురించి అవగాహన పెంపొందించేందుకు ప్రత్యేకంగా రూపొందించబడింది. ప్రారంభోత్సవ సందర్భంగా ఎస్ఐ విజయభాస్కర్ మాట్లాడుతూ, "యువత తమ జీవితాన్ని సార్థకం చేసుకోవడానికి అవగాహనతో కూడిన నిర్ణయాలు తీసుకోవడం ఎంతో కీలకం. ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవరచుకోవడం ద్వారా మాదకద్రవ్యాల ఉచ్చులో పడకుండా ఉండాలి" అని చెప్పారు. 'కాన్షియస్‌నెస్ క్లబ్' విద్యార్థులకు మాదకద్రవ్యాల వల్ల కలిగే ప్రమాదాలను వివరించేందుకు, వారి అనుభవాలను పంచుకోవడానికి వేదికగా ఉపయోగపడనుంది. ఈ క్లబ్ ద్వారా వర్క్‌షాప్‌లు, సెమినార్‌లు, కౌన్సెలింగ్ సెషన్‌లు నిర్వహించి, మాదకద్రవ్యాల రహిత సమాజాన్ని నిర్మించడం లక్ష్యంగా పెట్టుకున్నారు. పాఠశాల ప్రిన్సిపాల్ అనిల్, ఉపాధ్యాయులు స్వప్న, శ్రీలత, ఎక్సైజ్ సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాదకద్రవ్యాల దుష్ప్రభావాలను నివారించేందుకు అందరూ సహకరించాలని పిలుపునిచ్చారు.

పెండింగ్ బిల్లులు విడుదల చేయాలి

- జోగు లక్ష్మిరాజం(సాగర్)
- రెండో రోజు రిలే నిరాహార దీక్షలు

నవతెలంగాణ - కరీంనగర్

సర్పంచులకు న్యాయంగా రావాల్సిన పెండింగ్ బిల్లులను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద తాజా మాజీ సర్పంచ్ జేఏసీ జిల్లా అధ్యక్షుడు జోగు లక్ష్మిరాజం (సాగర్) ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు మంగళవారం రెండో రోజుకి చేరుకుంది. ఈ దీక్ష శిబిరానికి తాజా మాజీ సర్పంచుల జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు అక్కెనపెల్లి కరుణాకర్, కరీంనగర్ మాజీ మేయర్ సర్దార్ రవీందర్ సింగ్‌లు సందర్శించి సంఘీభావం ప్రకటించి మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. న్యాయంగా సర్పంచులకు ఇవ్వాల్సిన పెండింగ్ బిల్లులు ఇవ్వకుండా రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దుబారా ఖర్చులు చేస్తున్నాడన్నారు. ఎన్నికల ప్రచారంలో రేవంత్ రెడ్డి సర్పంచుల పెండింగ్ బిల్లులు ఇస్తామని హామీ ఇచ్చి ఇప్పుడు



ఏడాది గడిచిన ఇవ్వకుండా సర్పంచులను ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. పంచాయతీ రాజ్‌శాఖ మంత్రి సీతక్క కూడా హామీ ఇచ్చి ఇప్పుడు మాట్లాడటం లేదన్నారు. బిల్లులు విడుదల చేసే వరకు పోరాటం చేస్తామన్నారు. రాబోయే రోజుల్లో ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రాజన్న సిరిసిల్ల జిల్లా సలహాదారు బొజ్జం మల్లేశం, మల్యాల దేవయ్య, కార్యదర్శులు లక్ష్మణ్, మహేందర్, ఎండీ నజీర్. మడ్లపెల్లి గంగాధర్, రామిడి సురేందర్, వడ్లూరి ఆదిమల్లు, వేముల దామోదర్, మొగిలి సమ్మయ్య, లచ్చయ్య, రాజేశం, ప్రశాంత్, మాల చేంద్రయ్య పాల్గొన్నారు.

విద్యా రంగ సమస్యలు పరిష్కరించాలి

ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు డి.లక్ష్మణ్

నవతెలంగాణ - కరీంనగర్

విద్యా రంగ సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు డి.లక్ష్మణ్ అన్నారు. కరీంనగర్‌లోని స్థానిక అంబేద్కర్ కాలేజీలో ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం(పీడీఎస్‌యూ) కరీంనగర్ నగర జనరల్ బాడీ సమావేశం మంగళవారం నిర్వహించారు. సమావేశానికి ముఖ్య అతిథులుగా ఐఎఫ్టీయూ జిల్లా అధ్యక్షులు డి.లక్ష్మణ్ మాట్లాడుతూ..కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్య రంగాన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేస్తున్నాయని ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వం విద్యార్థుల మధ్య కులమత విద్వేషాలు సృష్టించి రాజకీయం చేస్తుందన్నారు. నూతన జాతీయ విద్యా విధానం 2020 తీసుకొచ్చి పేద విద్యార్థులను విద్యకు దూరం చేస్తుందన్నారు. ఎన్నికల్లో విద్య, వైద్యం ఉచితం ఇస్తామని ఎన్నికల్లో హామీ ఇచ్చిన ఈ కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విస్మరించిందన్నారు. ప్రభుత్వం వెంటనే ఫీజు బకాయిలు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం విద్యార్థులకు అందించే ఆహారంలో నాణ్యతను పాటించి విద్యార్థులు అనారోగ్యానికి గురి కాకుండా తగు చర్యలు చేపట్టాలని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు రత్నం రమేష్, నాయకులు రాజు, అనిల్, నవీన్, రాకేష్, సంపత్, శ్రావణి, సుప్రజ, స్వప్న, రాజేష్, శ్రీకాంత్, తరుణ్ పాల్గొన్నారు.

పోలింగ్ స్టేషన్ల ఏర్పాటుపై సమావేశం

నవతెలంగాణ - కరీంనగర్ : జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాలులో మంగళవారం పంచాయతీ ఎన్నికలకు సంబంధించి పోలింగ్ స్టేషన్ల ఏర్పాటుపై వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో అదనపు కలెక్టర్ లక్ష్మీకిరణ్ (రెవెన్యూ) అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ.. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు పంచాయతీ ఎన్నికల సన్నద్ధతకు సంబంధించి ఈనెల 7న ఓటరు జాబితా ప్రదర్శించామన్నారు. 15మండలాల పరిధిలో మొత్తం ఓటర్లు 5,35,246 ఉండగా పురుషులు 2,60,889 కాగా మహిళలు 2,74,346 ఉన్నట్లు వివరించారు. జిల్లాలో 323 గ్రామ పంచాయతీలుండగా 320 గ్రామాల్లో 3,000 వార్డులు ఉన్నాయి. వార్డుకో పోలింగ్ స్టేషన్ చొప్పున 3026 పోలింగ్ స్టేషన్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. నిబంధనల ప్రకారం 650 మంది ఓటర్లు దాటిన వార్డులో అదనంగా మరో పోలింగ్ స్టేషన్ ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. చింతకుంట, బొమ్మకల్ గ్రామాల్లోని వార్డుల్లో అదనంగా పోలింగ్ స్టేషన్లు ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా డీపీఓ రవీందర్ ఎన్నికల నిర్వహణ ఏర్పాట్లను రాజకీయ పార్టీల ప్రతినిధులకు వివరించారు. రాజకీయ పార్టీల ప్రతినిధులు మాట్లాడుతూ..డబుల్ ఓట్లను తొలగించి కుటుంబ సభ్యులందరి ఓట్లు ఒకే వార్డులో ఉండేలా చర్యలు తీసుకోవాలని కోరారు. రామడుగు మండలం వెలిచాల పంచాయతీలోని గుడ్డేలు గులపల్లిలో, కొత్తపల్లి మండలం నాగుల మల్యాల పంచాయతీలోని కొత్త కొండాపూర్‌లో పోలింగ్ స్టేషన్ ఏర్పాటు చేయాలని కోరారు. వికలాంగులు, ఓటర్లు ఇబ్బంది పడకుండా పోలింగ్ కేంద్రాల్లో కనీస సౌకర్యాలు కల్పించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో ట్రైనీ కలెక్టర్ అజయ్ యాదవ్, డీఆర్ఓ బి.వెంకటేశ్వర్లు, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు మాడెపు మోహన్ (కాంగ్రెస్), సత్తినేని శ్రీనివాస్ (బీఆర్ఎస్), నాంపల్లి శ్రీనివాస్ (బీజేపీ), వాసుదేవరెడ్డి (సీపీఐ(ఎం)), కల్లపెల్లి రాజేందర్ (బీఎస్పీ), మహమ్మద్ అఖిల్ ఫిరోజ్ (ఎంఐఎం), కల్యాడపు ఆగయ్య (టీడీపీ) పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

నవతెలంగాణ - వీణవంక


మండలం వల్భాపూర్ గ్రామ శివారులో అక్రమంగా ఇసుక తరలిస్తున్న జాన అరవింద్ పోతిరెడ్డిపల్లి, కేశవేణి వెంకటేష్, పోతిరెడ్డిపల్లి రెండు ట్రాక్టర్లను పట్టుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్సై తోట తిరుపతి తెలిపారు.

అంతర్రాష్ట్ర దొంగ అరెస్ట్

నవతెలంగాణ - కరీంనగర్ క్రైం

కరీంనగర్ వన్‌టౌన్ పోలీసులు మంగళవారం అంతర్రాష్ట్ర దొంగను అరెస్ట్ చేసి రూ.3లక్షల విలువైన బంగారు, వెండి ఆభరణాలు, ఎల్ఈడీ టీవీ వంటి వస్తువులను రికవరీ చేశారు. రామడుగు మండలంలోని శాతవాహన నివాసంలో తాళం వేసిన ఇంట్లో చోరీ జరిగింది. ఈ ఘటనలో దర్యాప్తు చేపట్టిన ఇన్‌స్పెక్టర్ బిల్లా కోటేశ్వర్ నేతృత్వంలోని ప్రత్యేక బృందాలు సాంకేతిక ఆధారాలతో తూర్పుగోదావరి జిల్లా మండపేటకు చెందిన కందుల సత్యనారాయణ అలియాస్ సత్తిబాబును (50) గుర్తించారు. గౌతమి నగర్ వద్ద పట్టుబడిన నిందితుడిపై తెలంగాణ, ఏపీ రాష్ట్రాల్లో 20 కేసులు ఉన్నాయి. ఈ అరెస్ట్‌లో ఎస్ఐ రాజన్న, భాస్కర్‌రెడ్డి, సిసిఎస్ రమేష్, క్రైమ్ టీమ్ సహకరించారు.

బీఆర్ఎస్ ఆధ్వర్యంలో తెలంగాణ తల్లికి పాలాభిషేకం



నవతెలంగాణ - తిమ్మాపూర్ : మండలంలోని మన్నెంపల్లి గ్రామంలో బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు రావుల రమేష్ ఆధ్వర్యంలో తెలంగాణ తల్లి విగ్రహానికి పాలాభిషేకాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగారావుల రమేష్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణ ప్రజలను అగౌరవ పరిచేలా విగ్రహాన్ని మార్పు చేసిందన్నారు. దీనినికి సీఎం రేవంత్ రెడ్డి నైతిక బాధ్యత వహించాలని తెలంగాణ ప్రజలు దీన్ని గ్రహించాలన్నారు. కోర్టులో కేసు నడుస్తున్నందున తెలంగాణ తల్లి విగ్రహాన్ని పాతదే పెట్టాల్సిందిగా కోరుతూ కేటీఆర్ పిలుపు మేరకు మన్నెంపల్లి గ్రామంలో తెలంగాణతల్లి విగ్రహానికి పాలాభిషేకం చేసినట్టు చెప్పారు. సహకరించిన మన్నెంపల్లి గ్రామ నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. పొన్నం అనిల్‌గౌడ్ మాట్లాడుతూ.. సీఎం అడ్డదిడ్డమైన నిర్ణయాలతో తెలంగాణ తల్లి విగ్రహాన్ని మార్చడం తెలంగాణకు చీకటి దినమన్నారు.

హత్య కేసులో ఒకరికి జీవిత ఖైదు, మరోకరికి 5 ఏండ్ల జైలు శిక్ష

నవతెలంగాణ-ఇబ్రహీంపట్నం

ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్ పరిధిలోని యమపూర్ గ్రామానికి చెందిన చెదుల రాజేందర్ వ్యవసాయం చేస్తూ జీవనం కొనసాగిస్తున్నాడు. అదే గ్రామానికి చెందిన కాస సంజీవ్‌కి మధ్య వ్యవసాయ భూమికి సంబంధించి తగదలు తరచూ జరుగుతుండేవి. వాటిని మనసులో పెట్టుకున్న చెదుల రాజేందర్‌ను ఎలాగైనా చంపాలని ఉద్దేశంతో సుమారు 35 నెలల క్రితం పొలంలో పని చేస్తున్న రాజేందర్‌ను సంజీవ్‌తో పాటు గోదురు గ్రామానికి చెందిన తైదపల్లి రజినీకాంత్ కత్తితో దాడి చేసి హత్య చేశారు. ఈ ఇద్దరు నిందితులు రాయికల్ మండలంలోని భూపతిపూర్ గ్రామానికి చెందిన మూడవ నిందితుడు మంగలారపు లక్ష్మీనారాయణతో కలిసి కేసుకు సంబంధించిన సాక్ష్యధా నాశనం చేశారు. మృతుడి భార్య లత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. నిందితులు అయిన కాస సంజీవ్, తైదపల్లి రజినీకాంత్, మంగలారపు లక్ష్మీనారాయణలను కోర్టులో హాజరు పరచడంతో కేసును విచారించిన న్యాయమూర్తి శ్రీ నారాయణ నిందితులు అయిన కాస సంజీవ్, తాడిపల్లి రజినీకాంత్‌లకు జీవిత ఖైదు, ఒక్కొక్కరికి 10వేల జరిమానా, మంగలారపు లక్ష్మీనారాయణకు 5 సంవత్సరాల జైలు శిక్షతో పాటు రూ.5వేల జరిమానా విధిస్తూ తీర్పు వెల్లడించారు. కేసులో పీపీగా మల్లేశం, ఇన్వెస్టిగేషన్ ఆఫీసర్స్‌గా ఇన్స్పెక్టర్ శ్రీను, ఎస్ఐ ఉమాసాగర్, సీఎం ఎస్పై రాజునాయక్, కానిస్టేబుల్ కిరణ్‌కుమార్ కోర్టు కానిస్టేబుల్ రంజిత్ నిందితులకు శిక్ష పడడంలో కీలక పాత్ర పోషించారు.

ఆగని అక్రమ ఇసుక దందా


పట్టించుకోని అధికార యంత్రాంగం

- టెండర్లు జరిపిన స్పందించని యంత్రాంగం
- సమాచారం ఇస్తే సమస్యల్లో ఇరుక్కున్నట్లే
- టైం టు టైం అక్రమ రవాణా
- అక్రమ దందాపై అధికారుల మౌనం


మూటపల్లి వాగులో ట్రాక్టర్‌లో నింపుతున్న ఇసుక

నవతెలంగాణ-రాయికల్

మండలంలో ఇసుక అక్రమ రవాణా ఆగడం లేదు. ఇసుక పాలసీని బేఖాతరు చేస్తూ, ఎలాంటి రాయాల్టీ చెల్లించకుండా అధికారుల అండతో వాగులను తోడేస్తున్నారు. ఇసుక అక్రమరవాణా అక్రమార్కులకు కాసుల వర్షం కురిపిస్తున్నది. ఇటిక్యాల, మూటపల్లి గ్రామాల్లో అభివృద్ధి పేరుతో అక్రమ టెండర్లు వేసి మరి ఇసుక రవాణా చేస్తున్నా మైనింగ్, రెవెన్యూ, పోలీసు యంత్రాంగం చూసి చూడనట్లుగా వ్యవహరించడంపై ఆయా శాఖలకు భారీగానే ముడుపులందాయనే ఆరోపణలతో పాటుగా జిల్లా అధికార యంత్రాంగం విఫలమవుతుందన్న విమర్శలు వెలువెత్తుతున్నాయి. ఆయా శాఖలను బట్టి లక్ష రూపాయల నుండి 30 వేల వరకు ముడుపులు అందినట్లు మండలంలో జోరుగా చర్చ కొనసాగుతుంది.



చూసి చూడనట్లు...

ఇసుక అక్రమ రవాణాను అడ్డుకోవలసిన అధికారులు చూసిచూడట్లుగా వ్యవహరిస్తున్న ఆరోపణలు కోకొల్లలుగా వినిపిస్తున్నాయి. అక్రమ ఇసుక వ్యాపారం అంతా వారి కనుసన్నల్లోనే కొనసాగుతుందని ఆరోపణలు మెండుగా ఉన్నాయి. ఆరోపణలు నిజం అన్నట్లుగా తమ ముంగిట నుంచి ఇసుక వాహనాలు వెళుతున్న అధికారులు చూసిచూడనట్లుగా వ్యవహరిస్తున్నారని ప్రజలు బహాటంగా చర్చించుకుంటున్నారు.

సమాచారం ఇస్తే సమస్యల్లో ఇరుక్కున్నట్లే...

మండలంలో సాగుతున్న అక్రమ ఇసుక వ్యాపారంపై అధికారులకు ఎవరైనా ఫిర్యాదు చేస్తే వారు ఇబ్బందుల్లో ఇరుక్కున్నట్లేనని ప్రచారం జరుగుతోంది. ఫలనా వాహనం ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తుందని ఆధారాలతో చెబితే అది మా పరిధిలోకి రాదని జిల్లా మైనింగ్‌శాఖ అధికారులకు సమాచారం ఇవ్వాలని స్థానిక అధికారులు చేతులు దులుపుకుంటున్నారు. ఇసుకాసురులతో తమకున్న అనుబంధం కారణంగా ఫలనా వ్యక్తి మీ గురించి ఫిర్యాదు చేశాడని, ఫోన్ నెంబర్లతో సహా చెబుతుండడంతో ఫిర్యాదు చేసిన వారు ఇబ్బందులకు గురికావాల్సి వస్తుంది. ఇటు అధికారులు, అటు ఇసుకా సురలతో పలుమార్లు ఇబ్బందులు పడ్డట్టుగా కొంతమంది చెబుతున్నారు.

టైం టు టైం అక్రమ రవాణా..

అధికారులు అందుబాటులో లేని సమయాల్లో ఇసుక అక్రమ రవాణాను జరిపేందుకు అక్రమార్కులు సమయాన్ని సైతం పాటిస్తున్నారు. సాయంత్రం 5 గంటల నుంచి ఉదయం 10 గంటల లోపు,సెలవు రోజుల్లో ఇటిక్యాల,మూటపల్లి వాగుల నుండి యదేచ్ఛగా ఇసుక అక్రమ రవాణాను సాగిస్తున్నారు. పట్టణంలో చేస్తున్న పలు సిసి, డ్రైనేజీ పనుల నిర్మాణాలకు సైతం కాంట్రాక్టర్లు ఈ అక్రమ ఇసుకను ఉపయోగిస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

ఇంకా ఎన్ని రోజులు...

గత మూడు నెలలుగా వాగుల నుంచి జోరుగా ఇసుక రవాణా జరుగుతున్న స్థానిక అధికారులు దాడులు నిర్వహించకపోవడంపై మౌనవ్రతం వహిస్తున్నారని చెప్పవచ్చు.గతంలో పోలీస్ శాఖలో పనిచేసిన సబ్ ఇన్స్పెక్టర్ అక్రమ ఇసుక రవాణా విషయంలో...లంచం తీసుకునే సమయంలో ఏసీబీకి చిక్కినట్లే చిక్కి పరారీ అవడంతో అప్పటి నుండి పోలీస్ శాఖ అధికారులు మాకెందుకులే...? అనుకున్నారేమో... కాని మండలంలో అక్రమ ఇసుక రవాణా చేస్తున్న ట్రాక్టర్లను పట్టుకోవడంలో ఆ శాఖ అధికారులు మౌనంగా ఉన్నారని గతంలో సీజ్ చేసిన అక్రమ ఇసుక రవాణా ట్రాక్టర్ల చిట్టా చూస్తే చెప్పకనే చెప్పవచ్చు.ఇక రెవిన్యూ శాఖలో పనిచేసే కొందరు అధికారులు రోడ్డుపై అక్రమ ఇసుక రవాణా ట్రాక్టర్ కనిపిస్తే చాలు ఒక్కో ట్రాక్టర్ కు ఒక్కో రేట్ చొప్పున మామూలు తీసుకుంటూ వదిలేస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.ఇక మరో రెండు నెలల్లో తనకు స్థాన చలనం ఉంటుందని ఆ అధికారి ఎంత అయితే అంతా అందిన కాడికి ముడుపులు దండుకుంటున్నాడని విమర్శలు వెలువెత్తుతున్నాయి.ఏది ఏమైనా మండలంలో అక్రమ ఇసుక రవాణా విషయంలో అధికారులు ఇంకా ఎన్ని రోజులు మౌనం పాటిస్తారో వేచి చూడాల్సిందే.



అంజన్నను దర్శించుకున్న దసరా మూవీ డైరెక్టర్ శ్రీకాంత్


అంజన్న స్వామి దేవస్థానంలో దసరా చిత్ర బృందం

నవతెలంగాణ -మల్యాల

కొండగట్టు ఆంజనేయస్వామిని దసరా మూవీ డైరెక్టర్ శ్రీకాంత్ ఓదెల, ప్రొడ్యూసర్ మూర్తి వారి మిత్ర బృందం మంగళవారం దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు ప్రత్యేకంగా ఆహ్వానించి ఆశీర్వచనం అందించారు. అనంతరం ప్రజా ప్రతినిధులు వారి సన్మానించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో జగిత్యాల జడ్పీ మాజీ వైస్ చైర్మన్‌హరి చరణ్‌రావు, జిల్లా వెల్మ సంఘం అధ్యక్షుడు అయిల్నేని సాగర్‌రావు, నూకపెల్లి ప్యాక్స్ చైర్మెన్ మధుసూదన్‌రావు, గుండ్లపల్లె తాజా మాజీ సర్పంచ్ సంపత్‌కుమార్ పాల్గొన్నారు.

108 అంబులెన్స్ సేవలు ప్రారంభం


అంబులెన్స్‌ను ప్రారంభిస్తున్న ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్

నవతెలంగాణ-వెల్గటూర్

మండల కేంద్రానికి నూతనంగా మంజూరైన 108 అంబులెన్స్‌ను ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మంగళవారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద రిబ్బన్ కట్ చేసి జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అత్యవసర పరిస్థితుల్లో, ముఖ్యంగా రోడ్డు ప్రమాదాలు జరిగే సమయంలో ఉపయోగపడుతోందన్నారు. మండల కేంద్రంలోని పాశిగం గ్రామంలోని ప్రభుత్వ స్థలంలో ఎమర్జెన్సీ ఆసుపత్రి ఏర్పాటు చేయాలని చూస్తున్నామని, దీనికి సంబంధించి డీఎంహెచ్ఓ జిల్లా కలెక్టర్ ద్వారా వైద్య ఆరోగ్యశాఖ మంత్రితో చర్చలు జరిపి ఆసుపత్రి ఏర్పాటుకు కృషి చేస్తానని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఎంహెచ్‌వో డిప్యూటీ ప్రమోద్ కుమార్, డిప్యూటీ డిఎంహెచ్‌వో ఎస్. శ్రీనివాస్, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ స్వరూప, డాక్టర్ రీతూరెడ్డి, తహసీల్దార్ శేఖర్, ఏఎంసీ వైస్ చైర్మన్ తిరుపతి, మాజీ సర్పంచ్ మెరుగు మురళి, ఉపసర్పంచ్ గుండటి సందీప్‌రెడ్డి, బందెల ఉదయ్ గౌడ్, మెరుగు నరేష్‌గౌడ్, గుమ్ముల వెంకటేష్ పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు, పాల్గొన్నారు.

టాస్కా ఆవిర్భావ దినోత్సవం విజయవంతం చేయాలి

నవతెలంగాణ-జగిత్యాలటౌన్

హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో జరిగే తెలంగాణ ఆల్ సీనియర్ సిటీజేన్స్ అసోసియేషన్ 9వ ఆవిర్భావ వేడుకలను విజయవంతం చేయాలని అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి, జిల్లా అధ్యక్షుడు హరి అశోక్ కుమార్ పిలుపునిచ్చారు. ఈ దినోత్సవంలో మంత్రులు సీతక్క, పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్సీ కోదండ రాం, ఏడీ జీపీ మహేశ్, మురళీధర్, భగవత్, సంక్షేమశాఖ కార్యదర్శి శైలజ హాజరు కానున్నట్టు చెప్పారు. ఈ సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి గౌరిశెట్టి విశ్వనాథం, ఉపాధ్యక్షులు బొల్లం విజయ్, పి.సి.హన్మంతరెడ్డి, ఎండి యాకూబ్, ఆర్గనైజింగ్ కార్యదర్శులు పి.అశోక్ రావు, కొయ్యడ సత్యనారాయణ, సూర్యనారాయణ రాజు, దిండిగాల విఠల్, కిషన్‌రావు, మంజరి, జలజ, పద్మ, లక్ష్మీ పాల్గొన్నారు.

డీఈవోకు సన్మానం

నవతెలంగాణ-జగిత్యాలటౌన్


డీఈవోను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

జిల్లా విద్యాశాఖ అధికారిగా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన కె. రామును జగిత్యాల జిల్లా అవార్డి టీచర్స్ అసోసియేషన్ (ఆటా) ప్రతినిధులు మర్యాద పూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ.. రాష్ట్ర స్థాయిఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీతలను అభినందించారు. ఉపాధ్యాయులు చేసిన సేవలకు గుర్తింపుగా ప్రభుత్వం ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందిస్తుందని, ఉత్తమ ఉపాధ్యాయుల సేవలు జగిత్యాల విద్యాశాఖకు ఎంతో అవసరం అన్నారు. ఈ కార్యక్రమంలో పీఆర్ టీయూ జిల్లా అధ్యక్షుడు బోయినపెల్లి ఆనందరావు, ప్రధాన కార్యదర్శి అమర్ నాథ్‌రెడ్డి, ఆటా జిల్లా ప్రధాన కార్యదర్శి జూపాక సుదర్శన్, ఆటా ప్రతినిధులు కొండపల్కుల నర్సింగరావు, అందె నారాయణ, కడకుంట్ల అభయ్ రాజ్ తదితరులు పాల్గొన్నారు.

అదనపు కలెక్టర్‌ను కలిసిన జగిత్యాల టీఎన్జీవోలు

నవతెలంగాణ-జగిత్యాలటౌన్

జగిత్యాల కలెక్టరేట్‌లో ఇటీవల ఎన్నికైన టీఎన్జీవో జిల్లా అధ్యక్షుడు మిర్యాల నాగేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో కార్యవర్గం అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థల) గౌతం రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. నూతన కార్యవర్గానికి అదనపు కలెక్టర్ శుభాకాంక్షలు తెలిపారు. జిల్లా కార్యదర్శి అమరేందర్‌రెడ్డి, సహాధ్యక్షులు మహమూద్, నాయకులు సాహెద్‌బాబు, రవీందర్, రవికుమార్, రాజేశం, సుగుణాకర్, మధుకర్, భువనేశ్వర్, హరిప్రసాద్, శరత్, మమత, శైలజ, శ్రావణి, ఉద్యోగులు పాల్గొన్నారు.

కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ

నవతెలంగాణ-మల్యాల



మండలంలోని స్థానిక మహాలక్ష్మి కల్యాణ మండపంలో వివిధ గ్రామాలకు చెందిన 29 కల్యాణలక్ష్మి చెక్కులు, 149 సీఎంఆర్ఎఫ్ చెక్కులను చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం మంగళవారం అందజేశారు. సుమారు రూ.44లక్షల 59వేల 832ల విలువ గల చెక్కులను లబ్దిదారులకు అందజేశారు.ఈ కార్యక్రమంలో తహసీల్దార్ మునీందర్, ఎంపీడీవో స్వాతి, నాయకులు యూత్ విభాగం కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు ముత్యం శంకర్ గౌడ్, దొంగ ఆనంద్‌రెడ్డి, బత్తిని శ్రీనివాస్‌గౌడ్, మండల యూత్ అధ్యక్షుడు శనిగారపు తిరుపతి, మ్యాక లక్ష్మణ్, నేరెళ్ల సతీష్‌రెడ్డి, మాజీ ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో అసాంఘిక కార్యకలాపాలు

నవతెలంగాణ-మేడిపల్లి



మేడిపల్లి మండలంలోని మాచపూర్, కాచారం, కొండాపూర్, కట్లకుంట విలయతాబాద్, రాజ లింగంపేట, కోరుట్ల రూరల్ గ్రామమైన తక్కలపల్లి, బొమ్మెన ప్రభుత్వ పాఠశాలల్లో రాత్రి వేళల్లో అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నాయి. ప్రభుత్వ పాఠశాలల గేట్లకు తాళం వేయక పోవడంతో గుర్తు తెలియని వ్యక్తులు పాఠశాలల్లో మద్యం తాగి సీసాలను అక్కడే పడేస్తున్నారు. ఉదయం పాఠశాలలకు వచ్చే విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. సంబంధిత ఉన్నతాధికారులు ప్రత్యేక చొరత తీసుకోవాలని విద్యార్థుల తల్లి దండ్రులు కోరుతున్నారు.

పాఠశాలలకు నిధుల మంజూరు కోసం ఎమ్మెల్యేకు వినతిపత్రం


వినతి పత్రం అందజేస్తున్న యూటిఎఫ్ నాయకులు

నవతెలంగాణ-వెల్గటూర్

నియోజకవర్గంలోని ప్రభుత్వ పాఠశాలలకు నిధులు మంజూరు చేసి మౌలిక వసతులు సౌకర్యాలను మెరుగుపరచాలని కోరుతూ తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (టీఎస్‌యుటిఎఫ్) జిల్లా కార్యదర్శి తులసి ఆగమయ్య, స్థానిక శాసనసభ్యులు, విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌ను కోరారు. మంగళవారం వెల్గటూర్ మండల కేంద్రంలో ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. పాఠశాలల్లో పారిశుధ్య కార్మికులను నియమించి మూడు నెలలు గడిచినా, ఇప్పటివరకు వారికి వేతనాలు మంజూరు కాకపోవడంపై ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. అనంతరం ప్రభుత్వ విప్‌ను సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

పాఠశాల భవనం ప్రారంభమెప్పుడు?

నవతెలంగాణ-జగిత్యాలటౌన్

జగిత్యాల పట్టణంలోని గర్ల్స్ హై స్కూల్ భవనం కూల్చి రెండు సంవత్సరాలు అవుతున్న ఇంకా కొత్త భవనం ప్రారంభం కాలేదని ఏఐఎస్ఎఫ్ నాయకులు పేర్కొన్నారు. ప్రజావాణిలో జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినా ఫలితం లేకుండా పోయిందని వాపోయ్యారు. తక్షణమే పనులు ప్రారంభించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నాయకులు ప్రణయ్, అశ్విక్, రాజేష్, నరేష్, ఫర్హాన్, అరవింద్, అరుణ్, సాగర్ పాల్గొన్నారు.

ప్రకృతి సిద్ధ ఆర్గానిక్ వ్యవసాయంపై అవగాహన



నవతెలంగాణ-ఇబ్రహీంపట్నం

మండలంలోని ఎర్దండి గ్రామంలో మంగళవారం ప్రకృతి సిద్ధ ఆర్గానిక్ వ్యవసాయంపై రైతులకు అవగాహన నిర్వహించారు. తెలంగాణ రాష్ట్ర కిషన్ సింగ్ కార్యదర్శి ఆచార్య విజయభాస్కర్ ప్రకృతి సిద్ధ వ్యవసాయ వ్యవస్థాపకులు రైతులకు అవగాహన కల్పించారు. గ్రామీణ ప్రాంతాల్లో గోవులను పెంచుతున్న రైతులు కూడా కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి చుట్టుపక్కల గ్రామాల నుంచి యువ రైతులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో గాదె రాజన్న, గుజ్జుల రాజిరెడ్డి, విడిసి చైర్మన్ సాన గంగారెడ్డి, బాశెట్టి గణేష్, దాసరి శ్రీనివాస్, దాసరి గంగ నర్సయ్య బర్లపాటి చంద్రశేఖర్, పశువుల శంకర్, తేలు శ్రీనివాస్, ఉప్పల రాజిరెడ్డి, ఇటుకల రవి, నాంపల్లి రమేష్, పిట్టల వంశీ పాల్గొన్నారు.

కూరగాయల సాగు.. లాభాలు బాగు


- చీడలు, పెట్టుబడి, తక్కువే

నవతెలంగాణ-పెగడపల్లి


వంకాయలు కోస్తున్న కూలీలు,

మార్కెట్‌లో డిమాండ్‌కు అనుగుణంగా కూర గాయల సాగు చేస్తూ పెగడపల్లి మండలంలోని దీకొండ గ్రామానికి చెందిన రైతు నశీర్ ఖాన్ లాభాల బాటలో పయనిస్తున్నాడు. పత్తి, మిర్చి, వరి, మొక్కజొన్న తదితర పంటలు సాగులో దిగుబడి రాకపోవడం, ఆది నుంచి పంట వేసినా తెగుళ్ల సోకి దిగుబడులు రాక, పెట్టిన పెట్టుబడి కూడా చేతికి అందకపోవడంతో దిక్కుతోచని స్థితిలో పడ్డారు. ప్రస్తుతం మార్కెట్‌లో కూరగాయలకు మంచి ధరలు ఉన్నాయి. దీంతో మిత్రుడికి చెందిన 10 ఎకరాల భూమిలో కూరగాయాల సాగు చేస్తున్నారు. రెండు సంవత్సరాల నుంచి ఆ భూమిలో పుచ్చకాయ పంట వేసి లాభాలు పొందడంతో ఇప్పుడు ఐదు ఎకరాల్లో వంకాయ, సొరకాయ పంటను, ఐదు ఎకరాల్లో స్వీట్ కార్నర్ సాగు చేస్తున్నారు. తన గతంలో దుహాకత్తెరలో టమాటను పండించిన అనుభవం ఉండడంతో ఈ ప్రాంతంలోని యువతకు మహిళకు ఉపాధి కల్పించాలని ఉద్దేశంతో పది ఎకరాల్లో కూరగాయలు పండ్లను పండిస్తున్నాడు. రైతు నశీర్ ఖాన్ వంకాయ, సొరకాయ, విత్తనాలకు రూ.80 వేలు, కలుపు మందుకు రూ.10 వేలు, ఎరువులకు రూ.40 వేలు వాటర్ డ్రింపింగ్‌తో సేంద్రీయ పద్ధతిలో పూత రావడానికి సాగు చేస్తున్నాడు. వంకాయ పంటకు మొదటి నుంచి కాయ కోతకు వచ్చేవరకు సుమారు లక్ష 30 వేల వరకు పెట్టుబడి పెట్టాడు. వంకాయ సాగు చేపట్టిన 45 రోజుల్లో కోతకు వస్తున్నాయి. వారానికి రెండుసార్లు కాయ కోస్తే సుమారు రెండు టన్నుల వరకు కాత వస్తుంది. వంకాయలను వారానికి రెండుసార్లు కచ్చితంగా కోయాలని, కోయకుండా వదిలేస్తే ముదురుతాయని రైతులు పేర్కొన్నారు. కాసిన వంకాయలను తానే కరీంనగర్, జగిత్యాల లాంటి మార్కెట్ తీసుకువెళ్లి వ్యాపారులకు అమ్ముతామని, ప్రస్తుతం వంకాయ ధర రూ.25 ఉందని పేర్కొన్నాడు. కొన్ని రోజులు రూ.35 వచ్చేవన్నారు. ఇప్పటివరకు వంకాయ సాగులో ఖర్చులు కూలీలకు పోను రెండు ఎకరాలకు 30 వేలు లాభం వస్తుందని రైతు చెబుతున్నాడు. సన్నకారు రైతులకు ఎక్కువ కూలీలు అవసరం లేకుండా తక్కువ పెట్టు బడితో ఎక్కువ లాభాలు గడించేందుకు కూరగాయల సాగు బాగుంటుందని పేర్కొంటున్నాడు.

నాణ్యమైన కూరగాయలు అందించడమే లక్ష్యం




మా స్నేహితుడు సహాయంతో ఈ ప్రాంతంలోని మహిళలకు ఉపాధి కల్పించడంతోపాటు 10 ఎకరాల్లో నాణ్యమైన కూరగాయలు పండ్లు పండించి ప్రజలకు అందిస్తున్నాను. రైతులు పంట మార్పిడి చేసి అధిక లాభాలు పొందవచ్చు.

– నశీర్ ఖాన్ రైతు, దీకోండ గ్రామం

ఉపాధి హామీ పనులపై నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవు

- అడిషనల్ డి.ఆర్డీ.ఓ మదన్ మోహన్
- పలువురు పంచాయతీ కార్యదర్శులకు, ఫీల్డ్ అసిస్టెంట్లకు రికవరీ,ఫైన్ విధింపు

నవతెలంగాణ-రాయికల్


సమావేశంలో మాట్లాడుతున్న అధికారులు

మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం 14వ విడత సామాజిక తనిఖీ ప్రజావేదిక కార్యక్రమాన్ని అడిషనల్ డి.ఆర్డీ.ఓ మదన్ మోహన్ ప్రారంభించారు. 32 గ్రామాల్లో 14 రోజులుగా సామాజిక తనిఖీ బృందాలు ఉపాధి హామీ పథకం పని తీరు, నిధుల వినియోగంపై తనిఖీలు నిర్వహించి ప్రజా వేదికలో చదివి వినిపించారు. ఈ సందర్భంగా తనిఖీ బృందాలు పలు గ్రామాల్లో మొక్కలు ఎండిపోయి ఉండటం, ఒకే కుటుంబంలో రెండు జాబ్ కార్డులు కలిగి ఉండటం, మాస్టర్‌పై కూలీలు, ఏ.పీ.ఓ సంతకం లేకుండా వేతనాలు చెల్లించడం, సిటిజన్ చార్టులు ప్రదర్శించకపోవడం, పనులు జరిగే ప్రదేశంలో పనికి సంబంధించిన బోర్డులు ఏర్పాటు చేయకపోవడం, మాన్యువల్ ఇన్పుట్ డాటా నిర్వహణ లేకపోవడం, పాస్ ఆర్డర్ లేకుండా వేతనాలు చెల్లించడం, గుట్ట దగ్గర కాకుండా సమతల ప్రదేశంలో కందకాల పనులు చేయించడం,కూలీలు పని చేయకుండానే వారి పేరుపై వేతనం చెల్లించినట్లు నమోదు చేయడం, పలు గ్రామాల్లో జరిగిన పనుల్లో సంబంధిత ఫీల్డ్ అసిస్టెంట్లు, పంచాయతీ కార్యదర్శులు,టెక్నికల్ అసిస్టెంట్లు నిర్లక్ష్యంగా వ్యవహరించినట్లుగా తనిఖీ బృందాలు గుర్తించారు.

అనంతరం అడిషనల్ డి.ఆర్డి.ఓ మదన్ మోహన్ మాట్లాడుతూ... నిర్దేశించిన 21 రకాల పనులు కాకుండా ఇతర పనులు చేస్తే చట్ట ప్రకారం తగు చర్యలు తీసుకుంటామని, 1 ఏప్రిల్ 2023 నుండి 31 మార్చి 2024 వరకు ఈ.జీ.ఎస్, పంచాయతీరాజ్, అటవీ శాఖలలో 772 పనులకు 8 కోట్ల 81 లక్షల 60 వేల 640 రూపాయల నిధులు ఖర్చు జరిగిందని, వృత్తి పరంగా విధి నిర్వహణ, మాస్టర్ నిర్వహణ,మొక్కలను కాపాడకపోవడం వంటి పనుల్లో నిర్లక్ష్యం వహించిన పలువురు ఫీల్డ్ అసిస్టెంట్లకు 14,770 రూపాయలు, పంచాయతీ కార్యదర్శులకు 36,362, కంప్యూటర్ ఆపరేటర్లకు 4,440, టెక్నికల్ అసిస్టెంట్లకు 19,348,ఇంజనీర్ కన్సల్టెంట్‌కు 1.000 రూపాయలు ఏ.పీ.ఓకు 3,722 రూపాయలు రికవరీ,ఫైన్ విధించినట్లు తెలిపారు. అనంతరం అంబుడ్స్ పర్సన్ కృష్ణారెడ్డి మాట్లాడుతూ.. వీఆర్పీలు సామాజిక తనిఖీల్లో గ్రామ సభలతో పాటుగా,గుణాత్మక పరిశీలన చేసి ఉపాధి హామీ కూలీలకు చట్టంపై అవగాహన కల్పించాలని, ఫీల్డ్ అసిస్టెంట్లు, పంచాయతీ కార్యదర్శులు ఉదాసీనంగా కాకుండా ఉత్సాహంగా పనిచేయాలని వారంలోగా ఎండిన మొక్కలను తిరిగి నాటాలని పనులపై నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో బింగి చిరంజీవి, డి.ఆర్డీ.ఏ విజిలెన్స్ అసిస్టెంట్ మేనేజర్ దేవేందర్, ఎస్.ఆర్.పి సురేందర్ బాబు, ఎంపీఓ సుష్మ, ఏపిఎం దివ్య పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

తెలంగాణ తల్లి విగ్రహానికి పాలాభిషేకం

నవతెలంగాణ-పెగడపల్లి

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ ఆదేశాల మేరకు పెగడపల్లి మండల కేంద్రంలోని తెలంగాణ తల్లి విగ్రహానికి బిఆర్ఎస్ నాయకులు పాలాభిషేకం చేసి పూలమాలలు వేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. తెలంగాణ ఉద్యమ స్ఫూర్తితో అన్ని వర్గాలకు అనుకూలంగా ఆనాడు తెలంగాణ ప్రజల గుండెల్లో రూపుదిద్దుకున్న విగ్రహాన్ని మార్చి నూతనంగా కాంగ్రెస్ పార్టీకి అనుకూలంగా విగ్రహం ఏర్పాటు చేయడాన్ని తీవ్రంగా ఖండించారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు లోక మల్లారెడ్డి, ఉప్పుగండ్ల నరేందర్ రెడ్డి, మాజీ ఎంపీపీ కాశెట్టి సత్తయ్య, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ తిరుపతి నాయక్, మాజీ వైస్ ఎంపీపీ కరుణాకర్‌రావు, రాజశేఖర్‌రావు, బొమ్మెన స్వామి, లక్ష్మణ్, శ్రీనివాస్, ఆనందం, రవి, లక్ష్మీనారాయణ, తిరుపతి, రాజశేఖర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఎండపల్లి: మండలం రాజారాంపల్లి గ్రామంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు సింహాచలం జగన్ ఆధ్వర్యంలో నాయకులు తెలంగాణ తల్లి చిత్ర పటానికి పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో వెల్గటూర్ మండల ప్రజా పరిషత్ కాప్స్ అండ్ సభ్యుడు మహమ్మద్ రియాజ్, ఉద్యమకారుడు పడిదం వెంకటేష్, పడిదం నారాయణ, గంధం రవి, దుర్గం కృష్ణ, ఉశికమల్ల పరందాం, గౌరి చిరంజీవి, ఉప్పు రాజయ్య, చింతల తిరుపతి, బట్టు రామస్వామి, గాధం భాస్కర్, దేవి నరేష్, చెంపక కేశవ్, జాడి సుదర్శన్, దుశ్యంత రాణి పాల్గొన్నారు.

సారంగాపూర్ : సారంగాపూర్ మండలంలోని రేచపెల్లి గ్రామంలో తెలంగాణ తల్లి విగ్రహానికి బీఆర్ఎస్‌నా


తెలంగాణ తల్లికి పాలాభిషేకం చేస్తున్న నాయకులు,

యకులు పూల మాల వేసి నిరసన తెలుపగా, బీర్పూర్ మండల కేంద్రంలో తెలంగాణ తల్లి చిత్ర పటానికి నాయకులు పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ జిల్లా కార్యవర్గ సభ్యులు మాజీ జడ్పీటీసీ కొల్ముల రమణ, సీనియర్ నాయకులు బైరి మల్లేష్, ఎండబెట్ల ప్రసాద్, కొండ ప్రభాకర్, ఒడ్నాల జగన్, నేరెళ్ల సుమన్ గౌడ్, మాజీ సింగిల్ విండో అధ్యక్షుడు మెరుగు రాజేశం, మాజి సర్పంచ్ చిక్రం రవీందర్, గడ్డమీ ది రామ చెంద్రం, శ్రీనివాస్, నేరెళ్ల క్రిష్ణమూర్తి, వొల్లాల శేఖర్, ఎనగంటి జితేందర్, నరేందర్ పాల్గొన్నారు.


: పాలాభిషేకం చేస్తున్న నాయకులు

మల్యాల:మండలంలోని తెలంగాణ తల్లి విగ్రహానికి బీఆర్ఎస్ నాయకులు పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షులు శ్రీనివాస్, మాజీ సర్పంచులు తిరుపతి రెడ్డి, రవి, మాజీ పీఏసీఎస్ చైర్మెన్లు అడువాలా సురేష్, అనిల్‌రెడ్డి, నాయకులు శ్రీనివాస్ గౌడ్, దశరథం, చిన్న దుర్గయ్య, మల్లేష్ గౌడ్, దేవరాజము, రాజమల్లు, లక్ష్మణ్, రాజేందర్, సంతోష్, అరుణ్, మహేష్ గౌడ్, రవి, సామి గౌడ్, రూపేష్, చందు, హనుమంతు, గంగారాం తదితరులు పాల్గొన్నారు.

ఆశావర్కర్ల సమస్యలు పరిష్కరించాలి

సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు అరుణ్ కుమార్

నవతెలంగాణ-వీర్నపల్లి

ఆశా వర్కర్లకు కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన ఫిక్స్‌డ్ వేతనం రూ.18 వేలు ఇవ్వాలనీ సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు మల్లారపు అరుణ్‌కుమార్ డిమాండ్ చేశారు. వీర్నపల్లి మండల కేంద్రంలో చలో హైదరాబాద్ వెళుతున్న ఆశావర్కర్లను పోలీసులు అక్రమ అరెస్టులను ఖండిస్తూ అంబేద్కర్ విగ్రహం ఎదుట ఆశా వర్కర్లు నిరసన తెలుపగా వారికి అరుణ్ కుమార్ మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నూతన తెలంగాణ తల్లి ఆవిష్కరణ చేసిన రోజే కోఠిలో ధర్నా చేస్తున్న ఆశా వర్కర్లపై తల్లులపై దాడి చేయడన్ని ఖండిస్తున్నామన్నారు.ఆశాల సమస్యలు పరిష్కరించక పోతే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆశ వర్కర్లు అనిత, సువర్ణ,మునవా, సరిత, జివంతి, నవత, జమున, సావిత్రి, సిమా, మంజుల, పాల్గొన్నారు.



డిపో మేనేజర్‌కు వినతి

నవతెలంగాణ-సిరిసిల్ల టౌన్

విద్యార్థుల సమయాను కూలంగా బస్సులు నడపాలని కోరుతూ ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో మంగళ వారం డిపో మేనేజర్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి మల్లారపు ప్రశాంత్ మాట్లాడుతూ జిల్లాలో పలుచోట్ల బస్సులు సమయానికి రాకపోవడంతో విద్యార్థులు గంటల తరబడి వేచి ఉండాల్సిన దుస్థితి నెలకొందన్నారు. ముస్తాబాద్ మండలం నామాపూర్ మోడల్ స్కూల్‌కి సాయంత్రం వేళ బస్సులు సకాలంలో రాకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని, కొందరు డ్రైవర్లు బస్సులు ఆపకుండా వెళ్ళిపోతున్నారని తెలిపారు. విద్యార్థులు భవిష్యత్ దృష్టిలో పెట్టుకొని విద్యాసంస్థల సమయానికి అనుగుణంగా బస్సులను నడపాలని వినతిపత్రంలో డిపో మేనేజర్‌ని కోరారు. ఆయనతో పాటు ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు కుర్ర రాకేష్ తదితరులు ఉన్నారు.



వినతి పత్రం అందజేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

మూత్రశాలలకు తాళం..

విద్యార్థులకు తప్పని తిప్పలు

నవతెలంగాణ-తంగళ్ళపల్లి

తంగళ్ళ పల్లి మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ప్రభుత్వ పాఠశాలలో గత కొంత వేల రూపాయలు వెచ్చించి నిర్మించిన మరుగుదొడ్లకు,మూత్రశాలలకు తాళం వేశారు. దీంతో బాలురు మూత్ర విసర్జన చేయాలంటే తాళం వేసిన మూత్రశాలల వెనకాల గోడచాటుకు వెళ్లాల్సిన దుస్థితి నెలకొంది. ఇక మలవిసర్జనకైతే ఇంటికి వెళ్లాల్సిందేనని విద్యార్థులు వాపోయారు. వేల రూపాయలు వెచ్చించి నిర్మించిన మూత్రశాలలు ఇలా తాళం వేయడం ఏంటని విద్యార్థుల తల్లిదండ్రులు మండిపడుతున్నారు. నిత్యం ఇదే పరిస్థితి నెలకొందని గత కొంతకాలంగా విద్యార్థులకు తిప్పలు తప్పడం లేదని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేశారు.



తాళం వేసి ఉన్న మూత్రశాల

అంబేద్కర్ కాంస్య విగ్రహాన్ని ఏర్పాటు చేయాలి

అంబేద్కర్ విగ్రహ డెవలప్‌మెంట్ జేఏసీ వేములవాడ

నవతెలంగాణ-వేములవాడ

వేములవాడ పట్టణంలోని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహ డిజైన్ మార్పు కొరకు అఖిలపక్ష సమావేశం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజా సంఘాల నాయకులు మాట్లాడుతూ పట్టణంలోని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ చౌరస్తా కొరకు రూపొందించిన డిజైన్‌ను మార్చాలని, అంబేద్కర్ విగ్రహ అభివృద్ధిపై ఉన్న వివిధ అభిప్రాయాలను తొలగించాలన్నారు. అంబేద్కర్ విగ్రహ చౌరస్తా సుందరీకరణ డిజైన్ కొరకు ప్రజా సంఘాల అభిప్రాయాన్ని స్థానిక ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ సేకరించాలన్నారు. పట్టణంలోని అంబేద్కర్ విగ్రహాన్ని1995లో ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు చేతులమీదుగా ఆవిష్కరించబడిన విగ్రహాన్ని గత 30 సంవత్సరాల నుండి అభివృద్ధి చేయకపోవడం చాలా బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. అంబేద్కర్ గార్డెన్ సెంటర్ పాయింట్‌లో అంబేద్కర్ కాంస్య విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని అఖిలపక్ష సమావేశంలో నిర్ణయం తీసుకున్నట్టు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ పాలకవర్గ కౌన్సిలర్లు నిమ్మిశెట్టి విజయ్, సిరిగిరి రామచందు, గోలి మహేష్, దుమ్మ ఆనంద్, సంటి అంజిబాబు, గుండా థామస్, మూలే కిషోర్, బొడ్డు రాములు, జక్కుల యాదగిరి, పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ప్రజాసంఘాల నాయకులు

సమగ్ర శిక్ష ఉద్యోగులను రెగ్యూలరైజ్ చేయాలి

నవతెలంగాణ-సిరిసిల్ల టౌన్

సమగ్ర శిక్ష ఉద్యోగులను రెగ్యూల రైజ్ చేసి, మినిమం టైం స్కేల్ వర్తింపజేస్తూ, తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని తెలంగాణ సమగ్రశిక్షా, ఉద్యో గుల సంఘం ఆధ్వర్యంలో మంగళవారం కలెక్టరేట్ ముందు నిరవధిక సమ్మె చేపట్టారు. ఈ సందర్భంగా సమగ్ర శిక్ష ఉద్యోగులు మాట్లాడుతూ కాంట్రాక్ట్ పద్ధతిలో పనిచేస్తున్న సమగ్ర శిక్ష ఉద్యోగులందరిని రెగ్యులరైజ్ చేసి, పేస్కేల్ ఇవ్వాలన్నారు. ఈ సమ్మెలో ఇప్పపూల దేవయ్య, కత్తి జయలక్ష్మి, రాజు, తుమ్మ రాజేందర్,భవాని, నీరజ, సలీం, శ్రీనివాస్, రవి, పాల్గొన్నారు.



నిరసన చేస్తున్న సమగ్ర శిక్ష ఉద్యోగులు

15వ తేదీలోగా సీఎంఆర్ ఇవ్వాలి

రైస్ మిల్లర్లతో కలెక్టర్ సందీప్ కుమార్ ఝా

నవతెలంగాణ-సిరిసిల్ల

ఈనెల 15వ తేదీలోగా పెండింగ్ సీఎంఆర్ ఇవ్వాలని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఆదేశించారు. ఖరీఫ్, రబీ 2023-2024 సీజన్ సీఎంఆర్ ఇవ్వడం, ఖరీఫ్ 2024-2025 సీజన్ ధాన్యానికి సంబంధించి బ్యాంక్ గ్యారంటీ అందజేయడంపై జిల్లాలోని బాయిల్డ్, రా రైస్ మిల్లర్లతో జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో కలెక్టర్ సందీప్ కుమార్ ఝా, అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్‌తో కలిసి మంగళవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడారు. జిల్లాలోని కొందరు బాయిల్డ్, రా రైస్ మిల్లర్ల నుంచి గత ఖరీఫ్, రబీ 2023-2024 సీజన్ సీఎంఆర్ ఇంకా పెండింగ్ ఉందని తెలిపారు. ఆయా రైస్ మిల్లర్లు ఈ నెల 15వ తేదీలోగా ఇవ్వాలని స్పష్టం చేశారు. ఎట్టి పరిస్థితుల్లోనూ గడువు పెంచమని తెలిపారు. ఖరీఫ్ 2024-2025 సీజన్ ధాన్యాన్ని తమ మిల్లుల్లో దించుకున్న యజమానులు రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలకు అనుగుణంగా బ్యాంక్ గ్యారంటీ ఇవ్వాలని ఆదేశించారు. ఏఏ రైస్ మిల్ యజమాని ఎంత ఇవ్వాలో అధికారులు తెలిపారు. జిల్లా పౌర సరఫరాల అధికారి వసంత లక్ష్మి, జిల్లా పౌర సరఫరాల శాఖ మేనేజర్ రజిత, బాయిల్డ్, రా రైస్ మిల్లర్లు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.



చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి: సివిల్ జడ్జి

నవతెలంగాణ-వీర్నపల్లి

ప్రతి ఒక్కరు చట్టాలపై, న్యాయ వ్యవస్థపై అవగాహన కలిగి వుండాలని సివిల్ జడ్జి రాధిక జైశ్వాల్ అన్నారు. వీర్నపల్లి మండల కేంద్రంలో ఆదర్శ పాఠశాలలో మానవ హక్కుల దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదర్శ పాఠశాలను సీనియర్ సివిల్ జడ్జి రాధిక జైశ్వాల్ న్యాయ విజ్ఞాన సదస్సును ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సివిల్ జడ్జి మాట్లాడుతూ విద్యార్థులు చట్టాలపై, మానవ హక్కులు ఎంటో అవగాహన కలిగి ఉండాలని తెలిపారు.అనంతరం మధ్యాహ్న భోజనంను పరిశీలించారు మెస్ ప్రకారం నాణ్యమైన భోజనంను అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో చీఫ్ లీగల్ ఎయిడ్ కౌన్సిల్ టి.పర్శరాములు, న్యాయవాది అడెపు వేణు, చింతోజి భాస్కర్, న్యాయవాదులు, ఎంఈవో శ్రీనివాస్, ఎస్ఐ ఎల్లయ్య గౌడ్, ప్రిన్సిపాల్ అశోక్, ఉపాధ్యాయ బృందం ఉన్నారు.

డిసెంబర్ 17న తుది పోలింగ్ కేంద్రాల ప్రచురణ

గ్రామ పంచాయతీ ఎన్నికల పోలింగ్ కేంద్రాలపై కలెక్టర్ సమీక్ష

నవతెలంగాణ-సిరిసిల్ల

గ్రామపంచాయతీ ఎన్నికల నిర్వహణ కోసం గుర్తించిన పోలింగ్ కేంద్రాలపై ఉన్న అభ్యంతరాలను వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు డిసెంబర్ 12 లోపు సమర్పించాలని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అన్నారు. మంగళవారం సమీకృత జిల్లా కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో గ్రామ పంచాయతీ ఎన్నికల పోలింగ్ కేంద్రాల పై వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా సమీక్ష నిర్వహించారు. రాజన్న సిరిసిల్ల జిల్లాలో ఉన్న 260 గ్రామ పంచాయతీలలో ఏర్పాటు చేస్తున్న పోలింగ్ కేంద్రాల వివరాలు అధికారులు వివరించారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ మన రాజన్న సిరిసిల్ల జిల్లాలో మొత్తం 260 గ్రామాలలోని 2268 వార్డులలో గ్రామపంచాయతీ ఎన్నికల నిర్వహణ కోసం మొత్తం 2268 పోలింగ్ కేంద్రాలను గుర్తించి డ్రాఫ్ట్ జాబితా విడుదల చేశామని, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు ఈ జాబితాను పరిశీలించి ఏవైనా అభ్యంతరాలు ఉంటే డిసెంబర్ 12 లోపు తెలియజేయాలని కలెక్టర్ తెలిపారు. రాజన్న సిరిసిల్ల జిల్లాలో 200 ఓటర్ల వరకు 1734 పోలింగ్ కేంద్రాలు, 400 ఓటర్ల వరకు 468 పోలింగ్ కేంద్రాలు, 650 ఓటర్ల వరకు 76 పోలింగ్ కేంద్రాలు, మొత్తం 2268 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయని, ఈ వివరాలను పార్టీల కార్యకర్తలకు అందజేసి క్షేత్రస్థాయిలో పరిశీలించి ఏవైనా అభ్యంతరాలు సందేహాలు ఉంటే డిసెంబర్ 12లోపు తెలియజేయాలని కలెక్టర్ తెలిపారు. డిసెంబర్ 13న అభ్యంతరాలపై సంబంధిత మండలాల ఎంపీడీవో అధికారులు స్క్రూటిని పూర్తి చేసి నివేదిక అందించాలని, డిసెంబర్ 16 లోపు జిల్లా కలెక్టర్ ఆమోదంతో తుది నిర్ణయం తీసుకొని డిసెంబర్ 17న గ్రామ పంచాయతీ ఎన్నికలకు సంబంధించి ఎంపీడీవోల ద్వారా తుది పోలింగ్ కేంద్రాల జాబితా ప్రకటించడం జరుగుతుందని అన్నారు. ఈ సమావేశంలో ఇన్‌చార్జీ డీపీవో శేషాద్రి, కాంగ్రెస్ పార్టీ ప్రతినిధి సీహెచ్. ప్రకాష్, బీఆర్ఎస్ ప్రతినిధి రాజన్న, భాజపా ప్రతినిధి గోపి, సీపీఐ(ఎం) ప్రతినిధి రాజశేఖర్, టీడీపీ ప్రతినిధి, వివిధ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్

చెన్నమనేని రమేష్ బాబుపై దేశద్రోహం కేసు పెట్టాలి

కాంగ్రెస్ ప్రచార కమిటీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బుర్ర రవితేజ గౌడ్

నవతెలంగాణ-వేములవాడ:

వేములవాడ మాజీ ఎమ్మెల్యే చెన్నమనేని రమేష్ బాబు పౌరసత్వం పై హైకోర్టు ఇచ్చిన తీర్పు ఆయన చెంపచెల్లుమనిపించేలా ఉందని, జర్మనీ పౌరసత్వం కలిగి ఉండి భారత చట్టాలను, వేములవాడ నియోజకవర్గ ప్రజలను మోసం చేసిన మాజీ ఎమ్మెల్యే రమేష్ బాబుపై దేశద్రోహం కేసు నమోదు చేయాలని కాంగ్రెస్ ప్రచార కమిటీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బుర్ర రవితేజ గౌడ్ అన్నారు. ఈ సందర్భంగా రవితేజ గౌడ్ మాట్లాడుతూ తప్పుడు అఫిడవిట్‌లు సమర్పించి 14 ఏళ్లుగా అటు చట్టాలను ఇటు నియోజకవర్గ ప్రజలను మోసం చేసిన రమేష్ బాబు పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. రమేష్ బాబు తప్పుడు విధానాలపై ఎన్నో పోరాటాలు చేసిన నన్ను కుట్రపూరితంగా అక్రమ కేసుల్లో ఇరికించే ప్రయత్నం చేశాడు అని ఆగ్రహం వ్యక్తం చేశారు. నియోజకవర్గ ప్రజల ఆశీస్సులతో గెలుపొందిన ఆది శ్రీనివాస్ ప్రభుత్వ విప్ అయి నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తున్నారని ఈ క్రమంలోనే రాజన్న ఆలయాన్ని 127 కోట్లతో అభివృద్ధి పరిచేందుకు శ్రీకారం చుట్టారు అని అన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర నాయకులు ఎరవెల్లి నాగరాజు, డీసీసీ లీగల్ సెల్ చైర్మన్ ఇరుకుల అశ్విన్, వైస్ చైర్మన్ వెంకట్ రెడ్డి, కన్వీనర్లు బుర్ర వివేక్, జెట్టి శేఖర్, శశి, మహేష్, కె. నరేష్, ఈ విశాల్ తోపాటు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న బుర్ర రవితేజ గౌడ్

క్రీడల్లో గెలుపు ఓటములు సహజం

గ్రంథాలయ జిల్లా చైర్మన్ నాగుల సత్యనారాయణ గౌడ్

నవతెలంగాణ-తంగళ్ళపల్లి

క్రీడల్లో గెలుపు ఓటములు సహజమని, గెలుపు ఓటములను విద్యార్థులు సమానంగా స్వీకరించాలని గ్రంథాలయ జిల్లా చైర్మన్ నాగుల సత్యనారాయణ గౌడ్ అన్నారు. మంగళవారం తంగళ్ళపల్లి మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ప్రభుత్వ పాఠశాలలో ప్రజా పాలన విజయోత్సవాల్లో భాగంగా ఏర్పాటు చేసిన సీఎం కప్-2024 క్రీడల పోటీలను గ్రంథాలయ జిల్లా చైర్మన్ నాగుల సత్యనారాయణ గౌడ్, మార్కెట్ కమిటీ చైర్మన్ వెలుముల స్వరూప తిరుపతిరెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పలు విభాగాల్లో విద్యార్థులకు క్రీడాకారులకు పోటీలను నిర్వ హించడం జరుగుతుందన్నారు. క్రీడల్లో గెలుపోటములు సహజమని గెలిచినవారు,రాబోయే కాలంలో రాష్ట్రస్థాయి,జాతీయస్థాయి క్రీడాకారులుగా ఎదగాలని, భవిష్యత్తులో మన ప్రాంతానికి, మీ ఉపాధ్యాయులకు తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో లక్ష్మి నారాయణ, ఎంఈవో రాజు నాయక్, కాంగ్రెస్ మండల అధ్యక్షులు జలగం ప్రవీణ్ కుమార్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ నేరెళ్ల నర్సింగ్ గౌడ్, పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నాగుల సత్యనారాయణ గౌడ్

ఎమ్మార్పీఎస్ గ్రామ నూతన కమిటి ఎన్నిక



నవతెలంగాణ-ఎల్లారెడ్డిపేట

ఎల్లారెడ్డిపేట మండలంలోని అల్మాస్‌పూర్ గ్రామంలో మంగళవారం ఎమ్మార్పీఎస్ జిల్లా కో కన్వీనర్ నేరెళ్ల శ్రీనివాస్ అధ్యక్షతన ఎమ్మార్పీ ఎస్ గ్రామ నూతన కమిటిని ఎన్నుకున్నారు. గ్రామశాఖ అధ్యక్షునిగా పసుల అంజయ్య, ఉపాధ్యక్షునిగా మునిగే ప్రమోద్, ప్రధాన కార్యదర్శులుగా పసుల మోహన్, మల్యాల శ్రీనివాస్‌లతో పాటు కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. ఈ ఎన్నికల్లో అంబేద్కర్ యువజన సంఘ సభ్యులు పసుల బాల మల్లయ్య, పసుల శంకర్, నేరెళ్ళ శంకర్, దేవయ్య, మల్లారం గోవర్ధన్, పసుల ఎల్లయ్య, నేరెళ్ళ నరేష్, మునిగే నర్సయ్య, మునిగే దేవరాజు, నేరెళ్ల రాజు, నేరెళ్ళ జీవన్, నారాపురం అరుణ్, పసుల శివకుమార్, మల్లెల కిషోర్, నేరెళ్ల రాములు, నేరెళ్ళ పరుశరాములు పాల్గొన్నారు.

జూనియర్ కళాశాల తనిఖీ



నవతెలంగాణ-ఎల్లారెడ్డిపేట

ఎల్లారెడ్డిపేట మం డల కేంద్రం లోని ప్రభుత్వ జూని యర్ కళాశాలను మంగళవారం జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి వై శ్రీనివాస్ ఆకస్మిక తనిఖీ చేశారు. అధ్యాపకులను ఉద్దే శించి మాట్లాడుతూ విద్యార్థులందరు క్రమం తప్పకుండా తరగతులకు హజరయ్యేలా చూడాలని అధ్యాపకులను ఆదేశించారు. వార్షిక పరీక్షలు సమీపిస్తుండడంతో సైన్స్ విద్యార్థులకు ప్రయోగాలు చేయించాలన్నారు. ఇంటర్మీడియట్ బోర్డు సూచించిన విధంగా యాక్షన్ ప్లాన్ ప్రకారం విద్యార్థులకు తరగతులు, స్లిప్ టెస్టులు, రోజువారి హోంవర్క్ ఇవ్వాలని ఆదేశించారు. జిల్లా విద్యాధికారి వెంట కళాశాల ఇంచార్జీ వాసరవేణి పరుశురాములు, క్యాతం సత్యనారయణ, మాదాసు చంద్రమౌళి, చెరుకు భూమక్క, బుట్ట కవిత, నీరటి విష్ణుప్రసాద్, ప్రవళిక, గౌతమి, గీత, సాగర్‌లు ఉన్నారు.

మార్కెట్ కమిటీ చైర్మన్‌ను సన్మానించిన చైతన్య యూత్

నవతెలంగాణ-రుద్రంగి

రుద్రంగి మండల కేంద్రంలో మంగళవారం స్థానిక మున్నూరు కాపు చైతన్య యూత్ సంఘ సభ్యులు ఇటీవల నూతనంగా ఎన్నికైన మార్కెట్ కమిటీ చైర్మన్ చేలుకల తిరుపతిని ఘనంగా సన్మానించారు. అలాగేయూత్ సభ్యులైన ఆకులరవి ఇటీవల ప్రభుత్వ ఉపాధ్యాయునిగా ఎంపికైన సందర్భంగా ఆయనను శాలువాతో సన్మానించారు. అలాగే యూత్ సభ్యుడైన ఎర్రం గంగ నరసయ్య మోడల్ స్కూల్లో ఉపాధ్యాయునిగా గతంలో ఉద్యోగం పొందగా ఆయనను యూత్ సభ్యులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా చైర్మన్ చేలుకల తిరుపతి మాట్లాడుతూ నాపై నమ్మకంతో వేములవాడ ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ నన్ను రుద్రంగి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా నియమించినందుకు వారికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్నూరు కాపు చైతన్య యూత్ సంఘ సభ్యులు పాల్గొన్నారు.



వేములవాడ మార్కెట్ కమిటీ పాలకవర్గానికి సన్మానం

నవతెలంగాణ-వేములవాడ రూరల్

వేములవాడ వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన పాలకవర్గాన్ని వేములవాడ మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ 11వ వార్డు ఇంచార్జ్ పీర్ మహ్మద్ ఆధ్వర్యంలో నూతన మార్కెట్ కమిటీ పాలకవర్గాన్ని ఘనంగా సన్మానించారు. మార్కెట్ కమిటీ అధ్యక్షులు రొండి రాజు, వైస్ చైర్మన్ కనికరపు రాకేష్ డైరెక్టర్లు దైత కుమార్, వస్తాది కృష్ణ రాగిరి నాగరాజు, సాబీర్, చెరుకు శంకర్, సల్మాన్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు కోయినేని శ్రీనివాస్, తోట రాజు, వలి, కోయినేని బాలయ్య, పోతుగంటి వెంకన్న తోపాటు తదితరులు ఉన్నారు.



రాజన్నను దర్శించుకున్న ఆదిలాబాద్ ఎస్పీ

నవతెలంగాణ-వేములవాడ:

వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి వారిని మంగళవారం ఆదిలాబాద్ ఎస్పీ గౌష్ ఆలం కుటుంబ సమేతంగా రాజన్న దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారికి ప్రీతిపాత్రమైన కోడె మొక్కు చెల్లించుకున్నారు. అనంతరం స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అర్చకులు కళ్యాణమండపంలో వేదోక్త ఆశీర్వదించి శేషవస్త్రం కప్పి లడ్డు ప్రసాదం అందజేశారు. ఆయన వెంట ఆలయ ఇన్స్పెక్టర్ నోగూరి నరేందర్, ప్రోటోకాల్ ఇంచార్జ్ సీనియర్ అసిస్టెంట్ ఎడ్ల శివసాయి, స్థానిక ఎస్ఐ అంజయ్య ఉన్నారు.



కోడెమొక్కులు చెల్లించుకుంటున్న ఆదిలాబాద్ ఎస్పీ

కలెక్టరేట్ ఎదుట మధ్యాహ్న భోజన కార్మికుల ధర్నా

సమస్యలు పరిష్కరించాలని డిమాండ్

నవతెలంగాణ-సిరిసిల్ల టౌన్

తమ సమస్యలు పరిష్క రించాలని ఏఐటీయూసీ తెలంగాణ మధ్యాహ్నం భోజన పథకం వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యం లో మంగళవా రం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా కార్యదర్శి గుంటి వేణు మాట్లాడుతూ ఎన్నో ఏండ్ల నుండి చాలి చాలని జీతంతో మధ్యాహ్న భోజన కార్మికులుగా పాఠశాలల్లో పనిచేస్తున్నమన్నారు. సమస్యలు పరిష్కరించాలని పలుమార్లు అధికారులకు విన్నవించుకున్నా పట్టించుకున్న పాపాన పోలేదన్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి నాయ్యం చేయాలని డిమాండ్ చేశారు. పాఠశాలవంట కార్యక్రమాన్ని ప్రైవేట్‌సంస్థలకు అప్పగించే విధానాన్ని విరమించుకోవాలన్నారు. వంట, కోడిగుడ్లు, రాగి జావ, అల్పాహారం సంబంధించి పెండింగ్ బిల్లులు వేతనాలు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం కలెక్టర్ ఏవోకి వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు మీసం లక్ష్మన్, నడిగొట్టులక్ష్మీ, నరసవ్వ, రాజవ్వ, సరోజన,విజయ, రేణుక రాజేశ్వరి, రోజా, పాల్గొన్నారు



నిరసన తెలుపుతున్న మధ్యాహ్న భోజన కార్మికులు

డ్రైనేజీ నిర్మాణానికి భూమిపూజ

నవతెలంగాణ-సిరిసిల్ల టౌన్

సిరిసిల్ల పట్టణంలో 23వ వార్డులో మురికి కాలువ, కల్వర్టు నిర్మాణం పనులకు మున్సిపల్ చైర్ పర్సన్ జిందం కళ భూమి పూజా నిర్వహించి పనులు ప్రారంభించారు. ప్రజా అవసరాల దృష్ట్యా రూ 3.5లక్షలతో వార్డులో సీసీ మురికి కాలువ, కల్వర్ట్ నిర్మాణ పనులు చేపడ్తున్నట్లు ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ సభ్యులు రాపల్లి అరుణ, అర్బన్ బ్యాంక్ చైర్మన్ రాపల్లి లక్ష్మీనారాయణ ఏఈ నరసింహస్వామి తదితరులు పాల్గొన్నారు.

ఆశావర్కర్ల ముందస్తు అరెస్ట్

ఖండించిన సీఐటీయూ నాయకులు

నవతెలంగాణ-సిరిసిల్ల టౌన్

ఆశవర్కర్ల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ చలో హైదరాబాద్‌లోని వైద్య ఆరోగ్యశాఖ కమిషనర్ ముట్టడి కార్యక్రమానికి తరలివెళ్తున్న ఆశవర్కర్లను సోమవారం అర్ధరాత్రి అడ్డుకొని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. కాగా ఆశ కార్యకర్తల అరెస్టును సీఐటీయూ నాయకులు తీవ్రంగా ఖండించారు. తమ న్యాయమైన డిమాండ్ల కోసం పోరాడుతున్న ఆశా వర్కర్లను ప్రభుత్వం అరెస్టు చేయించడం అప్రజాస్వామికమం అని సీఐటీయూ జిల్లా కార్యదర్శి కోడం రమణ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆశా వర్కర్లకు ఫిక్స్ వేతనం రూ.18 వేలు ఇవ్వాలని, పీఎఫ్, ఈఎస్ఐ, ఉద్యోగ భద్రత, ఆరోగ్య భద్రత కల్పించి పెండింగ్ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అరెస్ట్ అయిన వారిలో సీపీఐ(ఎం) పార్టీ జిల్లా కార్యదర్శి మూషం రమేష్, సీఐటీయూ సహాయ కార్యదర్శి అన్నల్దాస్ గణేష్, చంద్రకళ, లావణ్య తదితరులు ఉన్నారు.

నవతెలంగాణ-చందుర్తి

ఆశ కార్యకర్తలు డిమాండ్ల సాధనకై హైదరాబాద్‌లో జరిగే ధర్నాకు వెళుండగా మంగళవారం తెల్లవారుజామున ఆశ కార్యకర్తలను పోలీసులు హౌస్ అరెస్ట్ చేసి స్టేషన్‌కు తరలించారు. మధ్యాహ్నం వరకు స్టేషన్‌లో పోలీసుల అధీనంలో ఉంచుకొని సొంత పూచి కత్తుపై వదిలి పెట్టారు. ఈ సందర్భంగా ఆశలు మాట్లాడుతూ పనికి తగ్గ వేతనం కాకుండా కనీస వేతనం ఇవ్వాలని అన్నారు. తమను అరెస్ట్ చేయడం హేమమైన చర్య అని, ప్రభుత్వానికి రాబోయే ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు.



చందుర్తిలో అరెస్టైన ఆశాకార్యకర్తలు

సీఎం కప్ క్రీడా పోటీలు ప్రారంభం

నవతెలంగాణ-సిరిసిల్ల టౌన్

సిరిసిల్ల పట్టణంలోని స్థానిక కళాశాల మైదానంలో ప్రజా పాలన విజయోత్సవాల్లో భాగంగా సీఎం క్రీడా కప్ పోటీలు మంగళవారం ప్రారంభ మయ్యాయి. ఇట్టి పోటీలను మున్సిపల్ చైర్పర్సన్ జిందం కళ ప్రారంభించారు. ఈ సంద ర్భంగా ఆమె మాట్లాడుతూ క్రీడలు మానసిక ఉల్లాసాన్ని కలిగిస్తాయని, పోటీలో పాల్గొనే క్రీడాకారులు ఉత్తమ ప్రతిభ కనబరిచి జాతీయస్థాయిలో రాణించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంధాలయ చైర్మన్ నాగుల సత్యనారాయణ, సిరిసిల్ల ఏఎంసీ చైర్మెన్ వెలుమల స్వరూప, మున్సిపల్ కమిషనర్ లావణ్య, డీవైఎస్‌వో రాందాస్, స్థానిక కౌన్సిలర్ గెంట్యాల శ్రీనివాస్, పీఈటీలు తదితరులు పాల్గొన్నారు.



సిరిసిల్ల టౌన్‌లో..

నవతెలంగాణ-ముస్తాబాద్

మండల కేంద్రంలోని నామాపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సీఎంకప్ మండల స్థాయి క్రీడా పోటీలను కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బాల్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చదువుతోపాటు క్రీడలు ముఖ్యమని క్రీడల వల్ల శారీరకంగా మానసికంగా ఎదుగుతా రన్నారు. విద్యార్థులంతా చక్కగా చదువుకొని తల్లిదండ్రులకు ,ఉపాధ్యాయులకు మంచి పేరు ప్రఖ్యాతులు తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

తెలంగాణ తల్లి విగ్రహానికి పాలాభిషేకం

నవతెలంగాణ-ఎల్లారెడ్డిపేట

ఎల్లారెడ్డిపేట మండలంలోని నారాయణపూర్ గ్రామంలో మంగళవారం బీఆర్ఎస్ నాయకులు తెలంగాణ తల్లి విగ్రహానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమంలో ప్రజల గొంతుకగా ఏర్పడ్డా తెలంగాణ తల్లి రూపాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం మార్చివేసి తెలంగాణ అమరవీరుల, ఉద్యమకారుల మనోభావాలను దెబ్బతీసిందన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రజలు కాంగ్రెస్ ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెప్పడం కాయమన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు వరుస కృష్ణహరి, సింగిల్ విండో చైర్మన్ గుండారపు కృష్ణారెడ్డి, బొప్పాపూర్ మార్కెట్ కమిటి మాజీ చైర్మన్లు అందె సుభాష్, గుల్లపల్లి నరసింహారెడ్డి, ఎలుసాని మోహన్, మాజీ ఎంపీటీసీ శ్రీనివాస్, నారాయణపురం ఎంపీటీసీ మజీద్, పాల్గొన్నారు.



తెలంగాణ తల్లి విగ్రహానికి పాలాభిషేకం చేస్తున్న నాయకులు

వినియోగదారుల సమస్యల పరిష్కారానికి కృషి

నవతెలంగాణ-వీర్నపల్లి

వీర్నపల్లి మండల కేంద్రంలో రైతు వేదికలో మంగళవారం విద్యుత్ వినియోదారుల సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం సెస్ డైరెక్టర్ మల్లేశం అధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా సీజీఆర్ఎఫ్ చైర్ పర్సన్ నారాయణ నిజమాబాద్ మాట్లాడుతూ రైతుల పెండింగ్ సమస్యలను ఏవైనా త్వరగా పరిష్కారం చేయాలని ఆదేశించారు.సిరిసిల్ల పౌర సంక్షేమ సమితి అధ్వర్యంలో సీజీఅర్ఎఫ్ చైర్ పర్సన్ నారాయణకు విద్యుత్ వినియోగదారుల పరిష్కార వేదిక తీర్పులు ఆలస్యం అవుతుందని వినతి పత్రం సమర్పించి విద్యుత్ వినియోగదారులు సమస్యల పరిష్కారం వేదిక నింబంధనల ప్రకారం 22 రోజుల్లో పరిష్కారం చేయాలి.. కాని ఆలస్యం అవుతుందని కోరారు. సమస్యలు పరిష్కరించాలని మీ వద్దకు తీసుకవచ్చిన ప్పుడు తీర్పు జాప్యం చేయకుండా న్యాయం చేయాలని కోరారు. అలాగే సీజీఅర్ఎఫ్‌లో తీర్పు వెలువడే వరకు కరెంట్ కట్ చేయడం కాని ఎలాంటి చర్యలు తీసుకోవద్దని తెలిసి కట్ చేశారని తెలుపడంతో ఎండీపై సీజీఅర్ ఎఫ్ చైర్‌పర్సన్ నారాయణ ఆగ్రహం వ్యక్తం చేశారు. తీర్పు రాక ముందు ఎలాంటి చర్యలు తీసుకోకూడదని విద్యుత్ వినియోగదారులకు అసౌకర్యం కలుగకుండా చూడాలని రైతులు,ప్రజల ప్రతి సమస్య పరిష్కారం కోసం కృషి చేయాలని సెస్ అధికారులు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మేనేజర్ రామ కృష్ణ, మెంబర్ కిషన్, సెస్ ఎండీ, డీఈ, సెస్ ఎఈ లు, సెస్ కార్యాలయ సిబ్బంది,రైతులు తదితరులు పాల్గొన్నారు.

సమగ్ర శిక్ష ఉద్యోగుల సమ్మె నోటీస్

నవతెలంగాణ-జూలపల్లి



జూలపల్లి మండల సమగ్ర శిక్ష ఉద్యోగులు ఏంఈవో కె. సరస్వతికి మంగళవారం సమ్మె నోటీస్ అందించారు. తమ వేతనాలు పెంచాలని, రెగ్యూలరైజేషన్ తదితర డిమాండ్లను నెరవేర్చాలని సమ్మె నోటీస్ అందించామని ఉద్యోగులు తెలిపారు. ఈ నెల 10 నుంచి రెగ్యూలరైజేషన్ చేసే వరకు సమ్మెను కొనసాగిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమానికి జూలపల్లి మండల ఎస్ఎస్ఏ ఉద్యోగులు, సీఆర్పీలు సతీష్, తిరుమల, ప్రియాంక, సీసీవో మధు, ఐకెఆర్పీఅనిల్, వెంకట స్వామి, బాలయ్య, కేజీబీవీ ఉద్యోగులు నవ్య, పాల్గొన్నారు.

పంచ వృత్తులను విశ్వ బ్రహ్మణులుగా గుర్తించాలి

జిల్లా అధ్యక్షులు కట్ట రాజానందం

నవతెలంగాణ-పెద్దపల్లి



పంచ వృత్తులు అనగా కమ్మరి, వడ్రంగి, ఇత్తడి, శిల్పి, స్వర్ణకార వృత్తులను ఒకే కులం విశ్వబ్రాహ్మణులగా గుర్తించాలని విశ్వబ్రాహ్మణ/విశ్వకర్మ సంఘం జిల్లా అధ్యక్షులు కట్ట రాజానందము ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. విశ్వబ్రాహ్మణుల సమస్యలు, ఆర్థిక ఇబ్బందులు, రాజకీయ రిజర్వేషన్స్ విషయంలో 75సంవత్సరాల నుండి ప్రభుత్వాలు పట్టించుకున్న పాపాన పోలేదని, విశ్వబ్రాహ్మణులను కేవలం ఓటు బ్యాంకు మనుషులగా మాత్రమే గుర్తిస్తున్నారని తెలిపారు.

ఫీజు రీయంబర్స్‌మెంట్స్ వెంటనే విడుదల చేయాలి

బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు తాళ్లపల్లి మనోజ్ గౌడ్

నవతెలంగాణ-పెద్దపల్లి



పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయంబర్స్‌మెంట్ బిల్లులను వెంటనే విడుదల చేయాలని బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు తాళ్లపల్లి మనోజ్‌గౌడ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. విద్యార్థులకు ఫీజు రీయంబర్స్‌మెంట్ బిల్లుల చెల్లింపు, విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మంగళవారం పెద్దపల్లి జిల్లా బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు తాళ్ళపల్లి మనోజ్ గౌడ్ ఆధ్వర్యంలో జిల్లా అదనపు కలెక్టర్ దాసరి వేణుకు వినతిపత్రం అందించారు. అనంతరం బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు తాళ్ళపల్లి మనోజ్ గౌడ్ మాట్లాడుతూ బిసి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు ఆర్ కృష్ణయ్య పిలుపు మేరకు రాష్ట్ర వ్యాప్తంగా అన్ని కలెక్టర్ కార్యాలయాల ముట్టడిలో భాగంగా పెండింగ్‌లో ఉన్న విద్యార్థుల రెండు ఏళ్ల ఫీజు రీయంబర్స్‌మెంట్ బిల్లులు 4000 కోట్లు విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ జిల్లా అదనపు కలెక్టర్‌కు వినతి పత్రం అందించామని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి పొన్నం ప్రసాద్, రాష్ట్ర మహిళా ప్రధాన కార్యదర్శి సరోజ సత్యనారాయణ, జిల్లా మహిళా ప్రధాన కార్యదర్శి బొద్దుల అరుణ, జిల్లా యూత్ విభాగం అధ్యక్షులు నోమురి శ్రీధర్,రామగుండం నియోజకవర్గ కన్వీనర్ వింజమూరి సురేష్, పాల్గొన్నారు.

ఓసీపీ-5లో ఘనంగా 55వ వార్షిక రక్షణ పక్షోత్సవాలు

నవతెలంగాణ-గోదావరిఖని:



మాట్లాడుతున్న జీఎం డి.లలిత్ కుమార్

సింగరేణి ఆర్జీ-1 పరిధిలోని జీడీకే ఓసీపీ-5 ప్రాజెక్టులో సంస్థ స్థాయి 55వ రక్షణ పక్షోత్సవాలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. రక్షణ పక్షోత్సవాలకు ముఖ్య అతిథులుగా ఆర్అండ్‌డి జీఎం కార్పొరేట్, ప్రోగ్రాం కన్వీనర్ నారాయణ రావు, ఆర్జీ-1 జీఎం డి.లలిత్ కుమార్, జీఎం సేఫ్టీ రామగుండం రీజియన్ గుప్తా హాజరై రక్షణ జెండాను ఆవిష్కరించారు. అనంతరం ఉద్యోగులచే రక్షణ ప్రతిజ్ఞ పక్షోత్సవాల కార్యక్రమాన్ని ప్రారంభించారు. రక్షణ పక్షోత్సవాల సందర్భంగా తనిఖీ బృందం ఫిట్ స్టోర్, ఉపరితల గని క్వారీ, హాలేజి దారి, డంపర్, శవల్స్ తదితర వాటిని సందర్శించారు. ప్రమాదాలు జరుగకుండా ప్రతి ఒక్కరు రక్షణ చర్యలు పాటిస్తూ ముందుకు సాగుతూ నిర్దేశించిన ఉత్పత్తి లక్ష్యాలను సాధిస్తేనే సంస్థకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఓసీపీ-5 పీవో చంద్రశేఖర్, సేఫ్టీ ఆఫీసర్ పోనగోటి శ్రీనివాస్, మేనేజర్ రమేష్ బాబు, ఎఐటీయూసీ నాయకులు అరెల్లి పోషం, స్వామి, ప్రభుదాస్, అధికారులు రమేష్, సునీల్ వర్మ, కార్పొరేట్ అధికారులు రామకష్ణ, లక్ష్మి, రాజు, పాల్గొన్నారు.

జీడీకే-11వ గనిలో మల్టీ డిపార్ట్‌మెంటల్ సమావేశం

నవతెలంగాణ-గోదావరిఖని:



సింగరేణి ఆర్జీ-1 పరిధిలోని జీడీకే-11వ గనిలో మల్టీడిపార్ట్‌మెంటల్ సమావేశాన్ని ఏరియా జీఎం డి.లలిత్ కుమార్ ఆధ్వర్యంలో మంగళవారం మొదటి, రెండో బదిలీలో మంగళవారం నిర్వహించారు. ఇందులో భాగంగా సంస్థ పురోభివృద్ధికి సాధించాల్సిన అంశాల గురించి తెలిపారు. మల్టీ డిపార్మెంట్ కమిటీ సభ్యులు వివిధ అంశాలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా సింగరేణిలోని గనులు, వాటి పనితీరు గురించి వివరించారు. ఉత్పత్తి, ఉత్పాదకత, బొగ్గు రవాణా, ఓవర్ బర్డెన్ తరలింపు, నెలల వారిగా నిర్దేశించిన బొగ్గు ఉత్పత్తి, రవాణా సాధించుటకు ప్రణాళికల గురించి వివరించారు. ఈ ఆర్థిక సంవత్సరం ఆర్జీ 1 ఏరియాకు నిర్దేశించిన ఉత్పత్తి పెంపునకు తీసుకోవాల్సిన ప్రణాళికల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఓటూజిఎం గోపాల్ సింగ్, ఎఐటియుసి బ్రాంచి సెక్రటరీ అరెల్లిపోషం, ఏరియా ఇంజనీర్ డీవీ రావు, ఐఈడీ ఏజీఎం ఆంజనే యులు, ఏజంట్ చిలుక శ్రీనివాస్, డీజీఎం పర్సనల్ కిరణ్ బాబు, ఫైనాన్స్ డిజిఎం ధనలక్ష్మి భాయి, మేనేజర్ కోలా మల్లేశం, కమిటీ సభ్యులు రాజన్న, నాయిని శంకర్, మహేష్, ఉద్యోగులున్నారు.

సీఎం రేవంత్ రెడ్డి చిత్ర పటానికి పాలాభిషేకం

నవతెలంగాణ-గోదావరిఖని:



ఈ నెల 6న హోంగార్డుల రైజింగ్ డే సందర్భంగా హోంగార్డుల రోజూవారి వేతనం 1000 రూపాయలకు పెంపు చేయడం, ప్రమాదవశాత్తు చనిపోతే రూ.5 లక్షల ఎక్స్ గ్రేషియా, వీక్లీ పరేడ్ అలవెన్స్‌ను రూ.200కు పెంచడం, రాజీవ్ ఆరోగ్య శ్రీ పథకాన్ని జనవరి 01, 2025 నుంచి హోంగార్డులకు వర్తింప చేస్తానని సీఎం రేవంత్ రెడ్డి ప్రకటించడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ రామగుండం పోలీస్ కమీషనరేట్ హెడ్ క్వార్టర్స్‌లోని హోంగార్డ్స్ ఆఫీస్ వద్ద హోంగార్డులు సీఎం చిత్ర పటానికి మంగళవారం పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో హోంగార్డు ఆర్ఐ మల్లేశం, పెద్దపల్లి జోన్ హోంగార్డ్స్ ఇన్ చార్జి, హెడ్ కానిస్టేబుల్ మనోహర్, హోంగార్డ్స్ పిఎల్ సి.సత్యనారాయణ, కుమార్,బ్రహ్మచారి,శ్రీనివాస్, నర్సయ్య,చంద్రమౌళి,రాము తదితరులున్నారు.

పండుగ సాయన్నకు ఘన నివాళి

నవతెలంగాణ-కోల్‌సిటి

తెలంగాణ ప్రజల ఆశాజ్యోతి, పాలమూరు ముద్దుబిడ్డగా గుర్తింపు పొందిన పండుగ సాయన్న ముదిరాజ్ వర్ధంతిని మంగళవారం గోదావరిఖని ప్రధాన చౌరస్తాలో ముదిరాజులు, బిసి కులాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో నిర్వహించారు. సాయన్న చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ముఖ్య అతిథిగా తెలంగాణ మన ముదిరాజ్ మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ చొప్పరి శంకర్ ముదిరాజ్ మాట్లాడుతూ, 18వ శతాబ్దంలో ప్రజల పక్షాన పేద బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతిగా తెలంగాణ దొరలు, రజాకారులను ఎదిరించి ప్రజల పక్షాన పోరు చేశారన్నారు. పండుగ సాయన్న ఆశయ సాధనలో ముదిరాజులు బీసీ బడుగు బలహీన వర్గాలు ఐక్యతగా ముందుకు రావాలని పిలుపునిచ్చారు. జిల్లా నాయకులు దబ్బెట శంకర్ ముదిరాజ్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు పిల్లి శివయ్య ముదిరాజ్, పిడుగు కృష్ణ ముదిరాజ్, కోమల్ల మహేష్ ముదిరాజ్, తూడి రాజయ్య, బొజ్జ రాజనర్సు, కేశవ వేణి బిక్షపతి, బోయిని కుమార్, రంజిత్, స్వామి, రమేష్, రవి తదితరులు పాల్గొన్నారు.

కష్టపడి సాధించిన ఉద్యోగానికి సార్థకత తీసుకురావాలి

రామగుండం పోలీస్ కమిషనర్ ఎం.శ్రీనివాస్

నవతెలంగాణ-గోదావరిఖని:



ఉన్నత చదువులు చదివి పోలీస్ ఉద్యోగ ప్రయత్నంలో ఎన్నో సవాళ్ళను ఎదుర్కొని పోలీసు శాఖలో పూర్తి బాధ్యతలు నిర్వహించేందుకు ఎంపిక చేయబడిన ప్రతి ఒక్కరు ఎలాంటి ప్రలోభాలకు గురికాకుండా నీతి నిజాయితీతో విధులు నిర్వహించాలని, కష్టపడి సాధించిన ఉద్యోగానికి సార్థకత తీసుకురావాలని రామగుండం పోలీస్ కమీషనర్ ఎం.శ్రీనివాస్ అన్నారు. నూతన సాయుధ దళ (ఎఆర్) కానిస్టేబుళ్ళతో కమీషనరేట్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో పోలీసు విధులు, క్రమశిక్షణ తదితర అంశాల గురించి పోలీస్ కమీషనర్ దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ మీరు ఎంచుకొన్న, చేస్తున్న ఉద్యోగంలో విధులు గర్వంగా నిర్వర్తించాలని, ఈ ఉద్యోగాల్లో ఉన్నంత సమయం క్రమశిక్షణతో సమ యపాలన పాటిస్తూ, మంచి టర్న్ అవుట్‌తో అప్పగించిన విధులు గర్వంగా నిబద్దతతో నిర్వహించాలన్నారు. పోలీస్ జీవితంలో క్రమశిక్షణ ఎంతో ముఖ్యమైన దని, సమయపాలన పాటిస్తూ అధికారుల సలహాలు, సూచనలు పాటిస్తూ తమకు కేటాయించిన విధులను సక్రమంగా నిర్వహిస్తూ అధికారుల మన్ననలు పొందాలని, శిక్షణలో నేర్చుకున్న అంశాలను క్షేత్రస్థాయిలో అమలు చేయాలని కోరారు. నీతి, నిజాయితీతో పనిచేసే వారికి పోలీస్ శాఖలో ఎల్లప్పుడూ ప్రత్యేక గుర్తింపు ఉంటుందని అన్నారు. ప్రతి ఒక్కరూ క్రమశిక్షణ, నీతి నిజాయితీ, నిబద్ధత ఎలాంటి ప్రలోభాలకు గురికాకుండా పనిచేసి పోలీస్ వ్యవస్థకు, కమిషనరేట్‌కు, తెలంగాణ పోలీస్‌కు, రాష్ట్రానికి మంచి పేరు తేవాలని కోరారు. ఈ సమావేశంలో అడిషనల్ డీసీపీ అడ్మిన్ సి.రాజు, ఎఆర్ ఎసీపీలు ప్రతాప్, సుందర్ రావు, ఆర్ఐలు దామోదర్, వామనమూర్తి, శ్రీనివాస్, మల్లేశం, సంపత్‌లు పాల్గొన్నారు.

స్విమ్మింగ్, త్రోబాల్ పోటీలను ప్రారంభించిన ఆర్జీ-3 జీఎం

నవతెలంగాణ-రామగిరి



కంపెనీ స్థాయి అథ్లెటిక్స్ పోటీల రన్ లో పాల్గొన్న జీఎం

కోల్ ఇండియా స్థాయిలో రాణించి సింగరేణి సంస్థ పేరు నిలబెట్టాలని రామగుండం-3 ఏరియా జనరల్ మేనేజర్ నరేంద్ర సుధాకరరావు అన్నారు. రామగుండం-3, అడ్రియాల ప్రాజెక్ట్ ఏరియా వర్క్ పీపుల్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ అసోసియేషన్ ఆధ్వర్యం లో రెండు రోజుల పాటు నిర్వహిస్తున్న కంపెనీ స్థాయి అథ్లెటిక్స్, స్విమ్మింగ్, త్రోబాల్ పోటీలను మంగళవారం రాణి రుద్రమదేవి క్రీడా ప్రాంగణంలో రామగుండం-3 ఏరియా జనరల్ మేనేజర్ నరేంద్ర సుధాకరరావు ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభించారు. ఈ పోటీల్లో 6 ఏరియాలు బెల్లంపల్లి-మందమర్రి, శ్రీరాంపూర్, రామగుండం-1,2, రామగుండం-3-భూపాల పల్లి, మణుగూరు-ఇల్లందు, కార్పోరేట్-కొత్తగూడెం రీజియన్ల నుండి సుమారు 300 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, క్రీడల వల్ల శారీరక దారుఢ్యంతోపాటు, మానసి కోల్లాసం కలుగుతుందని అన్నారు. అనంతరం వివిధ క్రీడా విభాగాల్లో విజేతలకు వారితో పాటు మరొక ముఖ్య అతిథిగా హాజరైన అడ్రియాల ప్రాజెక్ట్ ఏరియా జనరల్ మేనేజర్ కొప్పుల వెంకటేశ్వర్లు పతకాలను అందజే శారు. కార్యక్రమంలో గుర్తింపు, ప్రాతినిధ్య సంఘాల నాయకులు వైవి రావు, కోట రవీందర్ రెడ్డి, అధికారుల సంఘం అధ్యక్షుడు సిహెచ్ వెంకటరమణ, ఎస్వోటు జీఎంలు జి.రఘుపతి, బండి నారాయణ, పర్స నల్ విభాగాధిపతి బి.సుదర్శనం, గౌరవ కార్య దర్శి వి సునీల్ ప్రసాద్, క్రీడాకారులు పాల్గొన్నారు.

కెరీర్ గైడెన్స్, సైన్స్ ఎడ్యూకేషన్ ప్రోగ్రాం

నవతెలంగాణ-ముత్తారం:



ముత్తారం మండలంలోని దరియాపూర్ మోడల్ స్కూల్, జూనియర్ కళాశాలలో ఐఐటి మద్రాస్ వారు మంగళవారం ఫ్రీ కెరీర్ గైడెన్స్, సైన్స్ ఎడ్యూకేషన్ ప్రోగ్రాం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డీఈవో మాధవి హాజరై మాట్లాడుతూ 9వ తరగతి నుంచి ఇంటర్మీడియట్ విద్యార్థులకు ఏం చదవాలి, ఏం చదివితే బాగుంటుందనే సందిగ్ధత ప్రతి విద్యార్థిలో ఉంటుందని, అందుకే విద్యార్థులకు వృత్తి పరీక్షను గత నెల రోజులుగా నిర్వహించడం జరిగిందని తెలిపారు. ఈ టెస్ట్ రిపోర్టులో విద్యార్థులకు తమకు ఏ వృత్తి అయితే సరిపోతుందో సలహాలు, సూచనలు ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. ఇంకా పూర్తి అవగాహన కల్పించేందుకు కెరీర్ గైడెన్స్ టెస్ట్ రూపకర్త, ఐఐటియన్ కొండవీటి బాలరాజు, విద్యార్థులలో శాస్త్రీయ దృక్పథాన్ని నింపడానికి ఐఐటీ మద్రాస్ ప్రొఫెసర్ శ్రీనివాస చక్రవర్తి ఆశయాన్ని, ఆచరణను ముందుకు తీసుకు పోవడానికి ఐఐటియన్ పింగిలి విక్రమ్ కుమార్ ప్రత్యేకంగా దరియాపూర్ మోడల్ స్కూల్‌కు వచ్చారని తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వారి టెస్ట్ రిపోర్ట్, సైన్స్ పుస్తకాలను అందజేశారు. ప్రిన్సిపల్ కేసరి సంతోష్ కుమార్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఎఎంఓ డాక్టర్ షేక్, ఎంపిడిఓ సురేష్, ఎంఇఓ ఓదెలు, అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్ తోట శారద తదితరులున్నారు.

బీఆర్ఎస్ ఆధ్వర్యంలో తెలంగాణ తల్లి విగ్రహానికి పాలాభిషేకం

నవతెలంగాణ-మంథని

తెలంగాణ తల్లి విగ్రహ రూపురేఖలు మార్చినందుకు నిరసనగా బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో మంథని పట్టణంలోని తెలంగాణ తల్లి విగ్రహానికి బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు పాలాభిషేకం నిర్వహించారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన అపచారానికి నిరసనగా రాష్ట్రవ్యాప్తంగా ఎక్కడిక్కడ తెలంగాణ తల్లి విగ్రహాలకు పాలాభిషేకం చేయాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారకరామారావు పిలుపు మేరకు, మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ ఆదేశాల మేరకు మంగళవారం మంథని పట్టణంలోని పాత పెట్రోల్ బంకు వద్ద మంగళవారం తెలంగాణ తల్లి విగ్రహానికి బీఆర్ఎస్ పార్టీ నాయకులు కార్యకర్తలు, పాలాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు ఎగోలపు శంకర్ గౌడ్ మాట్లాడుతూ ప్రభుత్వం చేసిన అపచారానికి తప్పకుండా ప్రజలకు సమాధానం చెప్పాల్సిన అవసరం ఉన్నదన్నారు. కొత్తగా ఏర్పాటు చేసిన తెలంగాణ తల్లి విగ్రహం.. తెలంగాణ తల్లి విగ్రహం కాదని,కాంగ్రెస్ తల్లి విగ్రహమని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఎక్కేటి అనంతరెడ్డి, కౌన్సిలర్ కాయతి సమ్మయ్య, నాయకులు ఆకుల రాజబాబు, విజయ్ కుమార్, తొంబరపు తిరుపతి, పోగుల సదానందం,పోలు కనకరాజు,గొబూరి వంశీ,మంథని లక్ష్మణ్, వేముల లక్ష్మయ్య, పాల్గొన్నారు.

నవతెలంగాణ-రామగిరి



తెలంగాణ తల్లి చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న నాయకులు

కల్వచర్ల గ్రామంలో మంగళవారం గ్రామ ప్రధాన రహదారి వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు మ్యాదరవేన కుమార్ యాదవ్, బొంకూరి పోశం ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు తెలంగాణ తల్లి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ప్రభుత్వం తెలంగాణ విగ్రహం మార్పు చేయడం కాంగ్రెస్ ప్రభుత్వ అవివేకమన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు జాపతి శేఖర్, రేండ్ల కుమారస్వామి, రేండ్లఅశోక్, మెట్టు కిష్టయ్య, తాటి శంకర్, బూడిద మంగ, సైండ్ల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

రామగుండం కమిషనరేట్‌లో నిషేధాజ్ఞల కొనసాగింపు

పోలీస్ కమిషనర్ ఎం.శ్రీనివాస్

నవతెలంగాణ-గోదావరిఖని:



రామగుండం కమిషనరేట్ పరిధిలోని పెద్దపల్లి, మంచిర్యాల జోన్‌లలో బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించడం, అనుమతి లేని డ్రోన్, డీజే సౌండ్స్‌పై నిషేధా జ్ఞలను కొనసాగిస్తున్నట్లు పోలీస్ కమిషనర్ ఎం.శ్రీనివాస్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించి మద్యం ప్రియులు పాల్పడుతున్న ఆగడాలపై పలు ఫిర్యాదులు వస్తున్న నేపథ్యంలో, చిన్నపిల్లలు, పెద్దలు రోగులు, విద్యార్థుల విద్యాభ్యాసానికి భంగం కలగకుండా, శబ్ద కాలుష్యం నుంచి కాపాడేందుకు భారీ సౌండ్‌లతో కూడిన డీజే సౌండ్ వినియోగంపై నిషేధాజ్ఞలను 01.12.2024 నుంచి 01.01.2025 వరకు కొనసాగించడం జరుగుతుందని తెలిపారు.

మృతుని కుటుంబానికి శ్రీ సీతారామసేవా సమితి సహాయం

నవతెలంగాణ-గోదావరిఖని:



నిత్యావసర సరుకులు అందజేస్తున్న శ్రీ సీతారామ సేవా సమితి సభ్యులు

రామగుండం కార్పొరేషన్ 40వ డివిజన్‌కు చెందిన బండారి సంతోష్ గత కొద్ది రోజుల క్రితం మృతి చెందగా అతని కుటుంబం ఆర్థికంగా ఇబ్బందులు ఎదు ర్కొంటున్నారని తెలుసు కున్న శ్రీ సీతారామ సేవా సమితి సభ్యులు సహాయం అందజేశారు. సంతోష్ దశ దిన కర్మ సందర్భంగా శ్రీ సీతారామ సేవా సమితి సభ్యులు కార్తీక్, మంగ, సుజాత, లింగయ్య, అజయ్‌ల సహకారంతో 50 కిలోల బియ్యం, నిత్యావసర సరుకులను మృతుని భార్య అశ్వినికి మంగళవారం అందజేశారు. దాతలు ముందుకు వచ్చి సహాయం అందించాలని ఈ సందర్భంగా శ్రీ సీతారామ సేవా సమితి అధ్యక్షురాలు గోలివాడ చంద్రకళ కోరారు. ఈ కార్యక్రమంలో కంది సుజాత, చంద్రమౌళి, పద్మ తదితరులున్నారు.

ఓపెన్ డ్రైనేజ్ పనులు ప్రారంభం

నవతెలంగాణ-గోదావరిఖని:



పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ దొంత శ్రీనివాస్

రామగుండం కార్పొరేషన్ 33వ డివిజన్ లోని 5వ ఇంక్లైన్ చౌరస్తాలోని ప్రధాన షాపింగ్ కాంప్లెక్స్ నుంచి పార్క్ వరకు టీయూఎఫ్ఐడీసీ నిధుల నుంచి 30లక్షల రూపాయల తో ఓపెన్ డ్రైనేజీ నిర్మాణం పనులు మంగళవారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా నిర్మాణం పనులను కార్పొరేటర్ దొంత శ్రీనివాస్ పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ గత పాలకులను అనేక సార్లు అభివద్ధికి తోడ్పడాలని వినతి పత్రాలు అందజేయడం చేసినప్పటికీ నిధులు లేక అభివద్ధికి నోచుకోకపోవడంతో ప్రజలు అనేక ఇబ్బందులు పడ్డారని తెలిపారు. ప్రధాన సమస్య అయిన 5వ ఇంక్లైన్ ప్రధాన షాపింగ్ కాంప్లెక్స్ అండర్ గ్రౌండ్ డ్రైనేజీతో వర్షాకాలం నీళ్లు రోడ్లపైకి రావడంతో ప్రజలు అనేక ఇబ్బందులకు గురవుతున్నారని రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్‌కు తెలియజేయగా, వెంటనే 30లక్షల రూపాయల నిధులు మంజూరు చేసి యుద్ధ ప్రాతిపదికన పనులు చేయిస్తున్నారని తెలిపారు. ఈ సందర్భంగా రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్‌కు డివిజన్ ప్రజల పక్షాన కార్పొరేటర్ దొంత శ్రీనివాస్ కృతజ్ఞతలు తెలిపారు.

విద్యుదాఘాతంతో మేక మృతి

నవతెలంగాణ-రామగిరి



రామగిరి మండలం రత్నాపూర్ గ్రామానికి చెందిన మేడోకొండ మహేష్‌కు చెందిన మేక మంగళవారం విద్యుత్ ఘాతంతో మృతి చెందింది. మేకలను మేడిపల్లి శివారులోని కనవేన. సదానందం పొలం వద్ద మేపుతుండగా, అక్కడే ఉన్న ట్రాన్స్ఫార్మర్ వైరుకు విద్యుత్ సరఫరా కావడంతో మేక అక్కడికక్కడే మృతి చెందింది. దీని విలువ రూ. 20 వేలు ఉంటుందని యజమాని మహేష్ తెలిపారు.

మండల సోషల్ మీడియా ఇంచార్జ్‌గా గాండ్ల హరీష్

నవతెలంగాణ-జూలపల్లి



హరీష్ అభినందిస్తున్న సంఘ నాయకులు

మున్నూరు కాపు సంఘం జూలపల్లి మండల సోషల్ మీడియా ఇంచార్జ్‌గా అబ్బాపూర్ గ్రామానికి చెందిన గాండ్ల హరీష్‌ను నియమిస్తూ,మున్నూరు కాపు సంఘం తెలంగాణ రాష్ట్ర సోషల్ మీడియా ఇంచార్జ్ ఎర్రం సంజీవ్ నియామక పత్రాన్ని జారీ చేశారు. ఎర్రం సంజీవ్ మాట్లాడుతూ మున్నూరు కాపు సంఘ రైతులు, విద్యార్థుల సమస్యలపై, బీసీ రిజర్వేషన్ల పెంపుకు మున్నూరు కాపుల రాజ్యాధికారం కోసం చైతన్యం తీసుకురావాలని ఆయన సూచించారు. గాండ్ల హరీష్ మాట్లాడుతూ మండల సోషల్ మీడియా ఇన్చార్జిగా నియమించినందుకు రాష్ట్ర సోషల్ మీడియా ఇంచార్జ్ ఎర్రం సంజీవ్‌కి మున్నూరు కాపు యువత రాష్ట్ర అధ్యక్షులు బండి సంజీవ్ కుమార్‌కి, మున్నూరుకాపు సంఘం తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు వనమాల ప్రవీణ్‌కుమార్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు దండే వెంకటేశం, కొప్పుల మహేష్, పసునూటి శ్రీనివాస్, ఉన్నారు.

భగవద్గీత కంఠస్థ పోటీలలో సాయి శాన్విత ప్రతిభ

నవతెలంగాణ-మంథని



శాన్విత (ఫైల్)

మంథని పట్టణంలోని శ్రీపాద కాలనీకి చెందిన శైలజ సంతోష్‌ల పుత్రిక సనాత ధర్మ గీత ప్రచార సమితి ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయిలో నిర్వహించిన భగవద్గీత కంఠస్థ పోటీలలో మూడో బహుమతి శాన్విత కైవసం చేసుకుంది. ఇంటింటా భగవద్గీత 555 రోజులు నిర్వహించుకొని బుధవారం నిర్వహించే గీతా జయంతి కార్యక్రమాన్ని పురస్కరించుకొని శాన్వితకు సనాతన ధర్మ జీవిత ప్రచార సమితి ఆధ్వర్యంలో మంథని కాకతీయ హైస్కూల్లో సత్కరించనున్నారు.

తేమ శాతం వచ్చిన ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలి

అదనపు కలెక్టర్ డి.వేణు

నవతెలంగాణ-మంథని



మండలంలో కొనుగోలు కేంద్రాలలో తేమ శాతం వచ్చిన ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలని అదనపు కలెక్టర్ డి.వేణు ఆదేశించారు. మంగళ వారం అదనపు కలెక్టర్ డి.వేణు మంథని మండలంలోని పవర్ హౌస్ కాలనీ, అంగళూరు, గుంజ పడుగు, నాగారం గ్రామాలు, రామగిరి మండలంలో సుందిళ్ల గ్రామంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ డి.వేణు కొనుగోలు కేంద్రంలో ఉన్న ధాన్యం తేమ శాతాన్ని పరిశీలించారు. ధాన్యం తేమ శాతం రెగ్యూలర్‌గా చెక్ చేయాలని,17 శాతం తేమ రాగానే వెంటనే కొనుగోలు చేయాలని సంబంధిత అధికారులకు అదనపు కలెక్టర్ సూచించారు. ఈ పర్యటనలో అదనపు కలెక్టర్ వెంట జిల్లా పౌర సరఫరాల సంస్థ మేనేజర్ శ్రీకాంత్, జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి రాజేందర్, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

దశాబ్దాల కళ నెరవేరిన వేళ...

కోల్ కారిడార్ రోడ్డుకు వెలిగిన విద్యుత్ దీపాలు...

"జీఎం సారూ లైట్లు వేయరూ" కథనానికి స్పందన

నవతెలంగాణ-యైటింక్లయిన్ కాలనీ



గత దశాబ్ద కాలంగా సింగరేణి కార్మికులు, ప్రయాణికులు ప్రమాదాలకు గురవుతూ ఎదుర్కొంటున్న సమస్య ఎట్టకేలకు పరిష్కారం అయ్యింది. "జీఎం సారూ..లైట్లు వేయరు" అని నవతెలంగాణ ప్రచురించిన కథనానికి ఆర్జీ-2 అధికారులు స్పందించారు. 20 లక్షల రూపాయలతో 8వ కాలనీ నుండి ఆర్జీ-1,ఆర్జీ-3 అలాగే అల్లూరు గ్రామాన్ని ఆనుకొని విస్తరించిన కోల్ కారిడార్ రోడ్డుకు దాదాపుగా 70 సోలార్ లైట్లను బిగించింది.సోలార్ లైట్ల బిగింపుతో కార్మికులు రాత్రి బదిలీకి ఎదుర్కొంటున్న ఇబ్బందులు, ప్రయాణికుల ఇబ్బందుల దృష్ట్యా సమస్య పరిష్కరించిన అధికారులకు కార్మికులు,ప్రజలు కృతజ్ఞతలు తెలుపుతున్నారు.

సీఎం కప్ మండల స్థాయి క్రీడలు ప్రారంభం

నవతెలంగాణ-ముత్తారం:



పోటీలను ప్రారంభిస్తున్న ఎంపీడీవో సురేష్

ముత్తారం మండలంలోని జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో సీఎం కప్ మండల స్థాయి క్రీడా పోటీలు మంగళవారం ప్రారంభం అయ్యాయి. ఎంపీడీవో సురేష్ ముఖ్య అతిథిగా హాజరై క్రీడా పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడా రంగంలో మంచి భవిష్యత్ ఉంటుందని, ఆ దిశగా విద్యార్థులు చదువులతోపాటు క్రీడల్లో రాణించాలని అన్నారు. మండల స్థాయిలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన వారిని జిల్లా స్థాయికి ఎంపిక చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో ఓదెలు, ప్రధానోపాధ్యాయురాలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సంతోష్ కుటుంబానికి అండగా ఉంటాం

ఎన్ఆర్ఐ, వీహెచ్ఆర్ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు వ్యాళ్ల హరీష్ రెడ్డి

నవతెలంగాణ-గోదావరిఖని



అనారోగ్య కారణాలతో అకాల మరణం పొందిన రామగుండం కార్పొరేషన్ 40వ డివిజన్ గాంధీ నగర్‌లో నివాసముండే బండారి సంతోష్ కుటుంబానికి అండగా ఉంటామని ఎన్ఆర్ఐ, వీహెచ్ఆర్ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు వ్యాళ్ల హరీష్ రెడ్డి అన్నారు. సంతోష్ మరణంతో కుటుంబం పెద్ద దిక్కును కోల్పోయిందని పేర్కొన్నారు. క్రమశిక్షణ కలిగిన బీఆర్ఎస్ కార్యకర్త సంతోష్ మరణం ఆ కుటుంబానికి తీరని లోటని, వారి కుటుంబానికి ఇలాంటి ఇబ్బందికర పరిస్థితుల్లో అండగా నిలవాలనే ఉద్దేశ్యంతో ఆ చిన్నారులకు భవిష్యత్‌లో వారి విద్యకు ఖర్చయ్యే మొత్తంలో సంవత్సరానికి 50వేల రూపాయలు వీహెచ్ఆర్ ఫౌండేషన్ ద్వారా అందిస్తామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రామగుండం నియోజక వర్గ విహెచ్ఆర్ టీం సభ్యులతోపాటు బిఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

మృతుని కుటుంబానికి ఆర్థిక సహాయం

నవతెలంగాణ-ముత్తారం:



గత కొద్ది రోజుల క్రితం రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన ముత్తారం మండలం ఓడేడు గ్రామ పంచాయతీ పరిధి వెంకటేశ్వర్లపల్లికి చెందిన సుంచు రమేష్ కుటుంబానికి జెకె సీడ్ తిరుపతితోపాటు సీడ్ ఉద్యోగులు, స్నేహితులు అందరూ కలిసి సేకరించిన 21,500 రూపాయలను ఆర్థిక సహాయంగా అందజేశారు. మంగళవారం మృతుని భార్య శిరీష, కుమారుడు అశ్వద్ధామ, కూతురు అనుజ్ఞలకు చెక్కును అందజేశారు. కుటుంబానికి ఎల్లవేళలగా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.

రామగుండం రిక్రియేషన్ క్లబ్ నూతన కార్యవర్గం

నవతెలంగాణ-కోల్‌సిటి: రామగుండం పారిశ్రామిక ప్రాంతంలో సమాజ శ్రేయస్సు ఆశిస్తూ నూతనంగా రామగుండం రిక్రియేషన్ క్లబ్ ఏర్పడింది. రామగుండం రిక్రియేషన్ క్లబ్ నూతన కార్యవర్గ ఎన్నిక మంగళవారం గోదావరిఖని ఆర్కే గార్డెన్స్‌లో నిర్వహించారు. ఎన్నికల అధికారులుగా చింతల రాజిరెడ్డి, తూముల, రాజేశ్వరరావు వ్యవహరించారు. అధ్యక్షుడిగా బల్మూరి అమరేందర్ రావు, ఉపాధ్యక్షుడిగా పి విక్రమ సింహరావు, ప్రధాన కార్యదర్శిగా మంతెన శ్రీనివాస్, సహాయ కార్యదర్శిగా చెరుకు బుచ్చిరెడ్డి, కోశాధికారిగా తూముల అశోక్ రావు, ఆర్గనైజింగ్ సెక్రటరీగా నిట్టూరి జీవన్ బాబు, స్పోర్ట్స్ అండ్ కల్చరల్ సెక్రటరీగా చందుపట్ల తిరుపతిరెడ్డిలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

చదువుతోపాటు క్రీడల్లో రాణించాలి

ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం


సీఎం రిలీఫ్, కళ్యాణ లక్ష్మి చెక్కులను పంపించేస్తున్న ఎమ్మెల్యే మేడిపల్లి

నవతెలంగాణ - రామడుగు

ప్రతి విద్యార్థి చదువుతోపాటు క్రీడల్లో రాణించాలని చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అన్నారు. ఈ మేరకు మండల కేంద్రంలో సీఎం కప్ క్రీడా పోటీలు మంగళవారం ప్రారంభించి మాట్లాడారు. ప్రతి విద్యార్థి క్రీడల్లో పాల్గొని వారి నైపుణ్యతను చాటుకోవాలన్నారు. క్రీడలతో స్నేహభావం పెంపొందుతుందన్నారు. ప్రతి విద్యార్థి జాతీయస్థాయిలో రాణించి మండలానికి పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలని కోరారు. అనంతరం సీఎం రిలీఫ్ ఫండ్, కళ్యాణ్ లక్ష్మి చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో సంఘీ రాజేశ్వరి, తాసిల్దార్ వెంకటలక్ష్మి, మండల విద్యాధికారి అంబటి వేణు కుమార్, గోపాలరావుపేట మార్కెట్ కమిటీ చైర్పర్సన్ బొమ్మరివేని తిరుమల తిరుపతి ముదిరాజ్, కాంగ్రెస్ పార్టీ మండల శాఖ అధ్యక్షుడు జవాజి హరీష్ జిల్లా బీసీ సెల్ చైర్మన్ పులి ఆంజనేయులు గౌడ్, నాయకులు కోల రమేష్,ఉప్పుల అంజనీప్రసాద్, పంజాల శ్రీనివాస్ గౌడ్, తడగొండ హనుమంతు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.


పోటీలను ప్రారంభిస్తున్న ఎంఈవో

మండలస్థాయి సీఎం కప్ పోటీలు ప్రారంభం

నవతెలంగాణ - మానకొండూర్

మండలస్థాయి సీఎం కప్ పోటీలు దేవంపల్లి గురుకుల పాఠశాల మైదానంలో మంగళవారం ప్రారంభమయ్యాయి. ఈ పోటీలను మండల విద్యాధికారి మధుసూదనాచారి ప్రారంభించారు. పురుషులు, బాలురు విభాగాలలో కోకో, కబడ్డీ, వాలీబాల్ పోటీలు నిర్వహించారు. కోకోలో దేవంపల్లి ప్రథమ స్థానం, కొండపలకల ద్వితీయ స్థానం, కబడ్డీలో దేవంపల్లి ప్రథమ స్థానం, కొండపలకల ద్వితీయ స్థానం, వాలీబాల్‌లో దేవంపల్లి ప్రథమ స్థానం, వెల్ది ద్వితీయస్థానంలో గెలుపొందారు. ఈ కార్యక్రమంలో టోర్నమెంట్ ఆర్గనైజింగ్ సెక్రటరీ ఆర్.నర్సయ్య, ఆయా పాఠశాలల వ్యాయామ ఉపాధ్యాయులు, క్రీడాకారుల పాల్గొన్నారు.

ఉపాధి హామీ పనులపై సామాజిక తనిఖీ

నవతెలంగాణ - జమ్మికుంట

జమ్మికుంట మండలంలోని 20 గ్రామాలలో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో జరిగిన పనులపై సామాజిక తనిఖీ ప్రజావేదిక స్థానిక మండల పరిషత్ అభివద్ధి కార్యాలయం ఆవరణంలో మంగళవారం ఎంపీడీవో భీమేష్ అధ్యక్షతన నిర్వహించారు. 20గ్రామాలలో వచ్చిన నివేదిక ల ప్రకారం మండలం మొత్తం రికవరీ రూ.1,57,184 వచ్చింది. ఈ రికవరీ మొత్తం ఆయా సిబ్బంది నుండి రికవరీ చేస్తామని డీఆర్డీవో శ్రీధర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ పీడీ కృష్ణ, విజిలెన్స్ ఆఫీసర్ వేంకటేశ్వర రెడ్డి, ఎంపీడీవో భీమేష్, ఎస్ఆర్పీ సుశీల, ఇన్‌చార్జ్ ఏపీఓ లక్ష్మణ్ పాల్గొన్నారు.

మ్యాథ్స్ ఫోరం మండల అధ్యక్షుడిగా శ్రీనివాస్

నవతెలంగాణ - శంకరపట్నం



తెలంగాణ మ్యాథ్స్ ఫోరమ్ ఆధ్వర్యంలో మంగళవారం శంకరపట్నం మండల గణిత ఫోరం కమిటీని ఎన్నుకున్నారు. మండల ఫోరమ్ గౌరవ అధ్యక్షులుగా భూర సుభాష్, అధ్యక్షులుగా తాటిపాముల శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిగా కళ్లెం మహిపాల్ రెడ్డి, కోశాధికారి గా రామకష్ణ, ఉపాధ్యక్షులుగా కవిత, జిల్లా ప్రతినిధిగా అనుమోజు వెంకటేశ్వర్లు, ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా మండల విద్యాధికారి లక్ష్మీనారాయణ నూతన కమిటీకి అభినందనలు తెలిపారు.

హైనా దాడిలో గేదె దూడ మృతి

నవతెలంగాణ - చిగురుమామిడి :



మండలంలోని సుందరగిరి గ్రామంలో సోమవారం అర్ధరాత్రి హైనా దాడిలో గేదె దూడ మృతి చెందిన ఘటన చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన రైతు గైని చంద్రమౌళి సోమవారం సాయంత్రం తన వ్యవసాయ బావి వద్ద పశువులను పాకలో కట్టి, రోజువారీ పనులు ముగించుకొని ఇంటికి వెళ్లారు. అయితే, మంగళవారం వేకువజామున పాలు పితకడానికి వచ్చిన రైతు దూడను గుర్తు తెలియని క్రూర మృగం చంపి తిన్న ఘటనను చూసి భయాందోళనకు గురయ్యారు. చంద్రమౌళి ఈ విషయాన్ని అటవీ శాఖ అధికారులకు తెలపగా, బీట్ ఆఫీసర్ ఘటనా స్థలానికి వచ్చి పరిశీలించారు. హైనా దాడి కారణంగానే దూడ మృతి చెందినట్లు బీట్ ఆఫీసర్ ధృవీకరించారు.ఈ ఘటనపై గ్రామస్తులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తూ, దూడను కోల్పోయిన రైతు చంద్రమౌళికి ప్రభుత్వ సహాయం అందించాలని విజ్ఞప్తి చేశారు.

అన్నదాత ట్రస్ట్‌కు విరాళం అందజేత

నవతెలంగాణ - చొప్పదండి



చొప్పదండిలోని శ్రీ వెంకటేశ్వర మణికంఠ ఆలయ, అన్నదాత ట్రస్ట్ ఏర్పాటుకు చొప్పదండి పట్టణానికి, చెందిన భీమనాతిని సరస్వతి-వెంకట నరసయ్య, కుమారుడు రాజు కుటుంబ సభ్యులు, రూ.18,018ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ అధ్యక్షులు బొడిగె వెంకటేష్, ప్రధాన కార్యదర్శి చేపూరి సత్యనారాయణ, కోశాధికారి దండే సత్యానందం, ఉపాధ్యక్షులు మునిగాల సుధాకర్, మల్లేశం, స్వాములు పాల్గొన్నారు.

వరి కొయ్యలు కాల్చొద్దు

నవతెలంగాణ - చొప్పదండి



మండలంలోని గుమ్లాపూర్, రాగంపేట, భూపాలపట్నం, చొప్పదండి గ్రామాలలోని రైతులకు మంగళవారం వ్యవసాయ విస్తారణ అధికారులు, వరి కోసిన కొయ్యకాలు కాల్చవద్దని అవగాహన కల్పించారు. దీనివలన పోషకలోపాలు, వాయు కాలుష్యం పెరగడం, పంటకు మేలు చేసే సూక్ష్మజీవులు చనిపోవడం, తద్వారా పంట దిగుబడి తగ్గిపోతుందని, రైతులకు వివరించారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారులు రమ్య జ్యోత్స్న, సాయి ప్రసన్న, రాజశేఖర్, సంపత్ రైతులు పాల్గొన్నారు.

మ్యాథ్స్ టాలెంట్ టెస్ట్‌లో

మోడల్ స్కూల్ విద్యార్థుల ప్రతిభ

నవతెలంగాణ - శంకరపట్నం



మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ హై స్కూల్‌లో టీయంఎఫ్ తెలంగాణ మ్యాథ్స్ ఫోరం ఆధ్వర్యంలో గణిత శాస్త్ర పితామహుడు మహనీయుడు శ్రీ శ్రీనివాస రామానుజన్ జయంతి సందర్భాన్ని పురస్కరించుకొని, మ్యాథ్స్ టాలెంట్ టెస్ట్‌లు మండల, జిల్లా, రాష్ట్రస్థాయి పోటీలు నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా జిల్లా పరిషత్ హై స్కూల్‌లో మండల స్థాయి టాలెంట్ టెస్టులు నిర్వహించగా, మోడల్ స్కూల్ విద్యార్థులు తాళ్ల జయశ్రీ, ప్రథమ స్థానంలో డి.నాగచైతన్య, ద్వితీయ స్థానాల్లో నిలిచారని, విద్యార్థులు ఈనెల 15న కరీంనగర్ జిల్లాలో జరిగే జిల్లాస్థాయి పోటీలలో పాల్గొంటారని తమ పాఠశాల నుంచి మండల స్థాయి పోటీల్లో బహుమతి పొంది జిల్లా స్థాయికి ఎంపికైన విద్యార్థులను మంగళవారం మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ సరిత అభినందించారు. ఈ కార్యక్రమంలో మ్యాచ్ ఉపాధ్యాయులు ఎస్ రజిత, ఆర్ రజిత, స్వప్న పాల్గొన్నారు.

పత్తి క్వింటాల్‌కు గరిష్ట ధర రూ.7,150

నవతెలంగాణ - జమ్మికుంట

జమ్మికుంట వ్యవసాయ మార్కెట్‌కు కాటన్ విడి పత్తి మంగళవారం 235క్వింటాళ్లు 26వాహనాలలో రైతులు విక్రయానికి తీసుకురాగా గరిష్ట ధర రూ.7,150, మోడల్ రూ.7వేలు, కనిష్ట రూ.6,700 పలికింది. అలాగే కాటన్ బ్యాగ్స్‌లలో తొమ్మిది క్వింటాళ్లు ఏడుగురు రైతులు విక్రయానికి తీసుకురాగా గరిష్ట ధర రూ.6,600, మోడల్ రూ.6,500, కనిష్ట రూ.6,000 పలికిందని మార్కెట్ సెక్రటరీ ఆర్ మల్లేశం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

పేదల డిమాండ్లపై స్పందించాలి

- ధర్మసమాజ్ రిలే నిరాహార దీక్షలు ప్రారంభం
- విద్య, వైద్యం, ఉపాధి, ఇల్లు, భూమి డిమాండ్ల సాధనకు చిగురుమామిడి మండల కేంద్రంలో నిరసన


నవతెలంగాణ పేపర్ చదువుతున్న నాయకులు

నవతెలంగాణ - చిగురుమామిడి :

పేద ప్రజల న్యాయమైన డిమాండ్లపై ప్రభుత్వం స్పందించాలని డిమాండ్ చేస్తూ ధర్మసమాజ్ పార్టీ ఆధ్వర్యంలో చిగురుమామిడి మండల కేంద్రంలోని బస్టాండ్ వద్ద రిలే నిరాహార దీక్షలు మంగళవారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ధర్మసమాజ్ పార్టీ జిల్లా అధ్యక్షులు తాళ్ళ నరేష్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో బీసీ, ఎస్సీ, ఎస్టీ, ఈబీసీ పేదలందరికీ ప్రాథమిక అవసరాలు అందించడంలో ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. విద్య, వైద్యం, ఉపాధి, ఇల్లు, భూమి వంటి ఐదు ప్రధాన డిమాండ్ల సాధన కోసం గత నెల నవంబర్ 20న తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశామని, కానీ ఇప్పటివరకు ఎలాంటి స్పందనా రాలేదని తెలిపారు. డీఎస్పీ పార్టీ ప్రభుత్వం ముందు పలు డిమాండ్లను ముందుకు పెట్టిందని వాటిలో ప్రతి గ్రామంలో సౌకర్యవంతమైన స్కూల్స్, కాలేజీలు, ఆస్పత్రులు నిర్మించాలి. యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలి. అర్హులైన వారికి ఎకరం భూమి అందించాలి. 200గజాల్లో నాలుగు గదుల ఇల్లు నిర్మించాలి. నిత్యావసర సేవలకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. ఈ ఐదు డిమాండ్లపై ప్రభుత్వం స్పందించే వరకు ప్రజలతో కలిసి నిరసనలను కొనసాగిస్తామని స్పష్టం చేశారు. రిలే నిరాహార దీక్షలకు నాయి బ్రాహ్మణ సంఘం మండల కోశాధికారి నీలికొండ బిక్షపతి సహా పలువురు సంఘీభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ధర్మసమాజ్ పార్టీ మండల నాయకులు జిల్లాల నవీన్, సురేష్, ఏనగందుల అనిల్ కుమార్, మాతంగి అనిల్, మేకల లింగయ్య పాల్గొన్నారు.

జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి ఆకస్మిక తనిఖీ


మెడికల్ షాప్‌లో తనిఖీ నిర్వహిస్తున్న డీఎంహెచ్‌ఓ

నవతెలంగాణ - జమ్మికుంట

జమ్మికుంట పట్టణంలోని సివిల్ ఆసుపత్రి, మండలంలోని వావిలాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని మంగళవారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ వెంకటరమణ, డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ చందుతో కలిసి తనిఖీ చేసి, ఫార్మసీ రూమ్, లేబర్ రూమ్,ల్యాబ్‌లను పరిశీలించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో మాట్లాడుతూ ఎన్‌సీడీ క్లినిక్స్‌ను పగడ్బందీగా నిర్వహించాలని, అందులో ఎన్‌సిడి పరీక్షలు హైపర్ టెన్షన్, డయాబెటిస్, బ్రెస్ట్ క్యాన్సర్, ఓరల్ క్యాన్సర్ సర్వైకల్ క్యాన్సర్ వంటి పరీక్షలు నిర్వహించాలన్నారు. లెప్రసి సర్వేను ఆశా కార్యకర్తలు ప్రతి గ్రామంలో విధిగా నిర్వహించి, ప్రాథమిక దశలో గుర్తించాలని ఆదేశించారు. టిబి నిక్షయ్ శిబిర్ 100 రోజుల ప్రణాళికలలో గ్రూప్ సమావేశాలు, కమ్యూనిటీ సమావేశాలు, పేషెంట్ ప్రొవైడర్ సమావేశాలు, నిక్షయ్ వాహన్ రోజు ఏసి ఎఫ్‌క్యాంపు పెట్టి స్పూటం శాంపిల్స్ సేకరించాలని అన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో సాధారణ ప్రసవాలు జరిగేలా చూడాలని, సాధారణ ప్రసవాలను ప్రోత్సహించాలని, సిజేరియన్ ఆపరేషన్ లను అవసరం మేరకు నిర్వహించాలని ఏబిహెచ్‌ఎ కార్డ్స్‌ను ఇంప్రూవ్ చేయాలన్నారు. సిబ్బంది సమయపాలన పాటించాలని, విధుల్లో అలసత్వం ప్రదర్శిస్తే క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో జమ్మికుంట సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీకాంత్ రెడ్డి వావిలాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ రాజేష్, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ శ్యాం కుమార్, హెల్త్ ఎడ్యుకేటర్స్ పంజాల ప్రతాప్ గౌడ్, మోహన్ రెడ్డి, సూపర్వైజర్ కుసుమ కుమారి, ఫార్మసిస్ట్ శ్రీధర్, స్టాఫ్ నర్స్‌సాయి పాల్గొన్నారు.

మండల స్థాయి సీఎం కప్ క్రీడోత్సవాలు ప్రారంభం

నవతెలంగాణ - జమ్మికుంట :జమ్మికుంట పట్టణంలోని బాలుర జెడ్పీహెచ్‌ఎస్ పాఠశాల మైదానంలో మంగళవారం మండల స్థాయి సీఎం కప్ క్రీడోత్సవాలు ప్రారంభమయ్యాయి. డిసెంబర్ 12 వరకు క్రీడోత్సవాలు కొనసాగుతాయని ఎంపీడీవో భీమేష్, మండల ఎస్‌జిఎఫ్ సెక్రెటరీ వీర్ల శ్రీలత తెలిపారు. ఈ సీఎం కప్‌లో కబడ్డీ, కోకో, వాలీబాల్, అథ్లెటిక్స్, యోగ, ఫుట్ బాల్ పిలిడా పోటీలు నిర్వహిస్తామన్నారు. ఈ క్రీడలు పురుషులు, మహిళలు, బాలురు, బాలికలకు వేరువేరుగా నిర్వహిస్తున్నామన్నారు. ఈ క్రీడలు మండల ఎస్జీఎఫ్ సెక్రటరీ శ్రీలత ఆధ్వర్యంలో జరుగుతున్నాయి. డిసెంబర్10న మంగళవారం ఖో..ఖో...కబడ్డీ, డిసెంబర్11న అథ్లెటిక్స్ వాలీబాల్, డిసెంబర్ 12న ఫుట్‌బాల్, యోగా నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జమ్మికుంట తహసీల్దార్ రమేష్ బాబు, ఎంపీడీవో భీమేష్, మున్సిపల్ కమిషనర్ మహమ్మద్ ఆయాజ్, ఎంఈఓ హేమలత, జెడ్పీహెచ్‌ఎస్ బాయ్స్ ప్రధానోపాధ్యాయుడు నల్లగొండ సదానందం పీడీలు, డీటీలు, క్రీడాకారులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్వీ ఆధ్వర్యంలో తెలంగాణ తల్లి చిత్రపటానికి పాలాభిషేకం


తెలంగాణ తల్లి చిత్ర పటానికి పాలాభిషేకం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు


గన్నేరువరం: తెలంగాణ తల్లి విగ్రహానికి పాలాభిషేకం చేస్తున్న మాజీ ఎమ్మెల్యే



చిగురుమామిడి: తెలంగాణ తల్లి విగ్రహానికి పాలాభిషేకం చేస్తున్న నాయకులు

నవతెలంగాణ - జమ్మికుంట

జమ్మికుంట పట్టణంలోని అమరవీరుల స్థూపం వద్ద బీఆర్ఎస్వీ ఆధ్వర్యంలో తెలంగాణ తల్లి చిత్రపటానికి మంగళవారం పాలాభిషేకం చేశారు. బీఆర్ఎస్వీ రాష్ట్ర అధ్యక్షులు గెల్లు శ్రీనివాస్ యాదవ్ సూచనల మేరకు జమ్మికుంట పట్టణంలోని అమరవీరుల స్థూపం వద్ద నివాళులు అర్పించి, తెలంగాణ తల్లి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్వీ నాయకులు మాట్లాడారు. తెలంగాణ తల్లినే మార్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా పాలన అని చెప్పుకునే ప్రభుత్వం ప్రజల ఆకాంక్షలను నిర్వీర్యం చేసే దిశగా పాలన కొనసాగిస్తుందన్నారు. లక్షల మంది ఆడపడుచులను అగ్రగామిలో నిలుపాలని ఆలోచనతో ఉన్న తెలంగాణ రాష్ట్రంలో బీదరికానికి నిదర్శనంగా తెలంగాణ తల్లి విగ్రహాన్ని తీర్చేదిద్దడంపై తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. తెలంగాణ ఆడపడుచులకు అత్యంత కీలకమైన పండుగ బతుకమ్మ పండుగ అలాంటి బతుకమ్మను చిహ్నాన్ని లేకుండా చేయడం పట్ల ప్రభుత్వానికి మహిళలపై ఉన్న చిన్న చూపుకి నిదర్శనంగా భావించాలన్నారు. తల్లిని కొలిచే విధంగా ఉండాలి అంతేగాని దయనీయస్థితిలో తల్లి విగ్రహం ఉండడం పట్ల యావత్ సమాజం సిగ్గుతో తలదించుకుంటుందని తెలిపారు. అందుకోసమే మంగళవారం మా తల్లికి జరిగిన అవమానాన్ని నిరసిస్తూ పాలాభిషేకం చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్వీ రాష్ట్ర కార్యదర్శి హరీష్ వర్మ అప్పని, జావాజీ అనిల్ వొల్లాల శ్రీకాంత్, కెన్ని, చింతల కౌశిక్, కాట్రేవుల అజయ్, పాతకాల అజయ్, ప్రవీణ్, అరవింద్ పాల్గొన్నారు.

చిగురుమామిడి :తెలంగాణ తల్లి విగ్రహాన్ని మార్చడం కాంగ్రెస్ మూర్ఖత్వమని బీఆర్ఎస్ సీనియర్ నాయకులు కొత్త శ్రీనివాస్ రెడ్డి అన్నారు. ఇది ముమ్మాటికీ తెలంగాణ అస్తిత్వాన్ని దెబ్బతీయడమేనన్నారు. చిహ్నాలు, విగ్రహాలను ప్రజాభీష్టం లేకుండా మార్చడాన్ని వ్యతిరేకిస్తూ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు హుస్నాబాద్ మాజీ శాసనసభ్యులు వొడితల సతీశ్ కుమార్ ఆదేశాలతో పార్టీ చిగురుమామిడి మండల అధ్యక్షుడు మామిడి అంజయ్య ఆధ్వర్యంలో మండలంలోని చిన్న ముల్కనూరులోగల తెలంగాణ తల్లి విగ్రహానికి మంగళవారం క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన శ్రీనివాస్ రెడ్డి మాట్లాడారు. ఓ చేతిలో బతుకమ్మ మరో చేతిలో పంటల సిరులు, శిరస్సుపై కిరీటం, మోమున చిరునవ్వు రాజసం ఒలికే నిలకడ, దైవత్వం ఉట్టిపడే కాంతివంతమైన మోము, కరుణ కురిసే కళ్లు, తెలంగాణ ప్రజల దర్పం కనపర్చే ఠీవి వంటి కలగలిసిన అపరంజి తల్లి విగ్రహాన్ని కాదని మరో రూపంలో విగ్రహాన్ని ఆవిష్కరించడం దారుణమన్నారు. చేతిలో బతుకమ్మ లేకుంటే తెలంగాణ చరిత్ర, సంస్కృతి నుంచి బతుకమ్మను శాశ్వతంగా తొలగించడమే అవుతుందన్నారు. కాంగ్రెస్ ఆవిష్కరించిన తెలంగాణ తల్లి రూపం కాంగ్రెస్ తల్లిలా ఉందన్నారు. ఏడాది పాలనలో ఏమీ చేయకుండానే విజయోత్సవాలు నిర్వహించుకోవడం కాంగ్రెస్‌కే చెల్లిందన్నారు. నమ్మించి ఓట్లు వేయించుకున్న కాంగ్రెస్ ప్రభుత్వం మాటలు తప్ప చేసిందేమీ లేదని స్పష్టం చేశారు. కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్ జంగ రమణారెడ్డి, రైతు సమన్వయ సమితి జిల్లా కమిటీ మాజీ సభ్యుడు సాంబారి కొమురయ్య, సింగిల్ విండో వైస్ చైర్మన్ కరివేద మహేందర్ రెడ్డి, పార్టీ ప్రచార కార్యదర్శి బెజ్జంకి రాంబాబు, పెసరి రాజేశం, నాయకులు నాగెల్లి రాజిరెడ్డి, మండల నాయకులు దుడ్డెల లక్ష్మీనారాయణ, గ్రామశాఖ అధ్యక్షులు బుర్ర తిరుపతి, ఆకవరం మఠంశివప్రసాద్, గీట్ల తిరుపతి రెడ్డి, శ్రీనివాస్, బోయిని రమేశ్, నారాయణ, మాజీ సర్పంచులు సన్నీళ్ల వెంకటేశం, ముప్పిడి నర్సింహా రెడ్డి, బోయిని శ్రీనివాస్ నాయకులు ముప్పిడి రాజిరెడ్డి, సదానందం, సారంపాగణి, నారాయణ, కొమురయ్య పాల్గొన్నారు.



మానకొండూర్: కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణతల్లి విగ్రహాన్ని రూపుమార్చి ప్రతిష్ఠించడాన్ని వ్యతిరేకిస్తూ మంగళవారం మండల కేంద్రంలో బీఆర్ఎస్ నాయకులు తెలంగాణతల్లి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు గడ్డం నాగరాజు, బీఆర్ఎస్ మండల అధ్యక్షులు శేఖర్‌గౌడ్,గ్రామశాఖ అధ్యక్షులు పిట్టల మధు, సీనియర్ నాయకులు గోపాల్ రెడ్డి, శాతరాజు యాదగిరి, ఎరుకల శ్రీనివాస్ గౌడ్, ఈశ్వర్‌రెడ్డి, రుద్రారం శ్రీనివాస్, నెల్లి శంకర్, దండబోయిన శేఖర్, గడ్డం సంపత్, సందీప్ పాల్గొన్నారు.

గన్నేరువరం :రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ తల్లి విగ్రహ రూపురేఖలను మార్చడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నానని మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో బీఆర్ఎస్ శ్రేణులతో కలిసి తెలంగాణ తల్లి విగ్రహానికి పాలాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ సాధనకై జరిగిన పోరాటంలో భాగంగా మేధావులు, కళాకారులు కలిసి ఏర్పాటుచేసిన తెలంగాణ తల్లి నమూనాను మార్చడం శోచనీయమన్నారు. తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలకు ప్రతీక అయిన బతుకమ్మను తెలంగాణ తల్లి చేతిలో నుండి తీసివేయడం, కిరీటాన్ని తొలగించడం తగదని, ఇప్పటికైనా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పునఃసమీక్ష జరుపుకొని యథావిధిగా తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. నియోజకవర్గంలో ఏడాదికాలంగా జరిగిన అభివృద్ధి పనులపై త్వరలోనే శ్వేత పత్రం విడుదల చేస్తామని, ఇచ్చిన హామీలను నెరవేర్చే వరకు గ్రామ గ్రామాన పోరాటం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు గంప వెంకన్న, మాజీ జెడ్పీటీసీలు మాడుగుల రవీందర్‌రెడ్డి, సిద్ధంవేణు, మహేందర్ రెడ్డి నాయకులు పాల్గొన్నారు.

రైతులకు ఎలాంటి సమస్యలున్నా తెలపాలి

నవతెలంగాణ - రామడుగు


తనిఖీ చేస్తున్న ఏఎంసీ ఛైర్మన్ బొమ్మరవేని తిరుమల తిరుపతి ముదిరాజ్

రైతులకు ఎలాంటి సమస్యలున్నా తెలియపరచాలని ఏఎంసీ చైర్పర్సన్ బొమ్మరవేని తిరుమల తిరుపతి మండలంలోని రైతులకు సూచించారు. వెలిచాల పరిధిలోని కావేరి జిన్నింగ్ మిల్,సిసిఐ కొనుగోలు కేంద్రాన్ని మంగళవారం తనిఖీ చేసి మాట్లాడారు. ఈ సందర్భంగా సీసీఐ పత్తి కొనుగోలు సెంటర్లోని మ్యాచర్ యంత్రాన్ని, పరీక్షించి, పత్తిని సిసిఐకే. గవర్నమెంట్ కేటాయించిన మద్దతు ధరకు అమ్ముకోవాలని రైతులకు సూచించారు.ప్రైవేటు దళారులకు, అమ్మి, రైతులు నష్టపోకూడదని, పేర్కొన్నారు.

నిత్యాన్నదానానికి రెండు సంవత్సరాలు

నవతెలంగాణ - జమ్మికుంట


అన్నదానం చేస్తున్న అన్నపూర్ణ సేవా సమితి సభ్యులు

జమ్మికుంట పట్టణంలోని శ్రీ విశ్వేశ్వర స్వామి దేవాలయం బొమ్మల గుడి లో గత రెండు సంవత్సరాలనుండి అన్నపూర్ణ సేవా సమితి ఆధ్వర్యంలో నిత్యాన్నదానం జరుగుతుంది. ఈనెల 12 నాటికి రెండు వసంతాలు పూర్తి అయిన సందర్భంగా మంగళవారం మహా అన్నదాన కార్యక్రమాన్ని శివాలయంలో నిర్వహించారు. మాకు ఈ రెండు సంవత్సరాల కాలంలో నిత్యాన్నదానానికి సహకరించిన దాతలకు పేరుపేరునా, ఈ రెండు సంవత్సరాల కాలంలో బొమ్మల గుడి అభివృద్ధికి సహకరించిన దేవాలయం ట్రస్టీలైన కొండూరు వారి కుటుంబ సభ్యులకు, దాతలకు అన్నపూర్ణ సేవా సమితి తరపున కృతజ్ఞతలు తెలిపారు.

శ్రీనివాస్‌కు డాక్టరేట్

నవతెలంగాణ - జమ్మికుంట



మైక్రోబయాలజీ శాస్త్ర విభాగంలో పరిశోధన అభ్యర్థిగా పనిచేస్తున్న మ్యాధర శ్రీనివాస్‌కు ఉస్మానియా యూనివర్సిటీ డాక్టరేట్ డిగ్రీని ప్రకటించింది. శ్రీనివాస్ జీర్ణాశయంలోని బ్యాక్టీరియా సమూహంపై జన్యుల ప్రభావం అనే అంశంపై వివిధ జాతుల ఎలుకలపై జాతీయ పోషకాహార సంస్థ (ఐసిఎంఆర్-ఎన్ఐఎన్)లో ప్రముఖ శాస్త్రవేత్త డాక్టర్ కే రాజేంద్రరావు ఆధ్వర్యంలో పరిశోధన చేసినందుకు మైక్రో బయాలజీ డిపార్ట్మెంట్ ఉస్మానియా యూనివర్సిటీ డాక్టరేట్ ప్రదానం చేసింది. శాలపల్లి గ్రామానికి చెందిన మ్యాధర ప్రభాకర్-ప్రమీల దంపతుల రెండో కొడుకు శ్రీనివాస్. జమ్మికుంట గవర్నమెంట్ డిగ్రీ కళాశాలలో బీఎస్సీ డిగ్రీ పూర్తి చేసి పీజీ హైదరాబాద్ చేసి, ప్రస్తుతం శ్రీనివాస్ జాతీయ పోషకాహార సంస్థలో టెక్నికల్ ఆఫీసర్‌గా ఉద్యోగం చేస్తున్నాడు. శ్రీనివాస్ డాక్టరేట్ పొందినందుకు జమ్మికుంట మాజీ జెడ్పీటీసీ డాక్టర్ శ్రీరామ్ శ్యామ్, అప్పటి జమ్మికుంట లెక్చరర్ ప్రొఫెసర్ బత్తిని చంద్రమౌళి, ఎన్‌సీసీ పూర్వ క్యాడెట్స్ మిత్రులు, శ్రేయోభిలాషులు అభినందనలు తెలిపారు.

అభివృద్ధి కార్యాలయంలో నిధుల కొరత

బీరువాను బండలతో నిలబెట్టిన దుస్థితి

నవతెలంగాణ - జమ్మికుంట



జమ్మికుంట మండల పరిషత్ అభివృద్ధి కార్యాలయంలో కార్యాలయ నిర్వహణకు డబ్బులు లేవట. వైట్ షీట్స్ కావాలన్నా ఇంకొకరిపై ఆధారపడవలసిన దుస్థితి నెలకొని ఉండడం బాధాకరం. చిన్నచిన్న స్టేషనరీ వస్తువులకు పంచాయతీ సెక్రెటరీలను అడగాల్సి వస్తోందని అధికారులు తలలు పట్టుకుంటున్నారు. ఈ విషయంపై ఎంపీడీవో భీమేష్‌ను అడగగా కార్యాలయ విద్యుత్ బిల్లులు 60వేల వరకు ఉందని, వాటిని కూడా కట్టలేని పరిస్థితి ఉందన్నారు. కార్యాలయ నిర్వహణకు కూడా ఒక పైసా కూడా రావట్లేదని ఆవేదన వ్యక్తం చేశారు.

స్నేహితుల ఔదార్యం

- రూ.52 వేల ఫిక్స్‌డ్ డిపాజిట్
- 10వ తరగతి బ్యాచ్ స్నేహితుల సహాయం
- మృతుని కుటుంబానికి భరోసా



స్నేహితుని కుటుంబానికి ఫిక్స్ డిపాజిట్ బాండ్ అందజేస్తున్న స్నేహితులు

నవతెలంగాణ - చిగురుమామిడి :

మండల కేంద్రంలో ఇటీవల మరణించిన గూడెం రాజు కుటుంబానికి అతని పదవ తరగతి (1989-90) బ్యాచ్ స్నేహితులు ఆర్థిక సాయం అందజేసి ఔదార్యాన్ని చాటారు. మంగళవారం జరిగిన ఈ కార్యక్రమంలో స్నేహితులు కలిసి రూ.52,000 విలువైన ఫిక్స్‌డ్ డిపాజిట్‌ను రాజు భార్య గూడెం లక్ష్మికి అందించారు. మృతుడు రాజుకు వృద్ధ తల్లిదండ్రులు, ఒక కుమార్తె, కుమారుడు ఉన్నారు. రాజు అందరితో కలివిడిగా ఉండడంతో.. స్నేహితులు అతని కుటుంబానికి అండగా నిలబడ్డారు. రాజు కుటుంబానికి భవిష్యత్తులో ఎలాంటి అవసరం వచ్చినా తమ వంతు సహాయాన్ని అందిస్తామని స్నేహితులు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఆకవరపు శివప్రసాద్, నిలికొండ రమేష్, డాక్టర్ తిరుపతి, గడ్డం భాస్కర్ రెడ్డి, వేముగంటి ప్రవీణ్, స్వతంత్ర చారి, దుబాయ్ రాజయ్య, నల్లాల రాములు, పోగుల రమేష్, పీచు రాజిరెడ్డి, మధుసూదన్, పన్యాల లక్ష్మి, అనిత, గడ్డం విజయ, పద్మ, జమున, బాల కొమురయ్య పాల్గొన్నారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం

చొప్పదండి మార్కెట్ చైర్మన్ కొత్తూరి మహేష్


సీఎం కప్ క్రీడా పోటీలను ప్రారంభిస్తున్న మార్కెట్ చైర్మన్, ప్రత్యేక అధికారి

నవతెలంగాణ - చొప్పదండి

క్రీడలతో మానసిక ఉల్లాసం కలిగిస్తాయని, చొప్పదండి మార్కెట్ చైర్మన్ కొత్తూరి మహేష్, మండల ప్రత్యేక అధికారి తిరుపతి రావులు అన్నారు. చొప్పదండి మండల కేంద్రంలోని, జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో, మంగళవారం సీఎం కప్ ఆటల పోటీలను హాజరై ప్రారంభించారు. ఈ పోటీలు రెండు రోజులు ఉంటాయని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో వేణు గోపాలరావు, మండల విద్యాధికారి దీక్షితులు శ్రీనివాస్, ఎస్సై గొల్లపల్లి అనూష, కాంగ్రెస్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కోమటిరెడ్డి పద్మాకర్ రెడ్డి, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఇప్ప శ్రీనివాసరెడ్డి, పట్టణ అధ్యక్షులు నిజానపురం చందు, ఇప్పనపల్లి సాంబయ్య, పెరుమండ్ల గంగయ్య పాల్గొన్నారు.

20క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత


నవతెలంగాణ - జమ్మికుంట

మండలంలోని వెంకటేశ్వర్ల పల్లి గ్రామంలో 20క్వింటాళ్ల రేషన్ బియ్యం డంపును పౌర సరఫరా అధికారులు, పోలీసులు మంగళ వారం పట్టుకున్నారు. బ్లూ కోట్ సిబ్బంది అక్రమ డంప్‌ను గమనించి, రెవెన్యూ సిబ్బందికి సమాచారం ఇచ్చారు. పోలీసులు రేషన్ బియ్యం ఉన్నచోటికి చేరుకోగానే అక్రమ దందా నిర్వాహకులు అక్కడి నుండి పరారయ్యారు. కొంతకాలం నుంచి ఈ రేషన్ బియ్యం దందా ఈ ప్రాంతం నుంచి కొనసాగుతోందని స్థానికులు చెప్పారు. సంబంధిత అధికారుల కనుసన్నల్లోనే ఈ దందా కొనసాగుతోందని సమాచారం.

బిజినెస్

ద్రవ్యోల్బణం, వృద్ధి సమతూల్యత పెద్ద సవాల్

- సైబర్ మోసాల కట్టడిపై దృష్టి పెట్టాలి : ఆర్బీఐ గవర్నర్ శక్తికాంత దాస్
- ప్రధానీ, ఆర్థిక మంత్రికి ధన్యవాదాలు
- ఆరేండ్ల తర్వాత విరమణ



న్యూఢిల్లీ : రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) గవర్నర్‌గా ఆరేండ్ల పూర్తి చేసిన శక్తికాంత దాస్ మంగళవారం పదవీ విరమణ చేశారు. చివరి రోజు సందర్భంగా ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ద్రవ్యోల్బణం, వృద్ధి, సైబర్ మోసాలు ఆర్బీఐ ముందున్న ప్రధాన సవాళ్లని అన్నారు. సైబర్ సెక్యూరిటీ సవాళ్లను ఎదుర్కోవడానికి కొత్త సాంకేతికతలను ఉపయోగించడంపై దృష్టి సారించాలని సూచించారు. ద్రవ్యోల్బణం, వృద్ధి మధ్య సమతుల్యతను పునరుద్ధరించడం అత్యంత ముఖ్యమైన అంశమని అన్నారు. నాలుగేండ్లలో అత్యంత వేగంగా కూరగాయల ధరలు పెరగడంతో అక్టోబర్‌లో రిటైల్ ద్రవ్యోల్బణం సూచీ 6.21 శాతానికి చేరి 14నెలల గరిష్ఠ స్థాయి వద్ద నమోదయ్యిందని గుర్తు చేశారు. పదవీ విరమణ సందర్భంగా ప్రధాని మోడీ, ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌కు ఎక్స్‌లో శక్తికాంత ధన్యవాదాలు తెలిపారు. ఇంతకాలం తనకు మద్దతుగా నిలిచిన ప్రతీ ఒక్కరికి కృతజ్ఞతలు చెప్పారు. తనకు అవకాశం కల్పించిన ప్రధాని మోడీ మార్గదర్శకం, ప్రోత్సాహం మరువలేనిదన్నారు. ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్‌కు హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. అదే విధంగా ఆర్థిక మంత్రిత్వశాఖ, ఆర్బీఐల మధ్య సమన్వయం అత్యుత్తమంగా ఉందన్నారు. అసాధారణమైన పరిస్థితులను ఎంతో విజయవంతంగా ఎదుర్కొన్నామన్నారు. విశ్వాసం, విశ్వసనీయత సంస్థగా ఆర్బీఐ ఎదగాలని ఆకాంక్షించారు. నూతన గవర్నర్‌గా బాధ్యతలు చేపట్టనున్న సంజయ్ మల్హోత్రా అపారమైన అనుభవం కలిగి ఉన్నారన్నారు. ఆర్బీఐ కార్యకలాపాలను సమర్థవంగా నడిపించగలరని ఆశాభావం వ్యక్తం చేశారు.

రెడ్‌మీ నోట్ 14 సిరీస్ ఆవిష్కరణ

న్యూఢిల్లీ : ప్రముఖ స్మార్ట్‌ఫోన్ల కంపెనీ రెడ్‌మీ భారత్‌లో తమ నోట్ 14 సిరీస్‌ను విడుదల చేస్తున్నట్లు ప్రకటించింది. ఇందులో తొలుత రెడ్‌మీ నోట్14 ప్రో ప్లస్5జి, రెడ్మీ నోట్ 14 ప్రో, రెడ్మీ నోట్ 14 పేర్లతో మూడు వేరియంట్లను ఆవిష్కరించింది. వీటి ధరల శ్రేణీ రూ.17,999 నుంచి రూ.34,999గా ప్రకటించింది.

క్విక్ కామర్స్‌లోకి అమెజాన్

బెంగళూరు : ప్రముఖ ఇ-కామర్స్ సంస్థ అమెజాన్ ఇండియా కూడా క్విక్ కామర్స్ సేవల్లోకి ప్రవేశిస్తున్నట్లు ప్రకటించింది. ఈ నెలాఖరులోనే బెంగళూరులో తొలుత ఈ సేవలను ప్రారంభించనున్నామని ఆ సంస్థ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ అమిత్ అగర్వాల్ తెలిపారు. 15 నిమిషాల్లోనే డెలివరీ అందించగల క్విక్‌కామర్స్ సేవల్లో భాగంగా 1,000-2,000 ఉత్పత్తులు డెలివరీలు చేయడానికి సిద్ధంగా ఉన్నామన్నారు. ఈ పైలట్ ప్రాజెక్టు విజయవంతమయితే రాబోయే రోజుల్లో మరిన్ని నగరాలకు విస్తరించనున్నామన్నారు.

ఎస్ఎంఈల బొమ్మలపై భారీ డీల్స్..

అమెజాన్‌లో హాలీడే టాయ్ లిస్ట్ 8వ ఎడిషన్‌ను ప్రారంభించినట్లు ఆ సంస్థ తెలిపింది. ఇది డిసెంబర్ 24వరకు అందుబాటులో ఉంటుందని పేర్కొంది. ఎస్ఎంఈ తయారీదారులు 50,000 పైగా బొమ్మలు, గేమ్స్‌పై గొప్ప ఆఫర్లను అందిస్తున్నట్లు పేర్కొంది. అదే విధంగా 10వేలకు పైగా బ్రాండ్లకు చెందిన 16 లక్షల పైగా బొమ్మలు, గేమ్స్ విస్తృత శ్రేణీ ఉత్పత్తులు అందుబాటులో ఉంటాయని తెలిపింది.


ఎన్‌హెచ్‌సీ ఫుడ్స్ రూ.47.42 కోట్ల రైట్ ఇష్యూ

న్యూఢిల్లీ : ఆహారోత్పత్తుల కంపెనీ ఎన్‌హెచ్‌సీ ఫుడ్స్ రూ.47.42 కోట్ల నిధులను సమీకరించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపింది. ఇందుకోసం రైట్ ఇష్యూ సబ్‌స్క్రిప్షన్ తెరిచామని.. ఈ నెల 18తో ముగియనుందని ఆ కంపెనీ తెలిపింది. సుగంధ ద్రవ్యాలు, ఆహార ధాన్యాలు, నూనె గింజలు, పప్పుధాన్యాలు, డ్రై ఫ్రూట్స్, ఇతర వ్యవసాయ ఉత్పత్తులతో సహా వివిధ రకాల ఆహార ఉత్పత్తుల ఎగుమతులను చేస్తోంది. ప్రస్తుత మార్కెట్ ధర రూ.2.76తో పోల్చితే అంతకంటే తక్కువకే లభిస్తుందని పేర్కొంది. ఇష్యూ ద్వారా వచ్చిన రూ.47.42 కోట్లలో రూ.25 కోట్లను వర్కింగ్ క్యాపిటల్ అవసరాలకు, రూ.15 కోట్లను సెక్యూర్డ్ లోన్స్ రీపేమెంట్‌కు, రూ.7 కోట్లను సాధారణ కార్పొరేట్ అవసరాలకు వినియోగించాలని కంపెనీ భావిస్తోందన్నారు.

లెక్సస్ అమ్మకాల్లో 17 శాతం వృద్ధి

న్యూఢిల్లీ : ప్రముఖ లగ్జరీ కార్ల కంపెనీ లెక్సస్ ఏడాదికేడాదితో పోల్చితే 2024లో ఇప్పటి వరకు అమ్మకాల్లో 17 శాతం వృద్ధిని సాధించినట్లు తెలిపింది. 2023 నవంబర్ విక్రయాలతో పోల్చితే గడిచిన నెల అమ్మకాల్లో ఏకంగా 56 శాతం పెరుగుదల చోటు చేసుకుందని పేర్కొంది. ఈ కంపెనీ పోర్టుపోలియోలో లెక్సస్ ఎన్ఎక్స్, ఆర్ఎక్స్ లాంటి ప్రధాన మోడళ్లు ఉన్నాయి.

75 శాతం తగ్గిన ఎంఎఫ్ పెట్టుబడులు



ముంబయి : ఈ ఏడాది నవంబర్‌లో మొత్తం మ్యూచువల్ ఫండ్‌ల్లో పెట్టుబడులు 75 శాతం తగ్గి రూ.60,363 కోట్లకు పరిమితమయ్యాయి. ఇంతక్రితం అక్టోబర్‌లో ఏకంగా రూ.2.39 లక్షల కోట్ల పెట్టుబడులు నమోదయ్యాయి. గడిచిన నెలలో ఈక్విటీ మ్యూచువల్ ఫండ్లలో నిధుల రాక 14 శాతం తగ్గగా.. రుణ ఫండ్లలో ఏకంగా 92 శాతం పతనం చోటు చేసుకుంది. ఈక్విటిల్లో రూ.35,943 కోట్ల పెట్టుబడులు రాగా.. ఇందులో అక్టోబర్‌లో రూ.41,886 కోట్ల పెట్టుబడులు నమోదయ్యాయి.

శాసన సభ్యుల అవగాహన తరగతుల బహిష్కరణ

- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

నేటి నుంచి రెండు రోజుల పాటు జరిగే ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల అవగాహన తరగతులను బహిష్కరిస్తున్నట్టు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఒక ప్రకటనలో తెలిపారు. తమ హక్కులకు భంగం కలిగేలా స్పీకర్ వ్యవహరించిన నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్టు తెలిపారు. శాసనసభ సమావేశాల తొలిరోజే తమను లోపలికి రానీయకుండా అరెస్టు చేయించారని పేర్కొన్నారు. ప్రభుత్వ వైఫల్యాలు, ప్రజా సమస్యలు ఎత్తిచూపితే అరెస్టు చేస్తారా? అంటూ ప్రశ్నించారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేల పార్టీ ఫిరాయింపులపై నిర్ణయం తీసుకోకుండా స్పీకర్ నాన్చుడు ధోరణి అవలంబిస్తున్నారని కేటీఆర్ ఆరోపించారు. గత అసెంబ్లీ సమావేశాల్లోనూ తమ గొంతు నొక్కేలా వ్యవహరించారని తెలిపారు. తమ శాసనసభ్యుల్లో అతి తక్కువ మంది మాత్రమే కొత్త వాళ్లున్నారని తెలిపారు. ఏకపక్షంగా వ్యవహరిస్తున్న స్పీకర్ వ్యవహారశైలికి నిరసనగా రేపటి నుంచి జరగనున్న అవగాహన తరగతులను బహిష్కరిస్తున్నామని తెలిపారు. ఇప్పటికైనా పార్టీలకతీతంగా వివక్ష లేకుండా వ్యవహరించాలని స్పీకర్‌కు విజ్ఞప్తి చేశారు.

కేంద్రం కుట్రల్ని తిప్పికొట్టండి



(మొదటిపేజీ తరువాయి)

నిర్బంధాలు ప్రయోగించాయనీ, అయినా ప్రజారంజక పాలనతో ఆ కుట్రల్ని సమర్థవంతంగా ఎదుర్కోగలుగుతున్నామని తెలిపారు. కేరళలో ఎలాంటి అభివృద్ధి జరగట్లేదని బీజేపీ, దాని అనుబంధ సంఘాలు దుష్ప్రచారం చేస్తున్నాయనీ, వాటికి ఎలాంటి విశ్వసనీయత లేదని స్పష్టం చేశారు. సీఐటీయూ, తెలంగాణ రైతు సంఘం (ఏఐకేఎస్), తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం (ఏఐఏడబ్ల్యూయూ) సంయుక్తాధ్వర్యంలో 'కేరళ ప్రజల హక్కులకు అండగా నిలబడదాం-వామపక్ష ప్రభుత్వాన్ని బలపరుద్దాం' అంశంపై మంగళవారంనాడిక్కడి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగిన సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. కేరళపై కేంద్రంలోని నరేంద్రమోడీ ప్రభుత్వం ఆర్థిక యుద్ధాన్నే ప్రకటించిందని చెప్పారు. అదే సమయంలో ఫాసిస్ట్ నేరాలకూ పాల్పడుతూ, ప్రజల మధ్య ఐక్యతను విచ్ఛిన్నం చేసే చర్యలకు పాల్పడుతున్నదని విమర్శించారు. రైతాంగానికి, శ్రామిక ప్రజలకు నష్టంచేసే విధానాల అమలును చేపట్టాలని రాష్ట్రాలపై ఒత్తిడి పెంచుతున్నదని వివరించారు. ప్రతిపక్షాలు అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో ఈ తరహా ఒత్తిళ్లు, దాడులు ఎక్కువగా ఉన్నాయని విశ్లేషించారు. ప్రణాళికా సంఘాన్ని నిర్వీర్యం చేసి, నయా ఉదారవాద విధానాలను బలవంతంగా కేరళ వంటి రాష్ట్రాలపై రుద్దాలనే ప్రయత్నాలు జరుగుతున్నాయని చెప్పారు. దీనికోసం రాజ్యాంగ మౌలిక సూత్రాలను కూడా పణంగా పెడుతున్నారనీ, రాష్ట్రాల హక్కుల్ని కాలరాస్తూ, ఫెడరల్ ప్రభుత్వ లక్ష్యాలను నీరుగారుస్తున్నారని తెలిపారు. రాజ్యాంగం ప్రకారం కేరళకు కేంద్రం నుంచి రావల్సిన ఆర్థికవాటాల్లో కోతలు విధిస్తున్నదనీ, ఇచ్చే నిధుల్ని కూడా సకాలంలో ఇవ్వకుండా జాప్యం చేస్తున్నదంటూ పలు ఉదాహరణలు చెప్పారు. అభివృద్ధి, సంక్షేమ పథకాలను స్తంభింపజేయడం ద్వారా కేరళ ప్రభుత్వాన్ని అప్రతిష్టపాలు చేయాలనే ఏకైక లక్ష్యంతో, ఉద్దేశ్యపూర్వకంగానే కేంద్రం ఇలాంటి చర్యలకు పాల్పడుతున్నదని తెలిపారు.

2023లో కేంద్రం విధించిన రుణపరిమితి ఆర్థిక ఆంక్షలపై అక్కడి రాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టును ఆశ్రయించాల్సి వచ్చిందన్నారు. కేంద్ర ప్రభుత్వం కేరళకు చెల్లించాల్సిన రూ.57,400 కోట్లను ఇచ్చేందుకు నిరాకరించిందనీ. ఆదాయ లోటు గ్రాంట్‌ను తగ్గించిందనీ, జీఎస్టీ పరిహారం, పన్ను పంపిణీ ఆదాయాలను తగ్గించిందని వివరించారు. గతంలో 3.97 శాతంగా ఉన్న పన్నుల కేటాయింపు, ఇప్పుడు 1.85 శాతానికి తగ్గిందన్నారు. ఇవ్వాల్సిన వాటా ఇవ్వకుండా, ఆర్థిక సంస్థల నుంచి రుణాలు తీసుకోవడానికి కూడా అనుమతులు ఇవ్వకుండా నిర్బంధాలు విధిస్తున్నదని తెలిపారు. కేరళలో ఏమీ జరగట్లేదని కేంద్ర ప్రభుత్వమే స్వయంగా కార్పొరేట్ మీడియాలో ఆ రాష్ట్రానికి వ్యతిరేకంగా పెయిడ్ న్యూస్‌ను వ్యాప్తి చేస్తున్నదన్నారు. వరదలతో రాష్ట్రం అల్లకల్లోలంగా మారితే కేంద్రం కేవలం పరామర్శలకే పరిమితమైంది తప్ప, ఎలాంటి ఆర్థిక సహకారాన్ని అందించలేదని గుర్తుచేశారు. సీపీఎం, ప్రజాసంఘాలు విరాళాలు సేకరించి, ప్రజల్ని ఆ విపత్తు నుంచి బయటపడేసేందుకు శక్తివంచన లేకుండా కృషి చేశాయని చెప్పారు. ఇంతటి ఆర్థిక నిర్బంధాల మధ్య కూడా కేరళ ప్రభుత్వం కాఫీ, మిరియాలు, ఏలకులు, మసాలా దినుసుల వంటి ఎగుమతి ఆధారిత వ్యవసాయ ఉత్పత్తుల్లో విశేష వృద్ధి సాధించి, దేశానికి అధిక విదేశీ మారక ఆదాయాన్ని అందిస్తున్నదని తెలిపారు.

రబ్బరు ఉత్పత్తి, ఎగుమతుల్లో కేరళ ప్రథమ స్థానంలో ఉందనీ, దాన్ని అడ్డుకోవడానికి కూడా కేంద్ర ప్రభుత్వం కుట్రలు పన్నుతున్నదని చెప్పారు. వ్యవసాయాధారిత పథకాల ద్వారా కేంద్రం నుంచి రాష్ట్రానికి రావల్సిన నిధుల విడుదలలో తీవ్రజాప్యం చేస్తూ, రాష్ట్ర ఖజానాను ఆర్థిక ఒత్తిడికి గురిచేస్తున్నదని వివరించారు. ఫెడరల్ స్ఫూర్తికి విరుద్ధంగా వ్యవహరిస్తున్న కేంద్ర ప్రభుత్వ విధానాలను వ్యతిరేకిస్తూ, ప్రగతిశీల, అభివృద్ధి దిశగా పయనిస్తున్న కేరళలోని వామపక్ష ప్రభుత్వానికి ప్రజలు సంపూర్ణ మద్దతు ఇవ్వాలని కోరారు. సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు భూపాల్ అధ్యక్షతన జరిగిన ఈ సదస్సులో ఏఐకేఎస్ సీనియర్ నాయకులు సారంపల్లి మల్లారెడ్డి, సీఐటీయూ ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్, తెలంగాణ రైతు సంఘం ప్రధాన కార్యదర్శి టీ సాగర్, తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి వెంకట్రాములు, సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు ఎస్ రమ తదితరులు మాట్లాడారు.

తేల్చాల్సిందే

(మొదటిపేజీ తరువాయి)

మరోవైపు అదానీ బొమ్మలు, బ్యాగ్ వెనుక వైపు 'మోడీ-అదానీ భాయ్ భాయ్' అని రాసి ఉంచారు. మోడీ-అదానీ కుమ్మక్కు అయ్యారని ఆరోపిస్తూ పెద్ద ఎత్తున నినాదాల హోరెత్తించారు. అదానీ అవినీతిపై చర్చకు డిమాండ్ చేశారు. ఈ ఆందోళనలో కాంగ్రెస్, డీఎంకే, జేఎంఎం, సీపీఐ(ఎం), సీపీఐ, శివసేన, ఆర్‌జేడీ, ఎన్‌సీపీ తదితర పార్టీల ఎంపీలతో కలిసి లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీ వాద్రా, డీఎంకే ఎంపీ కనిమొళి, జెఎంఎం ఎంపీ మహువా మాంఝీ, సీపీఐ(ఎం) ఎంపీ జాన్ బ్రిట్టాస్ తదితరులు పాల్గొన్నారు.

రాజ ఎంపీలకు రాహుల్ దిశా నిర్దేశం

అంతకు ముందు పార్లమెంట్ ఎనెక్స్‌లో మెయిన్ కమిటీ హాల్‌లో కాంగ్రెస్ ఎంపీల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఎంపీలకు లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ దిశా నిర్దేశం చేశారు. అదానీ ముడుపుల వ్యవహారం, మణిపూర్ అల్లర్లు, సంభాల్ హింసాత్మక ఘటన, ఢిల్లీలో కాల్పులు, కేంద్రం ఉభయ సభల ముందుకు తీసుకు రాబోయే బిల్లులపై అంశాల వారీగా అనుసరించాల్సిన వ్యూహాలపై పార్టీ వైఖరిని వివరించారు. ఈ భేటీలో ప్రియాంక వాద్రా, పార్టీ సీనియర్ నేతలు, ఎంపీలు పాల్గొన్నారు. సమావేశ అనంతరం ప్రియాంక గాంధీ తొలుత 'మోడీ-అదానీ' బొమ్మలతో ఉన్న బ్యాగ్‌ను వేసుకొని రాహుల్‌కు చూపించారు.

అనంతరం సహచర ఎంపీలతో కలిసి ఎనెక్స్ నుంచి రాహుల్ గాంధీ నడుచుకుంటూ మకర ద్వారం వద్దకు చేరుకున్నారు. ఈ సందర్భంగా ఎంపీలంతా మోడీ, అదానీకి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

సభ సాగకుండా ఎన్డీఏ సర్కార్ కుట్ర: తెలంగాణ ఎంపీలు

కేంద్రంలోని ఎన్డీఏ సర్కార్‌కు పార్లమెంట్ సమావేశాలను సజావుగా నడిపించాలనే ఉద్దేశం లేదని ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి విమర్శించారు. అదానీ ముడుపుల వ్యవహారం, సంభాల్ అంశాలపై చర్చ నుంచి ప్రణాళిక ప్రకారమే కేంద్రం తప్పించుకుంటుందని వ్యాఖ్యానించారు. ప్రతిపక్ష(ఇండియా బ్లాక్) ఎంపీలు లోక్‌సభను నడిపించాలని పట్టుబడుతుంటే... కావాలనే స్పీకర్ సభను వాయిదా వేస్తున్నారని అన్నారు.

మరోవైపు అధికార పార్టీ ఎంపీలకు అవకాశం ఇచ్చి, వాళ్ళతో విపక్ష పార్టీల సభ్యుల్ని రెచ్చగొట్టే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. ఇండియా బ్లాక్ ఎంపీల ఆందోళనతోనే సభ వాయిదా పడుతున్నట్టు దుష్ప్రచారం చేస్తున్నారని ఫైర్ అయ్యారు. కేంద్ర ప్రభుత్వ కుట్రలో భాగంగానే పార్లమెంట్‌ను నడపడం లేదని ఎంపీ మల్లు రవి విమర్శించారు. దీన్ని దేశ ప్రజలు గుర్తించాలని కోరారు.

చివరి ఘట్టంలో వర్గీకరణ

మూడు నెలలు ఉద్యమిస్తే వంద తరాలకు భవిష్యత్తు

- ఎస్సీ కమిషన్ రిపోర్టును అసెంబ్లీలో పెట్టాలి
- లేకుంటే నడి బజారులో గీత గీస్తాం..:ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మందకృష్ణ మాదిగ
- ఇబ్రహీంపట్నంలో భారీ బహిరంగ సభ



నవతెలంగాణ-రంగారెడ్డి ప్రతినిధి

'ఏబీసీడీ వర్గీకరణకు చివరి ఘటం ఆరంభమైంది. కేవలం మూడు నెలలు ఉద్యమిద్దాం, వంద తరాలకు భవిష్యత్తును ఇద్దాం. కమిషన్ సేకరించిన రిపోర్టు ఆధారంగా అసెంబ్లీలో తీర్మానం చేయాలి. లేకుంటే నడి బజారుపై గీత గీస్తాం. కబడ్డీ ఆడుదాం. వర్గీకరణ సాధించుకుందాం' అంటూ మందకృష్ణమాదిగ పిలుపునిచ్చారు. ఏ క్షణమైనా ఎలాంటి ఉద్యమ రూపమైన దాల్చొచ్చని, ఆ పిలుపు ఏ రూపంలో వచ్చినా విజయవంతం చేసేందుకు పిల్లాపాపలతో సిద్ధంగా ఉండాలన్నారు. ఏబీసీడీ వర్గీకరణ అమలు చేయాలని డిమాండ్ చేస్తూ రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం అంబేద్కర్ చౌరస్తాలో నిర్వహించిన మాదిగ ఆత్మీయ సమ్మేళనంలో ప్రొఫెసర్ కాశీంతో కలిసి మందకృష్ణమాదిగ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నెహ్రూ ప్రధానిగా ఉన్న కాలంలోనే ఎస్సీలోని మాదిగలకు ఉద్యోగ అవకాశాల్లో అన్యాయం జరుగుతున్నాయని కమిషన్ రిపోర్టులలో తేల్చి చెప్పారని అన్నారు. ఎస్సీ వర్గీకరణ కోసం 1994 మాదిగ దండోరను ఏర్పాటు చేసి వర్గీకరణ కోసం అనేక ఉద్యమాలు నిర్వహించామన్నారు. గతంలో చంద్రబాబు ప్రభుత్వం వర్గీకరణ ఇచ్చిన సందర్భంగా మాల సోదరులు అడ్డుకున్నారని చెప్పారు. రాష్ట్రపతి నిర్ణయాన్ని కూడా ఖాతర్ చేయడం లేదన్నారు. 11వేల టీచర్ పోస్టులను ఈ మధ్యకాలంలో రిజర్వేషన్ అమలు చేయకుండా కేటాయించారని, వాటిలో సుమారు 1200 ఉద్యోగాలు మాదిగలకు రావాల్సి ఉండగా.. కేవలం 500 ఉద్యోగాలు మాత్రమే దక్కాయని, ఇది అన్యాయం కాదా అని ప్రశ్నించారు. వర్గీకరణకు అనుకూలంగా రాష్ట్రాలకు అధికారాలు ఇస్తూ కేంద్రం సహకరించిందని అన్నారు.

సుప్రీంకోర్టులోని ఏడుగురు సభ్యుల్లో ఆరుగురు జడ్జీలు అనుకూలంగా ఉండటంతో ఎస్సీ వర్గీకరణకు అనుకూల తీర్పులు వచ్చాయని చెప్పారు. సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చిన క్రమంలో రేవంత్ రెడ్డి అసెంబ్లీ సాక్షిగా స్పందించారని చెప్పారు. ఎస్సీ కమిషన్ సేకరించిన రిపోర్టును అసెంబ్లీలో పెట్టి వెంటనే తీర్మానం చేయాలని డిమాండ్ చేశారు. ఓయూ ఆర్ట్స్ కాలేజీ ప్రిన్సిపాల్, ప్రొఫెసర్ కాశీం మాట్లాడుతూ.. ఎస్సీ వర్గీకరణ అనంతరం మాల, మాదిగలు ఒక్కటిగా సాధించుకోవాల్సిన హక్కులు మిగిలే ఉన్నాయని అన్నారు. అందుకు మాల సోదరులు ఎస్సీ వర్గీకరణకు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాదిగ జేఏసీ నియోజకవర్గ కన్వీనర్ బోసపల్లి ప్రతాప్, రాష్ట్ర నాయకులు కొండ్ర ప్రవీణ్, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షులు నరేష్, మాజీ ఎంపీపీలు ఇందిరా, కృపేశ్, నాయకులు మంద సురేష్, ఆకార కృష్ణ, కంబాలపల్లి భాస్కర్, కృష్ణ, అయోధ్య, రాష్ట్ర, జిల్లా స్థాయి నాయకులు పాల్గొన్నారు.

ఆశావర్కర్ల సమస్యలను అసెంబ్లీలో లేవనెత్తుతాం

- దాడి చేసిన పోలీసులపై చర్యలేవి..? : బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్యే కేటీఆర్



నవతెలంగాణ - ధూల్ పేట్

ఆశా వర్కర్ల సమస్యలను పరిష్కరించాలని, వారి సమస్యలను అసెంబ్లీలో లేవనెత్తుతామని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమెల్యే కేటీఆర్ అన్నారు. హైదరాబాద్ కోఠి కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ కార్యాలయం వద్ద సోమవారం జరిగిన ధర్నాలో గాయపడిన ఆశా కార్యకర్త రహీంబీ ఉస్మానియా ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. ఆమెను మంగళవారం ఎమ్మెల్యేలు సబితా ఇంద్రారెడ్డి, జగదీశ్‌రెడ్డి, పల్లా రాజేశ్వర్ రెడ్డి, మాజీ మంత్రి మహమూద్ అలీతో కలిసి ఆయన పరామర్శించారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. ఆశాలు శాంతియుతంగా ధర్నా చేస్తుంటే పోలీసులు జులుం ప్రదర్శించారన్నారు. సోనియా గాంధీ పుట్టిన రోజున మహిళలను ఇష్టం వచ్చినట్టు కొట్టారన్నారు. ఏసీపీ దారుణంగా ఒక ఆడ బిడ్డ చీర లాగారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ ఘటనలో అమానుషంగా ప్రవర్తించిన పోలీసులపై ఏం చర్యలు తీసుకున్నారని ప్రశ్నించారు. ఆశాలకు రూ.18వేల జీతం, ఉద్యోగ భద్రత కల్పిస్తామని చెప్పింది మీరు కదా అని నిలదీశారు. కేసీఆర్ ప్రభుత్వంలో ఆశాలకు వేతనాలు పెంచామని గుర్తు చేశారు. సమస్యలను పరిష్కరించాలని వచ్చిన వారిపై దాడి చేయడం అత్యంత హేయమన్నారు. ఆశాలకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలని అసెంబ్లీ కొట్లాడుతామన్నారు. వారిపై జరిగిన దాడిపై మహిళా కమిషన్‌ను కలుస్తామన్నారు. మెరుగైన కార్పొరేట్ వైద్యం కోసం అవసరమైతే బీఆర్ఎస్ తరఫున ఆస్పత్రికి తీసుకెళ్తామని చెప్పారు. ఈ సందర్భంగా ఆశా కార్యకర్తకు అందిస్తున్న చికిత్సపై సూపరింటెండెంట్ వివరించారు. ప్రస్తుతం ఆరోగ్యం నిలకడగా ఉందని తెలిపారు. మెరుగైన వైద్యం అందించాలని సూపరింటెండెంట్ డాక్టర్ రాకేష్‌కు కేటీఆర్ సూచించారు. ఉస్మానియాలో మంచి సేవలే అందుతున్నాయని ఈ సందర్భంగా వైద్యులను అభినందించారు. వారి వెంట బీఆర్ఎస్ గోషామహల్ నాయకులు ఆర్వీ మహేందర్ కుమార్, ఆశిష్ కుమార్ యాదవ్, శ్రీనివాస్ యాదవ్ తదితరులు ఉన్నారు.

విద్యార్థులకు సాంకేతిక పరిజ్ఞానం అందించాలి

- మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు
- ఐటీఐ మహిళా కళాశాల ప్రారంభం



నవతెలంగాణ- ఘట్కేసర్

విద్యార్థులకు అధునాతనమైన సాంకేతిక పరిజ్ఞానాన్ని అందించడంతోపాటు ఉపాధి కల్పించడమే ప్రభుత్వ ప్రధాన ఉద్దేశం అని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ఘట్కేసర్ మున్సిపల్ పరిధిలో హిందుస్థాన్ ఏరోనాటికల్ సౌజన్యంతో ఏర్పాటు చేసిన ఐటీఐ మహిళా కళాశాలను మంగళవారం ప్రభుత్వ చీఫ్ విప్ పట్నం మహేందర్ రెడ్డి, ఎమ్మెల్యే మల్లారెడ్డి, కాంగ్రెస్ మేడ్చల్ నియోజకవర్గ ఇన్‌చార్జి తోటకూర వజ్రేష్ యాదవ్‌తో కలిసి మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ప్రజాపాలన విజయోత్సవాల్లో భాగంగా ఐటీఐ కళాశాలను ప్రారంభించుకుంటున్నామని తెలిపారు. ప్రతి విద్యార్థికీ ఉపాధి కల్పించడమే ప్రభుత్వ లక్ష్యం అన్నారు. అందులో భాగంగానే రాష్ట్రంలో అధునాతన పరిజ్ఞానంతో కూడిన ఐటీఐ కళాశాలలు నిర్మిస్తున్నట్టు చెప్పారు. భవిష్యత్‌లో ఉపాధి పొందే దిశగా అధునాతనమైన శిక్షణకు సంబంధించిన పరికరాలతో కూడిన తరగతి గదులను నిర్మిస్తే విద్యార్థులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. మహిళలకు అవసరమైన విభాగాలను గుర్తించి అందుకు అనుగుణంగా విషయపరిజ్ఞానం పెంపొందించేలా శిక్షణ కార్యక్రమాలు ఉంటాయన్నారు. ఫ్యాషన్ టెక్నాలజీ కోర్సు మిషనరీతోపాటు కొత్త కొత్త హంగులతో ఏ విధంగా తయారు చేయాలో శిక్షణ ఇస్తారని చెప్పారు. అనంతరం మంత్రి కళాశాల ప్రాంగణంలో మొక్క నాటారు. తరువాత ఘట్కేసర్‌లోని గురుకుల్ జూనియర్ కాలేజీలో రూ.కోటి 50 లక్షల అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. అక్కడే సీఎం కప్ ఆటలను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఘట్కేసర్ మున్సిపల్ చైర్‌పర్సన్ మురళి పావని జంగయ్య యాదవ్, ప్రిన్సిపాల్ సెక్రెటరీ సంజయ్ కుమార్, జిల్లా కలెక్టర్ గౌతం, అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి, కీసర ఆర్డీవో సైదులు, మాజీ ఎమ్మెల్యే మలిపెద్ది సుధీర్ రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

షెడ్యూల్డ్ కులాల ఉప వర్గీకరణపై ఎస్సీ కమిషన్‌కు ఫిర్యాదులు

- షమీమ్ అక్తర్ నేతృత్వంలోని ఏకసభ్య కమిషన్ స్వీకరణ
- రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్‌లో షెడ్యూల్ కులాలతో సమావేశం



నవతెలంగాణ-రంగారెడ్డి ప్రాంతీయ ప్రతినిధి

షెడ్యూల్డ్ కులాల (ఎస్సీ) ఉప వర్గీకరణపై అధ్యయనం చేసేందుకు తెలంగాణ హైకోర్టు రిటైర్డ్ న్యాయమూర్తి డాక్టర్ షమీమ్ అక్తర్ నేతృత్వంలోని ఏకసభ్య కమిషన్ మంగళవారం రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్‌లో షెడ్యూల్డ్ కులాల వారి నుంచి ఫిర్యాదులు స్వీకరించింది. ఈ సందర్భంగా వారితో కమిషన్ సమావేశమైంది. షెడ్యూల్డ్ కులాల ఉప వర్గీకరణపై వివిధ కులాల వారు ఫిర్యాదులు అందజేశారు. మాలలు, మాదిగలు, జంగములు, చిందులు, బేడ బుడగ జంగములు, బైండ్ల, మంగులతో పాటు వివిధ వర్గాల ప్రతినిధులు ఉప వర్గీకరణపై తమ అభిప్రాయాలను కమిషన్‌తో పంచుకున్నారు. సామాజిక, ఆర్థిక వెనుకబాటు కారణంగా విద్య, ఉద్యోగాలకు రిజర్వేషన్లు పొందడంలో ఎదుర్కొంటున్న అన్యాయాల గురించి ఆందోళన వ్యక్తం చేశారు. తమకు న్యాయం చేయాలని కమిషన్‌ను కోరారు. ఈ సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్, రాష్ట్ర షెడ్యూల్డ్ కులాల అడిషనల్ డైరెక్టర్ శ్రీధర్, జిల్లా సోషల్ వెల్ఫేర్ అధికారి రామారావు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ములుగు జిల్లాలో పెద్దపులి సంచారం

- అటవీశాఖ అధికారుల నిర్ధారణ



నవతెలంగాణ/వెంకటాపురం

ములుగు జిల్లా వెంకటాపురం మండలం బొదాపురం పంచాయతీ పరిధిలో పులి సంచారం కలకలం రేపింది. దాని పాదముద్రలను పరిశీలించిన అటవీశాఖ అధికారులు పెద్దపులి సంచరించినట్టు నిర్ధారించారు. పాద ముద్రల ఆధారంగా పులి గోదావరి నుంచి మంగపేట వైపునకు వెళ్లినట్టు తేల్చారు. వెంకటాపురం రేంజర్ చంద్రమౌళి తెలిపిన వివరాల ప్రకారం.. మంగళవారం రాత్రి సమయంలో సమీపంలోని గోదావరి లంకలో నుంచి కొందరు రైతులు లంకలోని మిర్చి తోట వద్దకు వెళ్లారు. ఆ సమయంలో పెద్దపులి గాండ్రిపు వినిపించింది. గమనించిన రైతు అటువైపు టార్చిలైట్ వెలుగు చూపడంతో పులి గోదావరి నది వైపునకు వెళ్ళింది. ఆ గాండ్రిపులు గ్రామస్తులకూ వినిపించాయి. భయాందోళనకు గురైన రైతులు, గ్రామస్తులు అటవీశాఖ అధికారులకు సమాచారం ఇచ్చారు. మంగళవారం పులిసంచరించిన ప్రాంతాన్ని అటవీశాఖ అధికారులు గుర్తించారు. అవి పెద్దపులికి చెందిన పాదముద్రలుగా తెలిపారు. ఛత్తీస్‌గఢ్ నుంచి వచ్చి ఉంటుందని గుర్తించారు. గోదావరి నదిలో అడుగుల ఆధారంగా మంగపేట మండలం వైపునకు వెళ్లి ఉంటుందని తేల్చారు. పులి సంచరిస్తున్న నేపథ్యంలో గ్రామస్తులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. పొలం పనులకు వెళ్లే రైతులు, పశువుల కాపర్లు, గుంపులు గుంపులుగా వెళ్లాలని తెలిపారు. అడవిలోకి ఎవరూ వెళ్లొద్దని హెచ్చరించారు. పెద్దపులి వేటకై ఉచ్చులు, నీటిలో విష పదార్థాలు వంటివి ఏర్పాటు చేయొద్దని తెలిపారు. పులి సంచారాన్ని గుర్తిస్తే వెంటనే అటవీ శాఖ అధికారులకు తెలపాలని కోరారు.

ప్రజావాణికి 424 దరఖాస్తులు

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

మహాత్మా జ్యోతిబా పూలే ప్రజాభవన్ లో మంగళ వారం నిర్వహించిన ప్రజావాణిలో మొత్తం 424 దరఖాస్తులు అందాయి. పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖకు 108, మైనార్టీ సంక్షేమ శాఖకు 100, రెవెన్యూ శాఖకు 65, విద్యుత్ శాఖకు 57, పురపాలక, పట్టణాభివృద్ధి శాఖకు 13, ప్రవాసి ప్రజావాణికి 05, ఇతర శాఖలకు సంబంధించి 76 దరఖాస్తులు అందినట్టు అధికారులు తెలిపారు. రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షులు డాక్టర్ జి.చిన్నారెడ్డి, ప్రజావాణి ప్రత్యేక అధికారి దివ్య దరఖాస్తులు స్వీకరించారు. ప్రజాభవన్ కు వచ్చిన వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు.





జయంతి బురుడా... అట్టడుగు గిరిజన ప్రాంతంలో పుట్టి పెరిగారు. ఆడపిల్లకు చదువంటేనే వ్యతిరేకించే ఊరు అది. అలాంటి ప్రాంతం నుండి మొదటి మహిళా ఆదివాసీ జర్నలిస్ట్‌గా చరిత్ర సృష్టించారు. కోయ, గిరిజన సమాజానికి బలీయమైన గొంతుగా ఉద్భవించారు. గిరిజన బాలికలకు విద్య, ఆరోగ్యం, పరిశుభ్రతపై అవగాహన కల్పిస్తున్నారు. అందుకే ఫోర్బ్స్ ప్రచురించిన అత్యంత శక్తివంతమైన మహిళల్లో ఈ ఏడాది స్థానం సంపాదించుకున్నారు. చిన్నతనంలో తనకు ఓదార్పు నిచ్చిన అడవి బిడ్డల గొంతులు, పోరాటాలను దృశ్యమానం చేస్తున్న ఆమె పరిచయం నేటి మానవిలో...

గిరిజనానికి ప్రపంచానికి మధ్య వారధిగా...

ఒడిశా రాష్ట్రంలోని మల్కన్‌గిరి జిల్లా, సేరపల్లి గ్రామంలోని నిశ్శబ్ద అడవుల్లో పుట్టి పెరిగారు జయంతి. చిన్నతనంలో తరచుగా అడవిలోకి వెళ్లి ఆ అందాలను ఆస్వాదించేవారు. ఇతర పిల్లలు ఫోన్లతో ఆడుకుంటుంటే, తన అన్న మత్తులో ఊగిపోతూ గొడవ పడుతుంటే వీటన్నింటికీ దూరంగా ఆమె మాత్రం ప్రకృతి ఒడిలో ఓదార్పు పొందేవారు. ఈ అనుభవాలు ఒకరోజు ఆమె కోయ గిరిజన సంఘాల హక్కుల కోసం పోరాడే వారి పక్షం నిలబడేలా చేశాయి. ఈ రోజు మల్కన్‌గిరి మొదటి మహిళా ఆదివాసీ జర్నలిస్ట్‌గా నిలిపాయి.

ఆమెపై లోతైన ముద్ర

'నా కమ్యూనిటీతో నాకున్న అనుబంధం నన్ను ఏకాంత బిడ్డగా మార్చింది. ఈ రోజు మా కథలు ప్రపంచానికి చెప్పడానికి నన్ను ప్రోత్సహించింది' అని ఆమె ఓ వెబ్‌సైట్‌తో పంచుకున్నారు. బాలికల అక్షరాస్యత రేటు చాలా తక్కువగా ఉన్న సమాజంలో జయంతి బాల్యం గడిచింది. అయితే ఆమె తండ్రి జిల్లా పంచాయితీ సభ్యుడు. చదువు విలువ తెలిసిన వ్యక్తి కనుక తన ఆడపిల్లలను చదివించాలని నిర్ణయించుకున్నాడు. అలా వారి కమ్యూనిటీలో మొదటి విద్యావంతుల కుటుంబంగా మారింది. ఆమె తండ్రి క్రియాశీలత ఆమెపై లోతైన ముద్ర వేసింది. 'మా నాన్న ఎప్పుడూ ధోతి ధరించి ఆదివాసీ హక్కుల కోసం పోరాడేవారు. మా అమ్మ కష్టాల్లో ఉన్న కుటుంబాల కోసం వండి పెట్టేవారు. అయితే నేను చదువుకోవడానికి ఊరు విడిచి వెళ్లాల్సి వచ్చినప్పుడు మా నాన్న భయపడేవాడు' అని ఆమె గుర్తుచేసుకున్నారు.

అడ్డంకులు అధిగమించి

తన సొంత మార్గాన్ని ఏర్పరచుకోవాలని జయంతి మల్కన్‌గిరిలో బ్యాచిలర్ ఆఫ్ ఆర్ట్స్‌ను పూర్తి చేశారు. గిరిజన పిల్లలకు పాఠాలు బోధించారు. యుద్ధ కళలు కూడా నేర్చుకున్నారు. అయితే ఆమె కలలు నిజం చేసుకునేందుకు సామాజిక, ఆర్థిక అడ్డంకులను అధిగమించాల్సి వచ్చింది. జర్నలిజం కోసం తన ఊరికి 150 కిలోమీటర్ల దూరంలోని కొరాపుట్‌లోని ఒడిశా సెంట్రల్ యూనివర్శిటీలో చేరారు. అయితే అక్కడ హాస్టల్ ఫీజును భరించలేకపోయారు. అంతేకాదు తనకు తెలియని కొత్త ప్రపంచంలో అనేక ఇబ్బందులను ఎదుర్కొన్నారు. అయితే స్నేహితులు ఆమెకు మద్దతుగా నిలిచారు. ఒక కుటుంబం ఆప్యాయంగా అక్కున చేర్చుకుంది. జర్నలిజం విద్యను పూర్తి చేయడానికి వీలు కల్పించింది. డాక్యుమెంటరీ చిత్రనిర్మాత బీరెన్ దాస్ వద్ద ఇంటర్న్‌షిప్ చేశారు. ఆయన్ని ఆమె తన గురువుగా చెప్పుకుంటారు.

ఆకాంక్షలను సుస్థిరం చేసింది

జర్నలిజం పూర్తి చేసిన వెంటనే జయంతి కళింగ టీవీలో చేరారు. భారతదేశంలో మావోయిస్ట్ తిరుగుబాటుతో దెబ్బతిన్న, అత్యంత వెనుకబడిన, సంఘర్షణతో నిండిన ఓ ప్రాంతం నుండి తన ఉద్యోగం ప్రారంభించారు. గిరిజన మహిళా జర్నలిస్టుగా కొన్ని ప్రత్యేకమైన సవాళ్లను ఎదుర్కొన్నారు. 'న్యూస్‌రూమ్‌లలో, మగ సహోద్యోగులు తరచూ నన్ను పక్కన పెట్టేవారు. నా గిరిజన గుర్తింపు, భాషా అడ్డంకులను వారికి అనుకూలంగా ఉపయోగించుకున్నారు. కొన్ని సమయాల్లో నాకు దక్కాల్సిన క్రెడిట్‌ను కూడా తీసుకున్నారు' అని ఆమె పంచుకున్నారు. 2017లో నెట్‌వర్క్ ఆఫ్ ఉమెన్ ఇన్ మీడియా ఆమె సామర్థ్యాన్ని గుర్తించింది. గిరిజన మహిళలను ప్రోత్సహించేందుకు ఆమెకు ఫెలోషిప్‌ను ప్రదానం చేసింది. ఈ వేదిక ద్వారా ఆమె అట్టడుగు వర్గాలు, ముఖ్యంగా గిరిజన మహిళలు, పిల్లలు ఎదుర్కొంటున్న క్లిష్టమైన సమస్యలను జయంతి ప్రస్తావించారు. ఇలా ఈ ఫెలోషిప్ ఆమెలో ఓ కొత్త ధైర్యాన్ని ఇచ్చింది. తమ కమ్యూనిటీ ప్రజలు ఎదుర్కొంటున్న లింగ, సామాజిక అసమానతలను పరిష్కరించడానికి కొంత వరకు సహకరించింది.





వైవిధ్యం ఉన్న కథలు

జయంతి రిపోర్టింగ్ ఆమె సంఘంలోని కఠోర వాస్తవాలను వెలుగులోకి తెస్తోంది. ఆమె మల్కన్‌గిరిలోని ప్రసూతి ఆరోగ్య సవాళ్లను డాక్యుమెంట్ చేశారు. అక్కడి మహిళలు వైద్య సదుపాయాలు లేకుండా ప్రసవించేవారు. అందుకే హెల్త్‌కేర్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌ను మెరుగుపరచడం కోసం కృషి చేశారు. అలాగే ఆమె ఆసుపత్రిలో ప్రసవించిన ఓ తల్లితో కలిసి రెండు రోజులు ప్రయాణించి వారి గ్రామానికి వెళ్లారు. 'ఆమె ఇల్లు జలమయమైంది. మాకు అందుబాటులో ఉన్న రవాణా మార్గాలు ట్రాక్టర్, ఎద్దుల బండి, బస్సు మాత్రమే. మంత్రసాని, సంఘం సభ్యులు ఆమె బతుకుతుందనే ఆశ వదలుకున్నారు. కానీ సకాలంలో ఆసుపత్రికి తీసుకెళ్లడంతో బిడ్డకు జన్మనిచ్చింది' అని జయంతి పంచుకున్నారు. నిరక్షరాస్యతను అధిగమించేందుకు, గిరిజన మహిళలు ఎదుర్కొంటున్న గృహ హింస, మద్యం వ్యసనాన్ని పరిష్కరించేందుకు ఆమె చేసిన కృషి గ్రామంలోని అన్ని మద్యం దుకాణాలను మూయించింది. అంతేకాదు రుతుక్రమ పరిశుభ్రతపై కూడా ఆమె దృష్టి సారించారు. "రుతుస్రావం గురించి మాట్లాడటం ఇక్కడ నిషిద్ధం. రుతుక్రమం ప్రారంభమైన అమ్మాయిలు చదువ మానేస్తున్నారు. అపరిశుభ్రమైన ఉత్పత్తులను కూడా ఉపయోగిస్తారు. వారి పరిస్థితులు మార్చడానికి వారి ధైర్యం నాకు స్ఫూర్తినిస్తోంది. వారి జీవితాలకు, ప్రపంచానికి మధ్య వారధిగా నా పాత్రను నేను చూస్తాను' అని ఆమె చెప్పారు.

రిపోర్టింగ్‌కు మించి

సంఘం పట్ల ఆమెకున్న నిబద్ధత జర్నలిజానికి మించి విస్తరించింది. 2018లో బడా దీదీ యూనియన్ అనే మహిళా సమిష్టిని ప్రారంభించారు. ఇది రుతు పరిశుభ్రత, లైంగిక భద్రతపై అవగాహన పెంపొందించడానికి యువతులతో కలిసి పని చేస్తుంది. ఆ ప్రాంతంలో డ్రాపౌట్ రేట్లను తగ్గించడంపై దృష్టి సారించింది. 'పాఠశాలలోని లైంగిక వేధింపులు అమ్మాయిలకు అవరోధాలుగా ఉన్నాయని గుర్తించాము. ఆ సమయంలో జాగ్రత్తగా ఎలా ఉండాలో వారికి అవగాహన కల్పిస్తాం' అని జయంతి చెప్పారు. ఇలా ఆమె తన జర్నలిజం వృత్తిని గిరిజన ప్రజల బతుకులో వెలుగులు నింపేందుకు ఉపయోగిస్తున్నారు. అట్టడుగు ప్రజల గొంతుగా మారి వారి భవిష్యత్తుకు మద్దతు ఇస్తున్నారు. ■



డిజిటల్ యుగంలో సవాళ్లు

- డీప్ ఫేక్, గోప్యతకు భంగం వంటి అంశాలు ఆందోళనకరం
- ప్రజల హక్కులు, గౌరవాన్ని కాపాడే వాతావరణాన్ని సృష్టించాలి : రాష్ట్రపతి ముర్ము

న్యూఢిల్లీ: ప్రస్తుత డిజిటల్ యుగంలో సవాళ్లు పొంచి ఉన్నాయని భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము అన్నారు. సామాజిక మాధ్యమాల్లో తప్పుడు సమాచారం విస్తతంగా వ్యాప్తి చెందుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. సైబర్ నేరాలు, డీపీ ఫేక్, ప్రజల గోప్యతకు భంగం వంటి అంశాలు మానవులకు కొత్త ముప్పుగా పరిణమిస్తున్నాయన్నారు. వీటిని నివారించాలంటే ప్రజల హక్కులను, గౌరవాన్ని కాపాడే డిజిటల్ వాతావరణాన్ని కల్పించడం ముఖ్యమని 'మానవ హక్కుల దినోత్సవం' సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో రాష్ట్రపతి పేర్కొన్నారు. భారత్ అభివృద్ధి చెందిన దేశాల సరసన నిలిచేందుకు తీవ్రంగా కృషి చేస్తున్న నేపథ్యంలో సైబర్ నేరాలతో పాటు వాతావరణంలో వచ్చే వివిధ రకాల మార్పులను ఎదుర్కొంటోందని అన్నారు. ప్రస్తుత ప్రజల జీవితాల్లో ఏఐ ప్రభావం గురించి రాష్ట్రపతి ముర్ము మాట్లాడుతూ "కృత్రిమ మేధ ఇప్పుడు మన రోజూవారీ జీవితంలోకి ప్రవేశించింది.

ఇది మన సమస్యలను పరిష్కరిస్తోంది. కానీ మనకు తెలియకుండానే పలు కొత్త సమస్యలు సృష్టిస్తోంది. దీనికి ప్రాణం లేకపోయినా సృష్టించింది మానవులే కాబట్టి.. ఈ సవాళ్లకు మనమే తగిన పరిష్కారం కనుగొనాల్సిన అవసరం ఉంది" అని అన్నారు. సార్వత్రిక మానవ హక్కుల పరిరక్షణ ప్రకటనను ఐక్యరాజ్య సమితి సాధారణ సభ 1948లో ఆమోదించింది. ఆ తీర్మానంలో రూపొందించిన హక్కులు, స్వేచ్ఛపై అందరిలోనూ అవగాహన పెంచి, వాటి అమలుకు రాజకీయ దృఢ సంకల్పాన్ని పెంపొందించడానికి ఏటా డిసెంబరు 10న అంతర్జాతీయ మానవ హక్కుల దినోత్సవాన్ని జరుపుకుంటున్నాం. ప్రజల్లో మానవ హక్కులపై అవగాహన పెంచడానికి, ప్రభుత్వాలు మరింత బలంగా వాటి పరిరక్షణకు పూనుకోవడానికి ఈ కార్యక్రమాలు ప్రేరణగా నిలిచే అవ కాశం ఉందని ఐరాస పేర్కొంది. ఇందులో భాగంగా రూపొందించిన సుస్థి రాభివృద్ధి లక్ష్యాలను 2030 నాటికి సాకారం చేయాలని పిలుపునిచ్చింది.

కలుషిత ఆహారంపై వివరణివ్వండి

- రాష్ట్రానికి హైకోర్టు ఆదేశం

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

రాష్ట్ర వ్యాప్తంగా గురుకుల పాఠశాలలు, వసతిగృహాలు, కేజీబీ పాఠశాలల్లో ఆహారం వికటించడంపై వివరాలు ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది. విద్యార్థులు అస్వస్థతకు గురికావడం, కొన్ని చోట్ల విద్యార్థులు ప్రాణాలు కోల్పోవడం వంటి ఘటనలపై ఆందోళన వ్యక్తం చేసింది. విద్యార్థులు తుది శ్వాస విడిచే పరిస్థితులు ఉండటానికి వీల్లేదని తేల్చి చెప్పింది. హెల్ప్ ది పీపుల్ ఛారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షుడు కీతినీడి అఖిల్ శ్రీ గురు తేజ ప్రజాప్రయోజన వ్యాజ్యం దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ జె.శ్రీనివాస్‌రావు ధర్మాసనం మంగళవారం విచారణ చేపట్టింది. ఆసిఫాబాద్ జిల్లాలో వాంకిడిలో అరవై మంది విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారనీ, శైలజ అనే విద్యార్థిని మరణించిందని పిటిషనర్ న్యాయవాది చిక్కుడు ప్రభాకర్ బెంచ్ దృష్టికి తీసుకెళ్లారు. నాగర్‌కర్నూల్ జిల్లాలో ఒక ఎస్సీ విద్యార్థిని, భువనగిరిలో ఇద్దరు ఎస్టీ విద్యార్థినులు మరణించారని చెప్పారు.

సాక్షాత్తు రాష్ట్ర మంత్రి సీతక్క ప్రకటించిన మేరకు ఈ ఏడాది 42 సార్లు విద్యార్థులకు సరఫరా చేసే ఆహారం వికటించిన ఘటనలున్నాయని తెలిపారు. ఎన్సీపీసీఆర్‌లోని చాప్టర్ నాలుగు ప్రకారం విద్యార్థులకు ఆహార సరఫరా చేస్తున్నట్టు అడ్వకేట్ జనరల్ సుదర్శన్‌రెడ్డి చెప్పారు. ఇదే హైకోర్టు గతేడాది, ఇటీవల జారీ చేసిన ఉత్తర్వు లను కూడా ప్రభుత్వం అమలు చేయలేదని ప్రభాకర్ వాదించారు. దీనిపై స్పందించిన హైకోర్టు.. మొత్తం ఘటనల గురించి ఒక పట్టిక రూపంలో నివేదించాలని ఆదేశించింది. విచారణను గురువారానికి వాయిదా వేసింది.

హామీలు అమలు చేసే వరకూ పోరాడుతాం

(మొదటిపేజీ తరువాయి)

సీఎంకు పట్టవా? అని ప్రశ్నించారు. సకలాంగులకు ఇచ్చిన హామీలను అమలు చేస్తున్నామని గొప్పలు చెబుతున్న ప్రభుత్వం, వికలాంగులు ఏం పాపం చేశారని వారికిచ్చిన హామీలు అమలు చేయటం లేదో సమాధానం చెప్పాలని అన్నారు. వారి పట్ల నిర్లక్ష్యాన్ని వీడకపోతే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. రాష్ట్రంలో 43.02 లక్షల మంది వికలాంగులుంటే ఆసరా పింఛన్లు కేవలం 5.17 లక్షల మందికే వస్తున్నాయన్నారు. రోజురోజుకు పెరుగుతున్న ధరలతో వారు ఎలా బతుకుతారని ప్రశ్నించారు. మానవతా దృక్పథంతో సీఎం ఆలోచన చేయాలని సూచించారు. 2016 ఆర్‌పీడీ చట్టం గుర్తించిన 21 రకాల వైకల్యాలలో పాత ఏడింటికే సర్టిఫికెట్లు ఇస్తున్నారని తెలిపారు. కొత్తగా గుర్తించిన 14 రకాల వైకల్యాల వారికి కూడా సర్టిఫికెట్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఏడాది కాలంలో వేల ఉద్యోగాలిచ్చామని ప్రభుత్వం చెబుతోంది కదా? అందులో చట్టబద్ధంగా వికలాంగులకు రావాల్సిన వాటా ప్రకారం ఎందుకు ఇవ్వలేదని ప్రశ్నించారు. వారికి సమాన అవకాశాలు కల్పించడంలో పాలకులు నిర్లక్ష్యం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వికలాంగులను విస్మరించిన పార్టీలకు పుట్టగతులుండబోవని ఇప్పటికే రుజువైందని గుర్తు చేశారు. పింఛన్ పెంపుకోసం సీఎంను కలుస్తామనీ,



ఆ దిశగా ప్రభుత్వంపై ఒత్తిడి చేస్తామని చెప్పారు.

ఐద్వా రాష్ట్ర ఉపాధ్యక్షులు జ్యోతి మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికల్లో వికలాంగులకిచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. మహిళా వికలాంగులు సమాజంలో వివక్షకు గురవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. మహిళలతో పాటు వికలాంగులకు ఉచిత ప్రయాణ సౌకర్యం అమలు చేయాలని డిమాండ్ చేశారు. పెండ్లితో సంబంధం లేకుండా అంత్యోదయ రేషన్ కార్డులు జారీ చేయాలన్నారు. ఇందిరమ్మ ఇండ్లలో వికలాంగులకు మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని డిమాండ్ చేశారు.

అడివయ్య మాట్లాడుతూ వికలాంగుల పింఛన్‌ను రూ. ఆరు వేలకు పెంచి, 2024 జనవరి నుండే అమలు చేయాలని డిమాండ్ చేశారు. కొత్తగా దరఖాస్తు చేసిన వారికి వెంటనే పింఛన్‌ను మంజూరు చేయాలన్నారు. ఉద్యోగ నియామకాల్లో శారీరక వికలాంగుల జాబ్ రోస్టర్‌ను 56 నుంచి 10కి మార్చేందుకు 1996 స్టేట్ సబార్డినేట్ సర్వీస్ రూల్స్‌కు సవరణ చేయాలని డిమాండ్ చేశారు. నామినేటెడ్ పదవులతో పాటు స్థానిక సంస్థల్లో రిజర్వేషన్‌ను కల్పించేందుకు అసెంబ్లీలో ప్రత్యేక చట్టం చేయాలనీ, వికలాంగుల ఉద్యోగులకు ప్రమోషన్లలో రిజర్వేషన్‌ను అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు. 2016 ఆర్‌పీడీ చట్టంతో పాటు మెంటల్ హెల్త్‌కేర్ యాక్ట్ 2017, నేషనల్ పాలసీ, నేషనల్ ట్రస్ట్ చట్టాలను పటిష్టంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు.

టీడీపీ సీనియర్ నాయకులు సాయిబాబా మాట్లాడుతూ ఏపీలో వికలాంగులకు పింఛన్‌ను పెంచి అమలు చేస్తుంటే తెలంగాణలో ఎందుకు పెంచడం లేదని ప్రశ్నించారు. తీవ్ర వైకల్యమున్న వారికి రూ. 20వేలు ప్రత్యేక అలవెన్స్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర కోశాధికారి ఆర్ వెంకటేష్, రాష్ట్ర ఉపాధ్యక్షలు యశోద, స్వామి, బస్వరాజు, దశరథ్, అరిఫా, సహాయ కార్యదర్శులు రాజు, నాగలక్ష్మి, గంగాధర్, నర్సింహులు, లింగన్న, కాషప్ప, రాష్ట్ర కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

పాఠ్యపుస్తకాల్లో 'జయజయహే తెలంగాణ' రాష్ట్ర గీతం

- తెలంగాణ తల్లి విగ్రహానికీ చోటు
- పాఠశాల విద్యాశాఖ నిర్ణయం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో ఒకటి నుంచి పదో తరగతి విద్యార్థులకు పంపిణీ చేసే పాఠ్యపుస్తకాల్లో జయ జయహే తెలంగాణ, జననీ జయ కేతనం రాష్ట్ర గీతం పొందుపర్చాలని ప్రభుత్వం నిర్ణయించింది. తెలంగాణ తల్లి విగ్రహానికి కూడా చోటు కల్పించనుంది. జయ జయహే తెలంగాణ రాష్ట్ర గీతంతోపాటు తెలంగాణ తల్లి విగ్రహాన్ని రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా గుర్తించిన విషయం తెలిసిందే. దీంతో వాటిని పాఠ్యపుస్తకాల్లో చేర్చాలని పాఠశాల విద్యాశాఖ నిర్ణయం తీసుకున్నది. వచ్చే విద్యాసంవత్సరం (2025-26)లో విద్యార్థులకు పంపిణీ చేసే పాఠ్యపుస్తకాల్లో తెలంగాణ రాష్ట్ర గీతం, తెలంగాణ తల్లి విగ్రహం ముద్రించి ఇవ్వనున్నారు. పాఠ్యపుస్తకాల్లో ప్రతిజ్ఞతోపాటు జాతీయ గీతం జనగణమన, జాతీయ గేయం వందేమాతరం ముద్రిస్తున్నారు. వచ్చే విద్యాసంవత్సరం నుంచి వాటితోపాటు రాష్ట్రగీతం, తెలంగాణ తల్లి విగ్రహం కూడా పాఠ్యపుస్తకాల్లో ముద్రించి విద్యార్థులకు పంపిణీ చేస్తారు. 2014, జూన్ రెండున తెలంగాణ ప్రత్యేక రాష్ట్రంగా ఆవిర్భవించింది. కానీ పదేండ్ల పాటు బీఆర్ఎస్ ప్రభుత్వం తెలంగాణ గీతాన్ని అధికారికంగా ప్రకటించలేదు. తెలంగాణ ఉద్యమంలో జయ జయహే తెలంగాణ గీతం ప్రజలందరి మన్ననలు పొందినప్పటికీ అప్పటి ప్రభుత్వం దాన్ని అధికారిక గీతంగా ప్రకటించలేదు. నాటి ప్రభుత్వం తెలంగాణ తల్లి విగ్రహాన్ని రూపొందించినా అధికారికంగా నిర్ణయం తీసుకోలేదు. ఎలాంటి ఉత్తర్వులను జారీ చేయలేదు. 2023, డిసెంబర్ ఏడున రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేశారు. తెలంగాణ గీతంపై ప్రత్యేకంగా శ్రద్ధ వహించారు. అందెశ్రీ రచించిన జయ జయహే తెలంగాణ జననీ జయ కేతనం పాటను రాష్ట్ర గీతంగా ఈ ఏడాది ఫిబ్రవరి ఐదో తేదీన క్యాబినెట్ ఆమోదించింది. పూర్తి గీతం 13.30 నిమిషాల నిడివితో ఉన్నది. రాష్ట్ర అధికారిక కార్యక్రమాల్లో ఆలపించడానికి వీలుగా రాష్ట్ర గీతాన్ని 2.30 నిమిషాల నిడివితో మూడు చరణాలతో ఆస్కార్ అవార్డు గ్రహీత ఎంఎం కీరవాణి బృందం ప్రత్యేకంగా స్వరపరిచింది. రాష్ట్ర ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాల సందర్భంగా జూన్ రెండున రాష్ట్ర గీతాన్ని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి జాతికి అంకితం చేశారు. ఏడాది పాలన పూర్తయిన సందర్భంగా తెలంగాణ తల్లి విగ్రహాన్ని డిసెంబర్ తొమ్మిదిన డాక్టర్ బిఆర్ అంబేద్కర్ సచివాలయంలో సీఎం రేవంత్‌రెడ్డి ఆవిష్కరించారు. అదేరోజు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సీఎస్) శాంతికుమారి జీవో నెంబర్ 1946ను విడుదల చేశారు. ఏటా తెలంగాణ తల్లి ఆవిర్భావ దినోత్సవ ఉత్సవాలను రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. తెలంగాణ తల్లి విగ్రహంలో మార్పులు చేయాలన్న ఆలోచన చేస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించింది. జయ జయహే తెలంగాణ రాష్ట్ర గీతాన్ని, తెలంగాణ తల్లి విగ్రహాన్ని రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా గుర్తించడంతో పాఠ్యపుస్తకాల్లో చేర్చుతున్నట్టు పాఠశాల విద్యాశాఖ సంచాలకులు ఈవి నరసింహారెడ్డి తనను కలిసిన విలేకర్లకు చెప్పారు. 2026-27 విద్యాసంవత్సరంలో సిలబస్‌లో మార్పులుంటాయని వివరించారు. నేషనల్ కర్రికులమ్ ఫ్రేమ్‌వర్క్ (ఎన్‌సీఎఫ్)కు అనుగుణంగా రాష్ట్రస్థాయిలోనూ పాఠ్యాంశాలను రూపకల్పన చేస్తామని అన్నారు. రాష్ట్రంలో ఉండే ప్రత్యేకతలు, చరిత్ర, సాంస్కృతిక అంశాలను చేర్చే అంశాలను అధ్యయనం చేస్తామని వివరించారు. విద్యార్థులకు పంపిణీ చేసే పాఠ్యపుస్తకాల్లో తప్పుల నివారణకు జిల్లా స్థాయిలో సబ్జెక్టు నిపుణులతో పరిశీలన చేయించామని చెప్పారు. రాష్ట్రంలో ప్రస్తుత విద్యాసంవత్సరం (2024-25)లో 29,541 ప్రభుత్వ పాఠశాలల్లో 23,91,813 (40.76 శాతం) మంది విద్యార్థులు చదువుతుండగా, 11,890 ప్రయివేటు పాఠశాలల్లో 34,75,781 (59.24 శాతం) మంది చదువుతున్నారు. మొత్తం 41,431 పాఠశాలల్లో 58,67,594 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు.

పోడు సాగుకు సోలార్ పవర్

(మొదటిపేజీ తరువాయి)

పెట్టుకున్న దరఖాస్తులకు పరిష్కారం లభించిందని లబ్దిదారులు సంతోషాన్ని వ్యక్తం చేయడం ఆనందంగా ఉందన్నారు. ప్రజలకు జవాబుదారీగా ప్రజావాణిలో వచ్చిన ప్రతి దరఖాస్తును కంప్యూటరైజ్డ్ చేసి సంబంధిత అధికారులకు పంపిస్తున్నామని పేర్కొన్నారు. అనంతరం ఫిర్యాదుదారుల సమస్య పరిష్కారం కోసం సంబంధిత అధికారి తీసుకున్న నిర్ణయాలను ప్రజలకు చెప్పేలా పర్యవేక్షణ చేస్తున్నామని వివరించారు. పదేండ్ల అధికారంలో ఉన్న బీఆర్ఎస్ ప్రజల ఆకాంక్షలు నెరవేర్చకపోగా, ప్రగతిని 70 ఏండ్లు వెనక్కి తీసుకెళ్లిందని విమర్శించారు, భావ స్వేచ్ఛ, ప్రగతిశీల ఆలోచనలకు స్థానం లేకుండా తెలంగాణను తమ గుప్పిట్లో బంధించి పాలన అందించారని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో వచ్చిన అటవీ హక్కుల చట్టాన్ని తుంగలో తొక్కడమే కాకుండా పోడు రైతుల సమస్యలను గత పాలకులు పట్టించుకోలేదని విమర్శించారు.

ఎందుకలా..?

- ఓ వర్గంపై అలహాబాద్ హైకోర్టు న్యాయమూర్తి వివాదాస్పద వ్యాఖ్యలు
- విచారణ చేపట్టిన 'సుప్రీం'

న్యూఢిల్లీ : అలహాబాద్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ శేఖర్ కుమార్ యాదవ్ వివాదాస్పద వ్యాఖ్యలను సుప్రీంకోర్టు సుమోటోగా తీసుకొని విచారణ చేపట్టింది. ఆయన ప్రసంగంపై అలహాబాద్ హైకోర్టును సమాచారం ఇవ్వాలని ఆదేశించింది. విశ్వహిందూ పరిషత్ లీగల్ సెల్ ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో జస్టిస్ శేఖర్ యాదవ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన ఓ వర్గంపై చేసిన వ్యాఖ్యలపై వివాదం చెలరేగింది. జ్యుడీషియల్ అకౌంటబిలిటీ అండ్ రిఫార్మ్స్ (సీజేఏఆర్) అనే సంస్థ సీజేఐ జస్టిస్ సంజీవ్ ఖన్నాకు లేఖ రాసింది. హైకోర్టు జడ్జిపై అంతర్గత విచారణ జరపాలని సంస్థ కన్వీనర్ ప్రశాంత్ భూషణ్ డిమాండ్ చేశారు. ఆయన న్యాయనైతికత, రాజ్యాంగ సూత్రాలను ఉల్లంఘించారని ఆరోపించారు. ఓ వర్గాన్ని కించపరిచే పదాలను సైతం ఉపయోగించారని లేఖలో ప్రస్తావించారు. ఈ వ్యాఖ్యలతో అలహాబాద్ హైకోర్టు న్యాయమూర్తి పదవికి, న్యాయవ్యవస్థకు చెడ్డపేరు వచ్చిందన్నారు.

మొండి బాకీలు రూ. 4.5 లక్షల కోట్లు

(మొదటిపేజీ తరువాయి)

రికవరీ విలువ రూ.3.55 లక్షల కోట్లుగా ఉందన్నారు.

ఆరు నెలల్లో రూ.42వేల కోట్ల రుణాలు రద్దు

ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి ఆరు మాసాల్లో ఏకంగా రూ.42 వేల కోట్ల మొండి బాకీలను రద్దు చేసినట్టు పంకజ్ చౌదరి మరో ప్రశ్నకు సమాధానంగా తెలిపారు. ఏప్రిల్ నుంచి సెప్టెంబర్‌తో ముగిసిన కాలంలో స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్బీఐ) అత్యధికంగా రూ.8,312 కోట్లు, పంజాబ్ నేషనల్ బ్యాంక్ రూ.8,061 కోట్లు, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రూ.6,344 కోట్లు, బ్యాంక్ ఆఫ్ బరోడా రూ.5,925 కోట్లు చొప్పున అప్పులను మాఫీ చేశాయి. అయినప్పటికీ బ్యాంక్‌లు రుణగ్రహీతల నుంచి తిరిగి రికవరీ చేయడానికి ప్రయత్నిస్తాయని మంత్రి పేర్కొన్నారు. గడిచిన ఆర్థిక సంవంత్సరం 2023-24లో ప్రభుత్వ రంగ బ్యాంకులు మొత్తంగా రూ.1.14 లక్షల కోట్ల మొండి బాకీలను రద్దు చేయగా.. ఇంతక్రితం 2022-23లో రూ.1.18 లక్షల కోట్లు మాఫీ చేశాయని చౌదరి వెల్లడించారు.

ఫోన్ లాగేసుకున్నారు : ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

తన ఫోన్‌ను మాసబ్‌ట్యాంక్ పోలీసులు ఈ నెల ఆరోతేదీన బలవంతంగా లాగేసుకున్నారని బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి హైకోర్టులో లంచ్‌మోషన్ పిటిషన్ వేశారు. 50 మంది పోలీసులు ఇంట్లోకి వచ్చి ఫోన్ తీసుకున్నారనీ, రశీదు కూడా ఇవ్వలేదని పిటిషన్ దాఖలు చేశారు. దానిని మంగళవారంనాడు జస్టిస్ విజయ్‌సేన్‌రెడ్డి విచారించారు. వేరే కేసులో ప్రభుత్వంపై కుట్ర చేశారనే అభియోగాలున్నాయనీ, ఫోన్‌ను ఎఫ్ఎస్ఎల్‌కు పంపామని ప్రభుత్వం చెప్పింది. ఫోన్‌ను తిరిగి ఇచ్చే విషయంపై ప్రభుత్వం, పోలీసులు గురువారం జరిగే విచారణలో వివరణ ఇవ్వాలని హైకోర్టు ఆదేశించింది.

ఆశాల ఫిక్స్‌డ్ వేతనంపై ప్రతిపాదనలు




(మొదటిపేజీ తరువాయి)

సిద్ధం చేస్తున్నట్టు అధికారులు హామీ ఇవ్వడంపై తాము చేపట్టిన చలో హైదరాబాద్ కార్యక్రమం విజయవంతమైందన్నారు. హైదరాబాద్ కోఠి వైద్య ఆరోగ్య శాఖ కమిషనర్ కార్యాలయం ఆవరణలో మంగళవారం యూనియన్ ఆధ్వర్యంలో పెద్దఎత్తున ధర్నా నిర్వహించారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల నుంచి తరలివచ్చిన ఆశాలు ర్యాలీగా కార్యాలయానికి చేరుకున్నారు. కొంతమంది రోడ్డుపై బైటాయించడంతో ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. అప్రమత్తమైన ఈస్టర్ జాయింట్ డీసీపీ నరసయ్య, ఏసీపీ శంకర్, ఈస్ట్ జోన్ ట్రాఫిక్ ఏసీపీ సంపత్ కుమార్, సుల్తాన్ బజార్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసచారి, ఎస్ఐలు నరేష్, మధుసూదన్, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ రాంబాబు, ఇతర అధికారులు వారికి నచ్చజెప్పి రోడ్డును క్లియర్ చేశారు. ఈ సందర్భంగా జయలక్ష్మి మాట్లాడుతూ.. ఆశా వర్కర్లకు ఫిక్స్‌డ్ వేతనం రూ.18 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం తన మ్యానిఫెస్టోలో పొందుపరిచిన హామీలను, ఫిబ్రవరి 9న, జులై 30న ఆరోగ్యశాఖ కమిషనర్ ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని కోరారు. గతంలో ఇచ్చిన హామీ ప్రకారం ఆశాలకు ఇన్సూరెన్స్ రూ.50 లక్షలు చెల్లిస్తూ ఉత్తర్వులు జారీ చేయాలన్నారు. ఆదివారం, పండుగ సెలవులు ఇవ్వాలని కోరారు. ఆశాలకు ప్రతి సంవత్సరం 20 రోజులు వేతనంతో కూడిన క్యాజువల్ సెలవులు ఇవ్వాలన్నారు. ఆరు నెలల వేతనంతో కూడిన మెడికల్ సెలవులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఈనెల 16న నుంచి జరగబోయే అసెంబ్లీ సమావేశాల్లో ఆశా వర్కర్ల సమస్యలపై సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడాలని కోరారు. ఫిక్స్‌డ్ రూ.18 వేలు వేతనం, పీఎఫ్, ఈఎస్ఐ, ఉద్యోగ భద్రత కల్పిస్తున్నట్టు ప్రకటించాలన్నారు. అధికారులు ఇచ్చిన హామీలపై జీఓలు విడుదల చేయాలని కోరారు. ఏఎన్ఎం ట్రైనింగ్ పూర్తిచేసిన ఆశా వర్కర్లకు ఏఎన్ఎం, జీఎన్ఎమ్ పోస్టుల్లో ప్రమోషన్ కల్పించాలన్నారు. సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి జె.వెంకటేష్ మాట్లాడుతూ.. హక్కుల సాధనకు పోరాడాలని పిలుపునిచ్చారు.

జిల్లాల్లో అరెస్టులు

చలో హైదరాబాద్‌కు వెళ్లే ఆశాలను, సీఐటీయూ నాయకులను ఎక్కడికక్కడ నిర్బంధించడం, అరెస్టు చేయడాన్ని సీఐటీయూ ఆదిలాబాద్ జిల్లా అధ్యక్షులు బొజ్జ ఆశన్న తీవ్రంగా ఖండించారు. బస్టాండ్ వద్ద నిరసన తెలిపి ప్రభుత్వ దిష్టిబొమ్మను దగ్ధం చేయడానికి ప్రయత్నించారు. పోలీసులు అడ్డుకోవడంతో స్వల్ప తోపులాట జరిగింది. నిర్మల్ జిల్లా ఆశా కార్యకర్తలను తూప్రాన్ పోలీసులు మధ్యలో అడ్డుకొని అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. మంచిర్యాల జిల్లా నస్పూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఎదుట ఆశా కార్యకర్తలు నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలిపారు. జన్నారం మండలానికి చెందిన ఆశా కార్యకర్తలను అరెస్టు చేశారు. ఇండ్లలో ఉన్నవారిని అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

ఖమ్మం జిల్లా రఘునాథపాలెం తహసీల్దార్ కార్యాలయం ప్రధాన రహదారిపై సీఐటీయూ ఆధ్వర్యంలో ఆశాలు ఆందోళన చేశారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేటలో ఆశాలను అదుపులోకి తీసుకున్న పోలీసులు.. అనంతరం విడుదల చేశారు.

ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో ఆశావర్కర్లను ముందస్తుగా పోలీసులు అరెస్టు చేశారు. కొత్తూరులో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు బిసా సాయిబాబుతోపాటు ఆశావర్కర్లను అరెస్టు చేసి పీఎస్‌కు తరలించారు. నాగర్‌కర్నూల్ జిల్లా పరిధిలోని తెలకపల్లి, కందనూలు మండలాల్లో ఆశా వర్కర్లను, సీపీఐ(ఎం) మండల కార్యదర్శి గోపాసు లక్ష్మణ్, సీఐటీయూ నాయకులు ఎం.విజయ గౌడ్‌ను సోమవారం అర్ధరాత్రి అరెస్టు చేశారు. జోగులాంబ గద్వాల జిల్లా కేంద్రంలో చైతన్య మహిళా సంఘం రాష్ట్ర కన్వీనర్ జ్యోతి, అధ్యక్షులు, ఆశా వర్కర్ల యూనియన్ నాయకులు జయమ్మ, కార్యదర్శి రేవతి, నర్సమ్మ, పార్వతిని అరెస్టు చేశారు.

ఉమ్మడి మెదక్ జిల్లా నుంచి చలో హైదరాబాద్‌కు తరలివెళ్తున్న సీఐటీయూ, ఆశా వర్కర్లను పోలీసులు ముందస్తుగా అరెస్టు చేశారు. సోమవారం రాత్రి నుంచి మంగళవారం ఉదయం వరకు అరెస్టు చేసిన సీఐటీయూ నాయకులను, ఆశా వర్కర్లను పోలీస్‌స్టేషన్‌లకు తరలించారు. సంగారెడ్డి జిల్లా కేంద్రంలో సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి ఎం.యాదగిరిని, మెదక్ జిల్లాలో మనోహరాబాద్‌లో సీఐటీయూ జిల్లా అధ్యక్షులు ఏ.మహేందర్ రెడ్డి, నాయకులు, ఆశావర్కర్లను అరెస్టు చేశారు. సిద్దిపేట జిల్లా మద్దూర్‌లో సీపీఐ(ఎం) జిల్లా కమిటీ సభ్యులు ఆలేటి యాదగిరి, మిర్‌దొడ్డిలో ఆశావర్కర్ల మండల అధ్యక్షులు బాలమణి, సిద్దిపేటలో సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి తునికి మహేష్‌ను, నాయకులను పోలీసులు అరెస్టు చేశారు. నల్లగొండ జిల్లా కేంద్రంలో ఆశాలను సోమవారం అర్ధరాత్రి అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించారు. అరెస్టయిన వారిలో సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి దండెంపల్లి సత్తయ్య, ఆశా కార్యకర్తలు ఉన్నారు. అదేవిధంగా చిట్యాల, మిర్యాలగూడ, నాంపల్లి, చిట్యాల మండలాల్లో ఆశాకార్యకర్తలను అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించారు. సూర్యాపేట జిల్లా మునగాల నుంచి హైదరాబాద్ బయలుదేరిన ఆశాలను మునగాల ఎస్ఐ ప్రవీణ్ కుమార్ అరెస్టు చేశారు. మఠంపల్లిలో సీఐటీయూ ఆధ్వర్యంలో ఆశా వర్కర్లు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ముందు ధర్నా చేశారు. డాక్టర్ సుధాకర్ నాయక్ వినతిపత్రం అందించారు.

యూనియన్ ప్రతినిధులతో కమిషనర్ చర్చలు

ఈ సందర్భంగా వైద్య ఆరోగ్యశాఖ కమిషనర్ కర్ణన్ యూనియన్ ప్రతినిధులతో చర్చలు జరిపారు. డిమాండ్లపై నిర్దిష్టమైన ప్రతిపాదనతో కూడిన ఫైల్‌ను ప్రభుత్వానికి పెడతామని, పరిష్కారం చేసే దిశగా కృషి చేస్తానని కమిషనర్ తెలిపారు. అలాగే, వైద్య ఆరోగ్యశాఖ జాయింట్ డైరెక్టర్ రాజేశం, కృష్ణవేణి ధర్నా వద్దకు వచ్చి ఆదివారం, పండుగ సెలవులు ఈ రోజు నుంచే అమలు చేస్తామని ప్రకటించారు. కేసుల టార్గెట్స్ రద్దు చేస్తున్నామని, టీబీ స్పుటమ్ డబ్బాలు మోసే విధానాన్ని రద్దు చేస్తున్నట్టు తెలిపారు. లెప్రసీ, పల్స్ పోలియో పెండింగ్ డబ్బులను త్వరలోనే చెల్లిస్తామని హామీ ఇచ్చారు. ఆశాలు సెలవులు కావాలంటే ఏఎన్ఎంకు చెప్పి తీసుకోవచ్చని చెప్పారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ హైదరాబాద్ సెంట్రల్ కార్యదర్శి ఎం.వెంకటేష్, హైదరాబాద్ సౌత్ అధ్యక్షులు ఎం.మీనా, ఆశాల యూనియన్ రాష్ట్ర నాయకులు యాదమ్మ, పద్మ, కె.సునీత, బుచ్చమ్మ, సాధన, కళావతి, బాలామణి, ధనలక్ష్మి, మహేశ్వరి, మంజుల, వరలక్ష్మి, ప్రవీణ, సావిత్రి, హేమలత, సరస్వతి, మంగ తదితరులు పాల్గొన్నారు.

సాధన షురూ!

నెట్స్‌లో భారత క్రికెటర్ల ప్రాక్టీస్
14 నుంచి ఆసీస్‌తో మూడో టెస్టు



నవతెలంగాణ-అడిలైడ్

బోర్డర్ గవాస్కర్ ట్రోఫీ ఆసక్తికరంగా మారింది. పెర్త్ టెస్టులో భారత్ 295 పరుగుల తేడాతో ఘన విజయం సాధించగా.. అడిలైడ్ టెస్టులో 10 వికెట్ల తేడాతో గెలుపొందిన ఆస్ట్రేలియా లెక్క సమం చేసింది. ప్రపంచ క్రికెట్‌లో అగ్రజట్లు, సమవుజ్జీల సమరం ప్రస్తుతం 1-1తో రసకందాయంలో పడింది. స్వదేశంలో వెనుకంజ వేసినా.. పుంజుకోవటం కంగారూలకు కొత్త విషయం. కానీ విదేశీ పర్యటనల్లో భారత్ వెనుకంజ వేసినా పుంజుకున్న సందర్భాలు ఎక్కువ. భారత్, ఆస్ట్రేలియా మూడో టెస్టు ఈ నెల 14 నుంచి బ్రిస్బేన్‌లో ఆరంభం కానుంది. 2018-19, 2020-21 పర్యటనల్లో ఆసీస్‌పై అసమాన విజయాలు సాధించి సిరీస్ సొంతం చేసుకున్న టీమ్ ఇండియా.. తాజా పర్యటనలో హ్యాట్రిక్‌పై కన్నేసింది. పింక్ బాల్ టెస్టు పరాజయం నుంచి బయటపడిన రోహిత్‌సేన.. మంగళవారం నెట్స్‌లో సాధన షురూ చేసింది.

ప్రాక్టీస్ మొదలైంది

భారత క్రికెట్ విజయావకాశాలను బ్యాటర్లే ఎక్కువగా మోశారు. ఇప్పుడు పరిస్థితులు తారుమారు అయ్యాయి. గెలుపు భారం ప్రధానంగా బౌలర్లపై పడుతోంది. స్వదేశీ, విదేశీ టెస్టులో సంబంధం లేకుండా బ్యాటింగ్ లైనప్ నిలకడగా నిరాశపరుస్తోంది. పేసర్లు, స్పిన్నర్లు మెరిస్తేనే టీమ్ ఇండియా గెలుపు దిశగా సాగుతోంది. అడిలైడ్ టెస్టులో బౌలర్లు సైతం అంచనాలను అందుకోలేదు. ఫలితంగా, భారత్ దారుణ పరాజయం చవిచూసింది. సాధారణంగా ఆస్ట్రేలియా గడ్డపై తొలి ఇన్నింగ్స్‌లో పరుగుల వేట కష్టసాధ్యం. భారత్ సహా ఇతర జట్లు సైతం కంగారూలపై తొలి ఇన్నింగ్స్‌లో తడబాటుకు గురయ్యాయి. టీమ్ ఇండియా తొలి ఇన్నింగ్స్ బలహీనత అధిగమించాలి. అప్పుడే, చివరి మూడు టెస్టుల్లో ఆతిథ్య ఆసీస్‌పై ఒత్తిడి పెంచడానికి అవకాశం ఏర్పడుతుంది. సీనియర్ బ్యాటర్లు విరాట్ కోహ్లి, రోహిత్ శర్మ ఈ బాధ్యతను తీసుకోవాలి. యువ బ్యాటర్లు యశస్వి జైస్వాల్, శుభ్‌మన్ గిల్ మెరిస్తే ఈ సమస్య నుంచి భారత్ గట్టెక్కటం పెద్ద విషయం కాబోదు.

అడిలైడ్ టెస్టు మూడు రోజుల్లోనే ముగియటంతో.. మంగళవారం భారత క్రికెటర్లు మళ్లీ మైదానంలోకి అడుగుపెట్టారు. బ్యాటర్లు, బౌలర్లు అందరూ ప్రాక్టీస్ సెషన్‌లో పాల్గొన్నారు. యశస్వి జైస్వాల్, రిషబ్ పంత్, కెఎల్ రాహుల్ సహా విరాట్ కోహ్లి, రోహిత్ శర్మ, శుభ్‌మన్ గిల్, వాషింగ్టన్ సందర్‌లు నెట్స్‌లో బ్యాటింగ్ సాధన చేశారు. త్రోడౌన్స్‌లో పేస్, స్పిన్‌ను ఆడారు. విరాట్ కోహ్లితో చీఫ్ కోచ్ గౌతం గంభీర్ మాట్లాడుతూ కనిపించారు. చీఫ్ సెలక్టర అజిత్ అగార్కర్, బౌలింగ్ కోచ్ మోర్కెల్‌లు ప్రాక్టీస్ సెషన్‌ను పరిశీలించారు. పేస్ దళపతి జశ్‌ప్రీత్ బుమ్రా, మహ్మద్ సిరాజ్‌లు జిమ్ సెషన్‌లో కసరత్తులు చేశారు. శనివారం నుంచి మూడో టెస్టు ఆరంభం కానుండగా.. నేడు భారత జట్టు బ్రిస్బేన్‌కు వెళ్లనుంది!.

షమి వస్తాడా?!

స్టార్ పేసర్ మహ్మద్ షమి ఆస్ట్రేలియాతో టెస్టులకు వస్తాడా? అనేది ఇంకా సస్పెన్స్‌గానే ఉంది. 2023 వన్డే వరల్డ్‌కప్ ఫైనల్ తర్వాత చీలమండ గాయానికి శస్త్రచికిత్స చేయించుకున్న షమి.. రిహాబిలిటేషన్ ముగించుకుని దేశవాళీ క్రికెట్‌లో రీ ఎంట్రీ ఇచ్చాడు. సయ్యద్ ముస్తాక్ అలీ టీ20 టోర్నీలో బెంగాల్ తరఫున ఆల్‌రౌండ్ షోతో మెప్పించాడు. దీంతో చివరి మూడు టెస్టులకు మహ్మద్ షమి జట్టులోకి వస్తాడనే అంచనాలను ఎక్కువయ్యాయి. అడిలైడ్ టెస్టులో బుమ్రాకు సరైన జోడీ కరువైంది. దీంతో షమిపై అందరి ఫోకస్ నెలకొంది. 'షమి జట్టులోకి వచ్చి ఆడేందుకు తలుపులు తెరిచే ఉంటాయి. కానీ దేశవాళీ మ్యాచ్‌లో షమి గాయానికి వాపు వచ్చింది. కాస్త నొప్పి కూడా ఉన్నట్టు తెలిసింది. వైద్య నిపుణులు షమి ఫిట్‌నెస్‌ను పర్యవేక్షిస్తున్నారు. అతడిపై ఎటువంటి ఒత్తిడి పెట్టాలని అనుకోవటం లేదు. వైద్య బృందం క్లియరెన్స్ లభిస్తే షమి రాకకు సర్వం సిద్ధంగా ఉంది' అని రోహిత్ శర్మ అన్నాడు.


నేడు టీఓఏ ఎన్నికల ఫలితాలు

ఓట్ల లెక్కింపునకు న్యాయస్థానం గ్రీన్‌సిగ్నల్

హైదరాబాద్ : తెలంగాణ ఒలింపిక్ సంఘం (టీఓఏ) ఎన్నికల ఈ నెల 21న ముగియగా, ఓట్ల లెక్కింపు ఫలితాల వెల్లడిపై సిటీ సివిల్ కోర్టు స్టే విధించిన సంగతి తెలిసిందే. ఎన్నికల ఫలితాలు, ఓట్ల లెక్కింపు ప్రక్రియపై తెలంగాణ ఒలింపిక్ సంఘం న్యాయస్థానాన్ని ఆశ్రయించగా తాజాగా గ్రీన్ సిగ్నల్ లభించినట్టు టీఓఏ ప్రధాన కార్యదర్శి జగదీశ్ యాదవ్ తెలిపారు. ఎల్బీ స్టేడియంలోని ఒలింపిక్ భవన్‌లో నేడు ఉదయం 10.30 గంటలకు ఓట్ల లెక్కింపు ప్రారంభం కానుంది. అధ్యక్ష పదవికి ఏపీ జితేందర్ రెడ్డి, చాముండేశ్వరనాథ్‌లు పోటీపడగా.. ప్రధాన కార్యదర్శి పదవికి మల్లారెడ్డి, బాబు రావు పోటీపడగా, కోశాధికారి పదవి కోసం సతీశ్ గౌడ్, ప్రదీప్ కుమార్‌లు పోటీపడ్డారు. ఉపాధ్యక్ష పదవులు సహా ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ సభ్యులు ఇప్పటికే ఏకగ్రీవమైన సంగతి తెలిసిందే. నూతనంగా ఎన్నిక కానున్న ఆఫీస్ బేరర్లు నాలుగేండ్ల పాటు పదవిలో కొనసాగుతారు.

నవచిత్రం

సంక్రాంతి బరిలోకి సై..



బాలకృష్ణ

బాలకృష్ణ, దర్శకుడు బాబీ కొల్లి కాంబినేషన్‌లో సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ నిర్మిస్తున్న చిత్రం 'డాకు మహారాజ్'. తాజాగా ఈ సినిమా చిత్రీకరణ పూర్తయిందని నిర్మాతలు ప్రకటించారు. ముందుగా ప్రకటించినట్లుగానే సంక్రాంతి కానుకగా చిత్రాన్ని విడుదల చేయనున్నట్లు స్పష్టం చేశారు. ఈ సందర్భంగా 'డాకు ఇన్ యాక్షన్' పేరుతో చిత్రీకరణ సమయంలోని ఒక ఫొటోని విడుదల చేశారు నిర్మాతలు. ఆ ఫొటోలో దర్శకుడు బాబీ కీలక సన్నివేశం గురించి వివరిస్తుండగా, బాలకృష్ణ శ్రద్ధగా వింటూ కనిపించారు.
బాలీవుడ్ నటుడు బాబీ డియోల్ ఈ చిత్రంలో కీలక పాత్ర పోషిస్తున్నారు. ఎస్.థమన్ సంగీతం అందిస్తుండగా, విజయ్ కార్తీక్ కన్నన్ కెమెరా, కళా దర్శకుడిగా అవినాష్ కొల్లా, ఎడిటర్‌గా నిరంజన్ దేవరమానే బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు.
ఈ చిత్రాన్ని సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్‌ఫోర్ సినిమాస్ పతాకాలపై సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మిస్తున్నారు. శ్రీకర స్టూడియోస్ సమర్పిస్తోంది. ఈ చిత్రం సంక్రాంతి కానుకగా జనవరి 12న ప్రపంచవ్యాప్తంగా భారీస్థాయిలో విడుదల కానుంది.


'గేమ్ ఛేంజర్'లో రామ్‌చరణ్

గొప్ప గౌరవంగా భావిస్తున్నా : మహేష్‌బాబు

'ముఫాసా: ది లయన్ కింగ్'లో ముఫాసాకు వాయిస్ ఓవర్ ఇచ్చిన మహేష్ బాబు ఈ సినిమా, పాత్ర కోసం ఎంతలా ఎదురు చూస్తున్నారో సోషల్ మీడియా వేదికగా రిలీజ్ చేశారు. మోస్ట్ ఎవైటెడ్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ 'ముఫాసా: ది లయన్ కింగ్' ఈనెల 20న ఇండియాలో ఇంగ్లీష్, హిందీ, తమిళం, తెలుగు భాషలలో విడుదల కానుంది. బారీ జెంకిన్స్ డైరెక్ట్ చేసిన ఈ చిత్రం 2019లో లైవ్-యాక్షన్ 'ది లయన్ కింగ్' బ్లాక్ బస్టర్ విజయాన్ని కొనసాగిస్తూ ప్రేక్షకులను అలరించబోతోంది.
తెలుగు డబ్బింగ్ వెర్షన్‌లో 'ముఫాసా'కి హీరో మహేష్ బాబు వాయిస్ ఇచ్చారు. టాకా పాత్రకు హీరో సత్యదేవ్, టిమోన్ పాత్రకు అలీ, పుంబా పాత్రకు బ్రహ్మానందం, కిరోస్ పాత్రకు అయ్యప్ప పి శర్మ వాయిస్ అందించారు.
ముఫాసా: ది లయన్ కింగ్‌కి వాయిస్ ఇవ్వడం గురించి మహేష్ బాబు తన ఎగ్జైట్‌మెంట్‌ని షేర్ చేసుకున్నారు.
'ముఫాసా ఇప్పటివరకు వచ్చిన అత్యంత పాపులర్ పాత్రలలో ఒకటి. ఇది నాకు ఒక డ్రీమ్ కమ్ ట్రూగా భావిస్తున్నాను. నేను ఎప్పటి నుంచో చూస్తున్న పాత్రల్లో ముఫాసా ఒకటి. ముఫాసా తన కుటుంబాన్ని చూసుకునే విధానం అద్భుతం. అది నాకు చాలా బాగా నచ్చింది. ఈ పాత్రకు వాయిస్ ఇవ్వడం నిజంగా ఒక గౌరవం, ప్రతి తరానికి ఇష్టమైన పాత్ర ముఫాసా అని నేను అనుకుంటున్నాను. ప్రేక్షకులు తమ కుటుంబ సభ్యులతో కలిసి సినిమా చూస్తారని ఆశిస్తున్నా' అని మహేష్‌బాబు పోస్ట్‌లో పేర్కొన్నారు.


మహేష్‌బాబు

'ప్రణయ గోదారి' రిలీజ్‌కి రెడీ



సదన్, ప్రియాంక ప్రసాద్ జంటగా, డైలాగ్ కింగ్ సాయి కుమార్ ముఖ్య పాత్రలో రాబోతున్న చిత్రం 'ప్రణయ గోదారి'.
పిఎల్ విఘ్నేష్ దర్శకుడు. పిఎల్‌వి క్రియేషన్స్‌పై పారమళ్ళ లింగయ్య నిర్మించారు. ఈ సినిమా ఈనెల 13న రిలీజ్ కాబోతోంది. ఈ నేపథ్యంలో చిత్ర ప్రీ రిలీజ్ ఈవెంట్‌ను మేకర్స్ ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న, నిర్మాత రాజ్ కందుకూరి, హీరో సోహెల్ ముఖ్య అతిథులుగా విచ్చేశారు. ఓ చిన్నారి గుండెకు సంబంధించిన ఆపరేషన్ కోసం చిత్ర బృందం ఆర్థిక విరాళాన్ని అందించింది.
దర్శక, నిర్మాత విఘ్నేశ్ మాట్లాడుతూ, 'నేను ఎంతో కష్టపడి ఈ చిత్రాన్ని నిర్మించాను. ఆస్తులన్నీ అమ్ముకున్నా. అప్పులు తెచ్చి మరీ సినిమా తీశాను. నా అన్న మార్కండేయ కోసం ఈ మూవీని చేశాను. ఆయన ఈ చిత్రానికి మంచి పాటలు, ఆర్ఆర్ ఇచ్చారు. ప్రసాద్ మంచి విజువల్స్ ఇచ్చారు. ఎన్నో అడ్డంకులు దాటుకుని చిత్రాన్ని అయితే తీశాను. కానీ రిలీజ్ చేయడానికి చాలా కష్టపడ్డాను. మళ్లీ అప్పు చేశాను. సినిమా తీయడం, రిలీజ్ చేయడం అంటే మామూలు విషయం కాదనే సంగతి నాకు ఇప్పుడు అర్థమైంది. పి.ఆర్.ఓ. సాయి సతీష్ వల్లే ఈ చిత్రం ఇక్కడి వరకు వచ్చింది. డిస్ట్రిబ్యూటర్లు కూడా ముందుకు వచ్చి మా సినిమాకు థియేటర్లు ఇస్తామని అన్నారు' అని తెలిపారు.
'ఈ టైటిల్ నాకు చాలా నచ్చింది. చాలా పాజిటివ్‌గా అనిపించింది. సినిమాల్లో పెద్దది, చిన్నది అని ఉండదు. 'పెళ్లి చూపులు' చిన్న బడ్జెట్‌లో చేశా. కానీ దాన్ని పెద్ద హిట్ చేశారు. అందుకే మంచి సినిమా, చెడ్డ సినిమా అని ఉంటుంది. ఇది మంచి చిత్రం అవుతుంది. విఘ్నేశ్ చాలా మంచి వ్యక్తి. మార్కండేయ సంగీతం బాగుంది' అని నిర్మాత రాజ్ కందుకూరి చెప్పారు. మ్యూజిక్ డైరెక్టర్ మార్కండేయ మాట్లాడుతూ, 'ప్రణయ గోదారి ఎంతో విశాలంగా ఉంటుంది. విఘ్నేశ్ వల్లే నేను ఈ స్థాయికి వచ్చాను. ఆయన నా మీద పెట్టుకున్న నమ్మకాన్ని నిలబెట్టుకున్నాను అని అనుకుంటున్నాను' అని అన్నారు.

పార్టీ బీట్స్‌తో 'శకుంతలక్కయ్యా..' సాంగ్


సీయా గౌతమ్

వెన్నెల కిషోర్ టైటిల్ రోల్ పోషిస్తున్న చిత్రం 'శ్రీకాకుళం షెర్లాక్ హోమ్స్'. ఈ క్రైమ్ థ్రిల్లర్‌కి రైటర్ మోహన్ రచన, దర్శకత్వం వహిస్తున్నారు. లాస్యారెడ్డి సమర్పణలో శ్రీ గణపతి సినిమాస్ బ్యానర్‌పై వెన్నపూస రమణారెడ్డి నిర్మిస్తున్నారు.
మేకర్స్ మంగళవారం ఈ సినిమా నుంచి 'శకుంతలక్కయ్యా..' సాంగ్‌ని రిలీజ్ చేశారు.
సునీల్ కశ్యప్ ఎనర్జిటిక్ పార్టీ బీట్స్‌తో ఈ సాంగ్‌ని కంపోజ్ చేశారు. కాసర్ల శ్యామ్ లిరిక్స్ మాస్‌ని ఆకట్టుకుంటున్నాయి. సింగర్ ఉమా నేహ పవర్‌ఫుల్ వోకల్స్ మరింత ఎనర్జీని తీసుకొచ్చాయి. ఈ సాంగ్‌లో మాస్ డ్యాన్స్ మూమెంట్స్ స్పెషల్ ఎట్రాక్షన్‌గా నిలిచాయి. పెర్ఫెక్ట్ పార్టీ సాంగ్‌గా అలరించిన ఈ పాట ఇన్‌స్టంట్ హిట్ అయ్యింది. అనన్య నాగళ్ల, సీయా గౌతమ్ కథానాయికలుగా నటిస్తున్న ఈ చిత్రంలో స్నేహ గుప్తా, రవితేజ మహద్యం, బాహుబలి ప్రభాకర్, మురళీధర్ గౌడ్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ చిత్రం ఈనెల 25న క్రిస్మస్ కానుకగా విడుదల చేయనున్నారు అని చిత్ర యూనిట్ తెలిపింది.
'క, పొలిమేర 2, కమిటీ కుర్రోళ్లు' చిత్రాలతో విజయం సాధించిన వంశీ నందిపాటి ఈ చిత్రాన్ని విడుదల చేస్తున్నారు.

తెలుగులోనూ ఘన విజయం ఖాయం


జోజు జార్జ్, అభినయ

ఇటీవల మలయాళంలో విడుదలై ఘన విజయాన్ని సాధించిన చిత్రం 'పని'.
హీరో, దర్శకుడు జోజు జార్జ్ నటించిన ఈ సినిమాను తెలుగులో ఈ నెల 13న గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్‌కు సన్నాహాలు చేస్తున్నారు. ఈ చిత్రంలో అభినయ కీలక పాత్రలో నటించింది. ఆమ్ వర్డ్ ఎంటర్‌టైన్‌మెంట్ సంస్థ ఈ చిత్రాన్ని తెలుగు ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తోంది.
రాజవంశీ ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్‌గా వ్యవహరిస్తున్నారు. ఈ సినిమా ప్రీ రిలీజ్ ఈవెంట్ మంగళవారం ప్రసాద్ ల్యాబ్స్‌లో ఘనంగా జరిగింది.
ఈ కార్యక్రమంలో తెలుగు దర్శకుల సంఘం అధ్యక్షుడు డైరెక్టర్ వీరశంకర్, తెలుగు ఫిలింఛాంబర్ సెక్రటరీ దామోదర ప్రసాద్ పాల్గొని చిత్ర విజయాన్ని ఆకాంక్షించారు.
ప్రొడ్యూసర్ సిజో వడక్కన్ మాట్లాడుతూ, 'ఈ చిత్రంతో జోజు జార్జ్, అభినయ వంటి మంచి ఆర్టిస్టులతో పనిచేసే అవకాశం కలిగింది. ఈ సినిమా మలయాళం, కన్నడ, తమిళంలో మంచి విజయం సాధించింది. తెలుగులోనూ అలాంటి విజయాన్నే సాధిస్తుందని ఆశిస్తున్నా' అని తెలిపారు.
ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ రాజ వంశీ మాట్లాడుతూ,'ఇదొక మంచి థ్రిల్లర్ సినిమా. 2 గంటల పాటు ఆడియెన్స్‌ను ఎంగేజ్ చేస్తుంది. జోజు జార్జ్ నటిస్తూ అద్భుతంగా రూపొందించారు. ఇలాంటి సినిమా చేయాలంటే ధైర్యం ఉండాలి' అని అన్నారు. 'ఈ సినిమాతో తెలుగు ప్రేక్షకుల ముందుకు రావడం ఆనందంగా ఉంది' అని నటి అభినయ చెప్పారు.

నా దృష్టిలో మంచి సినిమాకు భాషా హద్దులు లేవు. ఏ భాషలోనైనా ప్రేక్షకులు ఆదరిస్తారు. తెలుగు చిత్రాల్లో నటించి మీ ఆదరణ పొందాను. ఈ సినిమా కమర్షియల్ యాక్షన్ ఎంటర్ టైనర్. అభినయతో కలిసి నటించడం సంతోషంగా ఉంది. ఈ మూవీ తెలుగు ప్రేక్షకులకు కూడా బాగా నచ్చుతుంది. మీరంతా మా మూవీని ఆదరిస్తారని కోరుకుంటున్నా.
- హీరో, దర్శకుడు జోజు జార్జ్

Printed And Published By Nandayala Narsimha Reddy On Behalf Of Navatelangana Printers Private Limited, Printed At Nava Telangana Printers Private Limited Near Manair Hanuman Temple, Godavarikhani Bypass Road, Housing Board Colony, Karimnagar-505001, Telangana State, Published At Navatelangana Printers Private Limited, Near Manair Hanuman Temple, Godavarikhani Bypass Road, Housing Board Colony, Karimnagar-505001, Telangana State. Editor : R.Sudha Bhaskar. TEL TEL/2015/60887.